స్వామి ఓంకార్

ద మిషన్ ఆఫ్ పిస్ – శ్రీ శాంతి ఆశ్రమము

(వైయ) శంఖవరం, తూ॥గో॥జిల్లా.

విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | అగ్నిపరీక్ష | 5 |
| 2. | తానొకటి తలచిన దైవమొకటి తలచును | 7 |
| 3. | వినతి | 12 |
| 4. | స్వామి చిదానందవారి షష్టిపూర్తి శుభాకాంక్షలు | 14 |
| 5. | సమయము–వృధా | 16 |
| 6. | కొబ్బరికాయకథ | 20 |
| 7. | బ్రహ్మస్థితి | 25 |
| 8. | స్వభావము | 29 |
| 9. | శాంతి సమావేశము | 33 |
| 10. | దైవము నిర్దయుడా? | 35 |
| 11. | ఆశ్రమమునకు తటాకము యొక్క ఉపయోగము | 42 |
| 12. | ఆదర్శనీయమైన జీవితము | 45 |
| 13. | చెవులున్నవారు వినవచ్చును–ఎచ్చటనున్నావు దైవమా! | 50 |
| 14. | సృష్టి–సృష్టికర్త | 52 |
| 15. | సూక్ష్మములో మోక్షము | 57 |
| 16. | రెండు తరగతుల మనుష్యులు | 65 |
| 17. | తృప్తి | 69 |
| 18. | శాంతి | 72 |
| 19. | బ్రహ్మచారీజీ | 76 |
| 20. | పొడినేలమీదనున్న చేపలు | 79 |
| 21. | చేపల వాంఛ ఆశయము | 83 |

22. అమూల్యమైన ఆత్మానుభవములు 87
23. చీమల ప్రపంచకము 94
24. నా ఆశయములు లేక నా పరితాపన 97
25. జీవన్ముృతులు 99
26. నా తప్పులు–పొరపాట్లు 101
27. యాచన 104
28. శ్రీ గాంధీ మహాత్ములు 107
29. కృతజ్ఞత 108
30. గోవిందా, గోవిందా, గోవిందా 111
31. మర్కట మార్జాల న్యాయము (కోతిపిల్ల–పిల్లిపిల్ల) 115
32. ప్రకృతి రాజుగారు 122
33. ఉచితము 124
34. కైలాసములో 126
35. మాయ 129
36. చిరజీవితము 133
37. బావిలో కప్ప 138
38. ఈశ్వర సంకల్పము 144
39. జగత్తే స్వప్నము 147
40. నీ విరోధులను ప్రేమించుము 152
41. మా చిన్న నెహ్రూ 156
42. సర్పము 162

43. కుళ్ళిన పండ్లు 164

44. వృక్షముల కృతజ్ఞత 167

45. శ్రీరామదాసుజీ 170

46. పాపులదే స్వర్గము 174

47. బ్రహ్మ సాక్షాత్కారము 177

48. గ్రామ మునసబు 183

49. మా చిన్న దూడలు 186

50. దొంగ వచ్చెను 189

51. దైవము మాట్లాడునా? 192

52. మానవ ధర్మము 197

53. దైవమునకు ప్రీతియైన అర్పణ 202

54. మీరా సాహేబు 205

55. నిమ్మచెక్క 208

56. ద్వంద్వము లేక భేద భావన 211

57. బ్రహ్మము నెరింగిన బ్రాహ్మణోత్తముడు 216

58. బావిలో సర్పము 218

59. దైవమును ప్రార్థించుట అవసరమా? 222

60. మూడు రోజుల పని వ్యర్థము 228

61. వాసనలు 231

62. బ్రహ్మకపాళము 236

63. మా టాగూరు మహాశయుడు 238

# 1. అగ్ని పరీక్ష

అగ్ని పరీక్షలు అందరికీ వచ్చుచుండును. మహర్షులకు, మహాత్ములకు కూడ ఇవి తప్పవు. మనమెంత నివృత్తిపరులమై ఆధ్యాత్మికంగా నుందుమో, అంత ఎక్కువగానే కష్టములు సంభవించుచుండును. ప్రతి సంస్థకు ఈ పరీక్షలు పరిపాటే.ఇది శాంతి ఆశ్రమమంనకు కూడ వర్తిస్తుంది. అసలీ ప్రపంచమే కర్మభూమి. వారి వారి కర్మలననుసరించియే ఫలితముల ననుభ వించుదురు. మా పీసు, శాంతి పత్రికలు ముప్పదియైదు సంవత్సరముల నుండి ప్రచురించబడుచున్నవి. కాని ఎన్నడును ఎవరును ఇంత కఠిన పరీక్షకు గురిచెయ్యలేదు. ఆశ్రమభక్తులైన అన్నవరం పోస్టుమాస్టరుగారు శలవులో నుండగా వారి సహాయకులు ఒకరు మన శాంతి పత్రిక మీద "డ్యూ" మార్కువేయడం జరిగింది. ఒకటిరెండు పత్రికలు మీదనే "డ్యూ" పడలేదు, అయిదువందల పత్రికలకు ఆ దురవస్థ పట్టినది. "డ్యూ"మార్కుతో మనపత్రికా పఠితలు అశాంతిని అసంతృప్తిని పొందిరి. ఈ పత్రిక నిస్వార్థ మైన భగవత్ సేవచేయుచున్నదను భావన ముఖ్యావసరము కదా! ఇతరులను అణగద్రొక్కి నీవు పైకి రావలదు అను వాక్యములో ఎంత సత్యమున్నది? వారి బాధ్యతలనుబట్టి ఖచ్చితముగానె యుండవచ్చును. గాని కొంతదయతో యిరుపక్షముల యిబ్బందులు గుర్తించిన ఈ స్థితి కలిగియుండెడిది కాదు. 12 నయాపైసలు "డ్యూ" మార్కు కొట్టి వెళ్ళినను ఆదరముతో అందుకొనిన మా ప్రియ శాంతి పాఠకులకు నా పరితాపన వ్యక్తము చేయబడెను. ప్రతి దినము పోస్టులో "నిరాకరింపబడెను" అను క్రూరమైన అక్షరములతో కొన్ని పత్రికలు తిరిగివచ్చు చుండుట చూచి ఆవేదన కలుగసాగెను.

ఈ ఆవేదన ఎంత ప్రగాఢమైనదనగా నిరాకరింపబడిన పత్రికల దురవస్థ చూచి విషాదముతో హృదయము బరువెక్కి ఒకదినము నిరాహారినై యుండుట కూడ జరిగినది.

మా శాంతి పాఠకులకు మా సానుభూతి.

కాలక్రమేణా ఈ అగ్ని పరీక్షలన్నియు సూర్యునిముందు మబ్బులు విడిపోయినట్లు తొలగిపోవును. ఏది వచ్చినను అది మన మంచికొరకే అను విశ్వాసమునాది. ఈ అగ్ని పరీక్షలలో కూడ కొంతమంచి లేకపోలేదు. ప్రతి మేఘము వెనుక తట్టున తేజస్సు వుండనే వుంటుంది. నిరాకరింప

బడిన పత్రికలు కొన్నింటి మీద ఆ చిరునామాదారులు పరమపదించి రనియు, కొందరి విలాసము తెలియదని మరికొందరు ఆ ప్రదేశమే వదలి వెళ్ళిరనియు వ్రాయబడియున్నది. చివరకు వంద రూపాల "డ్యూ" పడినను, పత్రికలు అందుకొనుటకు ఆతురతగాయున్న అసదృశ్యులైన ఆశ్రమభక్తులకు మా అభివందనములు. ఏలనన అటువంటి వారికి ప్రపంచములోని సర్వ సంపద కంటెను, శాంతియే ముఖ్యము. అంతగా భక్తి లేని కొందరు మాత్రము ధనకాంక్షతో 12 నయాపైసల కోసము "శాంతిని" త్రిప్పివేసిరి. భగవంతునికంటె పన్నెండు నయాపైసలు అధిక మైనవా? ప్రపంచములోని ధనమంతయు వెచ్చించినను దైవమును శాంతిని కొనగలమా? ఆత్మను కోల్పోయినపుడు విశ్వమునంతా జయించి మాత్రము యేమి ప్రయోజనము? ఈ అగ్ని పరీక్షల జ్ఞాపకార్ధముగా అల్పమైన కీర్తి ప్రతిష్ఠలనే మేఘములను ఆశ్రయించుటకంటె, దివ్యతేజ స్వరూపుడైన ఆ పరమేశ్వరునకు మరింత సన్నిహితముగా చేరుదముగాక!

అనుక్షణము మారెడు ఈ అగ్ని పరీక్షల జగత్తులో నిరవధికమైన పరమాత్మతో శాశ్వత తేజస్సుతో ఏకైక సత్యముతో తాదాత్మ్యము చెందెదము గాక! ప్రపంచములోని ధనమంతటితోను కొనలేని "శాంతి" మీ గృహమునకు వచ్చి, మీ హృదయ కవాటములను తట్టి ప్రవేశము కొరకు ఎదురుచూచు చున్నది. మీకు, మీ గమ్యస్థానమైన, అమూల్యమైన "శాంతికి' నడుమను మేఘములవంటి కొన్ని నయాపైసలు అడ్డుగా రాకుండుగాక!

ఈ వ్యాసము ముగించేముందు నేను మరియొకమారు ఆశ్రమ సభ్యులు, పనివారల తరఫున పత్రిక ఆలస్యముగా పోస్టు అయినందులకు, "డ్యూ" స్టాంపు పడినందులకు క్షమాపణ అందజేయుచున్నాను. అగాధముల నుండి అద్భుతమైన శక్తి, చీకటి నుండి క్రొత్త దీప్తి ప్రకాశించుగాక! విషాద ములో నున్నను మనము సత్యమార్గముననే యున్నాము. కృపామయుండైన, ఆ భగవంతుడు విశ్వములోని తన బిడ్డల నందరను అపార కృపారసముతో అనుగ్రహించుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు – ఓం ఓం ఓం

(శాంతి మార్చి 1962)

## 2. తానొకటి తలచిన దైవమొకటి తలచును

డాక్టరు నారాయణస్వామి గారు పరమభక్తులు. సేవాపరులు. వారు ఆయుర్వేద వైద్యులేగాక హెూమియోపతియందు గూడ చాల అనుభవము గలిగియుండిరి. గుంటూరు జిల్లాలోయున్న చందవరం అనే గ్రామము నందును, ఆ చుట్టుప్రక్కలయున్న ఇరువది గ్రామములలోయున్న నిరుపేద లైన రోగులందరకు ఉచితముగా సేవజేయుచు వారి అమూల్యమైన కాలమును సద్వినియోగము జేయుచుండిరి. అప్పుడప్పుడు తోటపల్లి ఆశ్రమంనకు గూడ మందులు పెద్ద పెద్ద పేకేజీ పెట్టెలతో పంపుచు, వాటిని రోగులకు వాడెడి విధానమును గూడ తెల్పుచు ఉత్తరములు వ్రాయు చుండెడివారు.

నన్నుగాని, శాంత్యాశ్రమమునుగాని యెన్నడూ చూడజాలకుండుట దైవవిధి, ఆశ్చర్యము, విచారకరము. వారెంత నిరాడంబరముగా అమాయక ముగా భక్తి, ప్రేమలతో నిండియుండెడివారనగా వారిని డాక్టరు అని పిలుచు టకు బదులు సాధు నారాయణస్వామిగారు అని సంభోదించిన, సమంజస ముగా యుండునని తోచుచున్నది. ఆయన ఉండెడితావు, చిన్న గుడెశ, ఆ చిన్న కుటీరములోనే రోగుల సేవ చేయజాలనప్పుడు ప్రార్థన ధ్యానాదులతో వారి కాలమును గడుపుచుండెడివారు. శాంతి ప్రార్థన యందు వారికి మిక్కిలి ప్రీతి, దానిని వారు స్మరించుటయేగాక వారి బంధుమిత్రులు,శిష్యకోటి చివరకు రోగులచే గూడ స్మరింపజేయించెడివారు.

హఠాత్తుగా సాధు నారాయణస్వామిగారు వారీలోకములో చేయవలసిన సేవపూర్తి అయ్యెననియు, వారికి దైవమునుండి పిలుపు వచ్చుచున్నదని అంతర్యవాణి చెప్పదొడగెను. గానీ ఒక్క ఉత్తరము, నన్ను జూచుటకు కోరుచుంటినని తన జీవితములో మిగిలియున్న ఒకే కోరిక “మిమ్ము దర్శించి మీ పాదపూజజేసి, ఈ నేత్రములు మూయుటకు కోరుచుంటిని” అని, ఆ ఉత్తరమునే టెలిగ్రాముగా భావించి దర్శనమిప్పించమని వ్రాసెను. కర్మ వశాత్తు ఆ ఉత్తరము ఆరురోజులకు అందెను. దానిని ఆయన స్వయముగా వ్రాయుటచే అంత జబ్బుగా యుండకపోవచ్చునని నేను తొందరపడి వెంటనే

బయలుదేరలేదు. ఆ ఉత్తరములో శ్రీ సాధు నారాయణస్వామి గారు 516 రూపాయలు ఆశ్రమసేవకై వినియోగించకోరుచుంటినని గూడ వ్రాసెను. మమ్ము వెంటనే రమ్మని మరల టెలిగ్రాము ఇచ్చెను. మేము గూడా వచ్చు చుంటిమి. ధైర్యముగా యుండుడని తిరిగి టెలిగ్రాము యిచ్చి వెంటనే బయలుదేరితిమి. దురదృష్టముచే మేము యెంత త్వరితముగా ప్రయాణం సాగించినను చందవరము చేరేసరికి, శ్రీ సాధు నారాయణస్వామి వారు " ఇంకను స్వామీజీ రాలేదా రాలేదా" అనుచు ఆ క్రిందటి దినమే వారి భౌతిక దేహమును విడిచిరన్న విషాదవార్తను వినుటకు మా హృదయములు బరువెక్కెను. వారు ప్రార్థన, ధ్యానము జేసుకొనెడి చిన్న కుటీరములోనకు వెళ్ళితిమి. అచ్చుటకుర్చీలు, బెంచీలు యైనా లేవు. అందులో ఉన్నది ఒక్కటియే. అదినలభై సంవత్సరముల క్రింద తీయబడిన ధ్యానములో నేను కౌపీన ధారినైయున్న నా చిన్న ఫోటో! మరే ఫోటోలు దైవపటములు కూడ కుటీరమందు లేవు. ఆ ఫోటో ఆయన ఎప్పుడు, యెటుల సంపాదించెనో ఆశ్చర్యముగా నుండెను. శ్రీ సాధు నారాయణుని అల్పమైన చిన్న కోర్కెనైనను తీర్చజాలకపోతినిగదా, ఆయన జీవించియుండగా ఆయన దగ్గరకు రాజాలక పోతినిగదాయని, నన్ను నేను చాలానిందించుకొనుచు, పశ్చాత్తాపము పడితిని. వలికిపోయిన పాలగురించి ఎంత దుఃఖించిన ఏమి లాభముం డును?

శ్రీ నారాయణస్వాములు నాపాద పూజకై పండ్లు పుష్పములు, అగర వత్తులు మొదలైనవన్నియు పరిసర పెద్దగ్రామము నుండి తెప్పించితిరి, హారతి కర్పూరము సాంబ్రాణి మొదలైన దీప ధూప నైవేద్యములన్నియు సిద్ధముగా నాకొరకై వేచియుండెను. అన్నియు సిద్ధముగా ఉండెను. గాని ఒక్కరు మాత్రమేలేరు. అది భక్తి, ప్రేమపూరితమైన నారాయణుని శరీరము, ఎంత విషాదకరము! శ్రీనారాయణ స్వాములకు, ఆయన యీ లోకమును వీడెడి రోజు, గంట గూడా తెలుసును, ఆ రోజున ఆ గంటలో "శ్రీ స్వామీజీని చూడజాలకుండ వెళ్ళుచుంటిని." అని ఆయన శిష్యకోటికి జెప్పుచూ సమాధి పొందిరట. ఎంత విచారకరము!

ఈ లోకములోమనము చేసిన కొన్ని తప్పులను సరిజేసుకొనవచ్చును, గాని యీ తప్పు,విషాదకరమైన యీ అశ్రద్ధ ఆలస్యము. సరిజేయజాలనిది. దైవము యీ నా పొరపాటునకు ఆలస్యముగా చందవరము వెళ్ళినందుకు మన్నించుగాక! శ్రీనారాయణ స్వాములవారి ఆత్మను నిత్య శాంతితో నిరంత రము బ్రోచుగాక! ఆశ్రమవాసులు కొందరు చందవరము ఆలస్యముగా వెళ్ళితిమి గాన శ్రీ నారాయణ స్వామివారు దేహమును విడిచితిరి గాన వారు ఇచ్చెదనన్న 516 రూపాయలు గూడా వారితోనే పోయెనేమో అని తలచసాగిరి. గాని సాధునారాయణ స్వామిగారు వారికండ్లు మూయక ముందే శ్రీ స్వామీజీ రాగానే. వారి ప్రేమార్పణను పూజ పునస్కారములతో అర్పించమని శిష్యులను కోరుచూ, అన్ని యేర్పాట్లు జేసియే వారు కండ్లు మూసిరి. గురుభక్తిలో గురువును మించిన శిష్యులున్నట్లు, శ్రీనారాయణ స్వామిగారు యేర్పర్చిన 516 రూ.లకు మరొక్క 50 రూ.లు కలిపి ఆశ్రమ సేవలో వాడుటకు అర్పించితిరి. వారి శిష్యులలో ముఖ్యులైన శ్రీవిష్ణుమూర్తి గారు అనెడి భక్తులు తాము స్వయముగా 100 రూ.లు ఆశ్రమవృద్ధిని కోరుచు అర్పించుట చాలా ఆశ్చర్యము. ఆనందమును గల్గించెను. గురువెట్లో శిష్యులు గూడా అట్టి సేవాపరులై ప్రేమమూర్తులై యుందురుగదా! శ్రీ గురు దేవులు లేని కొరతను శ్రీ విష్ణుమూర్తి గారు ముందు ముందు శాంత్యాశ్రమ సేవను జేయుచు తోడ్పడుచుందునని వాగ్దానము జేసిరి.

ఆ సాయంత్రము ఒక గొప్పసమావేశము శ్రీ సాధు నారాయణ స్వామిగారి జ్ఞాపకార్థముగా చేయబడెను. పరిసర ప్రాంతముల నుండి అనేకమైన గ్రామముల నుండి భక్తులందరును విచ్చేసిరి. శ్రీడాక్టరు గారు అహోరాత్రముల యందు యెటుల బీదనారాయణుల సేవ చేసియున్నది. వారి గుణగణములను పెక్కుమంది ఉపన్యసించిరి. మేము సకాలమునకు రాజాలక, ఆలస్యముగా వచ్చినందుకు శ్రీనారాయణ స్వాములు వారి ఆత్మనే గాక వారి శిష్యకోటి అందరి క్షమార్పణలను కోరుచు, శ్రీ డాక్టరుగారి అఖండమైన సేవ జ్ఞాపకార్థముగా వారి పేరు చిరస్థాయిగా ఉండేలాగున వారికి బీదసాదల యందు, రోగులయందు ప్రేమగావున. వారి పేరున నారాయణ ఆసుపత్రి నొకదానిని వెంటనే నిర్మించి రోగుల సేవ జేయుచుండ

మని కోరితిని. వారి శిష్యులు అచ్చుటచేరిన భక్తులందరునూ అటులనే త్వరలో నారాయణ ఆసుపత్రిని కట్టించుటకు వాగ్దానము జేసిరి. వారు బ్రతికియుండగ రాజాలకున్నను, శ్రీ నారాయణ ఆసుపత్రిని తెరిచి దాన్ని ప్రారంభోత్సవము జేయించుటకు మరల వచ్చెదనని వాగ్దానము జేస్తిని. భక్తులందరూ చాలాఆనందించితిరి. భజనలు ప్రార్థనలు ప్రణవగానము జేయుచుండ శ్రీ నారాయణ స్వాములు గతించినట్లు యుండుటకు బదులు వారి సన్నిధిని మేమందరము అచ్చటనే అనుభవించ సాగితిమి.

శరీరములు మారవచ్చును గాని, ఆత్మ యెప్పుడునూ స్థిరముగానే ఇచ్చటనే సదా వెలుగుచున్నదని నేను మరల మరల నొక్కి జెప్పుచూ శ్రీ నారాయణ స్వాముల యందు ప్రేమ, భక్తి గౌరతయున్న వారందరూ, వారు రోగులసేవ నిరంతరము, స్వార్థరహితముగా జేసినట్లే, మనమందరము గూడ, ఇప్పుడు, ఇకముందును జేయుదుముగాక యని దైవమునకు వాగ్దానము జేయుచు ముమ్మారు ప్రణవగానము చేయబడెను.

ఇప్పటికిని, శ్రీ నారాయణుని ఆంతర్యమైన, అంత్య కోర్కెనైనా నేను తీర్చజాలకపోతినని జ్ఞప్తికి వచ్చినప్పుడెల్లను, హృదయము బరువెక్కు చుండును, గాని శాంతి ప్రార్థనను స్మరించగనే నారాయణుని సన్నిధిని ఆంతర్యమున బాహ్యమున క్రిందను, మీదను, చుట్టును అనుభవించుచూ తృప్తిని చెందుచుందును. నారాయణుడే నా హృదయమునకు హృదయముగా, శ్వాసకు శ్వాసగా, ఆత్మకు ఆత్మగా నిరంతరము యున్నట్లు తృప్తిని పొందు చుందును. ఈ అవినాభావన ప్రేమ అనుసంధానమే నాకిప్పుడు మిగిలి యున్న ఆనందము, తృప్తి!

మానవుడు ఎంతచదువరియైనను, మేధావంతుడైనను, దైవము ముందు, అల్పమైన కించజ్ఞత్వమైనవాడు! తాను కట్టుచున్న గాలిలో మేడ లన్నియు ఒక్కక్షణములో కూలబడును గదా! తాను దైవాజ్ఞలేనిదే గడ్డిపరక నైనను కదల్పజాలడు గదా! స్వర్గములోను భూమి మీదను దైవాజ్ఞయే దైవ విధియే జరుగుగాక!

ఓ ప్రభువా! నా సంకల్పముగాదు. అన్ని స్థితిగతుల యందును నిరంతరము సర్వము నీ ఆజ్ఞ ప్రకారమే జరుగుగాక! మేము నిమిత్త మాత్రులముగా యుండి నీ దివ్య సన్నిధిని సదా అనుభవించుచూ, నీ అడుగు జాడలలో నడచుచు నీ విధినే నెరవేర్చుటకు శక్తిని ప్రసాదించుము.

శ్రీ సాధు నారాయణ స్వాముల ఆత్మకు నిరంతర శాంతి గలుగుగాక! చందవరము వాసులందరనూ ముఖ్యముగా శ్రీ సాధు నారాయణ స్వామివారి శిష్యబృందమును, దైవము ఆయురారోగ్యములతో బ్రోచుచు, వారికి నూతన శక్తి నొసంగి త్వరలోనే నారాయణ అసుపత్రిని పూర్తి జేయించి, నిరుపేదలైన రోగులకు స్వార్థరహితమైన చికిత్సను, నిరంతరము శ్రీ డాక్టరు నారాయణ స్వాముల పేరున జరిగించుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

(శాంతి జూలై 1962)

## 3. వినతి

శాంతి ఆశ్రమాభిమానులకు, పునర్జన్మాతుల్యమగు జీవితము నొందిన మీ ఓంకారుని వినతి.

శ్రీశాంతి ఆశ్రమ కార్యభారమును వహించుచు, కార్యదర్శినిగా సమస్తము నిర్వహించుచున్న, కుమారి జ్ఞానేశ్వరి నిన్న ఒక విచారకరమైన వార్తను నా వద్ద తెల్పెను. "ఆశ్రమవాసులేగాక వందమంది గురుకుల బాలబాలికలు కూడ పోషింపబడుచున్న యీ ఆశ్రమములో బియ్యము నిండుకున్నవి. ప్రతి సంవత్సరము పండుచున్న కొలది పంట అయినను, అనావృష్టిచే యీ సంవత్సరము పండలేదు." ఈ విషాదవార్త నా హృదయ మును కదిలించివేయుటచే ప్రాక్పశ్చిమము నందలి ఆశ్రమ శ్రేయోభిలాషు లకు యీ వినతి నందించుచుంటిని.

క్రిందటి సంవత్సరము కూడా ఆశ్రమ నిర్వహణకై గురుకుల బాల బాలికల పోషణకై ఎన్నియో అవస్థలు పడవలసివచ్చినది. ఈ కార్యభార ముతోబాటు ప్రతినెల పదునైదు వందల రూపాయలపైగా బియ్యము కొనవలసి వచ్చెడిది. దైవమే యిచ్చును. దైవమే పరిగ్రహించును. దైవము మాత్రమే మనలనందరను కాపాడి పోషించుగాక!

ఈ విజ్ఞప్తి తమ భారమును తామే మోయజాలని బీదలకెంత మాత్రము పంపుటలేదు. ధన సంపదలతో తులతూగు విశాల హృదయాలు గల వారికి నేను ప్రేమతో గావించు వినతి ఏమన "నిస్సహాయులగు, దైవ స్వరూపులగు ఈ చిన్ని బిడ్డలకు పట్టెడన్నము పెట్టుటకు మీరు ప్రేమతో సహాయము చేయుడు." ఏలనన, యీ బాలబాలికలందరును మీబిడ్డలే!

ఏబదియారు సంవత్సరముల నుండి ఆశ్రమ కార్యములందు తోడ్పడు చుండిన ఆ ప్రేమమూర్తి ఎన్నటికిని నిరాశకల్గించదనియు,కరుణా హృదయు లగు ఆశ్రమభక్తుల హృదయములలో ప్రవేశించి, యీ అత్యవసర సమయమున తోడ్పడునట్లొనరించునని నమ్ముచుంటిమి.

దయతో మీరు పంపు విరాళములు యీ క్రింద చిరునామాకు పంపు ప్రార్థన.

కుమారి జ్ఞానేశ్వరి కార్యదర్శిని,
శ్రీ శాంతి ఆశ్రమము,
(వయా) శంఖవరం
తూర్పుగోదావరి జిల్లా,ఆంధ్రప్రదేశ్

దానము

ఇమ్ము! ఇమ్ము! ఇమ్ము!
ఇమ్ము! నీకు కలదాని స్వేచ్ఛగానిమ్ము
దాచగా చూతువేమో భూతిగా మారసుమ్ము!
ఇమ్ము! నీవు జీవించియుండగా నిమ్ము
కాలగర్భాన కలసిన కలసిరాదు సుమ్ము!
గుప్పెట బిగించి భద్రంబుగాదాచ చూతువేమొ
నీదు అంగుళులె అడ్డని హరియించు తథ్యంబు సుమ్మ
ఇమ్ము! ఇమ్ము! ప్రేమంపురాసివై నిమ్ము
దాన ప్రభవించు నిత్య నూతన జీవస్రవంతి
ఓం! ఓం! ఓం!

( శాంతి మార్చి & ఏప్రియల్ 1972 )

# 4. స్వామి చిదానంద వారి షష్టి పూర్తి శుభాకాంక్షలు

పవిత్రవంతమగు షష్టిపూర్తి శుభదినమున, సెప్టెంబరు 24వ తేదీ నాడు పూజ్యశ్రీ స్వామి చిదానందజీ వారికి సర్వ ప్రకాశము నొనగూడుగాక. నిస్వార్థపరులు, త్యాగధనులు అగు అట్టివారికి ఒక్క షష్టిపూర్తి దినమేకాదు ప్రతిదినము ఒక ప్రకాశవంతమైన దినమే.

శ్రీ శివానంద ఆశ్రమము, శాంతి ఆశ్రమము రెండు గావు ఒక్కటియే, అటులనే స్వామి చిదానందజీ, స్వామి ఓంకార్ ఇద్దరు కాదు, ఒక్కరే. వారి షష్టిపూర్తియే నా షష్టిపూర్తి. మేము దానిని ఎట్లు నిర్వహించుట. ఆ పవిత్రదినమున జై చిదానందజీ, జై చిదానందజీ,జై చిదానందజీ అని పల్కుచు మన ప్రత్యణువునందునూ, నఖశిఖ పర్యంతము,వారి అనుభూతిని నింపుదము గాక! వాస్తవమునకు మనలోపలను, వెలుపలను సర్వేసర్వత్ర నిండియున్నదా చిదానంద స్వరూపమే.

పూజ్య చిదానందజీకి కానిండు, లేక దివ్యజీవనసంఘమునకు కానిండు, ఈ షష్టిపూర్తి శుభసమయములో మనము చేయగల సహాయ మెద్దియన ఆ దివ్యసాన్నిధ్యమును అణువణువునా, ఈ విశ్వమందెల్ల పొంద గలుగుటయే.

మనమందరము ఒక అపరిచ్ఛిన్న చిదానంద స్వరూపము నందలి భాగములము. ఆ నిత్యసత్యానుభూతిని ఇపుడు ఇచ్చటనే బడయుదుము గాక! సూక్ష్మమగు శాంతి ప్రార్థన, గురుదేవులయొక్క విశ్వప్రార్థన ఎడతెగక చేయుచు, కోటి సూర్యప్రభాభాసమానమగు దివ్య తేజస్సున లయింతము గాక!

మనము చిదానంద స్వరూపమున నుంటిమి.

మనలో చిదానంద స్వరూపమే యున్నది.

మనమే ఆ చిదానంద స్వరూపులమై యుంటిమి.

ఒక్క క్షణమైన ఎడతెగక ఆ చిదానందానుభూతి నందుండుటయే ప్రాక్పశ్చిమములందలి చిదానందజీ వారి భక్తుల అదృష్టముగా నెంచవలెను.

ఈ విశ్వమే నా గృహము

విశ్వమానవాళి అంతయు నా సోదరీ సోదరులు

వారిని సేవించుటయే నా మతము.

ఆనందముతో అట్లు పల్కగల్గిన వారొక్క చిదానందులే. ప్రతి దినము ఒక షష్ట్యాబ్దిపూర్తి దినమే. ఒక ఆనందప్రదమగు దినమే. దైవానుభూతి ఎడతెగక తైలధారవలె నిరంతరము అనుభవించుటయే ఆనందము.

చిదానందజీ వార్కి మా కృజ్ఞతలు

చిదానందజీ వార్కి మా వందనములు

దైవము వారికి ఆయురారోగ్యములు

తేజః శాంతుల నొసంగుగాక!

వారి షష్టిపూర్తి జ్ఞాపకార్థముగా అందరు ప్రతిక్షణమున దైవ జ్ఞప్తిని కలిగి జీవింతురుగాక! ఇప్పుడు ఈ క్షణము నుండియే ప్రతిశ్వాసతోడను దైవానుభూతి నందుండుడు, ఇదియే స్వామి చిదానందజీ వారిని ప్రేమించు ఓంకారుని ప్రార్థనయైయున్నది. విశ్వప్రేమ, సోహం శివోహం భావము కలిగి నిశ్శబ్దము, చలన రహిత, తరంగరహిత నిశ్శబ్దముతో జై చిదానంద స్మరణగావింతము.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

( శాంతి అక్టోబరు 1976 )

# 5. సమయము - వృథా

మూలము: స్వామీ ఓంకార్ అనువాదము: గరిగిపాటి కృష్ణ

ఎందుకనో, ఈ రోజుల్లో నేను చేస్తున్న ప్రతిపనివల్ల సమయము వృథా అయినట్లు తోస్తోంది. ఈ ప్రభాత సమయములలో, నేను వ్రాసే సందేశము కూడా సమయము వృథాచేయడానికేనా? నిస్సందేహముగా అవుననే అనిపిస్తుంది, కానీ ఈ వృథా అయిన సమయమువల్ల ఒకమేలు జరిగింది. అదేమిటంటే మనము చేసే పనిలో భగవంతుని వునికిని ఎంతగా అనుభవిస్తామో అది సమయము వృథాచేసినట్లు కాకపోగా భగవంతుని సన్నిధిని అనుభవించడానికి వుపకరించిందని చెప్పవచ్చు. మనము ఏపూజ, ఆరాధన చేయకపోవచ్చును కానీ భగవంతుని సన్నిధిని అనుభవించలేనట్లయితే మనము కాలమును వృథాచేసినవారమవుతాము.

శాంతి ఆశ్రమములోని ఫలకములమీద వ్రాయబడిన ధనము పోయినచో ఏమియు పోలేదు; ఆరోగ్యముపోయినచో కొంత వరకు పోయినట్లు; శీలము చెడిన యెడల అంతాపోయినట్లే' అను వాక్యములు ఎంత సత్యవచనములు! ఆశ్రమములోని మరియొక అమూల్యమైన జీవన సందేశము "ఎవరు క్షణములను వృథాగా గడుపుదురో, వారు జీవితమును వృథాచేసికొన్నట్లే", జీవితములో తిరిగిరాని క్షణములను వృథాగా గడుపుదురో, వారు జీవితమును వృథాచేసికొన్నట్లే." జీవితములో తిరిగిరాని క్షణములు వృథా అయినచో దాని వలన కలిగే నష్టమెటువంటిది, అనగా మొత్తము వృథా అయినట్లే గదా!

నేను స్నేహితులకు, ఆశ్రమ శ్రేయోభిలాషులకు లేఖలను వ్రాయడము వలన కూడా కాలము వ్యర్థమైనట్లు భావిస్తాను. సందర్శకులను కలిసి విలువైన సమయమును సంభాషణములతో మరియు బోధలతో గడుపుటను ఏమనాలి? భగవంతుని వునికిని లోపల, బయట, ఎల్లెడల అనుభవించలేకపోతే యిది కూడా సమయమును నిష్ప్రయోజనముగా వృథా గావించినట్లే అవుతుంది. ఏ పనిలో నీవు భగవంతుని అంతటా దర్శిస్తూ అతని అనంత ప్రేమను పంచుతావో అది నిన్ను వున్నత శిఖరాలకు చేరుస్తుంది. భగవంతుని వునికిని విస్మరించి అతని విశ్వవ్యాప్తమైన ప్రేమను గుర్తించక

చేసే పూజైనా, ధ్యానమైనా అది తప్పనిసరిగా సమయమును వృథాచేయడ మవుతుంది. నీవు చేసిన ఏపని అయినా లేక మౌనముగా వున్ననూ అతి ముఖ్యమైన విషయమేమనగా అణువణువులోనూ భగవంతుని దర్శిస్తూ నిరంతరమూ భగవంతునిలో ప్రతిష్టితమై అతడే నీకు ఆలంబన, ఆధారము అనునది గుర్తించుటయే. ఇంకొకవిధముగా చెప్పాలంటే అతని సర్వాంత ర్యామిత్వము, సర్వశక్తిమంతము మరియు సర్వజ్ఞతలను సదా స్మరణలో యుంచుకొనడమే.

తరచుగా నేను ఏదైనా పనిలోయున్నా లేక మౌనము వహించినా ఎవరో నన్ను "నీవు కాలమును వ్యర్థపరచుచున్నావా?" అని అడిగినట్లు తోచును. దానికి సమాధానముగా నా అంతర్వాణి నేను భగవంతుని సన్నిధిని అనగా నా లోపలి అఖండమైన వెలుగును నా అణువణువు నందును అనుభవించనపుడు కన్నులు మూసుకొని ప్రార్థన లేక ధ్యానములోనున్నా నా సమయమును వృథా చేసికొన్నట్లే. అలాగే నేను పనిలో వున్నా, లేక సందర్శకులతో సంభాషించినా, నన్ను ప్రేమించే సందర్శకుల యందు, నా సందేశమును చదువు వారియందు భగవంతుని దర్శించలేకపోతే అది వృథాకాలయాపనయే అవుతుంది. 'ఈశావాస్యమిదం సర్వమ్' అను వాక్యమును వల్లెవేయుట ఎంత సులభము! ఈ విశ్వమంతయూ భగవంతు నితో నిండియున్నది. విశ్వము ఈశ్వరుడు లేక బ్రహ్మమయమైయున్నది. ఎడతెగక ప్రతిక్షణము, మనకు కావలసినది సదా భగవంతుని స్మరిస్తూ వారి వునికిని అనుభవించడమే.

చిలకపలుకులవలె మహావాక్యములను యాంత్రికముగా పునశ్చరణ చేయడము కంటే మన స్వానుభావములో అత్యున్నత స్థితినంది సర్వత్ర భగవంతుని చూడగలగడమే జీవిత పరమావధి కావాలి. మన నేత్రములలోని చూడగలిగే శక్తి అంతయూ భగవంతుడే. ఎందుకనగా మన నేత్రముల ద్వారా భగవంతుడే చూస్తున్నాడు. ఇప్పుడు నేను వ్రాస్తున్నప్పుడు ఆయనే వ్రాస్తున్నాడని గుర్తించ గలిగితే అది ఒక ఉత్తమమైన ఆరాధన అవుతుంది కానీ కాలము వృథా చేసినట్లు కాదు. భగవంతునికి మన శరీరము తప్ప తనదైన శరీరము లేదను మాట ఎంతయో నిజమే కాక ప్రాణాధారము, ఆత్మను జాగృతపరచేవీ అయి వున్నాయి.

ప్రతి శ్వాసలోనూ ఆయనే నిండి ఉన్నాడు; నిశ్శబ్దములో నీ హృదయ స్పందనలన్నియు ఆయనతో నిండి యున్నవి. మనము విశ్రాంతి తీసుకుంటున్ననూ లేక ధ్యానములోనున్ననూ పనిలో యున్ననూ సేవచేస్తున్ననూ, చిన్న పెద్ద అను తారతమ్యము లేకుండా ఇవన్నీ ఆయనే మన ద్వారా చేస్తున్నట్లు గ్రహించండి. ఉదయముననే నేను ఈ సందేశమును వ్రాస్తూ సమయము గడుపుతూంటే, రెండు 'రామీలు' నావద్దకు వచ్చి తమకివ్వవలసిన బిస్కెట్ల కోసమని నావైపు చూస్తున్నాయి. నేను వ్రాయటం ఆపి వాటికి బిస్కెట్లు పెడుతుంటే అల్పప్రాణులకు ఇచ్చే ఆహారము భగవంతునికే చెందుతుందనే భావన కలిగింది. పెద్ద రామీ మరియు చిన్న రామీ తృప్తిచెంది వాటిలో ఒకటి కృతజ్ఞతాపూర్వకంగా నా పాదమును నాకింది. అహంకారము, అజ్ఞానములతో నిండి తన స్వార్థము కోసము జీవించే మనుష్యుల కన్నా ఈ మూగ జీవాలు ఎంతటి విధేయతను, విశ్వాసమును మరియు కృతజ్ఞతా భావమును కలిగియున్నాయో గుర్తించండి.

నేను వుదయము తీసుకునే నిమ్మరసమును త్రాగుతూ ఆ రూపములో భగవంతుడే నాలోనికి వెళ్ళి ప్రత్యణువునందు వ్యాప్తిచెందినట్లు మనసా వాచా కర్మణా అనుభవముతో గుర్తించాను.

మనోవాక్కాయ కర్మలన్నిటిలో భగవంతుని సర్వదా గుర్తించుటయే సమయమును సద్వినియోగపరచుట అని చెప్పవచ్చును. అవి చిన్నవి గానీ లేక పెద్దవి గానీ ప్రతివస్తువునందును భగవంతుని చూడగలగడమే సమయమును సదుపయోగపరచినట్లవుతుంది. అతడే చూస్తున్నాడు; అతడే వింటున్నాడు. మనలో జనించిన ప్రతి ఆలోచన అతడే అయివున్నాడు. చలనములోనూ, నిశ్చలతలోనూ, లోపలా, బయటా, అంతటా అతడే వున్నాడు. ఎందువలనంటే ఈశ్వర సంకల్పము లేనిదే గడ్డిపరక కూడా కదలజాలదు. ఈ చేయి ఈశ్వరేచ్ఛలేనిదే యెట్లు కదులును? ఈ విశ్వమంతా ఈశ్వరమయమే కనుక కన్నులు చూసేదంతా బ్రహ్మమే. కన్నులు ఎక్కడ తిరిగినా లేక విశ్రాంతి పొందుతున్నా అవి చూసేదంతా బ్రహ్మమే అయివున్నది.

నేను వ్రాస్తున్నప్పుడు వర్షపుజల్లు పడుతూ వుంది. నేను ప్రతి వానబొట్టులోనూ ఆతని వునికిని గమనించడము నాకెంతో ఆనందదాయకమవుతుంది. ఈ వ్రాసేదంతా కూడా సమయమును వృథా చేయడమే ననుకుంటూ

ప్రక్కనే బల్లపైనున్న రుద్రాక్ష మాలను చూసాను. ఆ రుద్రాక్ష మాలనుచేతి లోనికి తీసుకుని త్రిప్పుతూ కొంతసేపు రామనామమును, సోహమ్ మంత్రమును జపిస్తూంటే నాకెంతో హాయిగా అనిపించింది. ఇలా చేయడము వలన నాకు శక్తి మరియు ప్రశాంతత కలిగినవి. వర్షములోనైనా, ఎండలోనైనా భగవంతునితో తాదాత్మ్యము చెందడము ఎంతటి సౌభాగ్యము! గతములోనైనా, వర్తమానములోనైనా, భవిష్యత్తులోనైనా భగవంతుడు మననుండి వేరైన క్షణము వుండనే వుండదు. కానీ మనకు తెలియకుండానే మన విలువైన సమయమును యితర విధములుగా వృథా చేయడము జరుగుతుంది. మనకు రోతపుట్టించే వుత్తరము వస్తే విమర్శ మరియు నిందలనే కుళ్ళిన పళ్ళను తింటూ ఎంతోవేదన చెందుతూ సమయమును వ్యర్థపరుస్తాము. అలాగే వుత్తరములో మనను ఎవరైనా పొగడడము జరిగితే ఆ పొగడ్తలను పదే పదే నెమరు వేసుకుంటూ మన సమయమును పాడు చేస్తాము. ఈవిధముగా పొంగిపోవడము, కృంగిపోవడము వలన సమయము వృథాచేస్తున్నట్లే కదా! మనము పొగడ్తలకు, తెగడ్తలకు అతీతముగా వుంటూ మన ధ్యాస భగవంతుని యందే నిలిపి వుంచాలి. ఈ విశ్వమంతా కాలమునకు అధీనులైన వారితో నిండివున్నది. మనకు కావలసినది కాలమునకు అతీతముగా వున్నవారే.

ప్రియ శాంతిపత్రిక చదువరులారా! ఇంకా మాటలతో కాలయాపన చేయుట ఏల? మన కన్నులు మూసినప్పుడు భగవంతుని చూడాలి. మనము కన్నులు తెరిచినప్పుడు భగవంతుని మన కన్నుల ద్వారా ప్రకటిద్దాము. నిష్కామసేవ మనలను మౌనములోనికి గొనిపోతుంది. నిశ్చలమైన మౌనము మనలను భగవంతుని వద్దకు చేరుస్తుంది. ఎందుకనగా ఈ విశ్వమంతా బ్రహ్మమే అయి వున్నది. దానినే మరో విధముగా చెప్పవలెనన్నచో కాలము, కారణము మరియు ప్రదేశములకు భగవంతుడు అతీతుడు కనుక మనము విశ్వవ్యాప్తమైన మౌనములోనికి వెళ్ళడం జరుగుతుంది.

శాంతి అందరియందు సుస్థిరమగుగాక!

ఓం! ఓం! ఓం!

# 6. కొబ్బరికాయ కథ

మూలము : స్వామి ఓంకార్ అనువాదము: గరిగిపాటి కృష్ణ

ఉష్ణమండల ప్రాంతాలలో సాధారణంగా కోతులు కొబ్బరిచెట్లెక్కి కొబ్బరికాయలు తెంపడం చూస్తూంటాము. కానీ ఆ తెంపిన కాయలను అవి ఆస్వాదించలేవు. ఎందుకనగా వాటి పీచు బాగా దళసరిగా ఉండడమే కాక దాని పెంకు కూడా చాలా గట్టిగా ఉండటంచేత అవి కొబ్బరికాయ పగలకొట్టలేవు. కోతులు కొబ్బరికాయలను చెట్టు నుండి తెంపితే ఇతరులు వాటిని ఆస్వాదిస్తారు. అయితే ఈ ఉదాహరణతో నాకు ఎట్టి ప్రత్యక్ష సంబంధము లేకపోయినా, నాకు ఈ విషయము కొంతమంది గ్రంథకర్తలు వ్రాసే పుస్తకాలు పుంఖానుపుంఖలుగా అచ్చువేయించడంలో నిమగ్నులుగా ఉంటూ ఉండడము, వాటిలో మతపరమైన మరియు ధార్మికమైన సూత్రము లను క్రోడీకరించి ప్రకటించడానికి సామ్యము కనపడుతుంది. వారు చేసే పనిని కోతులు ఎంతో కష్టపడి కొబ్బరికాయలు తెంపడముతో పోల్చవచ్చును. వాటిసారము మాత్రము సత్యశోధకులకు చెందుతుంది. ఈ ప్రపంచమంతా కొబ్బరికాయలను చెట్టునుండి తెంపే వారితో నిండి ఉండక, వాటిసారమైన కొబ్బరి నీరు–అమృతత్వము అనే పానీయమును గ్రోలేవారిగా వుంటే ఎంత బాగుంటుంది?

వాళ్ళను పరిగణనలోనికి తీసుకుంటే, మనకు ఎండుకొబ్బరి, పచ్చి కొబ్బరి యొక్క విభిన్న స్థితులు గోచరిస్తాయి. ప్రియమైన శాంతిపత్రిక చదువరులారా! మిమ్మల్ని ఒక వ్యక్తిగతమైన ప్రశ్న అడుగుతున్నందుకు క్షమించండి. మీదిపచ్చికొబ్బరి స్థితా? లేక ఎండు కొబ్బరి దశకు చేరు కున్నారా? బహుశః మీరు నా అసంబద్ధమైన ప్రశ్నకు ఆశ్చర్యపడవచ్చు. అయితే మీ ప్రస్తుతస్థితి ఎండు కొబ్బరిలాగా వుంటే మీరు పరిపక్వతకు చేరుకున్నట్లే. మీరు శరీరము ధరించిన జీవన్ముక్తులు. మీరు ఈ శరీరము నకు, మనస్సుకు, ప్రపంచమునకు అతీతమైన స్థితిలో వున్నట్లే. జీవన్ముక్తులైన మీరు ఈ జీవితములోనే సంపూర్ణ స్వేచ్ఛాగతులు. ఎండు కొబ్బరి దాని పెంకు నుండి విడివడినట్లు, మీరు ఆత్మ స్వరూపమే కాని ఈ శరీరము

కాదని అనుభవములో గ్రహించిన వారివలె వుందురు.

అట్లుగాక మీరింకా పచ్చికొబ్బరి దశలోనే యున్నట్లయితే నాకు దుఃఖము కలుగును. ఎందువలనంటే మీరింకా అపరిపక్వస్థితిలోనే యుండి మీరే ఈ మాంసము, రక్తముతో నిండిన శరీరమనే భ్రమలో జీవిస్తున్నారు. నిజానికి మీరు జీవన్మృతులు – జీవించివున్నా మీరు ఇప్పటికే చనిపోయినారు. ఇది ఎలాగంటే ఒక్కవేటుతో పచ్చికొబ్బరిని, దాని పెంకును ఎలాగయితే పగులగొడతామో,అలాగే ఏ మాత్రము పొగిడినా లేక తెగిడినా మీరు అస్థిరతకు గురి అవుతున్నారు. నా ప్రార్థన ఏమిటంటే మీరు కూడా ఎండు కొబ్బరిలా తయారయేందుకు ఉపక్రమించి నేను శరీరమనే భ్రమనించి ముక్తులుకండి.

ప్రకృతి సహజంగా, అతి సాధారణంగా జీవిస్తూ, జీవితంలోని కృత్రిమ త్వానికి, సంక్లిష్టతలకు లోనుకాకుండా వుండే మహాత్ములకు నేను శిరసువంచి నమస్కరిస్తాను. ఎందుకంటే వారు నిరాడంబరమైన, ప్రకృతి సహజమైన జీవనం సాగిస్తూ ప్రకృతిలో దొరికే ఫలాలను, గింజలను తమ ఆహారంగా యెంచుకుంటారు.

మళ్ళీ మనం కొబ్బరికాయ కథలోకి వద్దాం. మండు వేసవిలో ఒకనాడు సుబ్బిశెట్టి అనే వ్యాపారి తన కొబ్బరికాయలను ఒక గాడిదమీద వేసుకుని బజారుకు వెళ్తూవుంటాడు. అతనితోపాటుగా బాలుడైన అతని కుమారుడు కూడ సంతకు వెళ్తున్నాడు. సుబ్బిశెట్టి సంతకువెళ్ళి తనదగ్గరవున్న కొబ్బరి కాయలను అమ్మి బాగా డబ్బు సంపాదించాలనుకున్నాడు. సంతకు దూరం యెక్కువగా ఉండడంచేత చిన్నవాడైన సుబ్బిశెట్టి కుమారుడు కొంతదూరము వెళ్ళిన పిదప అలసటచే అతనికి దాహం వేసింది. తన తండ్రి పిసినారితనం తెలియడంచేత, అతను తండ్రిని ఒక కొబ్బరికాయను కొట్టి తన దాహం తీర్చమని అడగలేకపోయాడు. మరికొంత దూరం వెళ్లేసరికి ఆ బాలుడు ముందుకు నడవలేకపోయాడు. అప్పుడతడు సందేహిస్తూనే “నేను దాహంతో చనిపోయేలాగున్నాను. ఒక కొబ్బరికాయను నాకిచ్చి దాహము తీర్చమని” అడిగాడు. అప్పుడా తండ్రి ఆశ్చర్యంగా కుమారుని చూస్తూ “ఏమిటి! కుమారా, కొబ్బరినీళ్లు ధనవంతులు మాత్రమే తాగాలి. నీకు అటువంటి

ఆలోచన ఎలా వచ్చింది? ఇంకొన్ని గజాలు వెళితే ఒక సత్రం వస్తుంది. ఆ సత్రంలో వాళ్ళు నీకు ఉచితంగా చల్లని మంచినీళ్లు, మజ్జిగ ఇస్తారు. అవి గోరువెచ్చని కొబ్బరినీళ్ళకన్నా యెంతో శ్రేష్ఠమయినవి. అక్కడ నీ దాహం తీరేలా మంచినీళ్ళు, మజ్జిగ త్రాగవచ్చు. ఆ పిల్లవాడు ఏమి చేయగలడు? పాపం పసివాడు! అతను తండ్రి మాటననుసరించి నిదానముగా అడుగులు వేయసాగాడు. హతవిధీ! అతడు అలసట, దప్పికలను తట్టుకోలేక హృదయస్పందనలు వేగమవడముతో క్రింద కూలబడ్డాడు. అటు పిమ్మట కొద్దిక్షణాలలోనే అతని ప్రాణము అనంతవాయువులలో కలసిపోయింది.

ఇప్పుడు మనము కథ ముఖ్యభాగములోనికి అడుగు పెడతాము. పిసినారి తండ్రి సుబ్బిశెట్టిని నిస్పృహ, శోకము ముప్పిరిగొనగా ఈ విధంగా దుఃఖించాడు. "ఓ నా కుమారా! నీవు నన్నప్పుడే విడిచిపెట్టి పోవాలా? నిన్ను బ్రతిమిలాడుతున్నాను; ఒకటేమిటి నా దగ్గరవున్న కొబ్బరికాయలన్నీ తీసికో, సజీవుడవై ఈ కొబ్బరికాయలన్నింటిలోని నీరు త్రాగు.

కానీ అప్పటికే ఆలస్యమయినది. ప్రపంచములో వున్న కొబ్బరికాయ లన్నీ తెచ్చినా ఆ బాలుని సజీవునిగా చేయలేవు. మన జీవితములను బేరీజు వేసుకుంటే, మన ఆత్మీయులతో కొన్ని సందర్భాలలో సుబ్బిశెట్టి లాగానే పిసినారితనము ప్రదర్శించి వుండవచ్చు. ప్రత్యేకముగా మన ఆశ్రమము కూడా అనేక రకములయిన సుబ్బిశెట్టిలను కలిగివుంది. అలాగే ప్రాక్పశ్చిమములలో కూడా సుబ్బిశెట్టిలకు కొదువలేదు. కొన్నిసార్లు మన ఆశ్రమములో తినడానికి ఏమీ వుండక తరువాతి భోజనము ఎక్కడినుంచి వస్తుందనే ఆలోచన కలుగుతుంది. మన మూగ జీవములయిన గోవులకు ఆహారము కానీ, గడ్డికానీ వుండదు. మన పత్రికలు తగినంత స్టాంపులు లేక చందాదారులకు పంపించడము జరుగదు. ఈ విపత్కర సమయములో మనము సుబ్బిశెట్టి వంటి వారిని ఆశ్రయిస్తే మనకు లభించేవి శుష్క వాగ్దానములు మాత్రమే..కొబ్బరికాయలను ఇంకను వదలిపెట్టరు. ఆ విధముగా మన లక్ష్యమైన విశ్వశాంతి ఉద్యమము నిశ్శబ్దముగా, నిదానముగా పోరాటము చేస్తూనే వుంది.

వ్యక్తిగతమైన ఆశ్రమ స్థితిగతులను పక్కన పెడితే నేను మీకివ్వగలిగిన

సందేశము: మీరు ఏదైనా మంచి చేయదలచినచో దానిని వెంటనే అమలు చేయండి. అనిశ్చిత భవిష్యత్తుకై వాయిదా వేయకండి. ఇప్పుడే చేయండి, ఎందుకంటే ఈ క్షణమే మీది. ఆహా! క్షణభంగురమయిన జీవితమునకు మనము ఏ క్షణమయినా వీడ్కోలు పలుకవచ్చు. ఈ ప్రపంచములో మనము కూడబెట్టిన కొబ్బరికాయలు (అనగా నామరూపాత్మకమైన ప్రపంచమునకు) ఎందుకూ కొరగాకుండా నిష్ప్రయోజనమవుతాయి. అందుచే ఆలసించక మేల్కొనండి. ఇక్కడ ఈ మధ్య నాకు జరిగిన రెండు వ్యక్తిగత అనుభవాలను ప్రస్తావించకపోతే, నా సందేశము అసంపూర్తిగా మిగిలిపోతుంది.

నేను గతములో ఒకసారి ఒకచిన్న అనాధ పిల్లవానికి కొంత ధన సహాయము చేసాను, కానీ ఆ ధనము అతని అవసరానికి సరిపడేలా లేదు. కానీ యివ్వడానికి నా దగ్గర అంత ధనమేమీ లేదు కానీ రెండు కొత్త ఖద్దరు చొక్కాలు, తువ్వాళ్ళు మాత్రము వున్నాయి. అతను వెళ్ళిన తరువాత నేను వాటిని గురించి ఆలోచించినా నేను అప్పటికే బాగా అలసి వున్నందున నా ప్రక్క మీదనించి లేవలేకపోయాను. అప్పుడు నేను కూడా యితరుల మాదిరిగానే “నేను వాటిని తరువాత పంపవచ్చు” అని సమాధాన పడ్డాను. కొంతసేపయిన తరువాత ఆ పిల్లవాడు మరణించాడనే వార్త నాకు తెలిసింది. అతడు నా తువ్వాలు తీసుకోడానికి జీవించి లేడు. మీరు అప్పటి నా మానసిక వేదనను వూహించుకోండి...ఓమ్ శాంతి ఓమ్!

నేను నా ప్రార్థన ముగించి వేగముగా నాకు వచ్చిన లేఖలను చూడాలని వెళుతూండగా ఒక వీధి కుక్క బావి పక్కనే నేలపై పడి వుండడము గమనించాను. నేను దాని పరిస్థితి బాగులేదని గ్రహించి, తోటమాలిని పిలిచి తన గుడిసెకు ఆ కుక్కను తీసికొనివెళ్ళి దానికేదైనా ఆహారమును యివ్వవల సిందిగా చెప్పాను. మరుసటిరోజు నేను వాకబు చేయగా పనివాడు ఆ కుక్కను తన గుడిసెవద్దకు తీసికొని వెళ్ళిన వెంటనే చనిపోయిందని తెలిసి నది. ఈ సంఘటన నన్నెంతో కలిచివేసింది. అది ప్రాణముతో వుండగా నేను దాని చివరి క్షణములలో కొంతైనా దానికి సేవ చేసి ఒక విధమైన తృప్తితో జీవితము చాలించడానికి దోహదమవలేదనే వేదన నన్ను విచలితుని చేసింది. దానివల్ల ఏమి ప్రయోజనము కలుగుతుంది. ఇప్పుడు

నేను చేయగలిగినదల్లా అంతర్ముఖుడనై నా వేదనను ఈశ్వరునికి నివేదించడమే.

ఓ దేవా! నీవు నావద్దకు ఒక అనాథ బాలుని రూపములోవచ్చావు. కానీ నేను నిన్ను ఆరాధించలేదు. మరల నీవు వదలి వేయబడి, తీవ్ర అనారోగ్యముతో బాధపడే కుక్క రూపములో దర్శనమిచ్చినా నేను నా విధి నిర్వహణలో విఫలమయ్యాను. నన్ను మన్నించి, నాపై నీ కరుణ ప్రసరింప చేయి. భగవాన్! నేను ఇకముందు నిన్ను ఏ రూపములో దర్శించినా తత్ క్షణమే నా సేవలందించడానికి అప్రమత్తుడనయేలా నన్ను దీవించు.

ఓం ఓం ఓం

శాంతి. ఫిబ్రవరి 2021

# 7. బ్రహ్మా స్థితి

## వేదాంత ప్రశ్నోత్తరములు

ప్రశ్న : బ్రహ్మస్థితి అనగా నేమి?

ఉత్తరువు : స్వస్వరూపానందమే ఆత్మసాక్షాత్కారము నిప్పుడు **యిచ్చట** అనుభవించుటయే బ్రహ్మస్థితి.

ప్రశ్న : తమ సహజమైన బ్రహ్మస్థితిని పొందుటకు మానవులందరును యేల ప్రయత్నించుటలేదు?

ఉ : మానవులు తమ జన్మ యొక్క గమ్యస్థానమునేమరచి విషయలోలురై ఈషణ త్రయములలో కొట్టు కొనుచుండిరిగాన.

ప్రశ్న : బ్రహ్మస్థితి యెందువల్ల, ప్రాణతుల్యముగా ముఖ్యావసరముగా బరగు చున్నది?

ఉ: బ్రహ్మస్థితియే, స్థిరమైన, శాశ్వతమైన, సర్వకాల సర్వావస్థలయందును మార్పులకతీతమై, హెచ్చుతగ్గులు లేకుండ, ఒకేరీతిగా, అద్వితీయమై ప్రకాశించుచున్నది గాన అదియే ముఖ్యావసరము.

ప్రశ్న : ప్రాణతుల్యమని యేల జెప్పవలెను?

ఉ : అది ప్రాణమునకు ప్రాణమై, కదలుటకు, మెదలుటకు, చూచుటకు వినుటకు, సర్వ ప్రపంచమునకు ఆధారమైయున్నది గాన ప్రాణతుల్యమని జెప్పబడెను.

ప్ర : మనము మరచినను మనలను మరువనిదెద్ది?

ఉ : పరబ్రహ్మ స్వరూపమే.

ప్ర : మనము నిద్రించుచున్నను మనలో మేల్కొనియున్న దెద్ది?

ఉ : అమృతమైన సచ్చిదానంద స్వరూపమే.

ప్ర: జాగ్రత, స్వప్న, సుషిప్తి అవస్థలలోగూడ సాక్షిరూపముగా నిరంతరము వెలుగుచున్నదెద్ది?

ఉ : అఖండ పరబ్రహ్మ స్వరూపమే.

ప్ర: అద్దానిని, ఆ సత్‌పదార్ధమును, స్థిరముజేసి శాశ్వతముగా అనుభవించుట యెట్లు?

ఉ : నిత్యానిత్య వస్తువుల వివేకము కలిగి, గాఢమైన వైరాగ్యముతో నిండి యున్న సాధన చతుష్టయ సంపత్తితో మోక్షమును బడయనగును.

ప్ర: ఆ బ్రహ్మమును తనలోనేగాక ఇతరులలో గూడ గుర్తించుటెటుల?

ఉ : ప్రప్రథమమున ఆ దివ్య తేజస్సును మనలోగాంచ గలిగిన, అద్దానినే యితరులలో గూడ సులభముగా గాంచవచ్చును.

ప్ర : ఎందుచేతను అందరిలో గాంచవచ్చును?

ఉ : ఆ దివ్యతేజస్సు, నీలోనేగాక అందరిలోను గూడ అద్వితీయమై సంపూర్ణమై ప్రకాశించుచున్నదిగాన.

ప్ర : ధ్యానము చేయు సమయములలోనేగాక, పనిపాటలు చేయునప్పుడు గూడ ఆ దివ్య తేజస్సును అనుభవించగలమా?

ఉ : ఆ దివ్య తేజస్సును ధ్యానములో ఆపరోక్షముగ అనుభవించినవారు ఎన్ని పనులలో వున్నను అనుభవించగలరు.

ప్ర: ఆ బ్రహ్మస్థితిని, యిప్పుడు ఉండుటకు నిరంతరము అనుభవించుటకు సూచనలు, సహాయములున్నవా?

ఉ : అభ్యాసమే, నిరంతరము అద్దానిని ప్రార్థన ధ్యానాదుల యందును ఆట పాటలయందును, 'ప్రతి' నిముషమునందును గుర్తించుట సహకారిగా యుండును. మరచినపుడెల్లను, మరల మరల గుర్తించుటకు ప్రయత్నించ వలెను.

ప్ర : మరపు యెచ్చట వున్నది?

ఉ: మరపు మనస్సులోనే యున్నది. మరపు తెరపులు మనలో సంబంధమైనవే బ్రహ్మ తేజస్సులో మరపులేదు.

ప్ర: బ్రహ్మస్థితిలో ఏమున్నది?

ఉ: అచ్చట అఖండకోటి సూర్యప్రకాశమానమైన దివ్యతేజస్సే వెలుగుచున్నది.

ప్ర: అద్దానిని యీ నేత్రములతో గాంచగలమా?

ఉ: అది నేత్రములకు నేత్రముగా నున్నను, నేత్రములనేగాక, మనస్సును గూడ మీరియున్నది. మనస్సు మరుగైనచోటనే బ్రహ్మము ప్రకాశించు చుండెను. అనగా మనోలయమే బ్రహ్మస్థితి.

ప్ర: శరీరము నశించినను, నశించనిదెద్ది?

ఉ : ఆత్మయే

ప్ర: ఎందుచేతను?

ఉ : ఆత్మస్వరూపము శరీరమునకేగాక, ప్రపంచమంతకును సాక్షి స్వరూప ముగా నిరంతరము ఆధారమై ప్రకాశించుచున్నదిగాన.

ఆత్మనెద్దియు తాక జాలదు.

ప్ర: ఆత్మకు మార్పులు లేవనుటకు కారణమేమి?

ఉ: మార్పులన్నియు ఖండమైన వస్తువులకే – నామరూపములకే యుండును. నామరూపరహితమైన, అద్వితీయమైన పరమాత్మకు మార్పులెటులవుండ గలవు. పరమాత్మ స్వరూప మొక్కటియే అన్నిమార్పులకు అచలమై ఒకటిగా నిరంతరము ప్రకాశించుచున్నది.

ప్ర: దాని స్వప్రకాశమును అపరోక్షముగా అనుభవించుటకు మీ ఆధ్యాత్మిక జీవితములో మీకు తోడ్పడిన మీ అనుభవముల నుండి సూక్ష్మమైన సులభమైన మార్గములను జెప్పుదు?

ఉ: సోహం భావనయే నాకు చాల సహకారిగా యుండియుండెను. అజప గాయత్రియే మంత్రములన్నింటికి మహా మంత్రముగా విలసిల్లు చున్నది. అది మనము వుచ్చరించకున్నను, మనలో నిరంతరము విలసిల్లచున్నది.

ప్ర: అజపగాయత్రిని అనుభవముగా ఆచరించుట యెటులను?

ఉ: నిశ్శబ్దముగా యుండి, యింద్రియములన్నింటిని అంతర్ముఖముగా చేసి మనస్సును శ్వాసతో ఐక్యసంధానము జేయుచు, వుచ్ఛ్వాస నిశ్వాసములలో సోహం భావనను, మెప్పుడోగాక ఈ క్షణమునందే గుర్తించవలెను. లోపలికి వెళ్ళునది సో, బైటకు వచ్చునది హం.

ప్ర: దీని అర్థమేమిటి?

ఉ : ఈ కనిపించే ప్రపంచమును నేనే. కనిపించెడిదేగాక కనిపించనిది గూడ నేనే. అయమాత్మా బ్రహ్మ, ప్రజ్ఞానం బ్రహ్మ. తత్వమసి, అహం బ్రహ్మాస్మి. ఈ నాలుగు మహావాక్యముల యొక్క గూడార్థము సోహంలో యిమిడి యున్నవి.

ప్ర: సోహం మహామంత్రజపమునకు ప్రమాణమేమి?

ఉ: దేహో దేవాలయ ప్రోక్తో
జీవో దేవ స్సనాతనః।
త్యజేదజ్ఞాన నిర్మాల్యం
సోహం భావేన పూజయేత్॥

నీ దేహము దేవాలయము. జీవాత్మ యేకదా దైవము. బేధ మనెడి అజ్ఞానమును, అనగా దైవము వేరుగా వుండెననెడి బేధ భావనను విడిచి, సోహంభావనలో, ప్రతీ శ్వాసలోను మహాపూజను గావించుము.

ప్రియమైన పాఠకా! ఈ చిన్ని శ్లోకము నా ఆధ్యాత్మిక జీవితములో యెంత తోడ్పడినదో ఈ ఖండమైన మాటలతో మీకు చెప్పజాలను. దీని ఫలితమును నీవుగూడ ఈ చిన్న శ్లోకమును, కంఠతావల్లించి అర్థానిని సాధించుటకును నిరంతరము సోహం పూజలను చేయుచు, జన్మరాహిత్య మును బడసెదవుగాక. సోహం భావన విశ్వమంతటిని తనలో యిమిడ్చు కొని యున్నది గాన సోహం మహామంత్రం అజపగాయత్రి జపము అందరము తరించుటకు తోడ్పడును.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

# 8. స్వభావము

స్వభావము రక్తములో మిళితమైయున్నది. దానిని బోధలతో, వుపదేశ ములతో, ప్రార్ధనలతో మార్చగలమా?

తేలు స్వభావము తేలుది. పాము స్వభావము పాముకున్నది. తోడేలు స్వభావము తోడేలు వ్యక్తపరచుచున్నది. పులి స్వభావము పులి జూపుచున్నది.

వాటి స్వభావములను మనము మార్చగలమా? తేలు స్వభావము తేనెలో పెంచినను అదికుట్టుట మానదు. పామును పాలతో పెంచినను అది కరచుట మానదు. తోడేలును ఎంతప్రేమించినను దాని మాయ మోసపుగుణము మారదు. ఇక పెద్దపులి స్వభావము ఎవరు మార్చగలరు. ఎంత అమాయకపు జీవులనైనను అది చీల్చి తినివేయును.

ప్రపంచములో చాలమంది మానవుల స్వభావములనే మార్చుటకు ప్రయత్నించిన వారికి, విఫల మనోరధులై దుఃఖించుచున్నను, లోక సంస్కర్తలు తమను విడిచి లోకములో అందరిని మార్చుటకు విశ్వప్రయత్న ములు జేయుచున్నారు.

గాని మానవులెంత ప్రయత్నించినను తేళ్ళు తేళ్ళవలె, పాములు పాములవలె, తోడేళ్ళు తోడేళ్లవలె, పులులు, పులులవలె వాటి వాటి స్వభావముననుసరించి లేశమైన మార్పులేక వ్యవహరించుచున్నవి.

గాని మానవుడు వెర్రివాడై తేలు నన్ను ఎందుకు కుట్టవలెను, పామెందుకు కరువవలెను. తోడేలెందుకు నన్ను మోసం జేయవలెను, పులి నన్నేల చీల్చవలె అని ప్రశ్నించుచు దుఃఖవారధిని పడుచుండెను.

ఈ సమస్య ముఖ్యముగా తేళ్ళను, పాములను, తోడేళ్ళను పులులను తమ స్వంతముగా భావించి, ప్రేమించుచు, వారి శ్రేయస్సును వారి భావి వృద్ధిని కోరుచు జీవించుచున్నవారికి, ఆ జంతుజాలములు వారిమీద తిరుగబడినప్పుడు అతికష్టముగానే యుండును.

ఈ సందిగ్ధావస్థలోనే వివేకముగల మానవుడు, ఆ ఆ జంతు

సముదాయములు; వాటి వాటి స్వభావము ననుసరించియే నటించుచున్న వనెడి యదార్థమును గ్రహించి మనోశాంతిని పొంద ప్రయత్నించవలెను.

పొరబడుటే మనుజుని స్వభావము. అందరును పొరపాటు పడుదురు. గాని తమ పొరబాటును పొరబాటుగా తెలిసికొన్నవారు దైవతుల్యులు. నీది తప్పు అని మనము జెప్పినప్పుడు, మనలను కొట్టవచ్చెడివారు మృగ తుల్యులు. గాన యిచ్చటనే Resist not - evil అని మహనీయులు జెప్పిరి. పాపమును ఎదుర్కొనవలదని నుడివియుండిరి. దానిని ఎదుర్కొన్న అది నీ మీదనే అమాంతముగాపడును.

చిన్న ఉదాహరణను, ఈమధ్యను జరిగిన దానిని ఈ సమస్యను పూర్తిగా బోధపర్చుకొనుటకుమాత్రము తీసుకుందాము.

తాలూకా కోటాలో బీదప్రజలకు బియ్యముసరిగా నివ్వక పైగా వాటిని అమ్మివేయుచు, నానా అవస్థలు ఒక వ్యక్తిపెట్టుచుండెను. ఎన్నిసార్లు ప్రార్థన లతోను, బాహ్యములలోను, నమ్రతగా, కఠినముగా జెప్పినను లక్ష్యము చేయలేదు. చివరకు దిక్కులేని ప్రజలందరూ యింక అతని క్రూరత్వమును భరించజాలమని భోరున ఏడ్వగా అతనిని తొల్గించితిమి.

ఆ కోపమున అతడు బియ్యము వుంచుచున్న శాలనే కాల్చి వేసెద ననెను. అటుల అనుట తప్పు అని అతని భార్యతో జెప్పగా, తన భర్త లేనందున, తన భర్త అన్నను కర్రయిచ్చి దెబ్బలాడుటకు పంపెను. అతడు రౌద్రమూర్తివలెవచ్చి, అనరాని మాటలన్నియు నిందలన్నియు వర్షమువలె కురిపించెను. తన తమ్ముడు ఇల్లు కాల్చివేసెదనని అనెనో లేదో అతడు తెలుసుకొన నవసరములేదు తన తమ్ముడు అనియున్నను, యీమాట యెందుకు మరల యెత్తవలెననే అతని స్వభావము యొక్క ముఖ్యోద్దేశము. ఆ స్వభావము ముందుపడినవారి నెవ్వరినైనా కాల్చివేయును.

ఇటువంటి అస్వభావికమైన వుదాహరణలనే యెన్నింటినో వివేకము గల్గిన మనుజులు తమజీవితములనుండియు, తమ చుట్టును జరుగుచున్న పనులనుండియు లెక్కకు మీరి తీసుకుని జూపవచ్చును. గాన స్వభావమును మార్చుటకు ప్రయత్నించుట వెర్రితనము.

క్రూరుని స్వభావము క్రూరత్వముగా యుండును. నిరుపేదలను హింసించుటే! సజ్జనుని స్వభావము ప్రేమించుట ఓర్పుతో అన్నియు భరించుటే.

ఒక మనుజుడు తన స్వభావమునుబట్టియే నిందించుచు, బాధించుచు కొట్టుచుండును. అతని స్వభావమునెవ్వరు మార్చగలరు.

ఎంత చదువరులైనను అబద్ధములాడుట స్వభావమైన ఆ గుణమును విడువజాలరు. తలలు నెరసినను దొంగతనము జేయుట స్వభావమైన అద్దానిని మార్చుకొనజాలరు.

స్వభావముననుసరించియే ప్రతిమనుజుడును ఆ ఆ పనులు జేయుచుండిరి. సజ్జనుని నుండి శాంత, సహనము గుణములు వ్యక్తమవ్వుచున్నవి దుర్జనుని నుండి డంభము, అహంకారము, క్రోధము, కక్ష మొదలైన గుణములు వచ్చుచున్నవి.

మనమీ అవస్థలలో చేయవలసినదెద్ది? మన గత్యంతర మేమి?

సాధ్యమయినంతవరకు, యీ తేళ్ళకు, అగ్నిజెర్రెలకు, పాములకు, నక్కలకు, తోడేళ్లకు, పులులకు వీలైనంత దూరముగా ఏ సంపర్కము లేకుండ యుండుటయే మంచిది.

మనము తేళ్ళు, జెర్రులు నక్కలు జిత్తులమారులు, క్రూరులు, మోసగాండ్రు వున్నచోటనే వుండుట తప్పనిసరియైనను, అదియు మన మంచి కొరకే అని భావించి తేలుకుట్టినప్పుడెల్లను మనను కాపాడుచు, పాము బుస్సుమన్నప్పుడు మనము శాంతించుచు, ఆ ఆ స్వభావములలో యుండు వారిన్నెన్ని కఠిన పరీక్షలు మనలకు పెట్టినను, ఓర్పుతో భరించుచు మనలోవున్న సాత్విక గుణమునే వ్యక్తపరచుటకు ప్రయత్నించవలెను.

అగ్నిచేతనే యినుము బాగా కాల్చబడి శుభ్రపడుచున్నది. మనుజుడు కఠిన పరీక్షల చేతనే తన జీవితము యొక్క దుర్బలత్వమును, పరీక్షలలో పరిశీలించుకొని, వ్యక్తము జేయుచు, మనోజయమును బడయుచుండెను.

గాన యీ తేళ్ళు, పాములు, తోడేళ్ళు, పులులతో సంపర్కము దైవ నిర్ణీతమై మన శ్రేయస్సు తరింపు కొరకే యివ్వబడినది. గాన సాధకుడు, దైవపిపాసకుడు ఓర్పుతో, శాంతితో, ప్రేమతో, ఆనందముతో తన మీద విసరబడుచున్న పాషాణములను సోపానములుగా (రాళ్ళను మెట్లుగా) జేసుకొని, దినదినాభివృద్ధిని గాంచుచు, తన జన్మహక్కైన కోటిసూర్య ప్రకాశ మానమైన దివ్యతేజస్సునే, అన్ని అగ్ని పరీక్షలలోను గూడ నిరంతరము వ్యక్తపరచుచు తరించెదముగాక!

సర్వేజనా సుఖినోభవంతుః

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

నిర్వాణ కుటీరము

1-1-50

6-00 ఎ.ఎమ్.

# 9. శాంతి సమావేశము

ప్రియమైన సోదరీ సోదర స్వరూపులారా!

నేటి వార్షిక శాంతి సమావేశము యొక్క జ్ఞాపకార్థముగా, నిరంతరము మన జన్మహక్కైన బ్రహ్మానందమును అపరోక్షముగ అనుభవించుటకే నిశ్చయించుకొందాము.

అన్నిజన్మలలో మానవజన్మ ఉత్కృష్టమైనది. కాలము విలువైనది. గాన ప్రతీ దినమును,యిరువది నాలుగు గంటలలో అరగంటయైనను భక్తి జ్ఞాన వైరాగ్యములను బోధించెడి, ఆధ్యాత్మిక గ్రంధములను పఠించుటకు నిశ్చయించుకొనుడు. మరొక అరగంట, ముప్పది నిముషములైనను ప్రార్థన ధ్యానాదులలో గడపవలెనని ఒక్కదినమునైనను గడపమని నిశ్చయించుకొనుడు.

మీ ఆధ్యాత్మిక వృద్ధిని తరించెడి సమయములైనను పరిశీలించుకొని దైవములో నిద్రించి, దైవములోనే మేల్కాంచుటకు ప్రయత్నించుడు. దినచర్య డైరీని నిత్యము వ్రాయుచున్న మీ ఆంతర్యవృద్ధికి చాల సహకారిగా వుండును.

దైవము లేక మీ ఆత్మానుభవమును కేవలము ప్రార్థన ధ్యానాదులు జేయు సమయములందే అనుభవించుటగాక సర్వకాల సర్వావస్థల యందును, ఎన్ని పనులయందున్నను దైవజ్ఞప్తితో దైవముననుభవించుచు మీ స్వధర్మకార్యములను నెరవేర్చుకొనుటను అభ్యసించుడు.

ఒక్కమారు పఠించినంత మాత్రముననే, నూతనమైన శక్తిని, శాంతి యొసంగెడి, లోకశాంతి ప్రార్థనను వల్లించి, అద్దానిని ఉదయము, సాయంత్రమే గాక నిరంతరమును, మీరేగాక మీ ఆలుబిడ్డలచే గూడ స్మరింపజేయుచు తరించుడు.

మాసమునకు ఒక్కమారైనను భక్తకోటికి శాంతి నొసంగుటకై స్థాపితమైన మీ శాంతి ఆశ్రమమును దర్శించి, ఋషి కొండ సాగరతీరమున కొంత తడవు యిసుకలో కూర్చొని, ఆ మహాసముద్రము యొక్క అలలను వీక్షించుచు, సముద్రములో హెచ్చైన అలలుగలవో లేక మీ మానస సరోవర

ములో పరిమితిలేని అలలు, ఆలోచనలు గలవో ఒక్కసారి, నిమీలిత నేత్రులై మీ జీవితములను పరీక్షించుకొనుడు.

అలలులేని సంకల్పరహితమైన బ్రహ్మసాక్షాత్కారమే మీ జన్మహక్కు. అద్దానిని దీపముండగనే స్థిరముజేసి నేడే అనుభవించుటకు ప్రయత్నించుడు.

**సముద్రము ప్రార్థించుచున్నది – మనుజుడా నీవేల ప్రార్థించవని?**

ప్రతీకెరటమును తన ప్రార్థనయే! మన ప్రతీ ఆలోచనను గూడ దైవార్పితము జేయుచు, సంకల్ప రాహిత్యమైన అలలులేని, పరిపూర్ణమైన స్థితిని పొందెదముగాక!

ఋషికొండ సాగరము ఓంకార శబ్దముతో మీకు స్వాగతము నొసంగు చున్నది. కైలాసము గూడ మీకు నిరంతరము మౌనముతో నిశ్శబ్దముతో స్వాగతమొసంగు చున్నది.

కరుణాసాగరుడైన దైవము మీ అందరకును ఆయురారోగ్యములను పూర్ణశాంతి నొసంగి బ్రోచుగాక!

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

రెండు నిమిషములు మనమందరము మౌనములో నిశ్శబ్దముగా వుండి దైవమును ననుభవించెదము గాక!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

27–7–52

5–30 ఎ.ఎమ్.

# 10. దైవము నిర్దయుడా?

## (సోదరి సుశీలాదేవి గురించి)

దైవము నిర్దయుడేగాక క్రూరుడు అని యీ మధ్యను జరిగిన, క్రూరమైన హృదయవిచ్ఛేదమైన శ్రీ సుశీలాదేవిగారి అకాల మరణము గురించి, కొందరు అనుకొనుచుండ వినియుంటిని.

చీమకైనను ఎన్నడూ హాని చేయని, పశుపక్ష్యాది జంతువులను యెంతయో ప్రేమతో పోషించిన, నోరులేని జంతువుల క్షేమమునకై తన ప్రాణమునైనను అర్పించి, అహోరాత్రులయందు పాటుబడియున్న సోదరి శ్రీ సుశీలాదేవి గార్కి ఇట్టి ఘోరమైన, భీతికరమైన దుర్మరణము నేల దైవ మిచ్చెనని, మరికొందరు భక్తులు వుత్తరములలో వ్రాసియుండిరి.

వాస్తవమే! సోదరి సుశీలాదేవి గారి ప్రేమ అఖండము. నిరుపమానము, అపారమనే జెప్పవలసియున్నది. పావురాలు చిలుకలు మొదలైన పక్షిజాలములను పంజరములలో జూచిన యెంతయో బాధపడెడివారు. ఏ బండివాడుయైన తన యెద్దుమీదగాని, గుఱ్ఱము మీదగాని దెబ్బకొట్టిన, ఆ దెబ్బ తన శరీరము మీదనే పడినట్లు శరీరముచుట్టుకొని పోవుచు, యెంతయో బాధ పడెడివారు.

ఉత్తరదేశ ప్రయాణములో, ఒక్కచోట రైలుపట్టాల మీద మేకపిల్ల అరచు చుండ, రైలుదూరములో వచ్చుచున్నను లెక్కజేయక, ఫ్లాటఫారమునుండి దిగి, దానిని రక్షించిరని వారితో ప్రయాణము చేయుచున్న భక్తురాలు జెప్పియుండెను.

ఆశ్రమసేవజేయుచు, గ్రామగ్రామములకు కారుమీద ప్రయాణము జేయుచున్న సమయములలో, యెద్దులను గుఱ్ఱములను హింసించెడి బండ్ల వాండ్లను చూడగనే, వెంటనే కారును ఆపించి, ఆబండ్ల వాళ్ళకు నమస్క రించి, దైవము ఆ నోరులేని జంతువులలో గూడ యుండెనుగాన వాటిని కొట్టవద్దని తన చేతులు జోడించి వారిని ప్రార్థించెడివారు.

కొన్ని సమయములందు, ఒకటి రెండు రూపాయలు ఆ బండివాని చేతులలో వుంచి, ఇంకెప్పుడు ఇట్టి క్రూరమైన పనులను చేయవలదని, పశువులను, జంతుజాలమును ప్రేమగా జూడమని జెప్పుచుండెడివారు. ఆమెకు భాషరాని రోజులలో తాను ఇంగ్లీషులో జెప్పుచు దగ్గరివారిచే తెనుగులో జెప్పమనుచుండెడివారు.

ఆమె భూతదయ, అపారమైన, అఖండమైన ప్రేమకు అంతులేదనియే జెప్పవలసియున్నది. ఆ అపారమైన నిర్హేతుకమైన భూతదయలో ఆమె నిర్భయత్వమును గూడ వెయ్యి నోర్లతో నైనను మనము కొనియాడజాలము. తోటపల్లి ఆశ్రమములో, ఒక్కరాత్రి వారు వంటరిగా, గుహమీద యున్న బంగళాలో వుండెడివారు. ఆమెవద్ద రామీ అనెడి విశ్వాసమైన కుక్క యుండెడిది. తాను లోపలయుండ,చీకటిలో బైట రామీ అరచుచు ఏడ్వ సాగెను. వెంటనే బైటకు వచ్చి చూడగా, రామీ, చిరుతపులి నోటిలోయున్నది. అప్పుడు దగ్గరలో అరుగుమీద చెంతనే యున్న బిందెతో ఆ చిరుతపులిని కొట్టితిరి. రామీని చిరుతపులి నోటినుండి లాగినట్లుగా, అంత దగ్గరలో యుండి, నిర్భయముగా దానిని విడిపించితిరి.

గాని రామీకి చాల బలమైన గాయాలు తగిలెను. దానిపీక అంతయు గాయములచే రక్తమయమై యుండెను. వెంటనే కారు తీయించి ఇరువది మైళ్ళలో యున్న పిఠాపురం పశువుల ఆసుపత్రికి రామీని తీసుకొనివెళ్ళి చికిత్స జేయించితిరి.

అచ్చట ఆసుపత్రిలో కొన్నిరోజులు రామీవుండగా దానినిజూచుటకు తరుచు శ్రీ సుశీలగారు వెళ్ళుచుండెడివారు. రామీగాయములు మానగనే దానిని కారుమీద ఆశ్రమమునకు మరల తీసుకొనివచ్చిరి. రామీ కృతజ్ఞతతో చాలా సంవత్సరములు శ్రీ సుశీలాదేవిగారిని అంటిపెట్టుకొని ప్రేమతో ఆమె చెంతనే జీవించుచుండెడిది.

శ్రీ సుశీలదేవిగారు హిందూదేశములో సేవజేయుచు, నివసించిన ఇరువది సంవత్సరములలో ఆమె పశుపక్ష్యాది జంతుజాలమునకే గాక మానవమాత్రులకు గూడ ముఖ్యముగా నిరుపేదలకు,రోగపీడితులకు జేసిన

వివిధమైన సేవలు లెక్కకు మీరి యుండెడివి.

వాల్తేరు ఆశ్రమములో, శాంతి చికిత్సాలయమునందు ప్రతీరోజును రోగుల పుండ్లు మొదలైనవి కడిగి, శుభ్రము జేయుచు ప్రసిద్ధికెక్కిన వైద్యులచే పరీక్షలు జేయించి, చికిత్సలు జేయించెడివారు.

ఒక్కరోజున ఒక్క రోగియొక్క పుండ్లను కడిగి శ్రీ డాక్టరుకి పిన్నిగారికి జూపించుచుండగా,ఆయన ఆ రణము, కుష్టురోగ సంబంధమైనదనియు, సుశీలగారిని చాల జాగ్రత్తగా వుండమని, ప్రేమతో సలహానిచ్చితిరి. అప్పటి నుండియు, మరికొంత హెచ్చువుత్సాహము, నిర్భీతి, ఆనందముతో సేవ జేయుచుండెడివారు.

ఏ దిక్కుయులేని స్త్రీలు ఆమెకు కనిపించినను, తాను వాడుచున్న చీరలు మొదలైన దుస్తులను వాటి విలువైన ఖరీదును గూడ సరకు జేయకుండ, ఇచ్చుచుండెడివారు. అరటిపండ్లు మొదలైనవి గూడ ఆవులకు రోజూ ఆశ్రమంలో పెట్టుచుండుటచే జంతుజాలములు ఉదయమునే ఆమె కుటీరము వద్ద ఆమెకై జూచుచుండెడివి. ఒక్క పెద్ద ఆవు, ఆమె గదిలోనకే మెట్లు యెక్కి, వెళ్ళుటకు ప్రయత్నించుట జూచుట, ఆశ్చర్యమును కల్గించెడిది.

సముద్రపు ఒడ్డున వెళ్ళుచుండ చేపల వాండ్రు పెద్దపెద్ద తాబేళ్ళను పట్టి వాటిని తిరగవేసి ఇసుకలోవుంచుట, ఆమెకు భరించలేని బాధను గల్గించెడిది. జాలరులకు వాటి విలువను ఇచ్చుచు, ఆ తాబేళ్ళను మరల సముద్రములో వదలిపెట్టించెడివారు.

శ్రీ సుశీలగారు ప్రయాణములలోగాని వూరిలోనకు పనిమీదవెళ్లి నపుడుగాని, ఏ పిల్లవాడు ఏకుక్కపిల్లనుగాని పిల్లి పిల్లనుగాని వాటి మెడలకు త్రాడుగట్టి లాగుచు ఆడించుచున్నను వెంటనే వారు ఆపించి తనముక్కు మీద వ్రేలుపెట్టి 'తప్పు 'తప్పు' అనుచు ఆ జంతువుల మెడలకు కట్టబడిన త్రాళ్ళను విప్పివేసి, ఆ పిల్లలకు పండ్లో పిప్పరమెంటుతొనలో పంచి పెట్టు చుండెడివారు. ఏదిక్కు దక్షతలేని కుక్కపిల్లను, పిల్లి పిల్లను జూచిన వాటిని వెంటనే కారులో యెక్కించి, ఆశ్రమమునకు తీసుకునివచ్చి, వాటిని ఆనంద ముగా పోషించుచు, కాపాడుచుండెడివారు.

సుశీలదేవిగారు హిందూదేశములో యున్నను, ఆమెరికాలో యున్నను, ఆమె గదిలో దిక్కులేని ఏవో పిల్లి పిల్లలో, కుక్క పిల్లలో, ఆమె చెంతనే సదా వుండి యుండెడివి.

ఆమె బాల్యమునందు గూడ శ్రీ సుశీలదేవిగారి తల్లి తండ్రులు ఆమెతో "నీవు వీధిలో కనిపించిన ప్రతీకుక్క పిల్లను, పిల్లి పిల్లను ఇంట్లో తీసుకొని వచ్చి మేపుతున్న యెన్నింటినని గృహములో వుంచగలము" అని ఆమెను కోపపడుచుండెడివారు. ఎవ్వరెంత జెప్పినా, యెవ్వరి మనస్సులకు తప్పు అభిప్రాయము, కష్టముగల్గినను, ఏ దిక్కులేని, ఏ జంతువును ఎచ్చట జూచినను, దానికి తక్షణమే సంరక్షణ జేయుచుండెడి వరకు ఆమెకు తృప్తి యుండెడిదిగాదు. రోగముతోయున్న గుఱ్ఱములు, యెద్దులు, ఆవులు మొదలైన జంతువులను, ఆశ్రమంకు తనవెంటను తీసుకొనివచ్చి, మేపుటకు చికిత్స జేయుటకు వీలుగలుగనప్పుడు, వాటి యజమానులు ఒప్పుకొననప్పుడు, ఎవ్వరికీ తెలియకుండ 10,15 రూపాయలు నోట్లు వారి చేతులలో పెట్టి చేతులు జోడించి, దణ్ణాలుపెట్టుచు, దైవముపేరున వాటి చికిత్సలను జేయుచు, బాగా మేపుచు తోడ్పడమని చెప్పుచుండెడివారు.

ఆమె అఖండమైన అంతుఆదిలేని భూతదయ గురించి ఇంకను హెచ్చు వుదాహరణలతో వర్ణించుటకు బదులు, ఇప్పుడు మనకు కావలసిన, ముఖ్యావసరమైన అంశము, అట్టి కరుణాపూరితమైన మహాసాధ్వీమణికి ఇట్టి ఘోరమైన క్రూరమైన బలవన్మరణమేల గలిగెను.

ఒక జడ్జీగారు శ్రీ సుశీలగారి విషాదకరమైన మరణము గురించి విని, నేత్రములనుండి అశ్రుధారలు కార్చుచు, ఇది చాల బలవంతమైన మరణమేగాదు, అతిదారుణమైన హత్య అని సానుభూతి వుత్తరం వ్రాస్తిరి. నిజమే ఆమె శరీరం హఠాత్తుగా కారుక్రిందపడి త్రొక్కబడుటయే గాక, కారులో చిక్కుకొని కొంచెము దూరము రోడ్డు మీదను యీడ్వబడెనని, అమెరికా నుండి వచ్చిన విచారకరమైన వుత్తరమున వుండుటచే చాల బాధ గల్గించెను. అట్టి పావనమైన ప్రేమ స్వరూపునికి యిట్టి ఘోరమైన హత్య అర్హనీయమా? ఈ దుర్మరణము న్యాయమా?

ఇట్టి ఘోరమైన, విపత్తులు, హత్యలు జరుగుచుండ కృపాహృదయుం డైన, కరుణామయుండైన, దైవమెచ్చటయుండెను? ఆయన ఏమి చేయు చుండెను. ఇతరులబాధలు తనకు ఆనందకరములా? ఇతరులెవ్వరు? బ్రహ్మ పిపీలికాది పర్యంతము, సర్వజీవులు దైవము యొక్క బిడ్డలేకదా! తనబిడ్డలను తాను కాపాడవలదా! ఆ దైవము తన బిడ్డలను కాపాడజాలని శక్తిహీనుడా నిర్దయుడా?

తన అనుంగు, ముద్దులబిడ్డయైన సుశీలగారి నేలకాపాడలేదు? దైవము తలచిన చేయజాలనిదెద్ది? సర్వజ్ఞుండైన దైవము, సర్వత్రానిండియున్న దైవము, యీ ఘోరమైన హత్యను జూచుచు ఉపేక్షగా యేల వూరుకొనెను.

వెర్రి మానవులు వారి బాధలలో ఇటువంటివే అనేకమైన ప్రశ్నలను, తెలిసియో తెలియకయో దైవమును గూడ నిందించుచు వేయుచుండిరి. ఈ గూఢమైన ప్రశ్నలనంటిని తెలుసుకొనుటకు, ప్రప్రధముననే మనము దైవమును సర్వసాక్షి స్వరూపుడా లేక గుణములతో నిండియున్న వాడాయని విమర్శించి తెలుసుకొనవలెను. సర్వసాక్షి స్వరూపుడనియే నిర్ణయించిన, ఆయనకు, సూర్యునకు మేఘాలు అంటనట్లు ఏ శరీరావస్థలను, సూర్యులకు సూర్యుడై అఖండకోటి సూర్యదివ్యస్వరూపునకు, ఏ శరీరసూర్యులును, ప్రాపంచికపు సంఘటనలను, యెంతమాత్రము యెన్నడును అంటజాలవు గదా!

దైవము గుణములలోనే నిండియున్న వాడని జెప్పిన, సర్వజ్ఞుండైన దైవమునకు అల్పజ్ఞులైన మానవులకు భేదమెక్కడ యున్నది. దైవము కృపా మయుడా? నిర్దయుడా? దైవము కృపామయుడుగాడు, నిర్దయుడుగాడు. అతడు సాక్షి స్వరూపుడు మాత్రమే. దైవము ద్వంద్వాతీతుడు గుణరహితుడు నివేదించుచున్న కానుక అన్నట్లు ఈ క్రింది భావములను వారి ప్రార్థనలో వ్రాసియుండిరి.

ఓ ప్రభువా! నీపేరున చేతులు జోడించి నీ దేవాలయముల ముందు శాంత భూమిలో నిలువబడి నిత్యము ఫలపుష్పాదులతో నిన్ను పూజించు, నీ జ్యోతిని ధ్యానించుచు, కర్పూరమును హారతిగా ఇచ్చుచుండ నా హృద

యము పరవశత్వము చెంది, నీ అఖండ ప్రేమలో జ్యోతిర్మయమైన నీ సమాధిలో వెంటనే లీనమవ్వుటకు కోరుచున్నది.

శ్రీ సుశీలదేవిగారు యీ పై వ్రాయబడిన ప్రార్థనలో సంకల్పించినట్లు అఖండ జ్యోతిలో హఠాత్తుగాలీనమైపోయిరి. ఆ మహాసాధ్వీమణి హిందూ దేశములోనే జన్మించునని కొందరు వ్రాయుచుండిరి. మరికొందరు ఆ ప్రేమమూర్తికి పునర్జన్మయే లేదని వ్రాయుచుండిరి. మొన్నను ఆశ్రమ భక్తులొకరు బొంబాయినుండి, ఆశ్రమవాసుల వుపయోగార్థమై కొన్ని సిల్వరు పళ్ళెములు వగైరాలు కొంటిననియు, నాకు గూడ ఒక పళ్ళెము తెచ్చు చుంటినని వ్రాయగా, నా పళ్ళెమును శ్రీ సుశీలదేవిగారికే అర్పణ చేయుద మని వ్రాయుచుంటిని.

నేనింకను శ్రీ సుశీలదేవిగారు ఆశ్రమంకు వచ్చెదరని వేచియుండుట ఆశ్చర్యకరమే! సుశీలదేవిగారు ఇంకెప్పుడో వచ్చెదరని భావించుట పొరబాటే. ఏలనన ఆమె శరీరమును, అమెరికాలో విడువగనే, భారతదేశమునకు ఆమె శాంతి నిలయమునకు వెంటనే వచ్చియుండిరి. ఆమె ఇచ్చటనే మన హృదయములలోనే ప్రవేశించితిరి.

ఆమె దివ్య సన్నిధిని, అఖండమైన ప్రేమను, అపారమైన భూతదయను అనుభవించుచు ఇదివరకు కంటెను, హెచ్చుగా ఇప్పుడును ఇక ముందును, మానవసేవయే దైవసేవగా, భావించుచు, స్వార్థరహితముగా అమూల్యమైన మన కాలమునంతను, సద్వినియోగము జేయుచు తరించెదముగాక!

ఆశ్రమవాసులు, ఆశ్రమ భక్తులు, ఆశ్రమాభిమానులు, శ్రీ సుశీలదేవి గారి యందు ప్రేమగౌరవ పూజ్యభావనలతో సానుభూతి సందేశములను పంపుచున్న వారందరును ఆమెకు ఆనందము గల్గించెడి మూగ జంతువు లును నిరుపేదలైన, నిస్సహాయులైన రోగుల సేవజేయుచు దిన దినాభి వృద్ధిని గాంచుచు తరించెదరుగాక!

ఆంతర్యమున, బాహ్యమున సర్వత్ర నిండియున్న శ్రీ సుశీలదేవి ప్రేమ పూరితమైన ఆత్మకు నిత్యశాంతి గలుగుగాక!

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతిః శ్శాంతిః

18-12-57

Whenever He sees a smile too bright & heart too Pure for time and nice He bears it to that world of high to dwell in Paradise.

Om

# 11. ఆశ్రమమునకు తటాకము యొక్క ఉపయోగము

1. ఆశ్రమము అనగా, సముద్రమో, నదియో, కాలువయో వున్నదే ఆశ్రమము అనబడును. నీటివసతిలేనిదే ఆశ్రమము అనిపించుకొనదు. ఇచ్చట ఆశ్రమంకు ధార వున్నదిగాని అది మైలు దూరములో యున్నది. గాన ఆశ్రమములో చెరువైనా వున్న, స్నానపానాదులు జేసుకొనుటకు, ఆశ్రమస్థులు, అతిధులు, అచ్చటస్నానము చేసుకొని, సంధ్యావందనము, ప్రార్ధన ధ్యానాదులతో సూర్యోదయమునందు, సూర్యాస్తమయమునందు గడిపెడదరని ఆశయముతో చెరువు ప్రారంభించబడెను.

ఆ ప్రదేశములో నీరు 3 నిలువులలో పడునుకాని, ఆ మూడు నిలువులు క్రమముగా తవ్వివ, త్రాగెడి నీరే పడును. నూతి దగ్గరకంటె, చెరువులో నీరువున్న స్వేచ్ఛగా స్నానము జేసుకొనవచ్చునని ఒక్కవైపు చీడీలు నెమ్మదిగా కట్టిన వాటిమీద కూర్చొని, అచ్చటనే స్నానమవ్వగానే ప్రార్ధన ధ్యానాదులు చేసుకొనవచ్చును.

2. నా విశాలమైన ఆశయమును, నా కండ్లతో ఆశ్రమంకు వచ్చిన వేలానవేలు భక్తులలో యెవ్వరైన జూచి గ్రహించిన యీ తటాకము తవ్వు టలో పూర్తి జేయుటలో తోడ్పడగలరు.

3. చక్కనైన ఏకాంతముగా నున్న చెరువును మరుగుదొడ్డిగా వాడుట కంటె, ఆశ్రమస్థులు,అతిధులు దానిచుట్టు పచారు చేయుచు, ఏకాంతములో కాళ్ళు చేతులు కడుక్కొని, కొంచెముసేపు, అచ్చట కూర్చొనుటకు వుపయోగించెడి లాగునయైనను జేయుట మంచిదిగదా!

4. చీడీలు వగైరాలు కట్టించితటాకముగా చేసెడివరకు ఆశ్రమంలో యున్న మూగజంతువులు, పశువులు, స్వేచ్ఛగా అందులో నీళ్ళు త్రాగ వచ్చును. స్నానాలు చేయుచుండును. పశువులు తొక్కుటచే నీరు గూడ నిలుచునని జెప్పుచుండిరి. నోరులేని జంతువులకు నీటివసతి గల్గించుట గూడ చాలపుణ్యము.

5. ఒక్కొక్క బావి ఆశ్రమంలో తవ్వించి కట్టించుటకు, రెండేసి వేలు గూడ కొన్ని బావులకు అయ్యేను. ఒక్క నుయ్యికు అయిన ఖర్చు యీ చెరువుకు ఏ ధర్మాత్ములైనను ఆశ్రమభావిఅభివృద్ధినికోరుచు పెట్టిన యీ చెరువులో నీరు వేసవికాలములో కావిళ్ళతో మొక్కలకు పోయవచ్చును. దైవకృపచే ఆశ్రమవృద్ధియైన, ఏదైనా ఇంజనుబెట్టిన చెరువులో నీళ్ళతో చాల మొక్కలు తడిపి, మంచి రాబడి, ఆర్థికముగా తియ్యవచ్చును.

6. నూతులుండగా చెరువెందుకని ప్రశ్నించిన, వేసవికాలములో యీ నూతులన్నియు, ఏ రోజున ఆరోజే నీళ్ళు మోటగట్టగా, ఖాళీ అయిపోవు చుండును. నీళ్ళుచాలక ప్రతి సంవత్సరము కొన్ని మొక్కలు చనిపోవుచున్నవి. ఈ చెరువులో నీరు బాగా సంవత్సరమంతా దైవకృపవల్ల వుండిన ఈ నీరు పశువులకు, మనుష్యులకు మొక్కలకు అనేక రకములుగా ఆశ్రమవృద్ధిని జేయుటకు పనికి వచ్చును.

7. అన్నిటికంటెను దుర్వాసన కొట్టుచున్న మరుగుదొడ్డిగా వాడబడు చున్న దానికిని, అందముగా పువ్వుల మొక్కలతో చల్లని నీటితో, మనస్సుకు ఆనందము గలిగించెడి తటాకమునకు వేలకొలది రెట్లు భేదముండును గదా!

8. తటాకము పూర్తియైన నూతుల వుపయోగమువుండదని తలచ రాదు. ఏలననగా ఏ బావినీరు, ఆ బావి చుట్టును, దగ్గరలోను వున్న మొక్కలకును, అచ్చట నివసించెడి వారికిని వుపయోగించును. చెరువులో నీరు సుశీలగారి మందిరమునకు, త్రాగుటకు తెచ్చుటకు అసంభవము. వారి కుటీరము వద్ద పడిపోయిన బావి అచ్చట వున్నవారి వుపయోగార్థము చాలముఖ్యావసరము. ఇప్పుడు ఆ బావి పడిపోయినందున 1 1/2 ఫర్లాంగుల నుండి రోజూ శ్రమపడి, కావిళ్ళతో నీరు స్నానమునకు, త్రాగుటకు తెచ్చుట జరుగుచున్నది. వేసవికాలములో ఈ బావి పడిపోయి నందున, వందలకొలది కావిళ్ళ నీళ్ళు క్రిందనుండి, యిటులనే శ్రమపడి తెచ్చి యీ ప్రాంతములోయున్న మొక్కలకు చనిపోకుండగా కొద్ది కొద్దిగా నీరుపోసి బ్రతికి వుండేలాగున జేయుట జరుగుచున్నది.

9. దైవ కృపవల్లను చెరువులో నీరు సమృద్ధిగాపడిన ఆశ్రమం అంతకు ఆశ్రమస్థులకు, అతిథులకు చాలవుపయోగము. ఆనందముగా అందముగా గూడ యుండును. నీరుపడే అంతవరకు మనము తవ్వలేకపోయినను కొంచమైన ప్రతి సంవత్సరము తవ్వించుచున్న వర్షపునీరు చేతనే చెరువు నిండి ఆ నీరు నెలలకొలది పశువులకు చెట్లకు ఆధారముగా యుండును.

10. తోటపల్లి ఆశ్రమమునకు నది, కాలవలేని నీటికొరతకు, దైవమే చాల సంవత్సరముల క్రింద ప్రారంభించిన చెరువును అందరకూ వుపయోగించెడి తటాకముగా జేసి ఆశ్రమవృద్ధికి సౌందర్యమునకు తోడ్పడి బ్రోచుగాక!

# 12. ఆదర్శనీయమైన జీవితము

## LIVE IN GOD AND HELP OTHERS TO LIVE IN HIM

నీవు దైవములో జీవించుచు, ఇతరులందరినీ దైవములో జీవించుటకు తోడ్పడును. ఇదియే ప్రపంచము నుండియు శాంతి ఆశ్రమము యొక్క జీవితాశయమై యున్నది.

తాను దైవములో జీవించెడివాడే ఇతరులను గూడ దైవములో జీవించుటకు తోడ్పడగలడు. తానే అంధుడైయుండ, యితరులకు మార్గ మెటుల జూపించగలడు. అంధుడు అంధులకు దారి జూపజాలడు గదా!

ఆదర్శనీయమైన జీవితములను, జీవించెడివారి జీవితములు పరమ పావనమైనవి. వారెప్పుడును ఔన్నత్యమైన పీఠములనే అలంకరించును. చక్రవర్తులకు చక్రవర్తులుగా బరగుచుందురు.

ప్రాతఃకాలముననే తరచు నిర్వాణాశ్రమము వెనుక భాగముననయున్న కొండవైపునకు వెళ్ళి అచ్చుట యేర్పరచబడియున్న బడ్డీ మీదను కూర్చొని యుందును. దాని చుట్టును పెద్దపెద్ద పాషాణములు గూడ ఆసనములవలె కూర్చొనుటకు చుట్టును వేయబడియున్నవి.

కైలాస పర్వతమునకుయున్న సముద్రము, సౌందర్యము లేకున్నను ఆబడ్డీ మీద కూర్చొనియుండగా నాకు కైలాసపతివలె, ఆనందముగా, తృప్తిగా యుండును. మైళ్ళ కొలది దూరము చుట్టును ప్రకృతి, శోభాయమానములైన పర్వతశ్రేణులను వివిధ వృక్షరాజములను జూచుటకు ఎంతయో ఆనంద ముగా యుండును.

Every man is a king

ప్రతీ మనుజుడు ఒక రాజే అని ఆశ్రమములో ఆదర్శ వాక్యమొక్కటి వ్రాయబడియుండెను. ఇచ్చట కొండ మెట్ల మీద కూర్చొనియుండ రాజులకు రాజుగా యున్నట్లు స్వేచ్ఛగా, శాంతిగా యుండును.

ఆశయే నరకము
నిరాశయే స్వర్గము

ఏ కోరికయులేని వారిదే మోక్షము. ఈ వృక్షములకు, పర్వతములకు, పక్షులకు, మేఘములకు, గాలికి, ఆకాశమునకు జలమునకు, పృథ్వికి, సూర్యరశ్మికి నేనే ప్రభువునని ఆనందించుచు, అటులనే ఒక్కొక్కసారి, సూర్య రశ్మిని అనుభవించుచు, గంటలకొలది ధ్యానములో లీనమైయుండును.

ఈ అదృష్టము, ఆనందము అంతయు యీశ్వరుని కృపయే!

నేను అచ్చట కైలాసకొండపై ఆసీనుడనై కూర్చొని యుండ రోజూ ఆ దారిని క్రిందనుండి, కొండజాతివారు, గొల్లలు కత్తులు భుజములపై వేసుకొని, తమ కొండపోళ్ళ పనులు జేసుకొనుటకు, పూజల్లలు నరుకుటకు వారు పోవుచుందురు.

నేనచ్చట కూర్చొని యుండుట దూరము నుండి చూడగనే హరే హరే రామ అని ప్రారంభించెదరు. నన్ను సమీపించిన కొలదీ బిగ్గరగా హరేరామ మంత్రమును, శ్రీరామ జయరామ మంత్రమును, ప్రణవగానమును జేయు చుందురు.

నా ముందరకు రాగానే కత్తులు క్రిందపడవేసి బాబూ నమస్కారము అనుచు, భక్తి శ్రద్ధలతో మరల రామనామమును స్మరించుచు,చాలసేపు, ఇక నాకు వినిపించదు అనెడి వరకు దైవనామస్మరణ జేయుచు వెళ్లుచుందురు.

వీరిని, యెవ్వరు నామం స్మరించమని చెప్పిరి? నన్ను జూడగనే దైవనామ స్మరణ వారి నోటి నుండి రానేల ? దైవకృపచే ఇది అంతయు ఆదర్శనీయమైన జీవితము యొక్క మహత్మ్యమేగదా!

నేడు సోమవారము మౌనపు దినపు రోజు. ఉపవాసము గూడను మామూలుగానే బడ్డీవైపు వెళ్ళితిని. గాని యేలనో, ఆ నిశ్శబ్ద సమయములో కొంతదూరము నడవవలెననిపించెను. అంతర్యవాణి చెప్పినట్లు ఒక్కమైలు ఆ చిన్న గుట్టలు దాటుచు, శ్రీమల్లిఖార్జున ధారవైపు నడవసాగితిని.

ఒక్కచోట, పదిమంది తలలువంచుకొని, కొండపోళ్ళపని జేసుకొన చుండిరి. నన్ను సరిగా జూడలేదు. వారు పనిజేయుచు దైవనామ స్మరణ

జేసుకొనుచున్న ఎంత ఆనందముగా, శక్తివంతముగా యుండునని తలచితిని.

వారితో దైవ స్మరణ జేయుచు పనిజేయుడని జెప్పుటకు నేడు మౌన దినమని తలచితిని. ఐనను మంచిపనిచేయుటకు, ఇతరుల వృద్ధికి తోడ్పడుటకు, మౌనము అడ్డురాదని మరల మనస్సులో వితర్కించుకొంటిని.

మౌనమైనను వారితో "రామ రామ అనుడి" అని నేను జెప్పగానే వారందరూ దైవనామస్మరణ జేయుచు ఆనందముతో పనిచేయసాగిరి.

వారు ఆనందముతో దైవనామ స్మరణను గీర్తించుచుండ నేను పరవశత్వముతో వారి స్మరణను వినుచు కొంతతడవు అచ్చటనే, నాకు తెలియకుండగనే నిలవబడి వారి పనిని, ఆనందమును, తృప్తిని వీక్షించ సాగితిని.

దైవ నామస్మరణ యున్నచోట పని పనిగా తోచదుగదా! వారి సంకీర్తనను వినుచు నేనుగూడ ఆనందముతో ముందుకు నడచితిని.

నా జీవితమువల్ల, నా మాటలచే కొందరికైనను, అనుభవముగా, సహాయమును చేయగల్గిన, నా మౌనమును ఒక్కసారిగాదు గదా వందసార్లు యైనను విరమించుటనే నేను కోరుచుందును.

ఆనందముగా యుండుటకు దగ్గర మార్గము, సులభమైన రాచబాట ఇతరులను ఆనందపర్చుటయే అని తరుచు జెప్పుచుందును.

The way to be happy is to make others happy.

అమాయకులైన యీ గ్రామస్థులు ఒక్కసారి, హఠాత్తుగా నన్ను జూచుట తటస్థించినప్పుడు, వారు తెలియక చుట్టలు మొదలైనవి కాల్చుచున్న, కాల్చెడి వాటిని,బిడియముతో పారవేసి బాబూ దణ్ణమనుచుండ వారి భక్తి ప్రేమలకు నేను విస్మయుడనగుచుందును.

ఇది గూడ ఆదర్శనీయమైన జీవితము యొక్క ప్రభావమేగదా!

నేనే చుట్టలు కాల్చెడివాడినైన, బాబూ ఒక్క చుట్టముక్క దయచేయరా

అని నన్నే కోరుచుందురు.

పాశ్చాత్యదేశములలో కొందరు సిగిరెట్లు కాల్చుచు, మీరు గూడ కాల్చెద రా అని సిగరెట్టును మనకు అందించుచుందురు.

ఇప్పుడు మనము గ్రహించవలసిన సత్యమేమనగా ఏ అభ్యాసములో యున్నవారు ఆ అభ్యాసము మంచిదైనను, చెడ్డదైనను దానిని అందరూ అవలంభించుటకు కోరుచుందురు.

నేను సదా ప్రార్థన జేయుచు, అందరూ ప్రార్ధన చేయవలెనని కోరు చుందును. నేను ధ్యానము జేయుచు అందరూ ధ్యానము చేయవలెనని కోరుచుందును.

శాంతి ప్రార్థన యొక్క మహాత్యమును గ్రహించినవాడ నవ్వుటచే, లోకములో అందరూ, శాంతి ప్రార్థనను, వల్లించి, స్మరించుచు తరించవలె నని కోరుచుందును.

చుట్టలు, సిగరెట్లు, కాఫీ మొదలైనవాటిలో Necatine 'నికొటైను"అనెడి విష పదార్థము గలదని శాస్త్రవేత్తలు పరీక్షలు జేసి వాటి అపాయకరమైన, గుణములను అనేక రీతులుగా పుస్తకములు వ్రాసి, ఉపన్యాసములిచ్చి, ప్రత్యక్షముగా జెప్పియుండిరి.

ఆదర్శనీయమైన జీవితములను నడిపెడివారి జీవితములు అదృష్టవంతములే గాక లోకమంతకు, ఆదర్శనీయముగా, యెప్పటికిని బరుగచుండును.

ఆ కృష్ణభగవానుని జీవితమును చూడుడు, యేసు ప్రభువు జీవితమును గాంచుడు, బుద్ధ భగవానుని జీవితమును తిలకించుడు, మహమ్మదు ప్రవక్త జీవితమును గుర్తించుడు. ఏ మతప్రవక్త, ఏ మహానాయకుని జీవితము తీసుకొన్నను వేలాన వేల జనులకు ఆదర్శనీయముగా వెలంగుచుండును. అవతారమూర్తుల పరమపావనమైన జీవితముల నటుంచి, మహనీయులైన శ్రీరామకృష్ణ, శ్రీరామతీర్థ, శ్రీ అరవింద, శ్రీ గాంధీ మహాత్ముడు వగైరా మహాత్ముల జీవితములను గాంచుడు. వేలాన వేలే గాక, లక్షలకొలది జనులు వారి ఆదర్శనీయమైన జీవితములను, గుణపాఠములుగా జేసుకొని యితరుల

సేవజేయుచు, తాము తరించుటకు ప్రయత్నించు చుండిరి గదా!

దైవము దుర్లభమైన మానవజన్మను ప్రసాదించినందుకు జీవించిన ఆదర్శనీయమైన, అందరకూ తోడ్పడెడి జీవితమును జీవించవలెను గాని, ఒకనత్తగుల్లవలె, ఒక పీతవలె, చీమవలె, దోమవలె స్వార్థముతో జీవించిన లాభమేమి? అట్టి జీవితములు పృథ్వికే భారముగదా!

ప్రియమైన శాంతి పాఠకా! లెమ్ము! మేల్కొనుము! నీదుర్బలత్వమునకు అల్పమైన ఆలోచనలకు స్వస్తిజెప్పుము.

నీవు పిరికి వాడవుగావు. భయముతో నిండియున్న గొఱ్ఱెవుగావు. ఒక్కనిర్భయుడవైన, మృగరాజైన సింహమువు. వేదాంత సారమును గర్జించుము. అదే నీవన్న సత్యమును తత్త్వమసియని స్మరించుచు ఇతరులకు సత్యమార్గమును జూపుచు నీవు తరించుము.

నేడే మనది రేపు మనదిగాదు. గాన నేడే ఆదర్శనీయమైన నిత్యమైన, సత్యమైన, పరిపూర్ణమైన లోకమంతయు నీ గృహముగా లోకములో వారందరూ నీ స్వంతమైన సోదరీ సోదరులుగా భావించుచు, ప్రేమించెడి నీ ఆదర్శనీయమైన జీవితమును ప్రత్యక్షముగా వ్యక్త పరచెదవుగాక!

ప్రేమయే దైవము

ప్రేమ జీవితమే నిజమైన జీవితము

శాంతి జీవితమే సత్యమైన, శక్తివంతమైన జీవితము

ఆదర్శనీయమైన జీవితమే లోక కళ్యాణమునకు తోడ్పడెడి పరమ పావనమైన జీవితము.

లోకా స్సమస్తా సుఖినోభవంతు

శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓం

1-3-59

4-00 ఎ.ఎమ్.

# 13. చెవులున్న వారు వినవచ్చును-ఎచ్చటనున్నావు దైవమా

నేటి ఉదయము యథారీతిగానే వుత్తరాలు రాయుచు మూడుగంటలు గడిపితిని. అంతలో తెల్లవారెను. బడలికగా యుండి వరండాలో యున్న మంచము మీదపరుండి అప్పుడేవచ్చుచున్న సూర్యకిరణములు శరీరమును సోకుచుండ సూర్యరశ్మిలో స్నానమాడుటకు అచ్చటనే పరుంటిని.

తలవని తలంపుగా నేనీమూడుగంటలు వుత్తరములు వ్రాయుచుండ నీవు ఎచ్చటనున్నావు దైవమాఅని తలచసాగితిని. ఆ భావన నాలోయుండ దారులు బాగుచేయుచు గురుకుల బాలబాలకలలో గాయత్రి ఇందుగలడందు లేడని సందేము వలదు, ఎందెందువెదకి జూచిన అందందె గలడు అని పాడుచు తుడుచుచుండెను.

నా మనస్సు భావనలకు, దానికి జవాబుగా ఆ బాలిక యిచ్చుచున్న సమాధానమును వినుచు దైవమిచ్చటనే యుండెనని నాలో నేను నవ్వసాగితిని.

దైవము కోటి కంఠములతో, కోటి రూపముల ద్వారా మాట్లాడు చుండును. చెవులున్నవారు వినవచ్చును. కండ్లువున్న వారు చూడవచ్చును.

ఈ మధ్యను దైవ సన్నిధిని ముఖ్యముగా వుత్తరములు వ్రాయునప్పుడు, ఫలహారము జేయునప్పుడు అనుభవించుటకు ప్రయత్నించు చుంటిని. దైవమును మరచి క్షణములో కోటవవంతు కాలమైనను జీవించరాదని యెంతగా నిశ్చయించుకొన్నను, మాయయొక్క ప్రభావముచే అనేకమైన క్షణములు వ్యర్థముగా బోవుచున్నచునే యుండుట విచారకరము.

ఉత్తరములను దైవజ్ఞప్తిలోనే వ్రాయుట ప్రారంభించెదను. వుత్తరముల ధోరణిలో దైవమేమైనది, దైవ మెచ్చట యున్నది. మరచితినా అని వుత్తర ములు వ్రాయుట అంతయు పూర్తియైన తర్వాతను తలచుచుందును.

గాని నాలో వ్రాయువాడు అతడేగదా! ఆయనశక్తి లేకుండ నా హస్తమెటుల కదలగలదు?

అటులనే ఫలహారము జేసేముందు ప్రతీ ముద్దను దైవజ్ఞప్తితోనే భుజించ వలెనని నిశ్చయించుకొని ప్రారంభించినను, ఫలహారము రుచిగా వుండుట చేతనో, ఏదో చేయవలసినపని జరూరైనది వుండుటచేతనో ఏదో ఒక ఆలోచన వచ్చి దైవము మరుగైనట్లు యుండును.

అప్పుడు మరల ఎచ్చట వుంటివిరా దైవమా! ముఖ్యముగా నేనిప్పుడు ఫలహారము జేసినప్పుడు నీవెచ్చటదాగుంటివని ప్రశ్నింతును. అప్పుడు దైవము "ఓ వెర్రిబిడ్డా! నీవు నన్ను మరువవలెనన్నను మరువ జాలవు. ఏలనన నీలో కదిలెడిది, మెదిలెడిది, ఆలోచించెడిది నేనే, నేను లేకున్న నీవెటుల ఫలహారము జేయగలవు. నీ హస్తమెటుల కదులు? నీ నోరు ఎటుల కదుపగలవు. నీలో జూచెడిది, వినెడిది, భుజించెడిది నేనే. నీవు నిద్రపోవుచున్నను, కంటికి రెప్పపోలికను, నిన్ను గాపాడుచు, సాక్షి స్వరూప ముగా నీలో సర్వకాల సర్వావస్థలయందును ప్రకాశించుచున్నది నేనే. గాన, నన్ను మరచుచుంటి ననెడి భ్రమను వీడుము. నేను సర్వత్రా నిండియుండ, నీ కాలుగోరుమొదలు శిరస్సువరకు నేనే నిండి వ్యాపించియుండ నీవు నన్ను యెటుల మరువగలవు!

ఈ ఆనందవార్తలను విని, నేను వుత్తరములనన్నింటిని దైవజ్ఞప్తిలోనే వ్రాస్తిని, ఫలహారమునంతను దైవజ్ఞప్తితోనే భుజించితిని అని ఆనందముగా యుందును.

కోటిసూర్య ప్రకాశవంతమైన దివ్యతేజస్సు ఒక్కటే. నిత్యము శాశ్వతము, స్థిరమైనది అది ఒక్కటియే, నిత్యమైన,సర్వత్రా నిండియుండ దానిని ఏ ఏ పని పాటులలో ఎంత తొందరగు పనులలో మునిగియుండినను మనము మరువజాలము అనెడి సత్యము ఎంతయో ఆనందము నిచ్చుచున్నది.

దైవ మిచ్చటనే యుండెను. దైవము సర్వత్రా నిండియుండెను. కండ్లున్న వారు జూడవచ్చును. చెవులున్న వారు వినవచ్చును.

ఇదిగో దైవము వున్నదొక్కటయే.
అదియే నీవు తత్వమసి
లోకాసమస్తా స్సుఖినోభవంతు

23-3-55,2-00 పి.ఎమ్.

# 14. సృష్టి - సృష్టికర్త

సృష్టి, సృష్టికర్త అనెడి మాటలు బండి,గుఱ్ఱము గుఱ్ఱపువాడు, లేక రథము రథికుడు రథము నడిపెడివాడు అనునట్లు సామాన్యముగా తోచుచున్నను, యీచిన్న మాటల యందు గాంభీర్యమైన జీవితమునకు ఆధారమైన మూల ప్రకృతి యొక్క ఆదిని గ్రహించెడి భావన గలదు.

ప్రశ్న : మనకండ్లకు గానవచ్చెడి దంతయు నేమి?

జవాబు: సృష్టి– ప్రాపంచకము.

ప్ర: సృష్టికర్త యెచ్చటవుండెను?

జ : అతడు అవాంగామానసగోచరుడు. మనకండ్లకు గాన వచ్చుట లేదు.

ప్ర: ఎందుచేత?

జ : కండ్లువుండియు మనము జూచుట లేదు. చెవులు వుండియు వినుటలేదు.

ప్ర: కారణమేమి?

జ : కేవలము అజ్ఞానము – మాయ. మనుజుడు మాయలోపడి తన సృష్టికర్తనే మరచి సృష్టినే పూజించుచుండెను. ప్రాణమును వదలి శవమును గొలుచుచుండెను. సారమును విడచి, నిస్సారమైన ఆకారమును పెచ్చులను భజించుచుండెను.

ప్ర: నిస్సారమైన యీ బాహ్య పూజావిధానమునకు ఫలితమేమి?

జ: చీకటి అంధకారము, మానవుడు చీకటిలోపుట్టి, అంధకారములో జీవించుచు, అజ్ఞానములో నశించుచుండెను.

ప్ర: ఈ మాయనుండి విముక్తి గలదా. అదియెందు గలదు?

జ : కలదు. అది జ్ఞానమునందే గలదు.

ప్ర: జ్ఞానమనగా నెద్ది?

జ: అది సృష్టి, సృష్టికర్తలు వేరుకాదని, సృష్టి, సృష్టికర్తలకు అవినాభావ సంబంధమున్నదని మానవుడు అపరోక్షముగా తెలిసికొనప్పుడే మాయ నుండి విముక్తుడగు చుండెను.

వేదసారమైన అష్టావక్ర గీత, సృష్టి సృష్టి కర్తలకుయున్న అవినాభావ సంబంధము గురించి ఏమి జెప్పుచున్నదో, యీ క్రింది శ్లోకములను పరి శీలింతము.

శ్లో॥ యధానతో యతో భిన్నారంగాః ఫేన బుద్బుధాః

ఆత్మనోనతధాభిన్నం విశ్వమాత్మ వినిర్గతమ్.

తా. తరంగ బుద్బుదాదులకు జలమధిష్టానమైనందున నివి జలము కంటె నెటు వేరుగా లేవో యటులనే సర్వ ప్రపంచమున కధిష్ఠానమయిన చిద్రూపాత్మకమైన జగత్తు వేరుగాదు

నీటిబుడగలను,కెరటములను సముద్రమునుండి వేరుజేయగలమా? మట్టిని పృథ్వినుండి వేరుపర్చగలమా? వెలుగును సూర్యుని నుండి మరుగు పరచగలమా!

నీరులేని సముద్రమెచ్చట?

మట్టిలేని పృథ్వి నెచ్చట?

వెలుగులేని సూర్యుడెచ్చట?

అటులనే సృష్టికర్తలేని సృష్టి యెచ్చటవున్నదో, దైవములేని ప్రాపంచక మెచ్చట వున్నదో, ప్రాణములేని శరీరమెచ్చట వున్నదో ఆలోచించుదాము.

గీతలలో శ్రీకృష్ణ భగవానుడు యీ సృష్టి అంతయు తన సంభూతులలో కోటవవంతు, అణువు మాత్రమే అని జెప్పబడిన గీతా శ్లోకమును గూడ యిచ్చట పరిశీలింతము.

ఈ సృష్టి, సృష్టికర్తలో, అణుమాత్రమైన, అతి అల్పమైన కోటవవంతు భాగము కన్నను అతితక్కువగా యున్నను, ఆశ్చర్యకరమైన ఆనందకరమైన, అతి గుహ్యమైన,సత్యమెద్దియన, ఆ పరమాత్మ స్వరూపుడే, అణువు మొదలు

బ్రహ్మాండము వరకు యీ సృష్టి అంతను వ్యాపించి నిబిడీకృతమైయుండెను.

అట్టి స్థితిలో మనము కండ్లు వుండియు, అంధులుగా నుండనేల. మన కండ్లును దైవమును జూచుటకే వినియోగింతము. సృష్టికర్తను ఇప్పుడే, ఇచ్చటనే ప్రత్యక్షము చేసుకొందాము. ఏలనన, మన మిప్పుడు దైవ తేజస్సు చేతనే, ఆంతర్యమున బాహ్యమున, మీదను, క్రిందను, అన్నివైపులను నింప బడి నిండియుంటిమి. ఆగుడు! మనము దైవాంశ సంభూతులమే!

సృష్టికర్త సృష్టినుండి వేరుగా, భిన్నముగా అన్యముగా యెన్నడును లేడు అనెడి సత్యము నిప్పుడైనను స్థిరము జేయుదము. తాపత్రయముల నుండి విముక్తులమగుటకిదియే దగ్గర మార్గము. యమయాతనల నుండి తప్పించుకొనుట కిదియే మంచిమార్గము. జన్మరాహిత్యులమగుట కిదియే సూక్ష్మమైన మార్గము. శాంతిని పొందుట కిదియే సులభమైన చక్కని రాచబాట.

ఏవైపు జూచినను దైవమే. ఎందులో జూచినను దైవమే. ఎవ్వరిలో జూచినను దైవమే. అన్ని శబ్దములలో దైవమే. నేనీ వ్యాసమును కైలాస పర్వతము గుడిమెట్లమీద కూర్చొని వ్రాయుచుండ, కొన్ని కొంగలు నా మీదన ఆకాశములో యెగురుచు, ఓం ఓం ఓం అని ఆనందముతో,సముద్ర కెరటములతో కలసి పాడుచున్నవి.

చిన్న చిన్న చీమలు నేను నా హస్తమును కాగితము మీదనుంచి వ్రాయుచుండ కాగితం మీద ప్రాకుచు, మేముగూడ, నీ సృష్టికర్త యొక్క సృష్టిలోని వారమే, దైవసంభూతులమే, నీ చెయ్యి మా మీద వేసి మమ్ము నలిపివేయకుము అని ప్రార్థనా పూర్వకముగా కోరుచున్నవి.

ఇక సూర్యరశ్మియో! చుర్రున వీపు కాల్చుచు, తక్కువేమి మనకు రాము డొక్కడుండు వరకు అన్నట్లు, నేనుండగా, యీ జబ్బులు, రోగములు, దుర్బలత్వములేల అని చెప్పుచున్నట్లు తీక్షణము, యీ శరీరమునేగాక, యీ సృష్టినంతను, ప్రకాశముతో తేజస్సుతో నింపుచున్నది.

ఇక వ్రాయుటకేమి గలదు ఈ ఖండమైన మాటలతో అఖండమైన కోటి సూర్య దివ్యతేజస్సు గురించి యెటుల వ్రాయగలను?

కుంభాకారుడు తన కుండలనుండి వేరుగానున్నట్లు, మిఠాయివాడు తన మిఠాయివుండల నుండి భిన్నమైయున్నట్లు, నేతవాడు తాను నేసిన వస్త్రముల నుండి వేరుగా వున్నట్లు, సృష్టికర్త తన సృష్టినుండి యెన్నడును వేరుగా, భిన్నముగా వుండియుండలేదు.

మన్ను పృథ్విలోవున్నట్లు కెరటము సముద్రములో వున్నట్లు,తేజస్సు సూర్యునిలో సహజముగా వున్నట్లు, సృష్టికర్త తన సృష్టిలో నిబిడీకృతమై యుండెను. గాన మానవునకు విముక్తి, సృష్టికర్తను సృష్టిలో గాంచుటయందే గలదు. తనలోను ఇతరులలోను వున్నది ఆ దైవమేగాన, సర్వములో, సృష్టి అంతటా సృష్టికర్తను ప్రత్యక్షముగా వీక్షించుట యందే మానవునకు మోక్షము గలదు.

మోక్షము గలదా సంగీత విద్యా విహీనులకని శ్రీ త్యాగరాజులు పాడి యుండిరి. ప్రణవనాదమును సర్వములో అనుభవించజాలని వారికే మోక్షము లేనప్పుడు, ఇక సర్వాధారమైన సృష్టికర్తను, ఆయన సృష్టినుండియే మరగుపరచి,వేరు జేసిన వారి గతియేమి?

అట్టి మానవాధములకు, నరపశువులకు, దైవమును మరచి భూమికి భారముగా జీవించెడివారికి పుట్టగతులు లేవని విచారించవలసియున్నది. నేను వ్రాయునది కఠినముగా యున్నను సత్యము సత్యమే! సృష్టిని సృష్టికర్తనుండి వేరు చేసినవారికి మహాయాతనలు తప్ప మరేమియు మిగులదు. ఇదియే యీ వ్యాసము యొక్క సారాంశము. నిత్యానందము, పూర్ణశాంతి కావలసిన సృష్టిలో సృష్టికర్తను అహర్నిశములు దర్శించుటే సూక్ష్మమైన, దగ్గర మార్గము.

ఇంతవరకు వ్రాయుచుండ, ఆశ్రమస్తులు కొండయెక్కి కైలాసము వైపు వచ్చు చుండిరి. వారిలో సృష్టికర్తను గాంచి ఆనందించితిని. వారినొక శునకము వెంబడించుచుండెను. దానిలో గూడ సృష్టికర్తను గాంచుట కెంతయో ఆనందమాయెను. సృష్టికర్త యే నా తోకను ఆడించుచుండెనని ఆనందముగా నన్ను సమీపించెను.

అంతలో ఆశ్రమవాసులందరు కలసి ఆశ్రమ ప్రార్థనను,శాంతి శ్లోకము

ల నీక్రిందిగా వుచ్ఛరించసాగిరి.

శాంతి శ్లోకములు

శ్లో. బ్రహ్మానందం.....

ఓం హరే రామ

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

అటుపైన లోకశాంతి ప్రార్థన జేసిరి. ప్రియమైన పాఠకా! అనుభవనీయ మైన యీప్రార్థనను నీలో గూడ పంచుకొనిమ్ము.

లోకశాంతి ప్రార్థన

ప్రార్దనయైన తర్వాత ప్రణవగానము జేయగా ఆ ప్రణవనాదములో అన్ని శబ్దములు, సృష్టిఅంతయు, సృష్టికర్తలో నిశ్శబ్దములో విలీనమయ్యెను.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# 15. సూక్ష్మములో మోక్షము

మోక్షము అక్కరలేని వారుందురా? మోక్షము అందరకూ కావలెనుగదా! మోక్షమనగా ముక్తి–విముక్తి.

ప్ర: దేని నుండి విముక్తి?

జ. తనకున్న తాపత్రయముల నుండి యమయాతనల నుండి శరీరమును మరచి మనస్సును జయించి, ప్రపంచాతీతుడై, తన స్వస్వరూప మును ననుభవించుటే మోక్షముగదా?

ప్ర. ఆ మోక్షమును సూక్ష్మముగా అవలీలగా యెప్పుడోగాక యిప్పుడే అనుభవించుట యెటుల.

ఎ. అది సాధ్యమా?

బి. ఏదైన సాధ్యమైనది యున్న మోక్షమునిప్పుడు యిచ్చుట బడయుట సాధ్యమా.

జ. మహనీయులు మోక్షమును, సూక్ష్మముగా బడయుటకు అనేకమైన మార్గములను జెప్పియున్నారు. అనుభవనీయులు ఏ మార్గముకేగి, ప్రత్యక్షాను భవమైన పరిపూర్ణమైన, స్థితిని జెప్పుటేగాక, ప్రత్యక్షముగా వారనుభవించుచు, ఇతరులచే అనుభవింపజేసిరి.

యేడు నిమిషములలో మోక్షమని,పాశ్చాత్య దేశీయుడు ఒక చక్కని వ్యాసమును దైవత్వముననుభవించుచు వ్రాసియుండెను. మూడు రోజులలో దైవముననుభవించ వచ్చునని శ్రీరామకృష్ణులు సమాధిననుభవించుచు నుడివి యుండిరి. మరి కొందరు ఋషి పుంగవులు, యేడు గడియలలో ముక్తిని బడయవచ్చునని జెప్పిరి. జనకుడు అష్టావక్రమునీంద్రునకు మోక్ష మును, పాదము గుర్రము యొక్క రికాబులోవుంచి, దాని వీపుమీద దుముకు నంతలో,బడయ వచ్చునని వుపదేశించి యుండెను.

మోక్షమును బడయుటకు, ఒక్క నిమిషముగాదుగదా, ఒక్క క్షణమైన ఆలస్యమేల? మోక్షము ఇదివరకే పరిపూర్ణమై విలసిల్లు చున్నది. దానిని గుర్తించుటకు కాలయాపనయేల. టైము, లిమిట్లు వ్యవధియేల? సదా

పరిపూర్ణముగా యున్న దానిని పరిపూర్ణమని, యెప్పుడోగాక, యెన్నడునో గాక, ఇప్పుడే ఇచ్చటనే వ్యక్తపరచుటే అనుభవించుటే కావలయును.

ఆంతర్యమున, బాహ్యమున–కోటి సూర్యప్రకాశమానమైన దివ్య తేజస్సుతో నిండియున్న దానిని మరచి, అనిత్యము, అశాశ్వతము క్షణభంగుర మైన శరీరముతో ఐక్యమై దేహిని మరగుపరచి, దేహమేతానని, భ్రమపడుచు మోక్షము కావలెనని భ్రమపడుట, పరితపించుట కేవలము మూఢత్వము. అందుచేతనే మహనీయులు, కేవలం మోక్షాపేక్ష బంధః అని నుడివియుండిరి. తాను సచ్చిదానంద స్వరూపుడై, సదా విముక్తుడై యుండియు, దేనిచేతను బంధింపజాలని దివ్యస్వరూపుడై తన స్వస్వరూపమును మరచి విలపించుచు ముక్తిని యెప్పుడో కావలనని కోరుటే బంధముగదా! గోదావరి నదిలో ఈదుచు దాహము దాహమని జలమునకై పరితపించుట మూర్ఖతగదా! ఆంతర్యమున, బాహ్యమున దివ్యతేజస్సుచే నింపబడి, తేజస్సును మరుగుజేసి, మిణుగురు పురుగు వెలుతురును వెంబడించుట అజ్ఞానము గదా! అమృతము తన జన్మహక్కైయుండ విషమును గ్రోలనేల?

వ్యర్థమైన యీ మాటల నన్నింటిని మీరి, దైవమును సూక్ష్మములో మోక్షమును అనుభవించుటకు ప్రయత్నింతము. ఒక్కొక్క మనుజునకొక్క మహావాక్యము మోక్షమునకు సునాయాసముగా దారి జూపుచుండును. అన్ని మతములకు, వేదాంతమునకు సారాంశమైన మహావాక్యము, మహా మంత్రము పిన్న పెద్దలు, స్త్రీ పురుషాదులు మరెవ్వరైనను స్మరించు తేలికగా తరించగలిగిన సూక్ష్మమైన దివ్యమంత్రమిదుగో–

“దైవము నాలో యుండెను. నేను దైవములో యుంటిని.”

GOD IS IN ME and I AM IN GOD

ఈ చిన్నమాటలను మామూలు మాటలని త్రోసివేయరాదు. పిండివంట యొక్కరుచి, దానిని జూచుటయందు, వర్ణించుట యందు లేదు. దానిని తినుటయందు, అనుభవించుటయందే గలదని పెద్దలు చెప్పియుండిరి. గాన, ఈ మంత్రము నిప్పుడు వర్ణించుటకు బదులు అనుభవించుటకు

ప్రయత్నింతము. దానిని రెండు భాగములుగా జేయుదము.

**1. దైవము నాలో యుండెను.**

ఆత్మ సోదర సోదరీ స్వరూపులారా! దైవ పిపాసకులారా! మీకు దైవము కావలెనా? ఇప్పుడే కావలెనా? నిజమైన దైవపరితాపన మముక్షత్వము మీకు గలదా? అటులైన నాతోరండు. ఇప్పుడిచ్చట విశ్రాంతిగా సుఖాసీనులై కూర్చొనుడు. మీకు ఎంత దూరములోవున్నను, యీ వ్యాసమును చదివెడి వారందరు ఇప్పుడు నిమీలితనేత్రులై కూర్చొని–దైవము నాలో యుండెను అని మరల మరల నెమ్మదిగా, హృదయపూర్వకముగా, మీ మనస్సు యంతటితో, అనగా 100 పాళ్ళు మనస్సులో స్మరించుడు. దైవము నాలోనే యుండెను. మరల మరల స్మరించుడు. దైవము ననుభవించుచు స్మరించుడు.

ఆహా! ఏమి ఆనందము. ఏ దైవమునకై కొండలు–గోపురాలు, తీర్థ యాత్రలు,ఆశ్రమములు, మఠములు గురువులు, స్వాముల, మహాఋషుల యందు, వెదుకుచుంటిమో, ఆ దైవము మనలోనేయుండెను. ఆ పరిపూర్ణుడైన దైవలలాముడు మనలోనే యుండెను. మరి ఒక్కతరి నేత్రములు మూయుడు. జూడుడు! ఆంతర్యదృష్టిచే గాంచుడు. నివృత్తులై అనుభవించుడు. ఇకపెక్కు మాటలేల! మీలో దైవముండెను. మీరు దైవము ననుభవించుచుండిరి. దైవము నాలోయుండెనని మరల మరల స్మరించుడు. దైవము ననుభవించు వరకు స్మరించుడు. సర్వమును మరచెడి వరకు స్మరించి తన్మయత్వమును బడయుడు. ఇంకను దైవమును తేలికగా అనుభ వించుటకు సూచనలు ఇవిగో! అవసరమయినవారు వాడుకొన వచ్చును.

ధ్యానములో సుఖాసీనులై, దైవమునాలోయుండెనని స్మరించుచు మొదట మీపాదముల వద్దనుండి ప్రారంభించుడు. మీరెండు పాదములు దైవతేజస్సుతో నింపబడియున్నవి. రెండు కాళ్ళను దైవతేజస్సుతో నింపుడు. తొడలను,తుంటి భాగమును తేజస్సుతో నింపుడు. క్రమముగా గర్భమును హృదయమును, ఊపిరితిత్తులను, భుజములను కంఠము వరకు దివ్యతేజస్సుతో నింపుడు. మూలాధారము మొదలు సహస్రారము వరకు దివ్యతేజస్సుతో నింపుడు. మీకు కొత్తగా యీ దివ్యతేజస్సును

యెచ్చటినుండియు ఎరువు తెచ్చిగాని, కొనితెచ్చిగాని మీ శరీరమును నింపనవసరములేదు. దైవము సర్వాంతర్యామి సర్వత్ర నింపబడియున్నవాడు. నిరంతరము వుండియున్న వాడు గాన ఆయన దివ్యతేజస్సు అనాదినుండియు అంత్యము వరకు మీలో పరిపూర్ణమై సదా మీరు గుర్తించినను, గుర్తించకున్నను వెలుంగుచునే యున్నది. మీరిప్పుడు జేయవలసినది, మీలోవున్న దానిని,మీరు గుర్తించుటే! మీరిప్పుడు అనుభవించుటే; మరల, దైవము నాలోనే యుండెను. కోటిసూర్య ప్రకాశమానమైన దివ్యతేజస్సు నా జన్మహక్కు అని స్మరించుడు. ఈ సత్య గీతమును కంఠమెత్తి పాడుడు.

కంఠము వరకు దైవతేజస్సుతో నింపితిమి. కంఠమువరకు యున్న దైవతేజస్సు శిరస్సు అంతలో వున్నదిగదా! కండ్లలో దైవము, కర్ణములలో దైవము, నాసికములో దైవము, ఉచ్ఛ్వాసనిశ్వాసలలో దైవము గాంచుడు. మీ శ్వాసలో నిరంతరము యున్న దైవముననుభవింపుడు. కదలికలో దైవము. చలనములో దైవము, స్థంభములోదైవము,స్థిరత్వములో దైవము. దైవము కానిదెద్ది. అంతయు దైవము. దైవములేని క్షణము కలదా! సదా దైవమే! కాలిగోరు మొదలు శిరస్సువరకు దైవము. ఆపాదమస్తకము దైవ తేజస్సు. ఇక పెక్కుమాటలేల అనుభవించుడు.

ఇంతవరకు దైవము నాలో యుండెనన్న మహామంత్రము యొక్క మొదటి భాగమును పరిశీలించి దైవవాప్యము ననుభవింపగల్గితిమి. ఇప్పుడు దైవములో నేనుంటిని అనెడి రెండవ భాగమును పరిశీలింతుము. దైవము. నింకను అహర్నిశములు, నివృతులమైయుండి యున్నప్పుడేగాక ప్రవృతులమై వ్యవహారికముగా యున్నప్పుడు గూడ అనుభవింప ప్రయత్నింతము.

## 2. నేను దైవములోయుంటిని?

ఏపనియులేనప్పుడు, ఏకాంతముగా కండ్లుమూసుకొని నిర్జనమైన ప్రదేశములో దైవము నాలోనిండెనని స్మరించుచు, దైవము ననుభవించుట సూక్ష్మమే! ఇప్పుడు మనకు విధింపడియున్న పనిపాటలను జేసుకొనుచు దినచర్య గడుపుచు, అన్నిపనులు జేసుకొనుచు వ్యవహారకాండలో దైవము

ననుభవించుటే, అందరకు ముఖ్యావసరమైయున్నది.

నేను దైవములో యుంటిని. అనెడి మహామంత్రమును తీసుకొనుడు ఈ మహామంత్రమే సంసార సాగరమునుండి మనలను అవలీలగా దైవము దరిని చేర్చుటకు సులభమైన, సుఖమైన నావగా, పడవగా యున్నది. విద్యార్థి, చిన్న గుమాస్తా పనిచేయునీతడు పెద్ద గుమాస్తా అవ్వుటనే ఆశయముగల్గియుండును. చిన్న మొఖాసాదారునకు చక్రవర్తి కావలెనండదు గదా! ఏ పెద్ద మొఖాసాదారునిగానో లేక పిల్ల జమీందారునిగనో అవుటకు ఆశయంలో వుండును. ఈ ఆశయములన్నియు బావిలోయున్న కప్ప ఆశయములవలె, అతి అల్పమైనవిగాయున్నవి, నత్తగుల్ల ఆశయమును పరీక్షించుడు. కొన్ని గజములు అది ప్రాకుటతప్ప మరేమియు చేయజాలదుగదా సాలీడు ఆశయము చూడుడు. తనగూడు చేతనే బంధింపబడుచున్నది. ఒక శునకముయొక్క ఆశయమును జూడుడు. సదా తోక ఆడించుచు రొట్టిముక్కలకై యెదురుచూచుచుండును.

బావిలో కప్ప నూతినిమించిన ఆలోచనలు చేయజాలదు. చెరువులో వున్న మండూకమునకు చెరువే సర్వ ప్రపంచమైయుండును. దానిని మించిన ఆలోచనలు దానికి రాజాలవు. సముద్రములోయున్న మండూకమునకు బావిలో వున్న కప్పకంటె విశాలమైన ఆశయముండి తీరవలెను.

నేను దైవములోయుంటిని– అనెడి మహామంత్రమును తీసుకొనుడు ఈ మహామంత్రమే సంసార మహాసాగరమునుండి మనలను అవతలదరిని చేర్చుటకు సులభమైన పడవగా యున్నది. దైవములో నేనుంటిని అని స్మరించుచు దైవమును ఒక మహాసముద్రముగా భావించుడు. మీరా సముద్రములో బుద్బుదులనుమని, నీటిబుడగ సముద్రము నుండియే వచ్చి, సముద్రమునందే వుండి, సముద్రములో లీనమవ్వుచున్నది గదా! ఒకపాత్రను తీసుకొనుడు. ఆ పాత్రలో ఆకాశము, ఆ పాత్రచుట్టూ ఏమున్నది? అదియు ఆకాశమే ఆ పాత్రలోపల, బైటనేగాక అన్నివైపులా ఆకాశమే!

అటులనే మీరుగూడ–లోపల దైవమునై దైవము మీదను దైవము క్రిందను దైవము అన్నివైపులాదైవమే. నిశ్శబ్దములో దైవము శబ్దములో

దైవము వ్యక్తములో దైవము. అవ్యక్తములో దైవము ఖండములో దైవము. అఖండములో దైవము. శరీరములోదైవము. శరీరముచుట్టూతా దైవము. చూడుడు. ఆ చిన్నమర్రి విత్తులో ఆ విశాలమైన మర్రివృక్షమును, ఆ చిన్న మంచు బిందువులో గాంచుడు ఆ సూర్యునియొక్క బింబమును, అల్పుడైన మనుజునిలో, అవ్యక్తమైన దైవమును గాంచుడు. నరునిలో నారాయణుని ప్రత్యక్షముజేయుడు. సముద్రములోయున్న మత్స్యము జలమునకై వెతకనేల? దివ్యతేజస్సుచే ఆవరింపబడియున్న మీరు దైవమునకై వెతుకుచు పరితపించ నేమి? మీ జన్మ హక్కైన దైవమును మరచి పొడినేలమీద వుంచబడిన మత్స్యములవలె గిజగిజకొట్టు కొనెదరేల? మీగాఢమైన నిద్రనుండి మేల్కొనుడు. ఇదిగో దైవము. లోపల తేజస్సు బైట తేజస్సు. దైవమద్వితీయుడు. దివ్యతేజస్వరూపుడు.

దైవము మీలో వుండెను. మీరు దైవములో యుండిరి. వాస్తవముగా అనుభవమునుండి జూచి దైవము, మీరు రెండుగారు. ఒక్కరే. నరుడే నారాయణుడు జీవుడే దైవము.

ఆత్మీయులారా! ఇంకను మీకు హెచ్చుమాటలు కావలెనా. మనుజుడు మాటలకు, బోధలకు, వుపదేశములకు, పాటలకు, ద్వంద్వమునకు, ఇంద్రియములకు బానిసైయుండెను. మాటలకు వాక్కునకు అతీతమై నిరంతరము వెలుగుచున్న దివ్యజ్యోతిని మనుజుడు మాటల భ్రమలో మరుగు జేసుకొని పొడినేలమీద వుంచబడిన మత్స్యమువలె, సారములేని ఎముకలను, నములుచు, తన రక్తమును తానే త్రాగుచు, ఆ రక్తము ఎముకలనుండియే వచ్చుచున్నదని భ్రమపడుచున్న శునకములవలె, మాటలవలలోపడి, విలువైన కాలమును తన నోటిలో మాంసపుముక్కను– నీటి ప్రవాహములో తన ప్రతిబింబమునే జూచి, పేరాసగల్గి తనకున్న దానిని–పోగొట్టుకున్న శునకమువలె జీవితములను దుఃఖతరముగా జేసుకొని జీవించుచుండుట చాల విషాదకరము.

అంతర్యము, బాహ్యమున అని అననేల సర్వమును దైవముగా జూడుడు. అణువు మొదలు బ్రహ్మాండము వరకు దివ్యతేజస్వరూపమే. మీరేమిజేయుచున్నను, ఏ పనిలోయున్నను మీలోనూ మీ చుట్టును ఆ

దివ్య తేజస్సే.

ఇదియే సూక్ష్మములో మోక్షము. ఇప్పుడు దైవము నిరంతరము దైవము. ధ్యానములో దైవము పనిలో దైవము ఏకాంతములో దైవము, సమూహములో దైవము, శబ్దములో దైవము, నిశ్శబ్దములో దైవము.

ఆగుడు! మనలను ప్రేమించెడివారిలో దైవము, మనకు హానిగల్గించెడి వారిలో దైవము, మన పల్కులో దైవము, మనవిరోధులలో దైవము. అందరి నేత్రములలో ఆ దైవమేగదా! దైవమొక్కడే కదా! ఇద్దరు దైవములున్నారా? దైవమద్వితీయుడు.

చూచుచున్న దైవము, నడచుచున్న దైవము, మాట్లాడుచున్న దైవము. ధ్యానము జేయుచున్న దైవము, పనిపాట్లు జేసుకొనుచున్నను ఆదైవమే! గాంచుడు, పనివారిలో దైవము, పొలముదున్ను కొనువానిలో దైవము, ఆ దైవమునే సాధువులోను, మహాఋషిలోను, ప్రతి వ్యక్తిలోను ప్రత్యక్షముగా దర్శించుడు. దైవమును గుళ్ళకు, మసీదులకు, చర్చిలకు బంధింపకుడు. గుడిలో బంధింపబడియున్న దైవమును బయటకు తీయుడు. ఆయనను, అందరిలో అన్నింటిలో దర్శించుడు.

దేహమే దేవాలయము, దేహమే దైవము. జీవుడే ఆత్మ స్వరూపుడు. ఆత్మయే పరమాత్మ.

ఆ పరమాత్మ మనలోయున్నది. మనము పరమాత్మలో యుంటిమి. దైవము నాలోయుండెను. నేను దైవములో యుంటిని. ఎటువెళ్ళినను ఎచ్చటికి వెళ్ళినను అంతయు దైవమే. ఎప్పుడు వెళ్ళినను, ఎంతదూరమెళ్ళి నను, అంతయు దైవములోనే నింపబడియున్నది. దైవము కానిదెద్ది అంతయు దైవమే అందరూ దైవస్వరూపులే.

అణువులో పృథ్వి,పృథ్విలో అణువు. తేజస్సులో సూర్యుడు, సూర్యునిలో తేజస్సు, ఖండములో అఖండము, అఖండములో ఖండము నరునిలో నారాయుడు–నారాయనిలో నరుడు. శబ్దములో నిశ్శబ్దము నిశ్శబ్దములో శబ్దము.

"నిశ్శబ్దో బ్రహ్మ"

ప్రార్థన

ఆంతర్యమున, బాహ్యమున, కోటిసూర్య ప్రకాశమానమైన దివ్య తేజస్సుతో నిండియున్న ఓ దివ్యస్వరూపా! నిరుపేదగా, ధనవంతునిగా, రోగిగా ఆరోగ్యవంతునిగా, అతిథిగా, అభ్యాగతిగా ప్రత్యక్షమవ్వుచున్న ఓ అఖండకోటి బ్రహ్మాండ నాయకా! ఇప్పుడు మా పాఠకుని రూపముగా యీ వ్యాసమును చదువుచున్న ఓ కరుణామయా! పుష్పములో వికసించుచు, నక్షత్రములలో ప్రకాశించుచు, పక్షిలో పాడుచు, పసిపాపలో ఆనందించు చున్న ఓ నిత్యరూపా! నీ దివ్యతేజస్సుకు అన్ని నామరూపములందును అన్ని ప్రక్కలను, ముందు, వెనుక, మీదను క్రిందను చుట్టును ధన్యవాద ములు.

నీవు నాలో యుంటివి–నేను నీలోయుంటిని

ఈ ప్రార్థనను గూడ మరచి, మమ్ము నీలో, నీ తేజస్సులో విలీనమవ్వ నిమ్ము. ఇప్పుడు ఇచ్చట నిన్ను అనుభవించుటే నీతో విలీనమవ్వుటే సూక్ష్మ ములో మోక్షముగదా!

లోకాస్సమస్తా సుఖినోభవంతు

నిశ్శబ్దో బ్రహ్మ

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

మోక్షముగలదా భువిలో జీవన్ముక్తులుగాని వారలకు
సాక్షాత్కారనీ సద్భక్తి, సంగీతజ్ఞాన విహీనులకు
ప్రాణానిల సంయోగమువల్ల ప్రణవనాదము సప్తస్వరములైబరగ
వీణావాదనలోలుడౌ, శివుడను,విధమెరుగరు త్యాగరాజువినుత॥మో॥

Offer to HIM the Indualty presence of all hearts.

5-5-48,

6-00 A.M.

# 16. రెండు తరగతుల మనుష్యులు

ఈ లోకములో రెండు తరగతుల మనుష్యులు గలరు. అనేకమైన జాతులున్నను, యీ జాతులన్నియుగూడ యీ రెండు తరగతులలోనే వచ్చుచున్నవి. ఈ ప్రపంచమంతయు దైవగృహముగా యున్నది. దైవము సర్వసమానుడు. ప్రేమమయుడు. సర్వహృదయవాసి. అందరును దైవబిడ్డలే. దైవాకారములే! గాన యిందు కొందరిని గొప్పజాతుల వాండ్రగాను, మరి కొందరిని అంటరానివాండ్రగాను సృష్టించలేదు.

మనుజుడే తన కర్మనుబట్టి, గుణములనుబట్టి సహవాస దోషముచేతను గొప్పజాతివానిగాను, తక్కువజాతివానిగాను బరగుచున్నాడు. గాని ఏదేశస్థులనైనను, ఏ మతస్థులైనను మనము లోకములో యున్నవారందరినిని యీ రెండు జాతులలోను యిమడ్చవచ్చును. మంచి చెడ్డ జాతులు రెండే గలవు. ఉత్తరమునైనను, దక్షిణమునైనను, తూర్పు పడమరలనైనను లోకములో యెచ్చట జూచినను, ఏ మారుమూల వెతికినను, యీ రెండు జాతులేగానవచ్చును.

1. స్వార్థులు 2. స్వార్థ రహితులు

1. తమను గురించి పాటుబడుచు జీవించెడివారు

2. ఇతరులగురించి పాటుబడుచు జీవించెడివారు.

1. అంటరాని వాండ్రు 2. అంటతగినవారు

1. కేవలము తన గురించే రాత్రింబగళ్ళు ఆలోచించుచు, స్వార్థముతో జీవించెడివాడు అంటరానివాడే. అట్టివాడెవ్వడైనను ఎచ్చటవున్నను వాని జీవితమువలన, తన దగ్గరవున్నవారికి, దూరముగా యున్నవానికి హానియే గల్గుచుండును. అట్టివానికి దూరముగా యుండుటకే మనము ప్రయత్నించవలెను.

2. తన జీవభావనను మరచి, ఇతరుల శ్రేయస్సుకై జీవించుచు తన దుర్లభమైన మానవజన్మ పరోపకారార్థమై యివ్వబడినదని తన జన్మను సేవలో సార్థకముజేయు మహనీయుడు ఎచ్చటవున్నను ఏ బాహ్య జాతికి

చెందియున్నను అట్టివాని జీవితము లోకకళ్యాణమే. అట్టివారి దరి నుండుటే అదృష్టము.

ఈ స్వార్ధులను స్వార్ధ రహితులను మరియొక్క వుదాహరణలో బోధ పర్చుకొనవచ్చును. ఆవుయొక్క పొదుగులో పణుదులనెడి చిన్న జీవులు ఆ పొదుగును అంటుకొనియుండును. ఆ వాటికి ఆవుపాలు అంత దగ్గరలో యున్నను వాటికి మాధుర్యమైన పాలు అవసరములేదు. పాలకై పరితపించుట లేదు. అవి అమాయకమైన గోవుయొక్క రక్తమునే కోరును. రాత్రింబగళ్ళు, నిర్దయతో ఆ రక్తమును పీల్చివేయుచున్నవి. పాలు దగ్గర వుండియు పాలను గ్రోలక, రక్తమును పీల్చుచుండుట చాల విచారకరము. అటులనే కొందరు ప్రవృత్తి పరులు, దైవదృష్టి, దైవపరితాపన లేనివారు పాలుత్రాగుటకు బదులు నిరంతరము రక్తమునే గ్రోలుటలో విలువైన కాలమును వ్యర్ధబుచ్చుచు తమ జీవితములను భూభారముగా జేసుకొందురు.

లోకములో వున్న ప్రతిసాధకుడును, ముఖ్యముగా ఆశ్రమములో తమ జీవితములను గడుపుటకు అదృష్టముగల్గిన వారందరును తమ స్వీయ చరిత్రను ఆంతర్యజీవితములను నిర్దయతో, పక్షపాతములేకుండా, కఠిన ముగా పరీక్షచేసుకొని తాము రక్తమును పీల్చుచుండిరో, లేక అమృతతుల్య మయిన క్షీరమునే గ్రోలుచుండిరో, ఎవ్వరెలాంటివారు, పరీక్షచేసుకొని తమ తప్పును తామే తెలుసుకొని, హేయమైన రక్తమును త్రాగుటమాని, మాధుర్య మైన పాలను త్రాగుటకు ప్రయత్నించవలెను.

తమకంటిలో దూలమునుంచుకొని, ఇతరుల కండ్లలో నలుసులను తీసుకొనమని బోధించెడి వారందరునూ పాలకు బదులు, రక్తమును గ్రోలెడి మహానుభావులుగానే యున్నారు. తమలో తప్పులు జూచుకొని దైవపరితాప నతో నిండి వృద్ధిజెందుటకు బదులు, ఇతరులలో సదా తప్పులు యెగ్గులు వెదికెడివారు రక్తమును గ్రోలెడివారే.

ఆత్మభావనను మరచి శరీర జ్ఞప్తిలో నిండియున్న వారందరూ రక్తమును గ్రోలుచున్నవారే! స్వార్ధులు, సోమరిపోతులు అందరును అమాయకుల రక్తమును నిర్దాక్షిణ్యముగా పీల్చుచు జీవించుచున్నవారే. ఏమి రక్తము అంత

రుచికరముగా యుండునా! ఏదియైన అలవాటుచే రుచిగానే యుండును. ప్రవృత్తిచాల అపాయకరమైనది. దైవమును మరచుట చాలపాపహేతువు. అందుచేతనే దైవమును మరచుటే మృత్యువని మహనీయులు నుడివియుండిరి. ఈ జీవన్మృతులకు రక్తముగాక మరేమి కావలెను?

పూర్వకాలములోగూడ మన పురాణములలో రెండు తగరగతుల మనుష్యుల గురించి మనము చదివియుంటిమి.

1. రాక్షసులు 2. దానవులు

రాక్షసులకు కావలసినది ఏమి? రక్తము,రక్తము. ఎవ్వరి రక్తము పీల్చుదుమా, ఎవ్వరికి హాని జేయుదుమా అనెడియే రాక్షసుని ఆదర్శము.

2. ఇక దానవుల ఆదర్శము. నేడు నా జీవితమువల్ల హానిగలుగకుండు గాక! నా జీవితము భూభారముగా వుండకుండుగాక! ఏదో జీవికి లేశమైన నావల్ల ఉపకారము జరుగుగాక యని దేవతా సంభూతుడు, దానవ సంప్ర దాయము కలిగినవారు ఇతరుల సేవకై ప్రయత్నించుచుండును.

ప్రియమైన పాఠకులారా! కాలము చాల విలువైనది. మీలోనే లెక్కకు మీరిన తప్పులు, దుర్బలత్వములున్నవి. వీటన్నిటిని సరిజేయుటకే కాలము చాలదు. గాన విలువైన కాలమును ఆత్మవృద్ధిని, ఆత్మ ధ్యానమును మరచి, ఇతరుల జీవితములలోనకు రంధ్రములను పొడుచుటలో వ్యర్థబుచ్చనేల? మేల్కొనుడు.

ప్రవృత్తిని విడచి నివృతులవుడు. బాహ్యమునకు పరిగెత్తుచున్న మీమనస్సులను ఆంతర్యమునకు త్రిప్పుడు. బహిర్గతమై యున్న మీ దృష్టిని అంతర్ముఖముగా జేయుడు. తరించుటకిదియే సమయము. రక్తమును పీల్చుట విడువుడు. పాలను గ్రోలుట అభ్యసింపుడు. మీరువుండు తావుల కును భారము గావుండవలదు.

స్వార్థుని జూచిన అందరకు భయము కలుగును. స్వార్థరహితుని జూచిన ప్రేమగల్గును. స్వార్థుని నుండి మనుజులు పరుగెత్తి పారిపోవుదురు. స్వార్థ రహితుని లోకమంతయు ప్రేమించును. రక్తమును త్రాగుచు లోక

కంటకులుగా వుందామా లేక మన జన్మహక్కైన క్షీరములను గ్రోలుచు శాంతిదూతలుగా యుందుమా? పవిత్రమైన యీ క్షణము నుండియు సత్వ గుణ ప్రధానులుగా యుండి, సదా క్షీరమునే గ్రోలుచు, మననుండి శాంతిని, శక్తిని, ప్రేమనే లోకమంతకు వెదజల్లుచు, మనము తరించి యితరుల వృద్ధికి తోడ్పడుచు, నరజన్మ యొక్క గమ్యస్థానమైన పూర్ణశాంతి పొంద ప్రయత్నించెదముగాక!

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# 17. తృప్తి

## (లోకములో అందరనూ తృప్తి పరచజాలము)

లోకములో యున్న జనులందరనూ తృప్తి పరచుటకు ప్రయత్నించిన ముసలివాడు, అతని కొడుకు, దురదృష్టమయిన వారి గాడిద కథ మీ అందరు యెరింగి వున్నదేగాన దానిని ఇచ్చట వ్రాసి, మీ కాలము నా కాలమును వ్యర్థబుచ్చుటను కోరను. ఈ చిన్న కథను మనము చిన్నతనములో, చదువుకొనే రోజులలో గూడ పాఠములలో చూచివుంటిమి. ఎంతగా చిన్నతనములలో చదివినను ఆచరణలో పెట్టజాలనప్పుడు ఫలితాలు వుండవు గదా!

శాంతి ఆశ్రమ జీవితములోగూడ అటులనే ఆశ్రమవాసులును ఆశ్రమ భక్తులను అందరను తృప్తి పరచజాలము.

స్వార్థులు లోకములోపల ఇతరులను తను విమర్శించుటలోను దానిని ఇతరులలో గాంచును. పచ్చకామెర్ల జబ్బుచే బాధపడుచున్న రోగికి లోకమంతయు పచ్చగానే గానవచ్చు చున్నదనెడి సూక్తిని మీరందరు వినియే యుందురు. స్వార్థులు అహంకారముతో నిండియున్న వారు. స్వార్థపరునికి దాహాగ్నిలో పడియుటను తెలియకుండగనే కాలిపోవుచున్నారు. అహంకారమనెడి మహావిషసర్పముచే కరవబడుచున్న రోగులు దాని విషముచేతనే తమ శరీరములను విషతుల్యమైన ఆలోచనలతో అధోగతి పాలవుచున్నారు. ఈ అహంకార పూరితులగు స్వార్థులకు తాము చేయునదే నిత్యము సరియని, ధర్మ మని, ఇతరులు జేయు పనులన్నియు తప్పులే అని వారి అభిప్రాయము. దైవముగూడ వారి తప్పు అభిప్రాయములను మార్చజాలడు. అమాయకులైన సత్యవంతులు, క్రూరమైన స్వార్థమైన వారి దాహాగ్నులలోపడి కాలిపోవు చుండుట విచారము.

కించజ్ఞత్వముతో నిండియున్న మానవుడు కొంత తెలిసియున్నను సదా నిరాశనే గల్గించును. నిత్యము వారి గొంతును తనకు తెలియకుండగనే నిర్దాక్షిణ్యముగా కోయుచుండును.

శాంతి ఆశ్రమ అవస్థలలో యీ రోజులలో సంవత్సరములు గడచు చున్న ఈ కాలము విలువను రోజురోజు హెచ్చుగా ఆశ్రమములో గ్రహించుచు ఇతరులు నాకంటె ఎంత పూజ్యులు, సాధువులు ఏ తప్పులు లేకుండ, పూర్తిగ స్వార్ధరహితముగా వుండి, హాని జేయువారిని గూడ క్షమించుచు ప్రతిక్షణము స్వార్ధరహితమైన సేవలో ధ్యానము జేయుచు దీపముండగ మేల్కొనుట, శరీరంనుండి ప్రాణము పోకముందు మేల్కొనుట గమ్యస్థానము జేరుట మంచిదని ముఖ్యముగా నా అంతరాత్మకు నేనే బోధించుకొను చుందును. ఈ సంసార మహాసముద్రములో ఎన్ని ఆటంకములు వున్నను వారిని గాంచి విచారించుచుందును.

తెలిసీ తెలియని మూర్ఖులను జూచి బాధపడు చుందును. తెలిసినవానినైనా మార్చవచ్చును. తెలియని వానిని మార్చ వచ్చును. తెలిసీ తెలియని వారిని పైగా సర్వముతనకే తెలియునన్న అహం కారపూరితులను బ్రహ్మదేవుడు గూడ మార్చజాలరుగదా!

భర్తృహరి సుభాషితములోని చిన్నతనములో నేర్చుకొన్న ఈ క్రింది పద్యము జ్ఞప్తికి వచ్చుచున్నది.

గీ. తివిరి ఇసుమునదైలంబు తీయవచ్చు
దవిలి మృగతృష్ణలో నీరుద్రావ వచ్చు
దిరిగి కుందేటి కొమ్ము సాధింపవచ్చు
జేరి మూర్ఖుల మనసు రంజింపరాదు

అర్ధము: ఏవిధముగానైనను యిసుకలో నూనె తీయవచ్చును. ఎట్లయి నను ఎండమావులలో పరుగెత్తి నీరు ద్రావవచ్చును. తేజాలని కుందేటి కొమ్ము నెట్లయినను ప్రయత్నించి తేవచ్చును. కాని మూర్ఖుని జేరదీసి వానిని సంతోషపెట్టుట సాధ్యముగానిపని.

అహంకాపూరితులైన మానవులు దైవము ఎచటయులేడని జెప్పుటయు, తమకే అన్నియు తెలుసుననియు, భావించుచు ఇతరులను చులకనగా అదే రీతిగా జూచుచుండుట విచారకరము.

81 సంవత్సరములు దాటి 82 సం॥గా తపించుచు సమయములో ఇతరులను మార్చజాలనని, ఇతరులను విమర్శించుచు నా విలువైన కాలమును వ్యర్థబుచ్చుట కంటె నా పొరపాట్లు నేను తెలుసుకొనుటకు నా మనస్సును బాహ్యమున పోనీకుండ ఆంతర్యమునకు పంపి ఆంతర్య దృష్టిలో నా పొరపాట్లు పూర్తిగా గ్రహించి, దీపంవుండగా మేల్కొని దైవములో విలీనమగుట ముఖ్యమని గ్రహించి, నాలో ఆ తప్పులను ఆంతర్యమున విమర్శించి వ్రాయుచుంటిని.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

## 18. శాంతి

శ్రీ శాంతి ఆశ్రమము శాంతిని వ్యాపింపజేయుటకు, శాంతిని కోరు వారికి ఆశ్రయమిచ్చుటకు 53 సంవత్సరముల క్రితము దైవ ప్రేరణచే స్థాపించబడెను. శాంతియన్నను దైవమన్నను ఒక్కటియే.

శాంతోయం ఆత్మ. ఆత్మయే శాంతి. శాంతియే ఆత్మ. శాంతము లేక సౌఖ్యములేదు. జీవితమునకు శాంతియే ఆధారము. అదియే గమ్య స్థానము. శాంతిని ఉచ్ఛ్వాస నిశ్వాసలలో పూరించుడు. ప్రతిశ్వాసలో శాంతి ననుభవించెడివారి జీవితములు ధన్యవంతములు.

లోకములో ప్రతిమానవుడు శాంతినే కోరుచున్నను, ఆ శాంతిని అపరోక్షముగా అనుభవించెడివారు చాల అరుదైయుండుట చాల విచారకరము. శాంతి గురించి వుపన్యాసములిచ్చుట చాల తేలిక. శాంతి గురించి వ్యాసములు వ్రాయుట బహు సులభము. గాని శాంతిని నిరంతరము అనుభవించుట చాల దుర్లభము. శాంతిని అనుభవించుటకు కోరికలు విడువవలెను.

ఆశయే బద్ధతేలోకః ఆశచేతనే లోకములు బంధింపబడియున్నవి. ఆశయే నరకము. నిరాశయే స్వర్గము. స్వర్గ నరకములు ఇచ్చటనేయున్నవి. ప్రియమైన పాఠకా! నిమీలిత నేత్రుండవై హృదయమును ఒక్కసారి పరీక్షించుకొనుము. నీ మనస్సు యెటుల పరుగెత్తుచున్నదో గాంచుము. నీ మనస్సు దైవమువైపే పరుగెత్తుచున్న నీ జీవితము ధన్యము. విషయవాసనలు వ్యామోహముల వెంట పరుగెత్తుచున్న నీ జీవితము భూభారము.

క॥ వాసనలే సంసారము
వాసనలనణచుటయే ముక్తి
వాసనలడచి యధాస్థితి
భాసిల్లకయుండువాడే ఘనుడు

అని అష్టావక్రుడు యోగసారము నంతను చిన్న పద్యములో నుడివి యుండెను.

ఆశలకు పరిమితి లేనందున కోర్కెలతో నిండియున్నవారిని జూచి, పిశాచములు వారిచుట్టును తిరుగుచుండునట. ఇకయే కోర్కెలు వాంఛలు లేనివారి సేవజేయుటకు, దేవతలు వారిచెంతనే వేచియుందురు.

నీ కోరికలే నీకు శత్రువులు. నిరాశయే నీ నిజమైన మిత్రుడు. మాయను, కోరికను జయించినవారు చాల అరుదు. కోరిక యెట్టివారినైనను బురదలోపడవేయు చుండును. ఒక మహనీయుడు అన్ని కోర్కెలను వదలి ఆదర్శనీయమైన జీవితమును గడుపుచుండుటగాంచి, దేవతలు గూడ ఆశ్చర్య పడుచుందురట.

సైతాను, వాని అనుచరులు అతని ఆదర్శనీయమైన జీవితమును ఎంత ప్రయత్నించినను పాడుజేయజాలక, యమధర్మరాజుతో తమకు భూలోకమున పనిలేదనిజెప్పగా, మా వ్యక్తి యొక్క తపోమహిమ ఆయన దివ్య దృష్టిచే, దీర్ఘముగా ఆలోచించి, ఇంక అతని గురించి మీరు ఏ ప్రయత్న ములు చేయనవసరములేదు. అతడు తన మిత్రుల సలహాతో ఒక ఆశ్రమము స్థాపించుటకు ప్రయత్నించుచుండెను. ఆ ఆశ్రమ స్థాపనయే తనపతనము నకు దారితీయునని చెప్పెనట.

ఆశ్రమములు స్థాపించుట సులభము. గాని వాటిని సంరక్షించుట నిష్కామమైన సేవజేయుట చాల దుర్లభము. ప్రతి సాధకునకు ఒక ఆశ్రమము స్థాపించవలెనని తాను కూడ ఒక అధిపతిగా, పీఠాధిపతిగా యుండవలెనని కోరుచుందురు. నెమ్మదిగా ఒక పాఠశాలయో,లేక పత్రికయో స్థాపించవలె నని సంకల్పము గలుగును. తర్వాతను ఒక పోస్టాఫీసును కోరును. ఇటులనే కోరికలు తనకు తెలియకుండగనే ఆశ్రమ స్థాపనలకు, వృద్ధి అవుచుండును. ఇక తన ఆశ్రమము పోషించుటకు పట్టరాని వారి పాదములు పట్టుకొనుట చేయవలసి యుండును.

"కౌపీన సంరక్షణార్థం అయం పటాటోపం" అన్నట్లు ఆశ్రమ సంసార మహాసముద్రములో మునిగియుండును. వారెంతటి వారైన మాయను జయించజాలరు.

పెదవులతో శాంతి శాంతి అని వుచ్చరించుచున్నను, హృదయములో అశాంతిచే పరిమితముకాని కోర్కెలతో నిండియుండును.

ఓ ఆశాపిశాచమా! మా దిక్కులేని అవస్థలనుగాంచి, మనస్సు కోర్కెల నుండి విముక్తిని గల్గించుము. తన్ను తాను గ్రహించు వారికి శాంతిగలదు. Know myself. ఇతరులను విమర్శించుచు, విలువైన కాలమును వ్యర్థబుచ్చ వలదు. నిన్ను నీవు తెలుసుకొని నేడే తరించుము. నిన్ను తెలుసుకొన్నప్పుడే అన్ని కోర్కెలు, ఆశలు, సూర్యుని ముందు మేఘములు, పోయినట్లు పోవును. శాంతిని పొందగలవు.

లోకములో శాంతి స్థాపితమవుగాక! ఆ శాంతి నీహృదయములో స్థాపిత మవ్వుగాక. Let be peace on earth and the begin with me.

ఇక వెయ్యిమాటలు, వెయ్యి వ్రాతలు యేల! నేడే ఇప్పుడే శాంతిస్థాపన నీ హృదయములో ప్రతీ శ్వాసలో జేయుము. 'శాంతియే నీ జన్మహక్కు' దానిని మరచుటయే మృత్యువు. నీవుచ్ఛ్వాస నిశ్వాసములలో శాంతి. నీవు పూరించుచున్నది శాంతి. నీవు వదలుచున్నది శాంతి. ప్రతీ శ్వాసలో శాంతియే. ఇదియే మంత్రములకు మహామంత్రము. శాంతిని పూరించు టయే. శాంతియే వుపదేశములకు వుపదేశము.

ప్రతీశ్వాసలో, శాంతి ననుభవించుచు, మన జీవితములను శాంతి యుతముగా జేసుకొని, తరింతముగాక, ఇప్పుడు శాంతి గీతము స్మరించుచు శాంతిలో విలీనమయ్యెదముగాక!

శాంతి మంత్రము

ఆకసంబున శాంతి వెలుగుగాక!

స్వర్గధామమున శాంతి ప్రతిష్ఠిత మగునుగాక!

జలమునందు శాంతి సుస్థిరమవ్వుగాక!

పృథ్వియందున శాంతి కీర్తింపబడునుగాక!

సకల లతాగుల్మములయందు పదము ప్రవహించునుగాక!

సమస్త చరాచరములు శాంతితో నింపబడుగాక!

సర్వగృహముల శాంతి వ్యాపింపబడుగాక!

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓం

28-11-69

3 ఎ.ఎమ్.

# 19. బ్రహ్మచారిజీ

ఈయన బ్రహ్మచర్యము గురించియే తరచు ప్రసంగించుచుండెడివాడు. ఆ జన్మాంతరము, అస్ఖలిత బ్రహ్మచారిగా వుండెదనని సదా జెప్పుచుండెడి వాడు. ఎన్నటికైనను శాంతి ఆశ్రమమునుజేరి, లోకసేవను జేయుచు, తన జన్మనుద్ధరించుకొనెదనని గూడ వాగ్దానముజేసియుండెను.

అటులనే చాల సంవత్సరములు గడచుచుండెను. ఆశ్రమంకు మాత్రము నెలకు రెండురూపాయలు చందాని ఇచ్చుచు తరచు వచ్చుచుండెడి వాడు. ఇతడు పట్నములో పెద్దషాపులో పనిజేయుచు, చక్కనైన జీతమును బడయుచుండెడివాడు. ఇటుల కొంతకాలము జరుగగా హోటలులో భోజనము యీయనకు సరిపడలేదు. దానివల్ల అనారోగ్యముగా యుండ దొడగెను. అప్పుడు ఒక ప్రైవేటు కుటుంబములో ఒక గది అద్దెపుచ్చుకొని, ఆ గౌరవనీయులైన గృహస్థులయింటిలో భోజనము చేయుచు, తన బ్రహ్మ చర్యమును సాగించుచు, ఉద్యోగము జేయుచుండెను.

సకాలములోనే, ఆ సంపన్నులైన యింటిలో వున్న గృహయజమానురాలి కుమార్తెతో స్నేహము జేసెను. నెమ్మదిగా ఆమెను యితడు ప్రేమించసాగెను. మన బ్రహ్మచారిని ఆమె ప్రేమించెను. గాని మన బ్రహ్మచారి హిందువు ఆమె క్రిస్టియను. అయిననేమి. ప్రేమబంధములో జాతులు,మతములు భస్మీభూతమవ్వునుగదా! రెండు సంఘములవారి బంధుమిత్రులు యెన్ని ఆటంకములు గల్గించినను, యెంతరోదన జేసినను వినక, మనహిందూ బ్రహ్మచారి ఆ క్రిస్టియను యువతిని ఒక శుభలగ్నమందు గాంధర్వ వివాహమువంటి పెండ్లినే ఒక చర్చిలో జేసుకొనెను. శాంతి ఆశ్రమమునకు గూడ ఒక ఆహ్వానపత్రమును పెండ్లిపిలుపును పంపెను. అంతటితో మన బ్రహ్మచారి బ్రహ్మచర్యము, ఆశ్రమమును చేరుట పూర్తి అయ్యెను.

నిన్నటి దినమున యీయన తన భార్యతో ఆశ్రమదర్శనార్థమై వచ్చెను. వీరితోగూడ మరిద్దరు బాల బ్రహ్మచార్లు వుండుటజూచి నేను చాల ఆశ్చర్య పడితిని. ఏలనో బ్రహ్మచారి రెట్టింపు మనిషియైపోయెను. బ్రహ్మచర్యమునకు

బదులు గర్భమునే పూజించుటచేతనో మరేలనో, చిన్న యేనుగువలె శరీరము పెంచుచు కానవచ్చెను.

తాను సృష్టించిన పసి బ్రహ్మచార్లను, యీ చంకను, ఆచంకను యెత్తుకొని వారిని ఆడించుచు ముద్దులాడుచుండెను. ఈ నూతన సృష్టిలో ఆశ్రమ సేవ, మానవసేవ, దేశసేవ, లోకసేవ అన్నియు పటాపంచలై యెగిరి పోయెను. మా రెండు రూపాయల చందా రూపాయి చందాగా తగ్గించబడెను. మన బ్రహ్మచారి దృష్టి ఆయనలోకమంతయు, యిప్పుడు తన భార్య, తన పిల్లలయందే యిమడ్చబడి యున్నది. అతని తనయునకు భగవాన్ దాసు అని నామధేయమిచ్చెను. కుమార్తెకు పద్మినీదేవి యని నామకరణము జేసెను. మన బ్రహ్మచారి, తన చుట్టును చిన్నబరి గీసుకొని, ఆబరిలో తన భార్యను, చిన్న భగవానుదాసును, చిన్న పద్మినియిమిడ్చి యుండెను. ఆ చిన్న బరినుండి తాను బైటకు రాజాలడు. ఆబరిలోనికెవ్వరినీ రానీయ్యడు. మరెవ్వరినైన తన బరిలో యిమిడ్చిన వారు, మన బ్రహ్మచారిచే తయారవ్వ నున్న భగవానుదాసులు, పద్మినీదేవులై యైయుండవలెను. మరితరులకు ఆ చిన్న బరిలో చోటువుండజాలదు.

ఆహో! మాయయెంత దట్టమై గాడాంధకారముగా యున్నది. బ్రహ్మచార్లను, సన్యాసులనుగూడ మొగ్గలు వేయించి జీవితములనే మార్చు చుండునుగదా! ఆదిలో యేమియులేదు. మన బ్రహ్మచారి జీవితమునే జూడుడు. ఆశ్రమంచేరి, మానవసేవజేయుచు, మానవజన్మ గమ్యస్థానమైన దైవములో విలీనమవ్వుటకే పరితపించుచు జీవించుచుండెను. అంతలో హోటలు భోజనము, అజీర్తి, గృహస్థుల యిండ్లలో బస, ప్రేమబంధము, పెండ్లి, చిన్న భగవానుదాసులు పద్మినీ దేవులు ప్రత్యక్షమైరి. బ్రహ్మచారిగా వున్నప్పుడు తన మనస్సునంతను నూరుపాళ్ళు దైవమునకే అర్పించుటకు కోరుచుండెను. ఇప్పుడే సగముపాలు అనగా యాభైవంతు భార్యకివ్వవలెను. ఇరువదియైదవ వంతును చిన్న భగవానుదాసుతీసుకొనెను. కొదువ ఇరువది యైదవ వంతును చిన్నపద్మినీ తీసుకొనెను. ఇకదైవమునకిచ్చుటకు, లోక సేవజేయుటకు, నూరుపాళ్ళలో ఒక్కపాలైనను గానవచ్చుటలేదే! మాయ అనగా నిదియే గదా!

గుడ్డిలో మెల్ల అన్నట్లు మనబ్రహ్మచారి, హిందూ సాంప్రదాయమును నిలువబెట్టుచు, తన చిన్న భగవానుదాసునకు నమస్తే అనిచేతులు జోడించి నమస్కరించుటయు, క్రిస్టియను సంప్రదాయమును మరువకుండుటకు గుడ్ మార్నింగ్, గుడ్డుమార్నింగుఅని, సెల్యూట్ సలాం జేయుట నేర్పెను. ఈ రెండు విధముల క్రియలను నాముందు జేయించి జూపుచు బ్రహ్మచారి ముసిముసి నవ్వులు నవ్వుచు యెంతో బ్రహ్మానందమును బడసినట్లు గాన వచ్చుచుండును.

విషాదకరమైనను, హాస్యాస్పదమును గల్గించెడి బ్రహ్మచారి జీవిత ఘట్టములో ఆనందించవలసినది మరొక చిన్న విషయము గలదు. ఈ చిన్న భగవానుదాసును ఆశ్రమసేవకు అర్పించెదననెను. ఎప్పుడు? మరికొంత మంది చిన్న చిన్న భగవానుదాసులు సృష్టింపబడిన తర్వాతను. అప్పుడు మన బ్రహ్మచారికి తలనెరసి యుండును. ఆ స్థితిలో యీ చిన్న భగవానుదాసు పెద్ద భగవానుదాసుగా మారియుండును. అప్పుడు ఆశ్రమ మునకైన రానియ్యక, ఏవో నాలుగు డబ్బులు సంపాదించి కుటుంబ పోషణ జేయుటకు నౌకరీలో ప్రవేశపెట్టబడును. ఆహా! అస్కలిత బ్రహ్మచర్యము యొక్క గతి ఎట్టిదుర్దశకు వచ్చెను. ఆశ్రమభక్తుడైన మన బ్రహ్మచారి ఇద్దరు బిడ్డలను చెరి ఒక చంకను యెత్తుకొని భార్య, అత్తగారు వగైరా బంధువులతో ప్రణవగానము జేయింపబడి, పిల్లల ఆహారమిచ్చుటకు ఆలస్యమవ్వనని, చీకటిబడునని జెప్పుచు, చిన్నభగవానుదాసు చేతను మరొక సెల్యూటు కొట్టించి నిష్క్రమించెను.

సర్వేజనా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

31-1-50

4-00 ఎ.ఎమ్.

# ౨౦. పాడినేల మీద నున్న చేపలు

ఇచ్చట వాల్తేరులో ఆశ్రమము సముద్ర తీరముననే యుండుటచే, పొడినేలను ఇసుకలో గిలగిలమని కొట్టుకొనుచున్న చేపలను ప్రతినిత్యమును జూచుచునే యుందుము. జాలరులు వలను సముద్రమునుండి లాగినప్పు డెల్లను చేపలను ఇసుక (తిన్నెలు) మీద దులుపుచుందురు.

పాఠకులారా! ఆ గిలగిలమని, వూపిరాడక, జలమునకై కొట్టుకొనుచున్న మత్స్యములను మీరెన్నడైనను జూచితిరా? కొన్ని చిన్న చేపలు కొంత తడవు మాత్రమే కొట్టుకొని ప్రాణములను విడచును. మరికొన్ని పెద్దవి చాలసేపు వరకు ప్రాణముతో అటులనే యుండును. కొన్నిరకముల చేపలు అసలు కొట్టుకొనకనే కొట్టుకొనక, మందబుద్ధితో అటులనే నశించును. ఒక్కొక్కసారి పెద్ద తాబేళ్ళను గూడ తీయుచుందురు. అవి గంటలేగాక, రోజులకొలది, పొడినేలమీద వుంచబడినను జీవించియేయుండునుగాని ఆలస్యముగానైనను సముద్రమునుండి తీసి బైటపెట్టుటచే మృత్యువు తప్పదు. ఈ హత్యాకాండ అంతయు చాల విచారమైనదే. అయినను కొన్ని అవస్థలలో, స్థితిగతులలో హత్యాకాండ తప్పనిసరియని మనుజుడు నిర్ణయించుకొని, తాను మాంస భక్షణకు, చేపలను తినుటకు దాసుడైయుండ మనము విలక్షణముగా యుండి, ఈ చనిపోవుచున్న వేలానువేల, లక్షల యొక్క జీవులయొక్క ప్రాణములు దైవములో లీనమవ్వుగాక! లోకములో సర్వజీవులు శాంతిని పొందుగాకయని స్వస్థిజెప్పుచు వూరుకొనవలసినదే.

ఆత్మీయులారా! ఇప్పుడు మనకు కావలసినది మత్స్యముల హత్యాకాండ వాటి బాధల గురించిగాదు. ఈ వ్యాసము పొడినేలమీద వుంచబడిన చేపలవలె పడరాని అవస్థలు పడుచు ప్రాణములు వదలుచున్న మనతోడి, సోదర సోదరీల గురించి విచారించుదాము. మత్స్యమునకు జలము సర్వముగా ప్రాణముగా యున్నది. పొడినేల నరకముగా బాధగాయున్నది. సముద్రములోయున్న మత్స్యములను ఒక్కతరిగాంచుడు. చూడుడు. అవి యెటుల జలములో యీదుచున్నవో, ఆడుచున్నవో, యెగురుచున్నవో, మరల ఆ నీళ్ళలోనే పడి ఆనందముగా విహరించుచున్నవి. ఇక ఇసుకలో పొడినేల

మీద వుంచబడిన మత్స్యముల అవస్థయో? వాటి అవస్థను గూడ మీకు మీరే జూడుడు. నీళ్ళలోవలె యీదుచు, దుముకుచు, యెగురులేవుగదా! గిలగిలమని కొట్టుకొనుచు, చావునకు సిద్ధమవ్వుచున్నవి.

అటులనే యీ రెండు రకముల మనుష్యులు లోకములో గలరు.

1. పొడినేలమీద వున్నవారు

2. సముద్రములో – జలములో వున్నవారు

మొదట పొడినేల మీదవున్న వారి, హాస్యాస్పదమైన, ప్రాణరహితమైన చంచలజీవించియున్న వారి గురించి విమర్శింతము. వీరిలో కొందరు గొప్ప వుపన్యాసకులు, ధనవంతులు, సంస్కర్తలై యుండవచ్చును. తాబేళ్ళ వలె పుష్టిగా వుండి చాలకాలము పొడినేలనైనను జీవించవచ్చును గాని యెన్నటికైనను మృత్యువే వారి గమ్యస్థానముగదా? ఎన్ని చదువులు చదివి నను, ఎన్ని తెలివితేటలు గల్గినను పొడినేలమీద జీవితము సారహీనమైనది. దైవమును మరచిన జీవితములో ప్రాణమెచ్చట వుండును. స్వశక్తి లేని జీవితములో ఆధారమెచ్చట వుండును. మరపులో మెరపు యెటుల వచ్చును. పొడినేలమీద, దైవమును మరచిన జీవితము అంతయు అంధకారమే, చీకటియే అశాంతియే. చివరకు గిలగిలమని కొట్టుకొనుచు మృతిచెందు టయే. మహారాజులకైనను, నిరుపేదలకైనను, విద్యావంతులకైనను, మూఢులకైనను పెద్దలైనను, పిన్నలైనను దైవమును మరచి, జీవించెడి వారి గతి పొడినేల నుంచిన మత్స్యముల గతియే!

2. ఇక సముద్రములో జలములో నిరంతరము, అహర్నిశములున్న వారి జీవితములను పరీక్షించుదము. ఏమిశాంతి, ఏమి ఆనందము, ఏమి తృప్తి! దైవత్వము ననుభవించుచున్నవారి జీవితములు శాంతిపూరితమై యున్నవి. దైవములో జీవించెడివారి జీవితములు ఆనందమయమై వెలుంగు చున్నవి. నివృత్తులై అమృతపానము జేయువారి జీవితములు తృప్తితోనిండి యున్నవి. అట్టివారెచ్చటనున్నను, ఎన్నికఠిన పరీక్షలకు గురియైనను, దైవమునే అన్నివైపుల గాంచుచు ఆనందాబ్ధిలో వోలలాడుచుందురు. అట్టి మహనీయులకు అంతర్యమున దైవమును చూచుచుండెదరు. క్రిందను

దైవము, మీదను దైవము, అన్నివైపులా దైవమే! దైవములోనే నిద్రించి, దైవములో మేల్కాంచి దైవములోనే కదలుచు, మెదలుచు, తమకు విధింప బడిన పనిపాటులను, దైవమునను భవించుచు జేయుచుందురు. సముద్ర ములో మత్స్యమునకు అన్నివైపులా జలమేగదా! అటులనే అనుభవనీయమైన భక్తవరేణ్యునకు అన్నివైపులా దైవమే! అందరూ దైవమే! నిత్యము దైవాలే. దైవము తప్ప మరెచ్చటను యెప్పుడును, ఆరూఢునకు గానరాదు. అట్టి జీవితమే నిజమైన జీవితముగదా!

అన్ని జన్మలలో మనుష్యజన్మ దుర్లభమైనదని పెద్దలు నుడివియుండిరి. దుర్లభమైన మానవజన్మ పొందియు, తన జన్మహక్కైన దైవత్వము మరచి పొడినేల మీద వుంచబడిన చేపవలె గిలగిల కొట్టుకొనుచు అకాల మృత్యువు నోటను పడనేల?

ప్రియమైన పాఠకా! వెయ్యిమాటలేల? నీ జీవితమును పరీక్షించు కొనుము. నీవు పొడినేలమీద వున్న మత్స్యమువలె తాపత్రయములలో అవస్థ లలో జబ్బులతో చింతలతో అశాంతిగా జీవించుచుంటివా లేక సముద్ర ములో ఆడుచున్న చేపవలె, పాడుచు, గెంతుచు, యెగురుచు, బ్రహ్మా నందము, నిత్యశాంతిని అనుభవించుచు, జీవించు చుంటివో ఒక్కతరి నిమీళిత నేత్రుడవై నీ జీవితమును పరీక్షించుకొనుము.

ఇప్పుడైనను మించినది యేమియు లేదు. నీవు వెంటనే మేల్కొనిన నీకు గూడ మోక్షము, విముక్తి గల్గును. పొడినేలమీద, వలలో బంధింపబడి యున్నను, ఏదోఒక రీతిగా ఒక్కొక్క చేప బైటబడి మరల సముద్రమును చేరుచుండును. ఎప్పుడైనా ఇదివరకు ఈ దృశ్యమును జూస్తివా? చూడకున్న రమ్ము శాంతి ఆశ్రమ దర్శనమునకు, ఋషికొండ సాగర తీరమునకు, ఈ చేపల వలలనన్నిటిని జూడుము. ఆ వలలో కొట్టుకొనుచున్న మత్స్యములను జూడుము. చూడు చూడుము, ఒక్కొక్క మత్స్యము మాత్రమే అదృష్టముచే వలనుండి బైటపడి, దాని ప్రాణము ఆధారమైన సముద్రములో పడుచున్నది. అదృష్టవంతమైన ఆ మత్స్యముగా నీవుండవలెనని యున్నదా! నీకు గూడ మాయవల నుండి బైటపడి స్వేచ్ఛననుభవింపవలెనని యున్న ఇదేతరుణము.

నీ గాఢనిద్రనుండి మేల్కొనుము. ప్రవృత్తిని వీడుము. నివృత్తుడవగుము. బంధములనుండి విముక్తుడవగును.

శ్రీకృష్ణభగవానుడు గీతలలో కోటానుకోట్ల జనులలో కొంతమంది మాత్రమే ముముక్షుత్వమునకై ప్రయత్నించెదరనియు, ఆ ప్రయత్నించిన వారిలో ఒక్కరిద్దరు మాత్రమే బ్రహ్మ సాక్షాత్కారము ననుభవించెదరని నుడివి యుండిరి.

ప్రియపాఠకా! ఆ ఒక్కరిద్దరిలో, నీవు ఒక్క అదృష్టవంతమైన స్వరూప ముగా యుండి తరించవలెనని యున్నదా! లక్షల కొలది బంధితులై, వలలో చిక్కుకొనియున్న మత్స్యములలో ఒకటిరెండు మాత్రము ఎటుల వలనుండి బైటపడుచున్నవో, అటులనే నీవుగూడ, దట్టమైన సంసారమనెడి యీ మహా సముద్రమునుండి బైటపడి, మానవజన్మయొక్క గమ్యస్థానమైన దివ్యతేజ స్సును పూర్ణశాంతిని అనుభవించెదవుగాక!

ఇంతకును మనము దైవత్వము ననుభవించగల్గిన యెక్కటెచ్చుటవున్నను, సర్వకాల సర్వావస్థల యందును, దైవమునందే కదలుచు, మెదలుచు, పనిపాట్లు జేయుచు, బ్రహ్మానందము ననుభవించుచు జీవించుచుంటిమా!

దైవమే అనుభవమైన జీవితములో అపరోక్షమైన జ్ఞానముతో అందరినీ బ్రోచుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

27-7-49

8-00

## 21. చేపల వాంఛ్ర ఆశయము

ఒకానొక రోజున ప్రాతఃకాలమునందు సముద్రతీరమున వేగిరముగా నడచుచు శ్రీ కైలాసాశ్రమం వైపునకు వెళ్ళుచుంటిని. అనేకమంది జాలరులు, స్త్రీలు, పురుషులు, పిల్లలుగూడ బుట్టలు చేటలు పట్టుకొని పరిగెత్తుచుండిరి. నేనుగూడ కొద్దిగా పరిగెత్తుచుంటిని. ఈ జాలరులు గూడ హెచ్చుగా పరుగెత్తు చుండిరి.

ఈ పరుగులన్నియు యెందుకు, యెచ్చటకు తీసుకొని వెళ్లుచున్నవని యోచించసాగితిని నేను పరుగెత్తెడిది సూర్యభగవానుడు భూగర్భమునుండి రాకుండగనే కైలాసపర్వతపాదమునుజేరి, అచ్చట నిశ్చలముగా ధ్యానము జేసుకొనుటకు. ఇంక ఈ జాలరులో వీరు విత్తనములకై పరుగెత్తుచుండిరట. విత్తనములు వ్యవసాయదారునికిగాని చేపలవాంఛ్రకేల యని కొందరు ప్రశ్నించవచ్చును. నేను గూడ మొదటలో యిటులనే శంకించితిని. ఈ విత్తనములు భూమిమీద జల్లుటకు గాదు. సముద్రములోజల్లుటకే. ఈవిత్తన ముల సహాయమునే పెద్ద చేపలను పట్టెదరు. ఈ యెరలను చిన్న చిన్న చేపలను, పెద్దవలల ద్వారా పట్టుకొనువారి వద్ద అణా,బేడ,పావలాకు వారి వారి శక్తికొలది కొనుక్కొని అప్పుడు వాటిని గేలపుముల్లులకు గుచ్చి పెద్ద చేపలను పట్టుచుందురు. పాపమైన పనియేగాని కులవృత్తి, తరతరములుగా వచ్చుచున్న దానిని మానుట కష్టముగదా!

అయినను, వారు తినుటకై ఈ పాపపుపనిని హింసను జేయుట లేదు. వారు కడుపు ఏ గంజినీళ్ళతోను, యీ చేపలను మనకు అనగా జమీందార్లకు దొరలకు మత్స్యమాంసాదులు లేనిది ముద్ద గొంతునలోనకి పోని, మహనీయుల విషయమై నిత్యము యీ హత్యాకాండ యీ అమాయకమైన జాలరులు చేయుచుందురు.

ఇప్పుడు మన వ్యాసము హత్య హింసల గురించికాదు. ఇది జాలరుల ఆశయం గురించియే. వుదయం లేవగనే విత్తనముల గురించి తాపత్రయ పడెదరు. తర్వాత పెద్దలైన మంచి చేపలగురించి తొట్రుపాటు బడెదరు. అటుపైన వాటిని మంచి ధరలకు అమ్మి, ఆ డబ్బుతో రైసుడిపోలో బియ్యము

తీసుకొనివెళ్ళి, వెంటనే వండి ఆ గంజినీళ్ళను కుటుంబ మంతయు త్రాగి హాయిగా నిద్రించెదరు. ఒక్కొక్క పెద్దకుటుంబములో 7,8గురు ఒకే గదిలో పరుండుదురు. సరిగా కట్టుకొనుటకు ఒకచీరగాని ఒక పంచెగాని వుండదు. చేపలు ఎక్కువగా బడి ఆనాడు డబ్బులు హెచ్చు దొరికిన కల్లుపాకకు వెళ్ళి సురాపానీయము త్రాగెదరు. అదియేవారికి బ్రహ్మానందము. ఇంతకన్న హెచ్చు ఆశయము వారికి వున్నట్లు తోచదు.

ఇటులనే ప్రతీవాని జీవితము పరీక్షించిన, అతని వృత్తినిబట్టి, మనో వికాసమునుబట్టి, చిన్న చిన్న ఆశయములకు మాత్రము బానిసుడై, తనచుట్టును చిన్న గిరులను గీసుకొని, అందులోనే చేసిన పనినే రోజూ జేయుచు తిరుగుచుండును. రేషను డిపోయజమానుని ఆశయము పరీక్షించుదుమా? సామాన్యముగా వ్యాపారములో మునిగియున్న మనుష్యులను పరీక్షించిన, బీదల సేవజేసి తరించవలెనన్న వారెచ్చటనోగాని యుండరు గదా! నేడెంత డబ్బులు యెంతలాభము నిరుపేదలవద్ద లాగుదమనెడిదే ఆశయమై యున్నది. గవర్నమెంటు వుద్యోగులకు తెలియకుండగనే, వారిని జేబులో వేసుకొనో, దిక్కులేని అమాయకమైన తిండిలేక మలమల మాడు చున్న నిరుపేదలకు శేరు 11-12 అణాలకు అమ్ముచుండును. ఈ అక్రమమైన లాభములతో, పాపపుడబ్బుతో తాను సిల్కుబట్టలు, సూట్స్ ధరించి జట్కాలలోను, కారులలోను స్నేహితులతో సిగరెట్లు బీడీలు కాల్చుచు, షికారు జేయును. అప్పుడప్పుడు కొంచెము, విలువైన బ్రాందీ వగైరాలు త్రాగుచు తాను పక్కన స్నేహితులను ఆనందపర్చుచుండెను.

ఇంకను లోభులైన వర్తకులు డబ్బులనంతను బ్యాంకులలోను ఇనుప పెట్టెలోనూ వేయుదురు. లేక ఇండ్లు భవనములు కట్టించెదరు. భూములు గొనెదరు. తమ భార్యలకు వస్తువాహనములు జేయించెదరు. ప్రతీకోటాకు ప్రతీ నెలలోను ఎంతహెచ్చుగా నిరుపేదల దిక్కులేని వారి కడుపుకొట్టి సంపాదించెదననే ఆశయమేగాని, యీ గతిలేని మల మల మాడుచున్న వారి సేవచేసి యెటుల తరించగలననెడి ఆశయము లేకున్నదని వేరే వ్రాయ నవసరము లేదుగదా!

ఇక ఒక జడ్జీగారి వద్దవున్న, ఒక చిన్న బంట్రోతును జూడుడు. నడుము చుట్టు పేరుగల్గిన ఒక డవాలీ తగిలించుకొని జడ్జీగారి ఇంటిముందు తాను గూడ ఒక చిన్న జడ్జీనే అన్నట్లు తిరుగుచుండును. ఎవ్వరైనా జడ్జీగారిని జూచుటకు వెళ్లిన, ముందు అలా చేతిలో ఏమైనా పెట్టకుండా జడ్జీగారి దర్శనమవ్వదు. వెళ్ళిన మనుజుడు నిరుపేదయైన జడ్జీగారిని ఆరోజున చూడజాలడు. మరల రావలసివుండును. ఏదో లంచము శక్తికొలది ఇచ్చిన జడ్జీగారినో, కలక్టరుగారినో వెంటనే దర్శించుటకు సావకాశమివ్వబడును.

ఈ ఉద్యోగస్తులవద్ద వుండెడి చిన్న బంట్రోతులకు, వారు గొప్ప జిల్లా జడ్జీలుగా, పెద్ద కలెక్టర్లుగా అవ్వవలెనన్న ఆశయం వుండదుగాని వుండదు. వారి ఆశయం నేడు ఎంతమంది జడ్జీగారిని చూచుటకు వచ్చెదరు, నాకెంత డబ్బులు దొరుకును అనియే వుండును. లేక ఏ పెద్ద బంట్రోతుగానో ఏ డఫేదారుగానో అయి జడ్జీగారితో కలసి, చక్కని తలపాగా ధరించి కారుమీద కూర్చొని కోర్టుకో  వూరునకో వెళ్ళుటే స్వర్గతుల్యముగా వుండును.

ఒక విద్యార్థి ఆశయము చూడుడు. నిరుపేదయైన ఏ స్కూలుఫైనలు చదువుకొని, ప్యాసై గుమాస్తాపనికి, డబ్బుగలవాడైనను బి.ఏ చదివి పెద్ద వుద్యోగము చేయవలెనని ఇంకా డబ్బులు గలవాడైన పెద్ద వర్తకముజేసి హెచ్చుగా డబ్బులు సంపాదించవలెనని కోరుచుందురు.

అటులనే ఎవ్వరెవ్వరి వృత్తినిబట్టి, వారి వారి మనోపాధిక్యమును బట్టి వారి వారి ఆశయములు వుంటున్నవి. చిన్నవానికి చిన్న ఆశయము, పెద్ద వానికి పెద్ద ఆశయము, ప్రవృత్తి పరునకు బాహ్య ఆశయములుండును.

దుర్లభమైన మానవజన్మ యెత్తినా మానవ జన్మ యొక్క గమ్యస్థానమును చేరవలెనని, బుద్బుదమైనకాయము, శరీరము పోకముందే దైవములో విలీన మవ్వవలెననెడి ఆశయం గల్గినవారు అదృష్టవంతులుగదా!

ఆశయముండగనే చాలదు. ఆ ఆశయమును పొందుటకు చేరుటకు అహర్నిశములు కృషిజేయవలెను. ప్రియమైన పాఠకా! నీ ఆశయమేమి? అంతర్ముఖుడవై నీ జీవితమును నీ ఆంతర్య హృదయమును పరీక్షించు కొనుము. సామాన్య మనుష్యుని ఆశయము తినుట, పోగుజేయుట,

తిరుగుట, సృష్టించుట, నిద్రించుట, విలువైన కాలమును వ్యర్థమైన సంభాషణలలో గడపుటేగదా! ఇటువంటి వారికిని, దీపములోపడి కాలిపోయెడి పురుగులకును, చిన్న చిన్న రెక్కలుగల్గిన పిట్టలకును బేధమేమి వున్నది.

నేను వ్యాసమును వ్రాయుచుండ, దీపము యొక్క జ్యోతిని, పండుగా భ్రమించి చిన్న చిన్న పిట్టలు ఆ జ్యోతిలోపడి కాలిపోవుచున్నవి. ఓ ప్రియమైన మనుజుడా! ఆత్మీయుడా! విషయవాసనలను అమృతతుల్యమైన ఫలములుగా భావించి, విషమును గ్రోలి నశించెదవేల లెమ్ము! మేల్కొనుము. నీ జన్మహక్కైన దైవత్వమును వ్యక్తపరచుము. చేపలవానివలె కించిజ్ఞత్వమైన బుద్ధితో చిన్న ఆశయంతో జీవించవలదు. నీఆశయం బియ్యపు డిపోగాని, కిరసనాయిలుడిపో యజమానివలె వున్నదేమో పరీక్షించుకొనుము. లేక జడ్జీగారి వద్దవున్న బంట్రోతు ఆశయమువలెనే యున్నదా. కండ్లను తెరువుము. ఈ క్షణమే నీది. మరుక్షణము నీదిగాదు. రేపునీదిగాదు. దైవము నీకొరకై వేచి యుండెను. రమ్ము! నాతోరమ్ము. ఋషికొండ తీరమునకు వెళ్ళుదము. కైలాస పర్వతపాదమున ఆశీనులమై ధ్యానింతము. సర్వమును మరచి దైవత్వముననుభవించుచు గడిపెడి క్షణములే మనకెప్పటికైనను శాంతిని, శక్తిని, ముక్తినిచ్చును. అదిగో భానుడుదయించుచున్నాడు. ఈ పలకమున సుఖాశీనుడవై కూర్చొనుము. నీ ఆంతర్య హృదయమునందు నీకొరకై వేచి యున్న జ్యోతిని ధ్యానము జేయుము. ధ్యానించుట కిదియే సమయము. తరించుట కిదియే వుత్తమమైన సమయము. చక్కనైన రాచబాట! ఇంక హెచ్చుమాటలేల? నిమీలిత నేత్రులమై, అటులనే అంతర్య తేజస్సును ధ్యానించుచు కొంతతడవు శాంతితో గడపగా మరల నేత్రములు తెరచేసరికి ఆంతర్య మునేగాక బాహ్యమున గూడ సర్వము అఖండజ్యోతిర్మయమై కోటిసూర్య దివ్యతేజస్సులోనేగాక, మీరందరును లోకమంతయు నింపబడియున్నది ఈ అఖండ దివ్యతేజస్సే మనందరకు ఆశయమై యుండుగాక!

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

8-2-48

5-00 ఎ.ఎమ్.

## 22. అమూల్యమైన ఆత్మానుభవములు

ఎన్ని అద్వైత గ్రంథములు చదివినను, అద్వైత బోధలు విన్నను, సామాన్యముగా మానవుడు, అన్ని దేశములలో, అన్ని మతములలోగూడ దైవమును బాహ్యమునే వెదకుచుండుట ఆశ్చర్యకరము.

మహమ్మదీయుడు మక్కావైపు జూచుచుండును. క్రిస్టియను జరూసలం వైపు జూచుచుండును. బుద్ధుడు సారనాధు, బుద్ధగయవైపు జూచుచుండును.

ఇక హిందువుడు భద్రాచలము, తిరుపతి, కాశీ రామేశ్వరము, ధనము వున్న బద్రినారాయణ, అమర్‌నాథ్ వైపు తిరుగుచు దైవమును వెదకు చుండును.

ఏ నూటికో, వెయ్యికో, లక్షకో ఒక్కరుమాత్రము దైవమును బాహ్య నామరూపములలో, తీర్థయాత్రలలో బాబాలు, యోగులు, సాయినాధులు, పితామహులు, మండలేశ్వరులలో వెతకక, దైవమును నిశ్శబ్దములోనే తన ఆంతర్య హృదయముననే వీక్షించుచు, తృప్తిని ఆనందమును పొందుచుందురు. అట్టివారి జీవితములు ధన్యవంతములుగదా!

భక్తాగ్రేసరులారా! శ్రీమతి మీరాబాయి దైవమును అనుభవించుటకు “దశకోశనహిజానా” పదికోసులు వెళ్ళనవసరములేదనియు, ‘హత్, పాహి నహి చలనా’ చివరకు కాళ్ళు చేతులుగూడ కదపనవసరములేదనియు, చక్కగా సులభశైలిలో కీర్తించుచుండెను.

మనకు చెవులు వినజాలకుండుట కండ్లు వుండియు జూడజాల కుండుట, మనస్సులుండియు వాటిని వాటిని ఉపయోగించజాలకుండుట మన బుద్ధిని, నిత్యమైన, శాశ్వతమైన, స్థిరమైన ఆంతర్యజ్యోతియందు పరమాత్మలో స్థిరము చేయజాలకుండుట విషాదకరము.

సద్వస్తువును మరచి కీనీడలవెంటనే మానవులు పరుగెత్తుచుండుట విచారకరము. ఎన్నాళ్ళు వ్యయప్రయాసలతో కీనీడల వెంట పరుగెత్తినను ఆ సద్వస్తువును నిరంతరముగా ఆంతర్య హృదయములో పరిపూర్ణముగా స్వయంజ్యోతి ప్రకాశమానమైన పరమాత్మను బయడగలము? మానవుని

దుస్థితి విషాదకరమైన కస్తూరి మృగముయొక్క దిక్కుమాలిన స్థితివలె యున్నది. తనలోపలనేయున్న కస్తూరికై అడవులంట, కొండలలోను తిరిగి వేసారి మరణించెను.

ఒక సాధుపుంగవుడు అరువది సంవత్సరములనుండి రామేశ్వరం నుండి కాశీ, కాశీనుండి ద్వారక, పూరీ మొదలైన యాత్రలు, మధ్య మధ్య భద్రాచలం, తిరుపతి, సింహాచలము యాత్రలు గూడ జేయుచుండెనట. అరువది ఒక్కటవ సంవత్సరమున గూడ మరల యాత్రకు వెళ్ళుటకు సన్నాహములు జేయుచుండ ఒక మిత్రుడు, షష్టిపూర్తిదాటినను, అరువది సంవత్సరముల నుండి తిరుగుచు నాయనా! ఏమి నేర్చుకొనుచుంటివి? దేశాటనయందు ఇంకను నీకు విసుగుగలుగలేదా అని ప్రశ్నించెను.

తండ్రీ! యీ మనస్సు ఒక్కచోట నిలువనీయదు. నిశ్శబ్దముగా, ఏకాంతములో ధ్యానము జేయనీయదు. కోతివలె సదాచంచలత్వముతో తిరుగుచుండును. నన్ను తిప్పుచున్నది. నేనేమి చేయగలను? అని సమా ధానము జెప్పెనట.

ప్రియమైన పాఠకులారా! నా వ్రాతలను తగ్గించి, యిప్పుడు రహస్యమైన అమూల్యమైన, నా ఆత్మానుభవములను, మీ ఆత్మవృద్ధిని కోరుచు, మీతో పంచుకొనుటను కోరుచుంటిని.

ప్రప్రథముననే రెండు వస్తువులను గుర్తించుదము.

1. జీవాత్మ 2. పరమాత్మ

వెర్రి మానవుడు తాను జీవుడననే శరీరమును అంటిపెట్టుకొని, పరమాత్మకు పూజలు, ప్రార్థనలు, ధ్యానములు, సహస్రనామములు మొదలు కోటి పత్రిపూజ వరకు జేయుచుండెను.

బేధభావనయే అజ్ఞానము. నరకము, రెండువున్నచోట తృప్తి లేదు శాంతిలేదు.

శాశ్వతమైన ఆనందము, తృప్తి, పూర్ణశాంతి, అద్వితీయమైన పరిపూర్ణమునందే, అద్వైతానుభవమునందే గలదు.

రజ్జు సర్పదృష్టాంతమును ఒక్కసారి జ్ఞప్తికి తెచ్చుకొనుడు. త్రాడువున్న పాములేదు. పామువున్నచోట త్రాడులేదు. తాను జీవుడను కొన్న పరమాత్మ మరుగైయుండెను. దేనినో ఒక్క స్వరూపముగా గుర్తించవలెను. వెలుతురును, చీకటిని ఒకేసారి గుర్తించజాలము. దైవమును, దెయ్యమును ఒకేసారి కొల్వజాలము. ఒకేవరలో రెండు కత్తులను ఒకేసారి ఇమడ్చ జాలము.

అన్ని తాపత్రయములకు బాధలకు, చింతలకు అతీతముగా యుండవలె ననియున్న, జీవభ్రాంతిని విడువవలెను. జ్ఞానమనే అద్వైత ఖడ్గముచే, అజ్ఞానమనెడి బేధభావన అనెడి సర్పమును ఖండించవలెను.

జీవో దేవ సనాతనః

జీవుడే దైవమని, అనాది నుండియు వేదములు ఘోషించుచున్నవి. ఇంకను భద్రాచలం, తిరుపతి, కాశీరామేశ్వరముల వెంట తిరుగుచు అమూల్యమైన కాలమును, జీవితమును, నామరూపములను పూజించుచు, ఎంతకాలము వ్యర్థము జేయుదము?

దీపము ఆరిపోకుండగనే గమ్యస్థానము చేరవలదా? నడిసముద్రము లోనే, సంసార మహాసముద్రములో వుత్కృష్టమైన మానవజన్మయొక్క గమ్య స్థానము జేరకుండగనే విజ్ఞులైనవారు, చిన్న చిన్న దేవతలను పూజించు పసిబిడ్డలవలె, ఆటవస్తువులతో తృప్తిచెందుచు జీవితములను వ్యర్థబుచ్చ రాదు.

బాహ్యపూజలు, దేశాటనములు, ప్రారంభకులకు ఆనందముగనే యుండును. గాని జన్మరాహిత్యము జేసుకొనవలెననియున్న అన్ని తాపత్ర యములను, సంసార ఈతిబాధలన్నింటికిని దూరముగా యుండవలెననియున్న ఒక్కటే మహాపూజగలదు. అదియే సోహం పూజ. ఇది పూజలన్నింటికి మహత్తరమైన పూజ.

సోహం భావేన పూజయేత్

సోహం భావనతో శరీరమంతయు పూజించుమని, బ్రహ్మావిధులు

నుడివి యుండిరి.

శాస్త్రములన్నియు చదివిన మహామహోపాధ్యాయులు, వేదాంత సారమును బోధించగల్గిన గొప్ప పండితోత్తములైనను, దైవము భిన్నముగా, వేరుగా అన్యముగా వుండెనన్న భావన ఇసుమంతయున్నను, అచ్చట మరుపు తప్పదు. మరుపులో చింత దుఃఖము బాధయే గలదు.

మరుపే చావు. అదియే మృత్యువని అనుభవజ్ఞులు నుడివియుండిరి. మరుపేలేని స్వస్వరూపమును ధ్యానించినప్పుడే, తృప్తి, శాంతి, ఆనందము నిచ్చును.

ఎంతభక్తి, ప్రేమ, వైరాగ్యము గలిగియున్నను తనలో యున్న దైవమును మరుగుజేసుకొని, అన్యదైవములను ఎంతపూజించినను తాత్కాలికముగా గంజాయి, సారామత్తువలె ఆనందముగా వున్నను ఆ నిషా, ఆమత్తు వదలి పోవగనే ఆచరణలో మనుజుని జీవితము మతము వేరుగా యుండుట మనము జూచుచుంటిమి.

**మతమును, జీవితమును రెండుగావు ఒక్కటే అని,** మహనీయులు ఘోషించుచుండిరి.

మరుపు, తెరుపులు లేని సుఖదుఃఖములులేని, చావుపుట్టుకలులేని, పూర్ణశాంతిని, అద్వైత సిద్ధిని పొందవలెనన్న ఒక్కటే మార్గము గలదు. క్షణభంగురమైన, బాహ్య నామ రూపములను, అల్పమైన వివిధ దేవతారాధ నలను తగ్గించి, మీ స్వస్వరూప ధ్యానమును, మీ హృదయ కుహరమునందు స్వయంజ్యోతి ప్రకాశమానమై వెలుంగుచున్న మహాజ్యోతిని, యెన్నడును ఆరిపోవని అఖండ దివ్యజ్యోతి స్వరూపమును ఇప్పుడే, ఇచ్చటనే గుర్తించి, దానినే అనుసందానము జేయుచు, ఆ జ్యోతి స్వరూపముగా జీవించుడు. ఇదియే సులభమైన, సౌఖ్యమైన సూక్ష్మమైన రాజమార్గము.

ప్రియమైన ఆత్మసోదరీ సోదర స్వరూపులారా! ఉపనిషత్తులలో చెప్ప బడిన, చక్కనైన రెండుపక్షుల దృష్టాంతమును మీరు వినియుంటిరా?

ఒకచెట్టు మీద రెండు పక్షులుగలవు. క్రింద కొమ్మమీద వున్న పక్షి

తియ్యని పండ్లుతిని నవ్వుచు ఆనందించును. మరల చేదుగా వున్న పండ్లను తిని దుఃఖించును, బాధపడును.ఇటులనే, అహర్నిశములు జీవితమంతయు నవ్వులే, యేడ్పుతో సుఖ దుఃఖములతో గడుపుచుండును. ఈ సుఖదుఃఖములకు అతీతమైన స్థితి లేదా అని ఆ పక్షి తలయెత్తి పైకి చూడగా మరో కొమ్మమీద సుఖదుఃఖములకు అతీతమై శాంతమూర్తిగాయున్న మరొక పక్షినిజూచి, ఆశ్చర్యపడి, నెమ్మదిగా యీ క్రింద పక్షి మీద పక్షిచే ఆకర్షింపబడి దానిలో విలీనమవ్వును. జీవాత్మ పరమాత్మలు కలసిపోవును. ఇదియే జీవాత్మా పరమాత్మ ఐక్యసంధానము. పరిపూర్ణమైన స్థితి.

తాను జీవుడనను కొన్నంతకాలము తాపత్రయములు, చింతలు, బాధలు తప్పవు. జీవభ్రాంతిలో, చింత దుఃఖముగాక మరొక్కటి యెటుల దొరకును? చీకటిలో వెలుతురుండునా? వెలుతురులోనే వెలుతురును, తేజస్సును గాంచగలము. ఈ గోప్యమైన, సూక్ష్మమైన భావనలను గ్రహించు టకు, అనుభవించుటకు ప్రస్తుతము కష్టముగా గానవచ్చుచున్నను, స్వప్రయత్నముచే స్వస్వరూపధ్యానమే శాంతిని, నూతనశక్తిని, మోక్షము నందించును.

స్వస్వరూపధ్యానము చేతనే బ్రహ్మ సాక్షాత్కారము సిద్ధించును. ఏలనన మీరే ఆ సద్వస్తువు. **తత్వమసి. అదియే నీవు.** మీరే అదియైయుండి, కీ నీడల వెంటపరుగెత్తదరేల? తాటాకు చప్పుళ్ళకు భయపడదరేల? లెండు. మేల్కొనుడు.

అన్యవస్తువును, అది దైవమైనను, పరమాత్మయైనను, యెంత గొప్ప మహత్తరమైనదైనను, మీరు దానినెంతసేపు ధ్యానించగలరు? గంటలకొలది యైనను ధ్యానింపగా ధ్యానించగా విసుగుగలుగదా? నిద్రలోనైనను మరపు వచ్చునుగదా!

గాన మననుండి భిన్నముగా, వేరుగా, అన్యముగా యున్నది యెంత గొప్పదైనను దానిని ధ్యానించుటచే మనకు పూర్ణశాంతి, మోక్షము దూరము గానే యుండును.

గాన పూర్ణశాంతి, ముక్తి సన్నిహితముగా యెచ్చట వున్నది. అది స్వ

స్వరూప ధ్యానమునందే యున్నది. తన్ను తాను ధ్యానించుటలోనే యున్నది. శరీర ప్రపంచములు ఎన్ని సర్వములోనిండియున్నను అన్ని కార్యములకి అతీతమైన నిద్ర మృత్యువు గూడ అంటజాలని దివ్యజోతి స్వస్వరూపములో నిరంతరము ప్రకాశించుచున్న దన్న సత్యమును ఎంత త్వరగా గ్రహించిన అంతమంచిది. మన ఆంతర్య హృదయములో సోహం భావనలో వెలుంగు చున్న ఆ జ్యోతిస్వరూపములో మన ప్రయత్నలేమియు అవసరము లేకుండ గనే, అప్రయత్నముగానే, అది స్వయంప్రకాశమానమైనదిగాన, నిరంతరము వెలుంగుచునే యున్నది.

అద్దానిని మనము గుర్తించినప్పుడే, మరుపు తెరుపులు లేని పరిపూర్ణ మయిన నిర్వికల్ప స్థితి కలుగును. ఏలనన, అది ఆ దివ్యజ్యోతి స్వరూపము మనము మరచినను, సదా అద్వితీయమైన, సంపూర్ణమై ప్రకాశించుచునే యున్నది.

ప్రియమైన ఆత్మీయులారా! నేను మీకు చెప్పవలెనని కోరుచున్నది యీ చిన్న మాటలలో నేను ఎంతప్రయత్నము జేసి, అంతను వ్రాయుచున్నను మీకు చెప్పజాలకుంటిని. మాటలతో చెప్పజాలని దానిని, మీకు రుచి చూపించుటకు కోరుచుంటిని. గాన ఒక్కతరి కండ్లు మూసుకొని, మీ శరీరముల మాట మరచి ఆత్మ ధ్యానము జేయుడు. మీ వుచ్ఛ్వాస నిశ్వాస లలో ఆడుతున్న సోహమునే వెంబడించుడు.. వెంబడించనేల అది మీలోనే సదా వెలుంగుచున్నది. గాన అదియే మీరు. మీరే అది. దానిని గుర్తించి స్థిరముజేయుడు. ఆ తెలివియే మీరు ప్రజ్ఞానం బ్రహ్మ.

ప్రియమైన శాంతిపాఠకులారా! మీరు మరల మరల చదివి, దీని సారాంశమును, మీరు మీ జీవితములలో మీ అనుభవములోపెట్టుచు, మీ వృద్ధిని మీమీ అనుభవములను నాకు వ్రాసిన మీ వృద్ధివిని నేను ఆనందించె దను.

మీ జన్మహక్కైన కోటిసూర్యుల దివ్యతేజస్సును ఈక్షణమునందే గుర్తించుడు. అద్దానిని గుర్తించి దానినే నిరంతరము శ్రవణ, మనన, నిధి,

ధ్యాసలుచే స్థిరముచేసి బ్రహ్మానందము ననుభవించుడు.

ఆ దివ్యతేజస్సు ఒక్కదానిలోనే మరుపు తెరపులు లేవు. ఏ జబ్బులు రోగములు, చింతలులేవు. చివరకు ఆ తేజస్సులో రాత్రిపగలు, పుట్టుట గిట్టుట, గూడలేదు. అంతా స్వప్రకాశమే. దానిని వీక్షించుటకు మరి అన్య వస్తువుల సహాయము గూడ అవసరములేదు.

సూర్యుని గాంచుటకు అగ్గిపుల్లగాని, కిరసనాయిలు దీపము యొక్క సహాయము కావలెనా? అటులనే స్వయంప్రకాశమానమైన మీ దివ్యతేజస్సును గుర్తించుటకు బాహ్య సహాయములు అనవసరము.

Know Thy self.

మీ ఆత్మను మీరే మీ ఇచ్ఛచే గుర్తించి, శాంతిసుధను నిరంతరము గ్రోలుచు జీవనముక్తునిగా తరించెదరుగాక!

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

ఓం తత్సత్ ఓం

5-12-55

5-00 ఎ.ఎమ్.

ఆంతర్య జ్యోతిని పూజించెడి మహనీయులకు ప్రేమపూర్వకముగా అర్పణ.

I offered lovingly to the worshippers of the Indwelty light.

## 23. చీమల ప్రపంచకము

కైలాసములో మొన్నటి రాత్రి హఠాత్తుగా వర్షము కురిసెను. వుదయమై కైలాస ఆశ్రమ గేటు తెరచి రోడ్డు మీదనే కొంత తడవు అప్పుడే సముద్రము నుండి వచ్చుచున్న సూర్యభగవానుని తేజస్సును, సౌందర్యమును వీక్షించుచు నడచుచుంటిని. అటుల నడుచుచుండ క్రిందను చీమలబారునొక్క దానిని గాంచితిని. ఎంతదూరము నడచినను ఆ చీమలు ఒక పటాలమువలెఅంతు ఆది లేకుండ అటులనే వెళ్ళుచున్నవి. ప్రతీచీమ నోటిలోనను తెల్లని ఆహార పదార్థమేదియో వున్నది.

ఆ చీమలు యెచ్చుట కలసి వచ్చుచున్నవి; ఎచ్చుటకు వెళ్ళుచున్నవి? వాటి నోటిలోని తెల్లని పదార్థమేమి? దానిని తినకుండ యెచ్చుటకు యెందుకు తీసుకొని వెళ్ళుచున్నవి? ఈ ప్రశ్నలన్నియు సాధారణ మానవుడు యెంత బుద్ధి కుశలత గల్గినను తెలుసుకొనగలడా? గాని చీమల ప్రపంచముతో చిన్న చీమకు, యీ ప్రశ్నలన్నియు తెలియును.

ఆశ్చర్యముతో ఆ చీమలబారును నేను గూడ, వాటితో అటులనే నెమ్మదిగా నడచుచుంటిని. ఎంత దూరము నడచిను, ఇంకను లక్షల కొలది, చీమలేగాని, వాటి గమ్యస్థానమును కనుగొనజాలనైతిని. అహా! ఏమి ఆ నిపుణత! ఆ బారుల సరియైన సేహ్యాత! ఒక్కచీమయైనను, దాని లైను వరసనుండి వెనుకబడదు కదా! చీమల యొక్క కృషి తెలివితేటలు, మానవు డెటులు తెలుసుకొనగలడు!

అటులనే ఇతర జంతుజాలములను జూడుడు. కందిరీగలను జూడుడు. సాలీడులను జూడుడు, వాటివలె నిపుణతగా గూడులను మనుజుడు కట్టగలడా! కొంతజ్ఞత్వముతో నిండి యున్న మానవుడు, తాను సర్వము తెలసియున్నవాడునని గర్వించును. సర్వజ్ఞుడు, సర్వశక్తుడు సర్వము తెలుసుననెడి మానవుని ఒక్క చిన్న పాము వచ్చి చంపగలదు. ఒక్క పిడుగు వచ్చి మీదపడిన నశించును. అఖండమైన, పరిపూర్ణమైన అవగాహ్యామైన దైవశక్తులముందు, మానవుని జీవితము అతి అల్పమైనది గదా!

మానవుడు, మానవ ప్రపంచములో వుండి మరే ప్రపంచమును గుర్తించక మానవ ప్రపంచమే గొప్పదిగా, భావించును. అటులనే చీమలు తమ చీమల ప్రపంచమే గొప్పదిగా భావించును. మిగతా పక్షి, జంతు జాలములన్నియు వాటి వాటి ప్రపంచములే గొప్పవిగా భావించుకొను చుండవచ్చును.

మనుజుని ప్రపంచము కంటెను, అతీతమైనవి ఎన్నో బ్రహ్మాండములు వున్నవిగదా! అల్పజ్ఞుడైన మానవ మాత్రునకు ఏమి తెలియును. మానవుని విజ్ఞానమంతయు, తెలివితేటలన్నియు సముద్రములో నీటిబొట్టువంటివి.

సృష్టియొక్క విచిత్రములను దైవలీలలను కండ్లువుండియు చూడజాల కుండుట, చెవులు వుండియు వినజాలకుండుట, మనస్సులుండియు పరి పూర్ణమును, నిత్యమును, సత్యమును అవగాహన జేయచాలకుండుట చాల విచారకరమైన విషయము. గాని మానవుడు సర్వము తెలిసియున్న సర్వజ్ఞుండననెడి భ్రమనుండి, సింహాసనమునుండి క్రిందకు దిగిన, తాను చిన్న చీమనుండియు, సాలీడు నుండియు, పుష్పము నుండియు, నక్షత్రముల నుండియు, ప్రతీ వస్తువునుండి గ్రహించుటకెన్నో మహత్తరమైన అంశములు గలవు.

చీమల యొక్క కృషి, పట్టుదల చూడుడు. చీమలు ప్రాకిన రాళ్ళు గూడ కరిగి దారులేర్పడునని జెప్పెదరు. సాలీడు తన నుండియే ద్రవమును తీసి తనగూడును అల్లుచున్నదట. మానవుడు అటులనే యీ సృష్టినంతను, తన మనస్సుచేత కల్పించుచుండెనని వేదాంతులు జెప్పెదరు. పుష్పము లెంత ప్రేమమయమై చక్కని సువాసనను వారికి వీరికి అనక అందరకును సమముగా నిచ్చుచున్నవి. నక్షత్రములు జూడుడు, నిరంతరము ఎటుల ప్రకాశించుచున్నవి.

చీమల ప్రపంచమునుండి కృషి, నిరంతర కృషిని నేర్చుకొనవచ్చును. సాలీడుల ప్రపంచమునుండి, విచిత్రమైన సాలీడు యొక్క గూడు అంతయు దానినుండే వచ్చియున్నదిగాన, యీ సృష్టి అంతయు మానవుని మనో కల్పితమని గ్రహించి సంకల్ప రాహిత్యముగావుండి తరించుట సాలీడు నుండి నేర్చుకొనవచ్చును.

ఇక పుష్పము, నాయనా! నీ జీవితము ప్రేమపూరితముగా, సువాసనతో నింపి అందరకు వినియోగించుమని జెప్పుచున్నవి. ఇక నక్షత్ర ముల నుండి మనము నేర్చుకొనెడిది యెద్ది? నక్షత్రములు ఓ వెర్రిమానవుడా! ప్రకాశమే నీ జన్మహక్కు. చీకటి, అంధకారము,చింతలు, తాపత్రయములు నీ జన్మ హక్కుగాదు. దివ్య తేజస్సే నీ జన్మహక్కు. గాన మావలె నీవు గూడ నిరంతరము తేజస్సుతో ప్రకాశించుచు, మన అందరకు ఆధారమైన, గమ్యస్థానమైన కోటిసూర్య దివ్య తేజస్సులో విలీనమవ్వమని నిరంతరము బోధించుచున్నవి. ఇక పెక్కుమాటలేల? విజ్ఞునకు బుద్ధిమంతునకు ఒక్కమాట జాలును. మన చెవులను దివ్య వాక్కును వినుటకు, కండ్లను ప్రభువును దర్శించుటకు, మనస్సులను దివ్య తేజస్సులో విలీనమవ్వుటకును వినియోగించి తరించెదముగాక! అన్ని ప్రపంచములలో జీవరాశులను శాంతితో నిండియుండుగాక!

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

30-4-51

12-30 పి.ఎమ్.

# 24. నా ఆశయములు (లేక) నా పరితాపన

ఈ మౌనపు రోజులలో ఆశ్రమ పేరుననైయెనను, ఏ వస్తువునైనను ఏ చిన్న సహాయమునైనను, ఎవ్వరి నుండియు కోరుటకు నా మనస్సునకు బాధగా యుండును. ఆశ్రమ అవస్థలు దైవమే జూచును. దైవపనికి దైవమే తోడ్పడును. మౌనం సర్వార్ధ సాధనము. మౌనము అన్నింటిని జయించుటకు, పొందుటకు సాధనమై యున్నను. పరిపూర్ణమైన మౌన మనగా బ్రహ్మ భావములో నిరంతరము పరిపూర్ణముగా యుండుటయే.

అద్వితీయమైన సద్వస్తువునకు, ఆత్మ స్వరూపమునకు కోరుటకు అన్య మైనది, దానినుండి భిన్నమైనదెద్దియు లేదుగదా! కోరుదమన్నను ఆత్మకంటె భిన్నముగా యెద్దియు లేదుగాన నిరంతరము యీ మనస్సు లోకాస్సమస్తా సుఖినోభవంతు లోకములో జనులందరూ సుఖముగా యుందురుగాక, సర్వేజనా సుఖినోభవంతు. జనులందరును లోకమంతటా సుఖముగా శాంతిగా యుందురుగాక అనియే కోరుచుందును. ఐనను ఈ మౌనపు రోజులలో ఒక్కచిన్న విషయము మాత్రము నాకు చింతను గల్గించు చుండును.

అది యెద్దియన, నన్ను జూచుటకు వచ్చినవారు నాకాలమును, వారి కాలమును వ్యర్థము జేసియు, వారు వృద్ధి అవ్వకుండ నా నుండి వెళ్ళిన నాకు బాధగా యుండును. వృద్ధిలేని జన్మ భూభారముగదా! శ్రమపడి, వ్యయప్రయాసలతో ఆశ్రమమునకు వచ్చియు, వారి కాలము, ఆశ్రమ వాసుల కాలము కుశల ప్రశ్నలతో వ్యర్థమైన మాటలతో గడిపి వెళ్ళినవారికి ఏమి లాభము? ఆశ్రమవాసులకేమి లాభముండును? ఫలితమునకు వృద్ధికి బదులు విలువైన అమూల్యమైన కాలము వ్యర్థమయ్యేననియే నేను విచారించుచుందును. నేడు వ్యర్థముగా గడిపిన రోజు రేపు మనకు మరల ఇవ్వబడదు గదా!

అదియుగాక నేడే మనది, రేపు మనదిగాదు. ఎప్పటికిని శాశ్వతముగా యీ మట్టి ముద్దలను, యీ అస్థిపంజరములను అంటిపెట్టుకొని వుండగలమని మాత్రమెటుల జెప్పగలము.

అన్ని జన్మలలో వుత్తమమైనదియు, దుర్లభమైన మానవజన్మను బడసియు దైవపరితాపనలేని మానవులను జూచిన నాకు బాధగా యుండును. దైవము గురించి పరితపించలేని వారి దుస్థితిని జూచి నేను వారి శ్రేయస్సును కోరుచు దుఃఖించుచుంటిని. ఆశ్రమమునకు వచ్చినవారు, సందర్శకులు, భక్తులు నాకేమి ఇచ్చేరనెడి ఆలోచన యెన్నడును నాలో వుండదు. నన్నుజూచుటకు వచ్చినవారికి నేనేమి ఇవ్వవలెననెడి ఆలోచనయే తీవ్రముగా యుండును. నాకు యెవ్వరినుండియు, ఏమియు అవసరము లేని స్థితిలో, సంకల్ప రహితముగా జీవించుటను కోరుచుంటివి. నాకు కావలసినది మీరంతా వృద్ధియై దైవభక్తితోనిండి, దినదినాభివృద్ధిని గాంచుచు తరించుటయే.

ఆశ్రమమునకు వచ్చిన జ్ఞాపకార్థముగా శాంతి ప్రార్థనయైనను, ఆశ్రమములో వల్లించి దానిని సదా స్మరించుచు, వృద్ధియై నాకు తోడ్పడమని సందర్శకులను కోరుచుందును. మీ వృద్ధియే నాకు ఆనందము. మీ తరింపే నా గమ్యస్థానము. క్షణములను వ్యర్థము జేయువారు. జీవితమునంతయు వ్యర్థము జేయుదురని తరుచూ జెప్పుచుందునుగాన మీ ప్రతీక్షణము ఆశ్రమములో వుండగానైన శాంతి ప్రార్థన, దైవ నామము స్మరించుచు మీరు వచ్చినప్పుడు కంటె ఆశ్రమమునుండి వెళ్ళే అప్పటికి బాగా అన్ని రీతులుగా వృద్ధియై వెళ్ళిన మీకును నాకును గొప్ప ఆనందముగా యుండును. కరుణామయుడైన దైవము ఆశ్రమ సందర్శకుల నందరినీ ఆయురారోగ్యములతో, భక్తి ప్రేమలతో పూర్ణశాంతితో సదా బ్రోచుగాక!

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

27-11-55

6-00 ఎ.ఎమ్.

## 25. జీవన్మృతులు

లోకములో చనిపోయినవారు, జీవించియున్నవారు రెండు తరగతులు గలరని మన మెరింగినదే. బ్రతికి యున్నవారి కంటె చనిపోయినవారే చాలమంది యుండుట విచారకరము. **చనిపోయిన వారు అనగా స్వార్థులు. బ్రతికి యున్నవారు అనగా స్వార్థ రహితులు.**

ప్రియమైన శాంతిపాఠకా! ఇతరులమాట అటువుంచి, నీ జీవితమును, నీ సంకల్పములు, నీ భావనలు, కోర్కెలు విమర్శించి పరీక్ష జేసుకొని, నీవు బ్రతికియుంటివో, చనిపోయివుంటివో ఒక్క మాటలో జెప్పుము. జీవితము అమూల్యమైనది. అన్ని జన్మలలో మనుష్య జీవితము దుర్లభమైన దని గూడ జెప్పుచుండిరి. గాన దీపము వుండగనే, శరీరము నుండి ప్రాణము పోకుండగనే, గమ్యస్థానమును, దైవమును జేరుటకు ప్రయత్నించుము. దైవమును చేరుటకు సూక్ష్మమైన దగ్గరయైన మార్గము స్వార్థ రహితమైన జీవితమే. స్వార్థము, నరకమును జేర్చును. స్వార్థరహితమైన జీవితము స్వర్గ మును జేర్చును.

స్వర్గబాట–సత్యమార్గము ఎంత ఇరుకుగా ముళ్ళురుప్పలతో నిండి యున్నదో జూడుము. ఇక నరకబాటయో ప్రవృత్తిమార్గమో, వేలానవేల వ్యక్తులతో వేలకు వేలేగాదు, లక్షలు, కోట్లు మనుష్యులతో నిండియున్నది. నరకబాట విశాలముగా ఆకర్షనీయముగా గూడయుండి, మానవకోటిని ఆహ్వానించుచున్నది. ప్రవృత్తి అంతయూ నరకబాటయే, నివృత్తియే స్వర్గబాట.

నివృత్తి బాటలోనే, సత్యము ననుసరించుచు, ఏ ధర్మరాజువంటి వారో ఒక్కరు ప్రయాణము జేయుచుందురు. పూర్వ జన్మ సుకృతముచే, రామీ వంటి చిన్న కుక్కగూడ వెంబడించుచుండును. ఇక కొదువ ప్రజలందరును దుర్యోధనాదులు, వారి సంతతి బంధు మిత్రాదులు తండోపతండములుగా ప్రవృత్తి భావనలు, మాటలు, ఆలోచనలతో నిండియున్న వారై నదీ ప్రవాహ మువలె, చీమల బారులవలె కట్టి, అహర్నిశములు ప్రయాణము జేయుచు, అధోగతి పాలగుచుండుట జూచుట విచారకరమైన దృశ్యము.

ఎటువైపు జూచినా జీవన్మృతులే. బ్రతికి వుండియు చనిపోయినవారే! జీవించి యున్నవారు గనిపించలేదు. ఇదియే మాయ. దీనినే మాయ అందురు. మాయను జయించుట ఎటువంటి వారలకైనను బలవంతుల కైనను, ధనవంతులకైనను దుర్లభముగదా! ఇంకను మీరు యెంత బలిష్టనీయ మైనను అనగా రోజూ మన కండ్లముందు, మన ఇంటిలోను, వీధిలోను మృత్యువును గాంచుచు, మాయ ప్రాబల్యముచే ఎంతమంది చనిపోయినా, అందరూ చనిపోయినను మనము మాత్రము చనిపోవమని భ్రమపడుచు స్వార్థమైన ఆలోచనలు, మాటలు, పనులతో, అమూల్యమైన జీవితము వ్యర్థబుచ్చు చుందుము.

ప్రియమైన శాంతిపాఠకా! దీపము ఆరిపోకముందే ఈ మనస్సు నీకు చిన్నసహాయమును జేయుటకు కోరుచున్నది. నేను నీకు ఏ సహాయము జేయగలను.

ప్రశ్న: ప్రప్రథమున నేను నీకు ఎందుకు సహాయము చేయవలెను?

జ: నీవు నా స్వంతమైన ఆత్మ స్వరూపుడవుగాన, నీ ముక్తియే నాముక్తి. నీ వృద్ధియే నా వృద్ధి. నీ శాంతియే నా శాంతి గాన, యీ మనస్సులో నీ తరింపును నీ విముక్తిని, నీ పూర్ణశాంతిని కోరుచున్నది. ఎప్పుడో గాదు ఇప్పుడే ఈ క్షణమే మనది. మరుక్షణము మనదిగాదు. నేడున్నవాడు రేపుండకపోవచ్చును, గాన మనము చేయవలసిన మంచి పనిని నేడే ఇప్పుడే జేయుటకు ప్రారంభించెదము గాక!

ప్రియమైన పాఠకా! లెమ్ము! మేల్కొనుము. నీగాఢమైన నిద్ర నుండి ప్రవృత్తి నుండి, స్వార్థము నుండి మేల్కొనుము. స్వార్థముతో నిండి, చనిపోయిన వానిగా, భూమికి భారముగా, కళంకముగా జీవించవలదు. స్వార్థరహితముగా, మానవకోటికి ఆదర్శనీయముగా, **పరోపకారార్థమిదం శరీరం.** ఈ శరీరము ఇతరుల సేవకొరకే ఇవ్వబడెనుగాన, విశ్వ ప్రేమతో నిత్య శాంతితో నిండి, ప్రపంచమునంతను, నీ స్వంత గృహముగా, మానవ కోటి నంతను నీ సోదరీ సోదర స్వరూపులుగా భావించుచు, ప్రేమించుచు నేడేతరించుటకు ప్రయత్నించుదువుగాక!

లోకాస్సమస్తా సుఖినోభవంతు; శాంతి శ్శాంతి శ్శాంతిః

4-10-68, 5-00 ఎ.ఎమ్.

## 26. నా తప్పులు-పొరపాట్లు

1. ఆశ్రమం చుట్టుపట్లవున్న భక్తులైన జమీందార్లు, భూకామందులు వగైరాలని ఆదివారం ప్రార్థనకైనా వచ్చి తరించమని వుత్తరములు వ్రాయుచు వారికి శ్రమగల్గించుట.

2. ఆశ్రమంలో వున్నవారే ఆదివారం ప్రార్థనకైనా వచ్చుటలేదని, నా పరితాపనలో వారి వృద్ధిని కోరుచు, ఆశ్రమభక్తులు ఆశ్రమాభిమానులు వచ్చినపుడు నా ఆవేదనను జెప్పగా, ఆశ్రమవాసులు కొందరు నా ఆవేదన, విశ్వప్రేమను గ్రహించజాలని వారు నేను వారి మీద ఫిర్యాదులు జేయుచుంటి నని, నన్నే తప్పుగా తలచి నన్ను విమర్శించుట.

82 సంవత్సరములు వచ్చుచున్నను నా జీవితములో చాడీలు, కొండేలు ఇతరులమీద జెప్పుచు, ముఖ్యంగా ఆశ్రమ సేవజేయుచున్న వారి మీదనే జెప్పుచున్న నాకేమి ఫలితము. నాకీ మూఢులతో పైవారితో జెప్పిన వారు నాకు ఏమి తోడ్పడగలరు. నా ఈ 80 సంవత్సరముల జీవితము ఇతరులలో తప్పులు జూచుటకు, వారిమీద చాడీలు జెప్పుటకేనా అని నా జీవితంను విమర్శించుకొనుచు బాధపడుచుంటిని.

3. ఆశ్రమవాసులు కొందరు తెలివితక్కువచే, సోమరితనము స్వార్థ ముచే కొన్ని తప్పులు చేయుచు ఆశ్రమంకు కష్టనష్టములు గల్గించినప్పుడైనా ఎవ్వరైనా వారి తప్పులను తెలియపర్చిన తాచుపామువలె తిరుగబడుదురు. దైవము వారిని మాత్రమే ఏ తప్పులు లేకుండ పుట్టించెనా పొరబడుట మానవ స్వభావమని ఎంత త్వరలో తెలుసుకొన్న అంత వారికే మంచిది. పొరబడుట మానవ స్వభావము పొరపాటు తెలుసుకొనుట దైవస్వభావము.

4. నేనీవుదయం నా తొందరలో నన్ను సర్వముగా భావించి, ప్రేమించు చున్న ఓమీ తోక తొక్కితిని. అది అరవగా నా తప్పుకు చాల విచారించి వెంటనే ఓమీని తాకి దాని క్షమాపణను కోరగా కొంత తృప్తి మనస్సునకు

గలిగెను.

5. నోరులేని జంతువులకు, మనకిపాలిచ్చి తోడ్పడుచున్నవాటి శ్రేయస్సు, క్షేమమైనా చూడకుండుట కండ్లు వుండియు గుడ్డిగా వుండుట విచారకరము. చాలమంది ఆశ్రమవాసులై యుండియు వారు తినుచున్న అరటిపండ్లు వగైరాలు ఆవులకు దూడలకు పెట్టకుండ మట్టిలో పారవేయుట జూచుచుండ నా మనస్సునకు బాధగా వుండును.

6. పనియే ఆరాధన గావాలని నా పట్టుదలతో ఆశ్రమవాసులకు ముఖ్యముగా ఆశ్రమ గురుకుల బాల బాలికలకు శ్రమ గల్గించుచు ఆశ్రమ వృద్ధినే కోరుచు వారిచే పనులు చేయించుచుండుట.

7. నా జీవితములో 82 సంవత్సరములు వచ్చుచున్నను తిండి, ఆహారము విశ్రాంతి మరచి, తలచినపని పూర్తి జేయవలెనని ఒకే దృష్టిలో ఏకాగ్రతగా నేను నిద్ర ఆహారము విశ్రాంతి మరచి పనిజేయుచుందును. గాని అందరూ నావలెను పనిజేయవలెనని కోరుచూ, ఇతరులకు శ్రమగల్గించుట నా గొప్ప పొరపాటు.

8. దైవపరితాపనలేని స్వార్ధులను తమకొరకే జీవించుచున్న వారిని నామసంకీర్తనలో పాల్గొనమని, తమస్వార్ధమును మరచి స్పిరిట్యువల్ హీలింగ్ సెంటర్‌లో ఆధ్యాత్మికముగా రోగనివారణ జరుపు, ఇతరులకై ప్రార్ధనలు జేయుచున్న తావులో, ఆనందబాష్పములు కార్చెడివారకు, నామ సంకీర్తన జేయుచు, ఇతరులశ్రేయస్సు, రోగనివారణకై ప్రేమతో ప్రార్ధనలు చేయమని కోరుట నిర్భంధించుట నా జీవితములో మరొక గొప్పపొరపాటు.

9. క్షణమలను వ్యర్ధము జేయువారు జీవితమంతయు జేయుదురని జెప్పొచు, ఆశ్రమవాసులను, ఆశ్రమములో అడుగుపెట్టిన భక్తులందరినీ ప్రతీ అడుగునకు దైవనామస్మరణ జేయుమని నిర్భంధించుట మరొక్క పొరపాటు.

10. ఏమి చూసికాని, నిజానికని దైవములో అంతా రామమయం మని అని పాడుచుంటిమి గాన ఈ జగమంతలో దైవమును చూడవలెను. ఏది విన్నను దైవమాటలే, దైవము గురించియే మన నోరును దైవమును గురించి మాట్లాడుటకే తెరవవలెను. దైవమును గురించి మాట్లాడజాలని యెడల మౌనముగా యుండి ఇతరుల కాలమును మన కాలమును వ్యర్థము జేయరాదు.

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

20-2-75

8-00 ఎ.ఎమ్.

# 27. యాచన

యాచనవృత్తి అన్ని వృత్తులలో అధమాధమమైనది. యాచన దైవము పేరునైనను, ఆశ్రమం పేరునైనను యాచనయే. A begger is humiliated in world every where. ముష్టివానిని చూచి అందరూ అసహ్యించుకొందురు. ముష్టివారికి దూరముగా నుండుటకే ప్రవృత్తి పరులు కోరుచుందురట.

శాంతి ఆశ్రమము ప్రారంభించినది మొదలు ఈ అరవై సంవత్సరములు యాచనలో నా విలువైన జీవితమును వ్యర్థబుచ్చితిని అని యిప్పుడు విచారించుచుంటిని. పశ్చాత్తాపము ఆలస్యముగావచ్చెను. అలవాటు మానుటకుదుర్లభము. యిప్పటికిని 93వ సంవత్సరములోనున్నను ఆశ్రమమునకు అతిధులతో గురుకుల బాల బాలికలకు, బియ్యములేవని, వృద్ధులకు తిండిలేదని, రోగులకు మందులులేవని తలవని తలంపుగా చెప్పుచునే యుందును.

ఇంకను ఏ అవస్థలలోనైనను యాచనకు పోవరాదని నిశ్చయించుకొని ఫలితముగా నాకు తెలియకుండగనే కొన్ని సమయములలో యాచన ప్రారంభించి, దైవపనికి తోడ్పడి తరించమని భక్తులను కోరుచుందును. తర్వాత నా దుర్బలత్వమునకు విచారించుచుందును. నాకు 83 సంవత్సరములు శాంతి ఆశ్రమము వజ్రోత్సవము 21-1-77కి వచ్చుచున్నను ఆనందము, ఉత్సాహమునకు బదులు హృద యము బరువుగా నుండి మనస్సు కృంగిపోవుట విచారకరము. ఈ అంతు ఆదిలేని ఆశ్రమ అవస్థలకే 83 సంవత్సరాలకు బదులు 150 సంవత్సరముల వయస్సు వచ్చినట్లు బాధపడుచుందును. ఇంకా 20 సంవత్సరముల బాల వలె కాలుజారిపడుటచే చేతి కర్ర వాడుచుండుటనే నేడు చూచితిని. పండ్లు వూడిపోతున్నాయి. నడిచెడి శక్తితగ్గెను. నేత్రదృష్టియు తగ్గుచు కళ్ళజోడువాడ వలసి వచ్చుచున్నది. ఇదివరకువలె పరిగెత్త జాలకుంటిని, నడచుటకూడ శ్రమగానే యుండెను. అయినను శరీరము బలముగానేయుండి శరీరము మీదగాని, నుదుటమీదగాని ముడతలులేని ముఖవర్చస్సును యవ్వనముగానే

యుండుట దైవకృప. గాని మనస్సు మాత్రము ఆశ్రమ అవస్థలు తలచిన హృదయము బరువెక్కి బాధపడుచుండును. వృద్ధులకు, గురుకుల బాల బాలికలనీ తదితరమైన భక్తులను, అతిధులను పోషించుటకు వారమునకు వెయ్యి రూపాయలు తప్పనిసరిగా కావలెను. 2,3 రోజులకైన యెచ్చటనైనా రెండు రూపాయల చొప్పున బదులు తేగలము. చి.జ్ఞానేశ్వరి అవస్థలో బియ్యము తెచ్చుటకై ఆమె నిత్యము పొందుచున్న తాపత్రయము, శ్రీరాజాజీ, కె.ఎస్.ఆర్. మొదలైన ఆశ్రమవాసుల తాపత్రయములు చూచుచున్న నావల్లనే గదా, ఈ ఆశ్రమము స్థాపించుటచేతనే గదా ఇంతమంది భక్తులకు నేను కారకుడనై శ్రమగల్గించుచుంటినని బాధపడుచుందును. నేను వ్రాయుచున్న వ్రాతలు కొందరికి చదువుటకే బాధగా వుండును. కొందరు దాతలకు, దానకర్ణులకు ఆనందముకల్గించుగాన నా ఆంతర్య భావములను వారితో పంచుకొనుటకు కోరుచుంటిని.

సముద్రము ప్రార్థించుచున్న మా నూతనమైన మౌనాశ్రమము వుండుటలో ఒక మహాలోభి– నవకోటి నారాయణుడు వుండెను. ఈ నవకోటి నారాయణుడు ఒకరు వుండుట ఆశ్రమము దురదృష్టము. నవకోటి నారాయణుని జీవితము చాల ముఖ్యమైనది గాని ఆయన గురించి ప్రత్యేక ముగా వేరేగా వ్యాసమును వ్రాయుటకు కోరుచుంటిని.

మా శాంతి పాఠకులకు విసుగు కల్గించకుండా ముఖ్యమైన విషయాలు మాత్రమే వ్రాసి, యీ యాచన వ్యాసమును పూర్తిచేయుటకు కోరుచుంటిని.

ప్రారంభములో నా యాచన రోజులలో దేహి బిక్షాందేహి అని ఇంటింటికి తిరుగుచుండ ముఖ్యముగా ధనికులు కొందరు నిరాశ కల్గించగా కండ్లంట నీళ్ళు తిరిగిన రోజులు గూడ గలవు. యెన్నోసార్లు ఆత్మ స్వరూపులైయుండి గూడ బాల బాలికలు, వృద్ధులు అవస్థలోయున్నను దేహి యనెడి యాచన మాటలు, యీ నోటి నుండి యెన్నడును రానీయగూడ దని కృత నిశ్చయముజేసుకునియు, మరల మరల ఆశ్రమ అవస్థలచే యాచన చేయుటకు సిగ్గుపడెడివాడను. దగ్గరలోను, చుట్టుపట్లనున్న ఆశ్రమ భక్తులైన మా ధనికుల వుదారత్వముకు, ప్రేమ శూన్యమైన వారి హృదయ కాఠిన్యమును జూచినప్పుడెల్లను ఈ శాంతిఆశ్రమమును స్థాపించి వీరందకు

ఎందుకు విరామమే లేని శ్రమగల్గించుచుంటినని నేనే బాధపడుచుంటిని. ఇంక ఆశ్రమమును పోషించుచున్న దాతలకు, దానకర్ణులకు నాకృతజ్ఞత తెలుపకున్నచో వ్యాసము పూర్తికాదు. లక్నోలోను, హైదరాబాదులోను, బెంగుళూరులోను, మద్రాసు, బొంబాయి, వగైరా పట్టణములలో మహామహా భక్తులందరకూ నా కృతజ్ఞతలు అర్పించు చుంటిని.

మనవెంట వచ్చెడి దంతయు మనము ప్రేమతో చేసిన దానధర్మములే. ఇదియే మనము దైవ బ్యాంకులో స్వర్గములో దాచుకొనెడి శాశ్వతనిధి. యాచన అధోగతిని, నరకమునకు తీసుకొనివెళ్ళును. యాచన చేయువారి హస్తములు క్రిందనే చాచియుందురు. దానధర్మములు చేయువారి హస్తములు సదా మీదుగా వుండి ఇతరులకు తోడ్పడుటకు కోరుచుండును.

Blessed are the givers --- Cursed are the Beggers

GIVE - GIVE

A tiny giving to

the all danakarnas

who help to logest peace.

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

24-10-76

7-00 ఎ.ఎమ్.

# 28. శ్రీ గాంధీ మహాత్ములు

నేడే శ్రీ గాంధీజీ జన్మదినము. పరమ పావనమైనరోజు. వుదయమున తలుపు తీయగనే శ్రీ గాంధీజీ విగ్రహము నావైపు జూచుచున్నట్లు అయ్యెను. ఇంతియేగాదు, నా మహా ప్రపంచములో శ్రీ మహాత్ముడు, శరీరము విడిచే ముందు స్మరించుచున్న రామనామ మంత్రముగూడ వినదొడగెను. బ్రతికి నన్నాళ్ళు నీ భజన తప్పనుగాని మరణకాలమందు మరతునేమో అనెడి పద్యము జ్ఞప్తికి వచ్చి, బ్రతికి వుండగా మహాత్ముడు రాముని మరువకుండ ప్రతిక్షణములో స్వార్థరహితమైన సేవజేయుచుండెను. గాన మృత్యువులో గూడ దైవస్మరణయే జేయుచు శరీరమును వదలెనని తలచసాగితిని.

ఇక బ్రతికి యుండగానే దైవస్మరణ చేయజాలనివారి గతియేమి. జీవించియుండగా, బలముగా ఆరోగ్యముగా యున్నప్పుడు దైవస్మరణ చేయ జాలనివారు ఇక కఫవాత పైత్యములు, పక్షవాతము, తీవ్రమైన జ్వరమునే బాధపడచుండ ఇక దైవమునెటుల తలచగలరు? మృత్యువులోను, బాధలో గూడ దైవము ననుభవించుటకు సూక్ష్మమైన, దగ్గరయైన చక్కని రాజమార్గము ఇప్పుడు ఇచ్చటనే, ఈ క్షణము నుండియే దైవమును అనుభవించుటయే, క్షణములను వ్యర్థము జేయువారు జీవితమునంతను వ్యర్థము జేయుదురన్న సూక్తిలో యెంత మహత్తరమైన మానవజీవితములో సహకరించెడి గొప్ప భావన ఇమిడియున్నది. స్వార్థులను, సోమరులను జీవించియుండగా దైవ మును మరచెడి వారిని యమునివద్ద విడిచి మనమిప్పుడు శ్రీ గాంధీ మహాత్ముని ధ్యానించుచు ఆయన అడుగు జాడలలో నడచుటకు ప్రయత్నింతుము. నేటి వుదయమును శ్రీ మహాత్ముని దర్శించగనే నా మొదటి ఆలోచన ఈ క్రింది రీతిగా వచ్చెను. ఓ మహాత్మాజీ! నన్ను నీవలె జేయుము. నీవలె మనోవాక్కాయములతో నడచుటకు దీవించుము. యుగపురుషుడైన శ్రీమహాత్ముని జన్మదినము మనందరకు ముఖ్యముగా ఆశ్రమభక్తులకు, ఆశ్రమవాసులకు నూతనమైన శక్తిని దివ్య తేజస్సును, నిత్యశాంతినొసంగుగాక! శ్రీగాంధీ మహాత్మునికి ప్రీతికరమైన వైష్ణవజనతో అనెడి కీర్తనపాడుచు, శాంతిప్రార్థనను స్మరించుచు, ప్రణవగాన ముతో అందరిలో, అన్ని దిశలయందు శ్రీమహాత్ముని దివ్యసన్నిధినే అనుభ వించుచు ప్రణవగానముతో ముగించెదముగాక.

సర్వేషాం శాంతిర్భవతు సర్వేషాం పూర్ణంభవతు,సర్వేషాం మంగళం భవతు
2-10-62; 6-00 ఎ.ఎమ్.

# 29. కృతజ్ఞత

కృతజ్ఞతలేని జన్మలు భూభారములు. ప్రేమ యున్నచోటను కృతజ్ఞత యుండును. నివృత్తి పరులు సదా కృతజ్ఞతతో నిండియుందురు. ప్రవృత్తి పరులు అకృతజ్ఞతతో నిండియుందురు. ప్రేమలేని హృదయములు శ్మశాన మని ఆశ్రమములో వ్రాయబడియున్నది. శ్మశాన హృదయముతో జేయు పూజలన్నియు, జపధ్యానాదులు, యాత్రలు, నిరర్థకమేకదా! తామసులు, అకృతజ్ఞతతో నిండియుండి, ఉపకారము పొందియు అపకారమే జేయు చుందురు. రాజసులు ఉపకారమునకు ఉపకారము జేయుటకు ప్రయత్నించెదరు. ఇక సాత్వికులు, అపకారులకు గూడ ఉపకారమే జేయుచుందురు.

సాధు జనుల స్వభావము అమృతతుల్యముగా యుండును. తామసుల మూర్ఖుల స్వభావము విషతుల్యముగా యుండును. తేలు స్వభావము తేలుదే. ఆవు స్వభావము ఆవుదే. స్వభావములను బోధలచే, వుపన్యాసముచే మార్చజాలము కదా!

అకృతజ్ఞత, పట్టుదల, క్రోధము మొదలైన తామసగుణములతో నిండి యుండి, తమ తమ తప్పులను గ్రహించుటకు బదులు, తప్పు అంతా ఇతరులదే తామే తప్పును లేనివారమని తలచుటయేగాక, వాదించుచుండుట చాల విషాదకరమైన విషయము. అబద్ధమాడియు, దానిని తప్పిపుచ్చుటకు వంద అబద్ధములాడెడి వారిని జూసి భూదేవి దుఃఖించుచుండును. కృతజ్ఞత, ప్రేమతో నిండియున్న వారి జీవితములు నిరంతరము శాంతితోనిండి, ఆనందముగా యుండును. అకృతజ్ఞతతో నిండియున్నవారు తాము అధోగతి పాలగుటయే గాక, వారి దగ్గరను, చుట్టును యున్నవారిని గూడ వారికి తెలియకుండగనే అధోగతి పాలు జేయుచుందురు. అకృతా పిశాచము చాల క్రూరమైనది. దానికి ఎంత దూరముగా యున్న అంత శాంతయుతముగా యుండును.

కృతజ్ఞతగలవారి జీవితములు దేవతా జీవితములని జెప్పదగును.

సువాసనగల పుష్పములు యెటుల వాటి సహజమైన సుగంధమును అన్ని వైపుల వెదజల్లుచుండునో, అటులనే వారినుండి ప్రేమ,కరుణ, కృతజ్ఞత, అందరివైపుకును స్నేహితులు, బంధువులు, విరోధులు సన్నిహితులు, దూరస్థులు, అనెడి వివక్షత లేకుండగనే వారి ప్రేమ నలువైపులా పొర్లి పారుచుండును.

ఈ మధ్యను ఆర్థికశాఖామంత్రి ఆశ్రమమునకు వచ్చినపుడు జనకాశ్రమములో భవనములకు శంకుస్థాపన చేసిరి. వృద్ధుల గృహము గూడ తెరచిరి. వారి సతీమణి సావిత్రీదేవి మైత్రేయి ఆశ్రమములో భవనము నకు శంకుస్థాపన జేసిరి. మైత్రేయి ఆశ్రమస్థాపనని జూచి ఎంతోమంది భక్తులు ఆనందించుచుంటిరి. శ్రీ ప్రభాకర్‌జీ, శ్రీ విశ్వనాధంగారు మొదలైన దేశనాయకులు అనేకమంది స్త్రీలు గూడ మైత్రేయి ఆశ్రమము ప్రారంభించి నందుకు, దాని భావివృద్ధిని కొనియాడుచుండిరి.

అచ్చట నీరు లేనందున ఇంకను ఏకట్టడమలు, ఏపని చేయుటకును వీలులేకుండెను. మైత్రేయి ఆశ్రమములో చి.సుగుణావతి, బావికి ప్రారంభో త్సవమునకు చాలమంది భక్తులు సమక్షమున ప్రార్థన, భజనలతో చేసెను. అప్పటినుండియు ఆ బావిని తవ్వుచునే యుండిరి. 4,5నిలువులలో నీరు పడునని తలంచితిమి. ఎన్ని ప్రార్థనలు చేసినను కొండవారను, యెత్తైన ప్రదేశములో 4,5 నిలువులకే నీరుపడునా! నిర్వాణాశ్రమములోయున్న బావి 12 నిలువులకు నీరుపడినదనిరిగాన పట్టుదలతో దైవమును నమ్మి, ఓపికతో రోజూ కొత్తబావిని తవ్వుచునే యుండిరి. అందులో కప్పలు,చాల కనిపించుటచే కప్పలున్నచోట నీరు తప్పక పుట్టునని కొంత తృప్తిని పడితిమి.

నుయ్యి అంతా రాయితో నిండియుండెను. మొన్ననే శ్రీ ప్రభాకర్‌జీ వచ్చి, జనకాశ్రమ స్థాపనజూచి చాల ఆనందించి బావిదగ్గరకు వెళ్ళి ఇంకొక్క గజము తవ్విన నీరుపడునని జెప్పిరి. వారు జెప్పినట్లే వారి జ్యోతిష్యము ఫలించినట్లు మరునాడే నీరు గానవచ్చెను. ఇక ఆశ్రమవాసుల, నూతి పనివారల ఆనందమును నెటుల వర్ణింతును. నావద్దకు ఒక్క చెంబుడు జలమును తీసుకొనిరాగా ఆ నీరున్న చిన్న కుండలను కృతజ్ఞతతో పోయించితిని. కరుణామయుడైన దైవము యొక్క అఖండ ప్రేమకు ఆశీర్వాద ములకు ఆశ్చర్యము చెందుచు మైత్రేయి ఆశ్రమములో బావికై భక్తులొసగిన

ధనము సద్వినియోగమై జలమను జూస్తిమిగదా అని నా నేత్రములు అశ్రు పూరితములై, ప్రేమ నిధియైన దైవమునకు నిరుపేదలేమి ఇవ్వగలరు.

ఈ శుభవార్త వినగానే, ఆ జలమును జూడగానే కృపామయుడైన దైవమునకు నోటితో మాటలతో అర్పించుటకు ఏమియు లేక తలవని తలంపుగా కృతజ్ఞత అనే రెండు ఆనందబాష్పములురాగా వాటినే సర్వాంత ర్యామి, సర్వజ్ఞుడు, శక్తిమయుడైన ఆదైవలలామునికి, అర్పించి కృతజ్ఞతతో తృప్తిని బడసితిని. నా బీదమనసును, ప్రేమతో అందుకొన్న కృపామయునకు ధన్యవాదములు.

దైవ ప్రేరితముగా స్థాపింపబడిన మైత్రేయి ఆశ్రమము మహిళలంద రకు, ఆదర్శనీయమైన ఆశ్రమముగా యుండి నూతనశక్తిని ఆనందమును, ఉత్తేజమును కల్గించుచు దేశవృద్ధికి లోకశాంతికి మార్గదర్శిగా యుండుగాక.

లోకాస్సమస్తా సుఖినోభవంతు

8–1–65

6–00 ఎ.ఎమ్.

# ౩౦. గోవిందా, గోవిందా, గోవిందా

(శ్రీరామ, శ్రీ క్రీస్తు విగ్రహముల ప్రతిష్టదినము)

అది ఆదివారము జూలై 19వ తారీకు పరమ మహాపావనమైన చిరస్మరణీయమైన దినము.

శ్రీ సరస్వతీ దేవిగారి వీణాగానముతో చక్కనైన కృతులు, భజనపాటలు, భక్తుల ఉపన్యాసములతో ఆనాటి ప్రార్థన పూర్తి అయ్యెను. హాలు అంతయు దగ్గరనుండి, దూరమునుండి వచ్చిన సందర్శకులతో నింపబడియుండెను. రఘుపతి రాఘవ,శాంతి ప్రార్థనలతో, చివరను ప్రసాదములు పంచిపెట్ట బడెను.

అటు పిమ్మట రెండు గంటలకు శ్రీరామచంద్రుని, విగ్రహప్రతిష్ఠ, శ్రీక్రీస్తు ప్రభువు విగ్రహ ప్రతిష్ఠ రెండున్నర గంటలకు జేయుటకు నిశ్చయింప బడెను. రెండుగంటల సమయమున గోవిందా, గోవిందా, గోవిందా అనెడి శబ్దములు దూరముగా యేకరువుగా స్మరింపబడుచు, మిన్నుముట్టుచున్నట్టు వినిపించసాగెను. దగ్గరకు వచ్చిన కొలదీ, ఆ పవిత్రమైన శబ్దము స్పష్టముగా వినిపించసాగను. ఈ గోవిందా శబ్దము యెచ్చటనుండి, యెందుకు వచ్చు చున్నదని విమర్శించగా, ఆశ్రమ వాసులు, పనివాండ్రు, శ్రీరామచంద్రుని, శ్రీ క్రీస్తు ప్రభువుని జీవితసైజు విగ్రహములను క్రింద ఆశ్రమమునుండి శ్రీకైలాసగిరికి, తీసుకొనివచ్చుచుండిరి. అరమైలు నాలుగు ఫర్లాంగుల దూరమైనను, ఆ బరువైన విగ్రహములను, మోయవలసియుండెను. అవి చాల బరువుగా వుండుటచేతను హరేరామ గోవిందా గోవిందా అనెడి శబ్దము చేయుచూ చాల ఆయాసముగా వచ్చుచుండెను.

మొదట శ్రీరామచంద్రుని తీసుకొని వచ్చితిరి. క్రీస్తు ప్రభువు విగ్రహము మరియు బరువుగా వుండుటచే, గోవిందా గోవిందా శబ్దములు మిన్ను ముట్టుచుండెను. ఎట్టకేలకు విగ్రహములను వాటి గమ్యస్థానమునకు ప్రతిష్ట చేయుతావుకు అతికష్టముమీద గోవిందా గోవిందా ఉచ్చారణతో జేర్చబడెను. అదొక మరచిపోవుద మన్నను మరువజాలని, హృదయరంజకమైన ఆహ్లాద కరమైన స్వర్గతుల్యమైన దృశ్యము. కైలాసగిరి అంతయు భక్తులతో సందర్శ

కులతో పనివాండ్రుతో ముఖ్యముగా గురుకుల బాల బాలికలతో నిండి యుండెను. దైవ వుద్యానవనములో పుష్పచెట్లువలె పచ్చని దుస్తుల గురుకుల బాల బాలికలందరూ కైలాసగిరి అంతయునిండి, హరేరామ మంత్రమును స్మరించుచు, ప్రణవమును గానము చేయుచు, అప్పుడప్పుడు వారుగూడా ఉత్సాహముతో గోవిందా గోవిందా యని స్మరించుచుండిరి.

మనస్సు వెర్రి ఆలోచనలు తలవని తలంపుగా జేయుచుండునుగదా! ఇప్పుడు నేను వ్రాయవలసిన ముఖ్య అంశమును వ్రాయవలసియున్నది. ఈ గోవిందా ఉచ్ఛారణ నాకు వినిపించుచుండ అది శ్రీరామచంద్రునికి, శ్రీ క్రీస్తు ప్రభువుకు వినిపించుచున్నదా! యీ నిరంతర నామస్మరణ, ఆ అవతార మూర్తులకు తోడ్పడుచున్నదా, లేక వుచ్చరించుచున్న వారికి తోడ్పడు చున్నదా అని నా మనస్సు విమర్శించదొడగెను. మానవులు ముఖ్యముగా భక్తులు చనిపోయినప్పుడు వారి మృతకళేబరములను స్మశానవాటికనకు తీసుకొని వెళ్ళునపుడు గూడ, గోవిందా గోవిందా అని స్మరించుచునే, చనిపోయినవారిని, దైవనామస్మరణతో తీసుకొని వెళ్ళుచుందురు. ఇది చిరకాలము నుండి వచ్చుచున్న ఆచారమైయున్నది.

ఈ గోవిందా శబ్దము ఆ విగ్రహములకు వినిపించుచున్నదా అని ఆలోచించగా, జడమైన ఆ సిమ్మెంటు విగ్రహములకు వినిపించుటలేదని తోచెను. స్మరించుచున్న భక్తులకేమైనా తోడ్పడుచున్నదా అని తర్కించగా, ఆ క్షణములో మోయజాలని ఆ బరువును మోయుటలో కొంత శ్రమకల్గు చున్నట్లు తోచసాగెను. గోవిందా గోవిందా స్మరణతో నూతనశక్తివచ్చి, విగ్రహ ములబరువు కూడ తగ్గి రెండు అడుగులు ముందుకు వేయుచుండిరి. ఇరువది మందికిపైగా వాటిని భుజాల వేసుకొని అతికష్టము మీద గోవిందా గోవిందా గోవిందా అనుచు మోయుచుండిరి. వారి అవస్థలో దైవనామమైన గోవిందా శబ్దమే తోడ్పడుచుండెను.

విచిత్రముగా హస్యాస్పదముగా తోచినను ఒక్కతరి నేత్రములు మూయ గనే, శ్రీరామచంద్రుని, క్రీస్తు ప్రభువు విగ్రహములు మరుగై ఓంకారుని శరీరము గోవిందా గోవిందా గోవిందా ఉచ్ఛారణతో భజనలతో తీసుకొని వెళ్ళుచున్నట్లుగా గాంచితిని. ఆ విగ్రహములకు, యీ గోవిందా శబ్దము

వినబడజాలనట్లు నాకు గూడ వినబడదుగదా అని తలచితిని. శరీరముండ గనే కామక్రోధాల కారణమై తోడ్పడునుగాని శరీరమునుండి ప్రాణము పోయిన తర్వాత మహామంత్రములు, కామలోభాలు పోతాయి. వారెవరమో కారణాలు చనిపోయిన వారికి అంత తోడ్పడజాలవుగదా అని విచారించ సాగితిని.

జీవించి వుండగా, బొందెలో ప్రాణములుండగా, ఎంత ప్రాధేయ పడినను, నీకు పుష్పము నిచ్చుటకు వెనుదీసిన వారు గూడ, చనిపోయిన తర్వాత గోవిందా గోవిందా శబ్దము మిన్ను ముట్టెత్తు లాగున అరుచుచు బండ్ల కొలది పుష్పములను అర్పించుటకు కోరుచుందురు. ఈ అర్పణలు, సేవలు, సహాయము సానుభూతులన్నియు బ్రతికివుండగా చేయవలెనుగాని చనిపోయిన తర్వాత చేసిన ఏమిలాభము. జడమైన ఆ విగ్రహములు యీ గోవిందా శబ్దమును యెటుల వినజాలవో అటులనే మృతిజెందిన జీవిగూడ అంతగా బ్రతికి వున్నప్పుడువలె వినజాలడు గదా అని చింతించితిని.

మరల కన్ను తెరవగనే అంధకారము నుండి వెలుగునకు వచ్చినట్లు కైలాసపర్వతమంతయు భక్తులైన స్త్రీ పురుషులు, ఆశ్రమవాసులు, సందర్శ కులు, అమాయకులైన గురుకుల బాలబాలికలలో నింపబడి కళకళలాడు చుండెను. గోవిందా గోవిందా శబ్దము ఆకాశమును చేరుచుండెను.

అతికష్టము మీద గోవింద నామ వుచ్చారణలో రెండు విగ్రహములను ప్రతిష్టచేయు తావులకు జేర్చబడెను. వాటిని ముందుగా కట్టబడిన యెత్తు యైన దిమ్మల మీదకు ఎక్కించి నిలువబెట్టుట ఒకపెద్ద సమస్యగా యుండెను. మరల భక్తులు, బాలబాలికలు గోవిందా గోవిందా శబ్దమును మిన్ను మిట్టు లాగున అరచుచు ఎట్టకేలకు, ఒక్కొక్క విగ్రహమును వున్నతమై వాటి స్థాన ములకు, దిమ్మల మీదకు, తీసినిలువబెట్టి, ఒక కొత్త వస్త్రముతో ఒక్కొక్క దానిని కప్పివుంచిరి. అప్పుడు శ్రీరామచంద్రుని విగ్రహమును, శ్రీ జమీందారిణి శ్రీమతి సరస్వతిగారు భక్తి ప్రపత్తులతో ఆశ్రమవృద్ధిని, లోకశాంతిని కోరుతూ, అచ్చట సమావేశమైన భక్తవరేణ్యులందరూ ప్రణవగానము చేయుచుండగ శ్రీరామచంద్రుని విగ్రహమును ఆవిష్కరణజేసిరి. అటుపిమ్మట స్విట్జర్లాండు నుండి వచ్చిన సోదరి శాంతిదేవి

క్రీస్తు విగ్రహమును గోవిందా గోవిందా స్మరణములు చేయుచుండ ఆవిష్కరణము చేసిరి. నేను దగ్గరకు వెళ్ళుటకు, ఇంకను నడచుటకు కొండ ఎక్కుటకు వీలులేనందున డాక్టర్లు అనుజ్ఞనీయనందున అచ్చట సోహం తపోవనములో అమర్చబడిన వూయ లలో సోహంను స్మరించుచు, అచ్చటనే కూర్చొని, పరవశత్వములో ఆ చిరస్మరణీయమైన దైవదృశ్యమును గాంచుచుంటిని. సోదరి శాంతిదేవి స్విట్జర్లాండు సోదరి చాలఫోటోలు విగ్రహములకు, ఆ రోజు వచ్చిన భక్తు లందరి సమావేశములను వారి ప్రార్థన, భజన, ధ్యానాదులను తీసిరి.

ఇటుల ఆదివారము, విగ్రహప్రతిష్ఠ జయప్రదముగా ముగించబడినను, ఇంకను ఆ పరమపావనమైన, స్వర్గదృశ్యములన్నియు, ఇంకను నా కళ్ళ యందు కట్టబడుటచే నాకు ఆనందము నిప్పటికిని ఇచ్చుచున్నవి. గోవిందుని నామములో యున్న అఖండమైన గూఢార్థమును చెవులున్నవారు విన వచ్చును. కళ్ళున్న వారెవరైనను ఆ ఆదివారం రోజుననే కాకుండ ప్రతీ రోజును గాంచుచు తరించవచ్చును.

గోవిందా! గోవిందా! గోవిందా!

శరీరం వుండగనే, శరీరములో నుండి బైటకు వచ్చి యీ శరీరమును గోవిందా గోవిందా అని భక్తులు భజనలతో మోసుకొని పోవుచుండ, విలక్షణ ముగా సాక్షి స్వరూపముగా, దూరముగా యుండి జూచుచుండుట అపు రూపమైన ఆనందమును, స్వాతంత్రతను గలిగించెను. చనిపోయిన తర్వాత గోవిందా అనెడి వారికంటె జీవించియుండగా గోవిందా గోవిందా అని స్మరించుచున్న అట్టి స్మరణ జీవించియున్నవారికి, చనిపోయిన వారికి గూడ తోడ్పడునని ఆలోచించసాగితిని. బ్రతికినన్నాళ్ళు నీ భజన తప్పునుగాని, మరణకాలమున మరచదనేమో అని ఒక భక్తుడు గీర్తించివుండెను. చావులో మృత్యువులో చనిపోయినను నామస్మరణను, వదలను అనెడి భక్తుల జీవితములు పావనమైనవేగాక ఆదర్శమైనవి.

గోవిందుడు శాంతిపాఠకుల కందరినీ శాంతితో బ్రోచునుగాక!

లోకాస్సమస్తా సుఖినోభవంతు; ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

23-7-64

# 31. మర్కట మార్జాల న్యాయము

(కోతిపిల్ల–పిల్లి పిల్ల తీరు)

డెబ్బదవ జన్మదినము వెళ్లెను. డెబ్బదివకటవ జన్మదినము ప్రారంభించెను. ఈ డెబ్బది సంవత్సరములలో నేను నేర్చుకొన్నది యేమి? దగ్గర దగ్గర యేబది సంవత్సరములు దైవసేవజేసి, శాంతి ఆశ్రమమును ప్రాక్ పశ్చిమ దేశములలోయున్న భక్తవరేణ్యులకు, దైవబిడ్డలకు అర్పించితిని. తల్లి తండ్రులు తమ తమ లోకమును వీడేముందు కొందరు బిడ్డలకై ఒక గృహమును కట్టించి ఇవ్వగల్గిన, ధన ధాన్యములను విరివిగా ఇవ్వజాలకున్నను, వారి బిడ్డలు నివసించుటకు శాశ్వతమైన గృహమును కట్టించి ఇచ్చితిమిగదా అని యెంతయో ఆనందించెదరు. అటులనే లోకములో యున్న నా బిడ్డలందరకూ, దైవకార్యములకు, దైవారాధకులకు దైవచిహ్నములకు Children of God - Images of God యీ శాంతి ఆశ్రమమును రెండువందల ఎకరముల పరిమితి గల్గిన దానిని అనేకమైన బావులు, కుటీరములు, భవనములలో సన్యాసులకే గాక, బ్రహ్మచారులకు, గృహస్థులకు, వానప్రస్థులకు గూడ ప్రత్యేకమైన యేర్పాట్లు చేసి యివ్వగల్గితినని నాలో నేనెంతయో తృప్తిపడుచుంటిని. నా అంతట నేను గడ్డిపరకనైనను కదుపజాలనప్పుడు యీవిశాలమైన పనులన్నియు మనము యెటుల చేయగల్గితిమి? నేను ఏమియు చేయలేదు. ఆతడే వీడి ద్వారా సర్వమును జేసెను. గాన ఆకృపామయునికే ధన్యవాదములు.

వాన ప్రస్తులకు జనకాశ్రమము, స్త్రీలకు మైత్రేయి ఆశ్రమము, గృహస్థులకు అతిథి భవనములు, సన్యాసులకు కుటీరములు, బ్రహ్మచారులకు గురుకుల వసతులు విద్యాలయములు, వృద్ధులకు వృద్ధగృహములు, శాంతి పిపాసకులకు శాంతి ముద్రాలయములు, రోగులకు ఆసుపత్రులు మొదలైనవి జూచి నామనస్సెంతయో ఆనందించును. ఆ దైవానుగ్రహమునకు నిరంతరము కృతజ్ఞతాభివందనములర్పించు చుందును.

ఏ శాంతి బజారులో ఎంత ధనమున్నకైనను కొనుటకు దొరకదో ఆ శాంతిని దైవభక్తులందరూ, శాంతి పిపాసకులు వుచితముగా శాంతి ఆశ్రమ

మునందు పొందవచ్చును. ఇదియే మానవకోటికి, దైవపరితాపనముతో నిండియున్న భక్తులకు, జాతిమత దేశ వివక్షత లేకుండగా నేను అర్పించినవా Legacy, నా ప్రేమార్పణయై యున్నది.

శాంతి ఆశ్రమము నాకండగా యున్నచో మీకును అండగానేయున్నది. ఇది దైవపరితాపనలో నిండియున్న వారి స్వంత సొత్తుయై, జ్ఞానధనమై యున్నది. మహారాజుయైనను, యోగీశ్వరులైనను దైవపరితాపన లేనియెడల స్వార్థముతో నిండియున్న వానికి ఆశ్రమములో అడుగుపెట్టుటకు హక్కులేదు. అట్టి స్వార్థులకు అహంకారులకు శాంతి ఆశ్రమము తోడ్పడ జాలదు. ఇక దగ్గరవారైనను, దూరమువారైనను, తెలిసినవారు, తెలియని వారు, నిరుపేదలైనవారికి, స్వార్థరహితులైన సాధుపుంగవులకు శాంతి ఆశ్రమమే స్వంతగృహమైయున్నది. వ్యక్తుల శాంతియే దేశవృద్ధి లోకశాంతి గాన మీరంతా శాంతిలో నిండియుండుటయే నా శాంతి. మీతరింపే నా తరింపుగాన, మా శాంతి పాఠకులారా, భక్తవరేణ్యులారా! మీ శాంతి ఆశ్రమ మును తీరికయున్నప్పుడైనను దర్శించుచు, దీపము ఆరిపోవకుండగనే గమ్యస్థానము చేరుడు తరించుడు. మీరు తరించి మీ మీద అనుకొన్న వారందరినీ నామము చెప్పని మీ బిడ్డలును గూడ దైవమును చేరుటకు, దుర్లభమైన మానవజన్మ యొక్క గమ్యస్థానమును, శాంతిని పొందుటకు తోడ్పడుడు. నేడే మనది, రేపు మనదిగాదుగాన మనము చేయవలసిన మంచిని ఆధ్యాత్మ జీవితం నేడే ప్రారంభించి తరించెదరుగాక. మన జీవితములు లోకమునకు మకుటముగా యుండిన శాంతియుతముగా యుండి లోక కళ్యాణమునకు తోడ్పడునుగాక.

ఇప్పుడు, మర్కట మార్జాలముల వద్దకు వచ్చి, వాటి రీతులను వివరించుదము. కోతి పిల్ల దాని తల్లిగర్భమునే పట్టుకొనుట మీరు యెక్కడైనా జూచియుందురా? తల్లిని గట్టిగా పట్టుకొనియుండ కోతి, చెట్లు యెక్కుచు, పరుగెత్తుచు, కొమ్మ నుండి మరొక కొమ్మకు దూకుచుండును. ఎంతపరి గెత్తినా, ఎంతదుమికినా కోతిపిల్ల తన తల్లిని గట్టిగా పట్టుకొని యుండు వరకు దానికేమియు భయములేదు. అటులనే పిల్లవాడు స్తంభమును పట్టుకొని యెంతగా తిరిగినను ఎంతమాత్రము భీతివుండదు. ఆ పట్టు

తప్పిన, స్తంభము నుండి చేయి తీసిన, బాలుడు క్రిందపడి దెబ్బలుతినును. అటులనే కోతిపిల్ల తన తల్లిని వదలివేసిన మరణమే ప్రాప్తమవును. గాన, తన ప్రాణములు కాపాడు కొనుటకు గట్టిగా తల్లిని పట్టుకొని యుండును. మార్కండేయుడు పసివాడయినను తన ప్రాణములను యముని నుండి కాపాడుకొనుటకే శివలింగమును పట్టుకొని యుండెను. అటులనే మా శాంతి ఆశ్రమము అవస్థలలో పనిపాట్లలో యీ యేబది సంవత్సరముల నుండియు, మర్కటన్యాయముగా కోతిపిల్ల తనతల్లి గర్భమును గట్టిగా పట్టుకొనినట్లే, నేను గూడ దైవమును పట్టుకొని,యీ అల్పమైనసేవను మానవకళ్యాణమునకై జేయగల్గితిని.

మరపులో తల్లిని వదలినప్పుడు, దైవమును మరచినప్పుడు అనేకము లైనసార్లు అవస్థలుపడి, దెబ్బలు తినియుంటిని. మరచినప్పుడెల్లను దైవమును జ్ఞప్తికి తెచ్చుకొనుట, పడినప్పుడెల్లను మరలలేచి దైవమును పట్టుకొనుచు దైవకృపచే కేవలము నిర్హేతుకముగ ఈస్థితిని జగత్పతినిచేరి శాంతి ధామమును మీ అందరకు శాంతినిచ్చుటకు, మీకు అర్పించగల్గితిని గదా అని గర్వించుచుంటిని.

తల్లితండ్రులు తమబిడ్డలకు విద్యాబుద్ధులు నేర్పి, నూతన గృహములను కట్టి జీవితాదాయమునకై ఎంతో ధనధాన్యములను కొంత యేర్పర్చిన వారు యెటుల తృప్తిని ఆనందమును పొందుచుందురో అటులనే నేను గూడ, కోతి పిల్లవలె దైవమును పట్టుకొని, మీ అందరి వృద్ధికి యీ ఆశ్రమము ద్వారా ఇచ్చుటకే మీకు అర్పించుట నీకెంత ఆనందముగా యున్నదో, యీ చిన్న మాటలలో వ్రాయజాలను.

ప్రియమైన ఆత్మ సోదరీ సోదరస్వరూపములారా! శాంతి ఆశ్రమమును దర్శించి, శాంతినిపొంది, మీరు తరించుటయేగాక, మీతోటి సోదరీ సోదరు లందరను, దగ్గరవున్న వారిని, దూరములోయున్న వారిని, పాతవారిని, కొత్తవారిని, సన్నిహితులను, పరాయివారనుకొను విదేశీయులను అందరిని మీ స్వంతముగా భావించి, ప్రేమించుచు మీరు తరించెదరుగాక! **పరోపకారార్థం ఇదం శరీరమ్.** అనెడి ధర్మ సూత్రము మీ జీవితములో ఆధారముగా

అహరహమును గమ్యస్థానముగా జేసుకొని మీరు తరించి, అందరి తరపున కృషిచేయుచు దినదినాభివృద్ధిని గాంచెదరుగాక!

మర్కటపు న్యాయములో కోతిపిల్ల రీతిని ఇంతవరకు వినియుంటిమి. ఇప్పుడు పిల్లిపిల్ల మార్జాలపు స్థితిని వివరించుతాను. పిల్లి తన పిల్లలని నోటితో కరచుకొని పరుగెత్తుట మీలో చాలమంది జూచియే యుందురు. కోతిపిల్లవలె పిల్లిపిల్ల తనతల్లి గర్భమును, కడుపును గట్టిగాపట్టుకొన నవసరము లేదు. ఆ స్థితిదాటిపోయెను. అటులనే డెబ్బదివ జన్మదినములో నా కోతిపిల్ల స్థితి మర్కట న్యాయము ముగిసినట్లు ఆనందించుచుంటిని. 21, జనవరి 1965 సంవత్సరములో నా జీవితములో మార్జాలన్యాయము పిల్లి పిల్ల స్థితి. దాని తీరు ప్రారంభించెనని ఆనందించుచు సర్వము దైవా ధీనముజేసి తృప్తిపొందుచుంటిని.

ఈ స్థితిలో నాకు జడభరతుడు జ్ఞప్తికి వచ్చుచుండును. అతడు పల్లకీ మోయమన్నను, చేనువద్ద కాపలా పెట్టిననూ కాళికాదేవి గుడిలో తనను బలి వేయుటకై తీసుకొని వెళ్ళినను, ఒకేరీతిగా, చిరునవ్వుతో, శీతోష్ణము లలో, సుఖదుఃఖములలో, నిందాస్తుతులలో సమముగానే యుండును. ఇదివరలో, అనగా మర్కట న్యాయముగా మున్నప్పుడు ఎవరైనను ప్రవృత్తి పరులు, స్వార్థులు ఆశ్రమమునకు అసూయచే హాని గల్గించుచుండిన, నిందించుచు, బాధపడుచు ఆశ్రమమును కాపాడుటకే ప్రయత్నించుచుండెడివాడను. ఇప్పుడు మార్జాలస్థితిలో హాని గల్గెంచెడివారిని, అసూయాపరులను, స్వార్థులను దైవమునకే అర్పించి నేను పిల్లి పిల్లవలె, దైవమునే పూర్తిగా నమ్మి యుండుటకు ప్రయత్నించుచుంటిని.

మర్కటపు రీతి కొంత సులభమేగాని, మార్జాలపు తీరు Narrow and rugged in the path that leads to heaven. స్వర్గమునకు వెళ్ళెడివారి, ఇరుకుగా రాళ్ళు, రప్పలు ముళ్ళతో నిండి యుండును. మార్జాలపు స్థితి పదునుగానున్న కత్తిధారు మీద నడచుట వంటిది. It is like walking on the Sharp edge of a rajor blade. మార్జాలపుస్థితి, సులభమైనను, కఠినమైనను, అదియే మన గమ్యస్థానము.

ఈరోజులలో తరచు నిమీలిత నేత్రుండనై మైత్రీయి ఆశ్రమములో సూర్యోదయమును వీక్షించుచు ధ్యానము చేయుచుండ, నేను చిన్నపిల్లి పిల్లనని, ఆ సర్వాంతర్యామి, సర్వవ్యాపియైన దైవము నోటిలో గట్టిగా పట్టుబడియుంటినని తృప్తిని చెందుచుందును. సోహం తపోవనములో, ఉయ్యాలలో కూర్చొని, సోహం ధ్యానము చేయుచుండ మాతృస్వరూపమైన మార్జాలము నోటిలో గట్టిగా కరవబడి తీసుకొనబడిన పిల్లి పిల్లననే భావనలో తన్మయత్వము పొందుచుందును.

డబ్బదవ జన్మదినము వరకు కోతిపిల్లల రీతిగా దైవమును పట్టుకొని యుంటిని. డబ్బదవ జన్మదినము దాటిన తరువాతను మాతృస్వరూపులైన నా తల్లియు తండ్రియు గురువును నా సర్వముగా యున్న ఆ పరంధాము నునే సర్వముగా జేసుకొని, సర్వము నా భావిస్థితి ఆశ్రమవృద్ధియు ఆయనకే అర్పించి తృప్తుడనైయుంటిని. ఆశ్రమములు, ఆశ్రమ ఆస్తులన్నియు ఇదివరకే భక్తవరేణ్యులకు Relinqishment deed ద్వారా వదలిపెట్టియే యుంటిని. అప్పటినుండియు ఎంతో స్వతంత్రునిగా జీవించుచుంటిని. ఈ ద్వంద్వ ప్రపంచములో ఎట్టివారికైనను జీవితమే ఒక గొప్ప కఠినమైన పరీక్ష. దైవభక్తులకే కష్టములు మెండు అని పెద్దలు జెప్పుచుందురు. ప్రహ్లాదుడు ఎదుర్కొన్న పరీక్షలు చూడుడు. క్రీస్తు ప్రభువు శిలువకు వేయబడిన క్రూర స్థితిని జ్ఞప్తికి తెచ్చు కొనుడు. మీరాబాయి, సక్కుబాయి వగైరా భక్తుల కఠిన పరీక్షలు మన దినచర్యలో, మన జీవితములలో గొప్ప గుణపాఠములై దైవసన్నిధికి దగ్గర మార్గమును జూపుచున్నవి. అక్కడవుండే పాండురంగడు ఇచ్చట కూడ వుండెను. స్వర్గములో యున్న దైవమే, నాలో మనలో గూడ కోతిపిల్ల, పిల్లిపిల్ల ఆకారములోనే గాక, మానవ ఆకారములో గూడ విలసిల్లుచుండెను. ఇందుగలడందులేడని సందేహమువలదు, ఎందెందు వెదకిజూచిన అందందే గలడని ప్రహ్లాదుడు చూపెను. ఇంకను, ఇప్పుడును కీర్తించుచుండెను. చెవులున్నవారు వినవచ్చును కళ్ళు యున్నవారు భగవంతుని సర్వములో గాంచవచ్చును.

Having eyes see ye not

Having ears hear ye not

చీమలో దోమలో స్వార్థునిలోని స్వార్థపరులలో, అపకారులలో ఉపకారిలో సర్వములో, కిందను మీదను, చుట్టునూ అంతటా అతడే. **అంతా రామమయం బీజగమంతా రామమయం.** కన్నుమూసిన రామమయము, కన్ను తెరచినా కృష్ణమయం.

ఈ ప్రాతఃకాల సమయమున నేను దైవము యొక్క నోటిలో పిల్లిపిల్ల తన తల్లి నోటిలో గట్టిగా పట్టుకొనబడినట్లు దైవప్రేమను అనుభవించుచు యీ వ్యాసమును వ్రాయుచుండ దూరమునుండి పిపీహాపక్షి వ్యూకహ వ్యూకహ ప్రభువెక్కడ, ప్రభువెక్కడ అని పాడుచున్నది. ప్రియమైన శాంతి పాఠకా, నా ప్రభువెచ్చట వుండెను. నా ప్రభువు–దైవము గుళ్ళలో గోపురములలో దూరముగా, అన్యముగా భిన్నముగాలేరు.

## నీవే ప్రభువు

ఏ దైవమునకై ఇంతకాలమూ, మర్కట రీతిగా చివరకు మార్జాల న్యాయము రీతిగా, అనేకమైన, సులభమైన, కఠినమైన పరీక్షలకు లోనై, అగాధమైన యీ సంసారసాగరమహాసముద్రమునీదుచు, దానినుండి యీ శాంతి ముత్యమును శాంతి ప్రార్థనను నీ శాంతియై అప్పగించు చుంటిని. ఇదియే నాకు బ్రహ్మానందము. చూడవలసినవి చూచితిని, తెలుసుకొనవలసినవి తెలుసుకొంటిని. మర్కట, మార్జాల న్యాయమును గ్రహించితిని. నాస్తికించన చిన్మాత్రా సన్నకేలనన చిన్మాత్ర తప్ప మరెద్దియు లేదుగాన యెప్పుడును, యెచ్చటను అది అద్వితీయముగాన నీవే నా సర్వాత్మ స్వరూపుడవు. లెమ్ము నీ నిద్ర నుండియే మేల్కొనుము. ఆ డెబ్బదివ జన్మదినము జ్ఞాపకార్థముగా, నీవు గూడ భయభ్రాంతులతో నిండియున్న పాత జీవితమును పూడ్చివేసి, నూతనశక్తితో విశ్వప్రేమ, నిరంతరశాంతిని గ్రోలుచు, నీవు అనుభవించుచు, నీవుతరించి, మానవకోటి తరించుటకు అమూల్యమయిన నీ జీవితమును అర్పించు. లోకశాంతికి, మానవ కళ్యాణమునకు తోడ్పెదరుగాక! వ్యూకహ, ప్రభువెక్కడ, ప్రభువెక్కడ ఆర్తనాదము

విన వచ్చుచున్నది. ఇక ప్రభువును వెతకనేల? నీవే ప్రభువువని చెప్పియుంటిని గదా!

శాంతి ప్రార్ధన ఓం ప్రభువునకు ప్రభువా నీకు ధన్యవాదములు.

లోకాస్సమస్తా సుఖినోభవంతు

**అర్పణ :**

**లోకశాంతిని కోరు శాంతి పాఠకుల రూపముగానున్న ప్రభువునకు ప్రేమ పూర్వకమైన అర్పణ.**

సర్వేజనా స్సుఖినోభవంతు

24-2-65

5-00 ఎ.ఎమ్

# 32. ప్రకృతి రాజుగారు

1965, 21 జనవరి జన్మదినము జ్ఞాపకార్థముగా శాంతి ప్రకృతి చికిత్సాలయమును, శాంతి ఆశ్రమములో శ్రీ వెప్పా సూర్యనారాయణ శ్రీ చో॥ వెంకట్రావు, మొదలైన ప్రకృతి అభిమానులు డాక్టర్లు సహాయముతో పూజ్యశ్రీ రామానంద తీర్థజీ, ప్రబోధానందగిరి, శ్రీనిత్యానందపురి మొదలైన స్వాములు, తత్వవేత్తలు వైద్యులు సహాయముతో స్థాపింపబడుట చాలా ఆనందము.

దైవకృపచే అప్పటి నుండియు శాంతి చికిత్సాలయము చక్కనైన సేవను, నిరంతరాయముగా, నిత్యము చేయుచునే యున్నది. ఆశ్రమం అదృష్టముచే స్వార్థరహితులైన, భక్త శిరోమణులు వంటి, శ్రీ సత్యనారాయణ రాజుగారు ఈ నూతన చికిత్సాలయము సేవచేయుచు, ఆశ్రమ వృద్ధికి తోడ్పడుటకు వారు ఇచ్చుటను సర్వానుకూలంగా ప్రకృతి చికిత్సాలయ ట్రస్టు డైరెక్టర్లు శ్రీ ప్రభాకర్‌జీ డాక్టర్లు వెంపటి సూర్యనారాయణ గారి చేతనే ఇక్కడకు పంపబడిరి.

శ్రీ రాజుగారు అనుభవనీయులైన ప్రకృతి వైద్యులు గావున ప్రకృతి చికిత్స గురించి చక్కనైన బోధ ఒక్కరూ చేయగలరు. ఆసనము లన్నియు వేయగలరు. యోగ క్రియలన్నియు చేయగలరు. వారే స్వయముగా అన్నిరీతులుగా రోగులకు, బాల బాలికలకు రాత్రింబగళ్ళు సేవచేయుచు నూతన శాంతి ప్రకృతి చికిత్సాలయమునకు అనేక విధములుగా తోడ్పడు చుందురు.

జీర్ణించిన రోగములకు ముఖ్యకారణము పరిమితిలేకుండగా విషతుల్య మైన మందులను సదా వాడుచుండుటయే. ఎన్నిమందులు ఎక్కువగా నిత్యముగా వాడియున్న రోగాలుకూడ అంతకంతకుగా పరిణమించును. ప్రకృతి వైద్యము ఆధ్యాత్మిక జీవితమునకు పునాదివంటిదియే గాక కృపామయుడైన దైవము ఇంతకాలమునకు అన్నిరీతులుగా,ఆధ్యాత్మిక సేవను జేయుచున్న శ్రమించు ఆశ్రమమునకు సరియైన, గట్టిపునాది ఇప్పటికి వేయగలిగినందున నా చిరకాల ఆశయము నెరవేరినదని,

నేనెంతయో తృప్తిని ఆనందమును పొందుదును. నిర్హేతుకమైన కృపామయుడు, కటాక్షియైన దైవమునకు, ఆయన అనుంగుబిడ్డలై ప్రకృతిసేవ చేయుచున్న శ్రీ ప్రభాకర్‌జీ, శ్రీ డాక్టరు చేకూరు వెంకట్రావుగారు, శ్రీ చైతన్యానందస్వామి శ్రీ మూర్తిరాజుగారు మొదలైన ప్రకృతి అభిమానులందరకు నా కృతజ్ఞతావందనములు. శ్రీ డాక్టరు వెంకట్రావుగారు జన్మదినము రోజున శాంతి ప్రకృతి చికిత్సాలయం మును ప్రారంభించుటయేగాక వారు రాలేనప్పుడు, అనగా శ్రీ సత్యనారా యణ రాజుగారు వచ్చినపుడు ప్రకృతి సంబంధమైన పనిముట్లను తొట్టెలను ఎనిమాకేన్స్ మొదలైన పరికరములన్నియు పంపిరి.

గురుకుల బాలబాలికలకు, ఆశ్రమపనివారికేగాక, ఆశ్రమమునకు నిత్యము వచ్చెడి సందర్శకులకి గూడ ఏ మాత్రము జలుబుగా, సుస్తీగా యున్నను శ్రీ ప్రకృతి రాజుగారు వెంటనే చికిత్స నిచ్చుచు వారి బాధలను తగ్గించుచున్నారు. పిల్లలు బాలబాలికలు మర్కటముల లాంటివారని జెప్ప బడునుగాన, వారు శ్రీ సత్యనారాయణ రాజుగారిని ప్రకృతిరాజుగారని పిలుచుటకు బదులు ఎనిమా రాజుగారని నామకరణముచేసి, పిలుచుండ నేను కారణమడుగగా ఆ బాలబాలికలు శ్రీరాజుగారు ప్రతిజబ్బునకు ఎట్టిదైనా కడుపునొప్పి, కాలునొప్పి ఏ జబ్బుయైనను వారి చికిత్స ఎనిమాతోనే ప్రారంభించెదరు. రోజూ ఎనిమా యిచ్చుచు బాధను తగ్గించి ఉపశమనము కలిగించుచుండెదరు గాన వారికి స్వభావముగా ఎనిమా రాజుగారని పేరుతో పిలువబడుతున్నారని విని ఆశ్చర్యముకన్న తృప్తిని పొందితిని.

శ్రీ రాజుగారు మర్దనాలు చేయుటలో గూడనిపుణులు. కొంతమంది బాలురు కడుపునొప్పి మొదలైన జబ్బులతో బాధపడుచుండ వెంటనే వారి క్రియలను చేయుచు ఎన్నోరీతులలో తోడ్పడుతుండిరి. చాలామంది బాలురకు మర్దనా అవగానే ఎనిమా ఇచ్చిన పిదప ఏటికపాములు పడిపోయి ఇప్పుడు ఆరోగ్యముగా వుండిరి.

సర్వజ్ఞుడైన దైవము, ఎప్పుడెప్పుడు, ఎవ్వర్వెరిని ఎప్పుడవసరమై యున్నదో అచ్చటకు పంపును. ఆశ్రమమున ఆయన కృపయేగాక ప్రకృతి రాజుగారి అఖండమైన, నిరాడంబరమైన, అనుభవనీయమైన స్వార్థరహిత మైన సేవచే శ్రీశాంతి, ప్రకృతి చికిత్సాలయములు దినదినాభివృద్ధిని

గాంచునుగాక.

ఆశ్రమము నివాసులైన మా ప్రకృతి అభిమానులందరకు దైవము ఆయురారోగ్యములతో, నిత్య శాంతితో, నిరంతరము బ్రోచునుగాక.

లోకాస్సమస్తా సుఖినోభవంతు

## 33.ఉచితము

మంచి ముత్యములు బంగారపు హారములు ఉచితము.

ప్రశ్న : ఎవ్వరికి ఉచితము?

జవాబు : సంకల్ప రహితులకు, ఏ కోరిక లేనివారికి ఉచితము.

ఈ ఎనుబది సంవత్సరముల వయసులో ఈ జన్మదినమునకు, ఏ భక్తులో ముత్యాలహారము అర్పించేరు. మొన్నటి జన్మదినము, మూడు రోజులైన తర్వాత ఆశ్రమవాసులైన, కంటికిరెప్పవలె, సదా యీ శరీరమునకు సేవజేయుచున్న చిరంజీవి జ్ఞానేశ్వరి, చి॥శాంతి ఆనందముతోవచ్చి స్వామీజీ మీకు అర్పించిన జన్మదినపుకానుకలు, పుష్పమాలలన్నింటిలో, ఒక బంగారముతో తాపడము చేయబడిన కట్టబడిన మంచిముత్యముల హారమున్నదని జెప్పిరి. ఆ హారమును జూచి, నేను ఆశ్చర్యపడి ఏ భక్తురాలు, ఆ విలువైన హారమును అర్పించెనోయని, ఆమె శ్రేయస్సును కోరుచు ప్రతీ ముత్యమునకు ప్రణవమును స్మరించుచు, ఆ మాలను తిప్పుచు హారమును చి.జ్ఞానేశ్వరికే ఇచ్చితిని. ఈ విలువైన ముత్యాలహారమును ఏమి చేయుదును?

నేను బంగారమును తాకనుగదా! ఇంతియేగాక అమూల్యమైన శాంతి ముత్యములు నా హృదయములోనే యున్నవి. గాన ఇంక యీ బాహ్య గాజుముత్యములు నాకెటుల తోడ్పడును. ఏమహాభక్తురాలు గొప్ప త్యాగ ముతో, భక్తి ప్రేమలతో నా80వ జన్మదినమున ప్రేమపూర్వకముగా అర్పించెనో ఆమెకే, దానిని సద్వినియోగము జేయుటకు అర్పించమని

కోరితిని. ఏ కారణముచేతనైనను ప్రేమపూర్వకముగా ఆమె అర్పించిన దానిని మరల తీసుకొనుటకు అంగీకరించని యెడల నొక్కింతయొడు స్వార్థ రహితులైన భక్తులకు, ఏ కోర్కెయులేని మహాజ్ఞానులకు యీ విలువైన బంగారు తాడుతో కట్టబడిన మంచిముత్యముల హారమును ఉచితముగా అర్పించవలెనని అంతర్య సంకల్పము గల్గుటచే యీ అవగాహనమును నా ఆంతర్య భావమును వ్రాయుచుంటిని.

దూరముగా యున్నను, దగ్గరగాయున్నను, తెలిసిన వారైనను, తెలియని వారైనను, కొత్తభక్తులైనను పాతభక్తులైనను దేశ,జాతి,మత,కుల,వివక్షత లేకుండా మీ అందరునూ ఉచితముగా యీ ముత్యాల హారమును బడయుటకు ఆహ్వానము. దీనిని పొందుటకు ఒక్కటే  నియమము గలదు. అది సంకల్పములు లేనివారే. ఏ కోర్కెలు లేనివారే, అమృత తుల్యమైన దైవ బిడ్డలారా, ఆత్మసోదరీ, సోదర స్వరూపములారా! మీ అందరకు ప్రేమ పూర్వకమైన ఆహ్వానము. శాంతి ఆశ్రమము పంపుచున్నది.

కొన్ని రోజులు శాంతిగా, ప్రార్థన ధ్యానాదులలో గడుపుతూ, ఏ కోరికయు లేని, అన్ని కోర్కెలను జయించిన,సంకల్ప రహితులైన అదృష్ట వంతులు యీ అమూల్యమైన మంచిముత్యములహారము స్వీకరించి, శాంతిని బడయ గోరెదరు. బ్రహ్మ సాక్షాత్కరమునుబడసి, నిత్యశాంతిని అనుభవించుచు, ఆ శాంతిని లోకములో దైవ బిడ్డలందరిలో చూచుకొనుట ఎంత అదృష్టము.

సదా లోకశాంతిని మీ అందరి అభివృద్ధిని కోరుచున్న

మీ ఓంకార్

లోకాసమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# 34. కైలాసములో

కైలాసములో యుండుట ఎంత అదృష్టము. ఈ అర్ధరాత్రిలో, ఏకాంతముగా, ఒంటరిగా వుండి, నా ఆంతర్యభావనలను శాంతిపాఠకుల వృద్ధిని కోరుచు వ్రాయుటకు కోరుచుంటిని.

ఈ శరీరము కైలాసములోయున్నను, మరే లోకములోయున్నను, నిరంతరము శాంతిపాఠకులు, ఆశ్రమ భక్తులందరి వృద్ధి నే సదా కోరుచుందును.

ప్రియమైన శాంతిపాఠకురాలా! మీకు కైలాసమునకు రావాలెనని లేదా? నా ఆనందము నేనొక్కడనే కైలాసములో యుండుటలో లేదు. మీ అందరినీ కైలాసమునకు ఆహ్వానించి, మీ కాలమును దైవపరితాపనలో గడుపుచు మీరంతా తరించుటలోనే యున్నది.

గాన కైలాసమునకు రండు. కైలాసమునకు వచ్చుటయు అంత సులభము కాదు. కైలాసదారి ముళ్ళు రాళ్ళు రప్పలతో చాలా యిరుకుగా యుండును. అయినను ఖరీదు ఇచ్చినవారికే వస్తువు దొరుకును.

కైలాసములో నేను ఏకాకిగా లేను. సముద్రము నాతో కలసి ప్రార్థన చేయుచున్నది. ప్రతికెరటము తన ప్రార్థనయే. సముద్రమును చూచినప్పుడెల్లను **సముద్రము ప్రార్థించుచున్నది, నీవేల ప్రార్థించవు** అనెడి మహాసూక్తియే జ్ఞప్తికి వచ్చుచుండును. కైలాసములో మరొక్కమంచి సూక్తి యున్నది. **ఓ మానవుడా, నీ సృష్టికర్తనేల మరచితివి.** నా పెద్ద గదిలో, నా హృదయమున సన్నిహితమైన సూక్తి మరొక్కటి నావైపు సదా జూచుచుండును. స్వామి చనిపోయెను.మీ అందరిలో ఓంకారము జీవించుచుండెను. మాతృస్థానములో తోటపల్లి ఆశ్రమంలో మరొక్క ఆశయము నా హృదయమును ఆకర్షించుచుండును. దానిని కూడ నా పాఠకులు స్మరించుచు వృద్ధి అయ్యెదరని ఇచ్చట వ్రాయుటకు కోరుచుంటిని. **కాలమనెడి సర్పము మృత్యువు అనెడి నోటిని తెరచి స్వార్థులను, సోమరులను మ్రింగివేయుచున్నది.**

ప్రియమైన పాఠకులారా! లెండు, మేల్కొనుడు. రానున్న జన్మదిన జ్ఞాపకార్థమైను ప్రణవమును మీ భక్త హృదయములో గుర్తించుడు. తరించుడు, తరించుట కిదియే సమయము వృద్ధి చెందుటకు కైలాసము మిమ్ము ఆహ్వానించుచున్నది. ఇంకను తడవేల? నేడే మనది. రేపు మనది గాదు. మనము చేయనున్న మంచిపనిని నేడే జేసి తరించెదముగాక! మానవ జన్మయొక్క గమ్యస్థానము. తరింపేగదా! మీకు తరించవలెనని లేదా? దీపము ఆరిపోవకుండ గమ్యస్థానము చేరవలెనని లేదా! **మతేగతి.** నిమీలిత నేత్రులై ఒక్క నిమిషము మీ మనస్సు ఎటుల పరుగెత్తుచున్నదో పరీక్షించుకొనుడు. ప్రవృత్తి విషయవాసనల వైపు పరుగెత్తుచున్న అధోగతి పాలవుచున్నది. నివృత్తిగా కైలాసమువైపు వచ్చుచున్న దుర్లభమైన మానవ జన్మయొక్క గమ్యస్థానమును మోక్షమును పొందుచున్నది.

మానవ మాతృలందరూ నన్ను కైలాసమును దైవమును వదలిపెట్టినను సముద్రము దాని వేలానువేల కెరటములు నన్ను వదలిపెట్టలేదు. అహర్నిశములు నాతో కలసి అవిగూడ ప్రార్థనలు జేయుచునే యున్నవి. ఆకశము వైపు శిరస్సునెత్తి చూడుడు. అల్పజ్ఞులైన మానవులందరూ కైలాసమును, నన్ను వదలిపెట్టినను నక్షత్రములు కోటానుకోట్ల, నక్షత్రములు మేము నీతోనే యుంటిమని, ఓదార్చుచు, ధైర్యమును నిచ్చుచున్నవి. ఈగాలి మలయ మారుతము, సూర్యరశ్మి, బడారామి, ఛోటా రామి పశుపక్ష్యాది జంతువులు కీటకములు, చెట్లు, పర్వతములు, పుష్పములు, పృథ్వి ప్రతీ అణువును “ఓ బిడ్డా అధైర్యపడకుము, వెర్రిమానవులు నిన్ను మరచినను, కైలాసమును వదలినను, మేమందరమూ నీతోనేయుంటిమి. ధైర్యముగా, ఆనందముగా యుండుము'' అని ధైర్యమును, నూతనమైనశక్తి నందించుచున్నవి. అన్నిటి కంటెను తక్కువేమి మనకు కైలాసములో రాముడొక్కడుండు వరకు అని అంతరాత్మ సదా కీర్తించుచున్నది.

మొన్నటి దినమున సూర్యరశ్మిలో రాళ్ళగుట్టమీద కూర్చొని, మూడువైపులా సముద్రమును గాంచును, నాల్గవవైపున పర్వతశ్రేణులను వీక్షించుచు, ప్రకృతి సౌందర్యమును జూచుచు ఆనందించుచు కైలాసములో ఒకవైపున అమెరికా సోదరి ఎండలో కూర్చుని, స్వీయచరిత్ర

అధ్యాయములను ఆనందముగా టైపు చేయుచుండెను. మరొకవైపున సూరయ్య అనే సాధువు సద్గంధ్రములను పారాయణ చేయుచుండెను. ఇద్దరు బాల బ్రహ్మచారులు ఆంజనేయులు, వేంకటేశ్వర్లు అనెడి నామధేయములు గల్గినవారు ఓం శ్రీరామ! జయరాం జయజయరామ అనుచు పాడుచు రోడ్డుమీద కుప్పలు, రాళ్ళు తీయుచు కైలాసమును మీ అందరకు ఉపయోగపడేలాగున శుభ్రముగా చేయుచుండిరి. రామీలుగూడ, చెంతనేవుండినా రెండువైపులా కూర్చుని ప్రవృత్తి పరులను, కైలాసమునకు రానివ్వము అన్నట్లు జూచుచున్నవి. స్వర్గమన్న ఎచ్చట యున్నది. ఎచ్చటనైనా స్వర్గమున్న యెడల అది కైలాసములో యున్నది.

# 35. మాయ

మాయను తెలుసుకొనుట చాల కష్టము. మాయను తెలుసుకొనుటే కష్టమైన దానిని జయించుట ఎంత దుర్లభమో వర్ణించి చెప్పజాలము.

స్వప్నములోయుండ, ఇది స్వప్నమని గ్రహింపజాలనట్లు మాయచే బంధింపబడిన మనుజుడు యిది మాయయని గ్రహింపజాలడు.

అటులనే, మాయను అతిక్రమించినవారే, దానిని జయించినవారే మాయను తెలుసుకొనగలరు.

మాయను, కొంతవరకైనను గ్రహించుటకు, కొన్ని ఉదాహరణలను, శాస్త్రములనుండియు, మన జీవితములలో అనుభవముల నుండియు తీసికొని పరీక్షించిన, కొంతవరకు మాయ అవగాహన అవ్వవచ్చును.

సర్వసంగ పరిత్యాగముచేసిన ఒక సన్యాసినో, యోగినో తీసుకుందాము ప్రపంచమంతయు మాయ, దైవమే సత్యమని ప్రప్రథమున, ప్రపంచమును సన్యసించును, నెమ్మదిగా కొందరు శిష్యులను చేరదీయును. శిష్యులే గురువును, చేరెదరనుకుందాము. వారికి ఉపదేశములిచ్చుచు, బోధలు జేయుచు వారి కష్టసుఖములతో బంధింపడి లేనిపోని కొత్త తాపత్రయము లను తెచ్చిపెట్టుకొనును.

శిష్యుల కోరికననుసరించి, లోకసంగ్రహార్థణకై నెమ్మదిగా ఒక ఆశ్రమ మును స్థాపింపజేయుదురు. ఈ కొత్త ఆశ్రమ పోషణార్థమై ధనము అవసరమైనప్పుడు, కొందరు శిష్యులు తప్పుకొందురు. అనగా, దూరముగా వుందురు. వారికి ఉన్న అనేకమైన పనుల తొందర్లలో ఆశ్రమంకు వచ్చుటకు తీరికవుండదు. గురువుగారు ఆశ్రమ వృద్ధిపేరున యాచనకై, వెళ్ళిన వారికి మాట్లాడుటకు గూడ తీరిక వుండదు. అప్పుడు గురువుగారు కొత్త శిష్యులకై వెదకుట ప్రారంభించును. స్థాపించిన ఆశ్రమమును, ఎటుల ఏదోఒక గట్టు యెక్కించకుండా, వదలివేయును! పడరాని అవస్థలు పడుచు, రాత్రింబగళు ళ్ళ పట్టరాని వారి కాళ్ళు అన్నియుపట్టుచు, అనేకమైన భక్తుల గృహము లక వెళ్ళి యాచనజేయును. యెటులనో తన శిష్యుల ప్రేరణచే లోకోద్ధరణకై

స్థాపితమైన ఆశ్రమమును నిలువబెట్టును.

అచ్చుటితో కర్మ పరిపక్వమవ్వని యెడల, మరికొన్ని శాఖలను తన ఆశ్రమంను స్థాపించి వాటిని వృద్ధిజేయుటలో మరల పడరాని అవస్థలు పడుచుండును.

ఇదియే మాయగదా! మొదటిలో లేవు. లేనివానిని కల్పించి వాటికై నిత్యమును మరచి, అనిత్యములో, తాపత్రయములతో కృశించుచుండుట కంటే వేరే మాయ యెచ్చుట వున్నది? “కౌపీన సంరక్షణార్థం అయం పటాటోపః” అనెడి, కథయొక్క యధార్థస్థితి యీ మాయనే విపులముగా తెలియజేయుచున్నది.

అతడు ప్రారంభమున, స్వాతంత్ర్యమైన జీవితమును, శాంతిగా గడుపుచున్న సాధువు. తన కౌపీనమును ఎలుకలు తీసుకొనిపోవుచున్నవని, ఎలుకల బాధ తగ్గించుకొనుటకై, పిల్లిని పెంచెను. ఆ పిల్లికి పాలు పోయుటకై ఆవును చేరదీసెను. ఆ ఆవుకు గడ్డికై, వ్యవసాయమును ప్రారంభించెను. వ్యవసాయములో తనకు తోడ్పడుటకై పాలేరులు, వారి కుటుంబములు వారందరు నివసించుటకు ధనధాన్యములు నిలవచేయుటకు యిండ్లు, భవనములు కట్టబడెను.

ఆహా! చిన్న కౌపీనము, గుడ్డపీలిక యెంత మాయను తెచ్చిపెట్టెను. చదువుటకు, విచిత్రముగా తోచినను, గడచిన రాత్రియే ఒక యెలుక నా కౌపీనమును,కొరికివేయుటకు బదులు, పూర్తిగా దానిని తీసుకొనేపోయెను. కౌపీనమునకు, యెలుకకు ఒక నమస్కారముపెట్టి లోకాస్సమస్తా సుఖినో భవంతు అని స్మరించుచు తృప్తి బడసితిని.

మరియొక ఉదాహరణను తీసుకుందాము. ఒక బాలుడు చిన్నతనములో చాలా భక్తి వైరాగ్యములతో నిండియుండెడివాడు. బంధువులందరు పెండ్లిజేసిన, ఈ భక్తివైరాగ్యమునెడి జబ్బుకుదురునని నిర్బంధించి స్వేచ్ఛగా వున్న ఆ బాలునికి వివాహముజేసిరి. పెండ్లితో తాపత్రయములు ప్రారంభించెను. వ్యవహారముజేయుటకు దిగెను. దైవకృపవల్ల లాభము హెచ్చుగా రాదొడగెను. ఒక వ్యవహారమునుండి మరొక వ్యవహారము,

యిటుల పది పన్నెండు రీతులైన, వ్యవహారములను ప్రారంభించి సరిగా వేళకు తిండియైన తినకుండ స్వయంకృషిచే రెండు మూడు లక్షలు సంపాదించగలిగెను. దీనితో యేడు, యెన్మండుగురు పిల్లలను గూడ దైవమొసంగెను.

ఇందులో కొందర చనిపోవుచుండ యేడ్చుట, కొత్తగా పుట్టుచున్నప్పుడు నవ్వుట జీవించియున్నవారికి, చదువులు వారికి మరల పెండ్లిండ్లు, తాపత్రయములో, సంసార సముద్రములోపడి జీవించుచుండెను.

ఈ అవస్థలు చాలవా అన్నట్లు కొత్త వ్యవహారములలో నష్టము కలుగ సాగెను. తాను నమ్మినవారు మోసము జేయదొడగిరి. తానుకట్టిన గాలిమేడ లన్నియు ఒక్కొక్కటి పడిపోవసాగెను. ఇంట్లో భార్య విచారము, వీధిలో భర్తరోదన. ఇక పిల్లలకు సరియైన తిండి సంరక్షణలేక వాళ్ళు వాళ్ళ అవస్థలు. అవస్థలలో జబ్బులు వృద్ధియై మనస్సును పీడించుచుండెను. అనాధరక్షకుడైన దీనబాంధవుడైన దైవమే తన బిడ్డలనందరను సదా కాపాడుచు మాయాతీతు లుగా జేయుగాక!

ఆహా! మాయ అనగా నిదియేకదా! మొదటిలో భార్యలేదు, పిల్లలు లేరు, వ్యాపారములేదు. ఏక నిరంజునినిగా, స్వాతంత్ర్యముతో శాంతిగా జీవించుచున్న జీవికి యెన్ని అవస్థలు మాయ తెచ్చిపెట్టెను.

దైవమే సత్యము, నిత్యము. మానవ జన్మకు గమ్యస్థానమని, తెలిసి యున్న జ్ఞానము కలిగిన తల్లితండ్రులుగూడ, తమబిడ్డలకు నిత్యమైన సత్యమైన మానవజన్మ హక్కుయైన దైవత్వమును గల్గించుటలో తోడ్పడుటకు బదులు, తల్లితండ్రులు గూడ, మాయచే ఆక్రమింపబడి, తాము ప్రేమించే తమ కన్నబిడ్డలను చేతులార సంసార సాగర మహాసముద్రములో, ముంచి వేయుటకు తోడ్పడుటేకాక, త్రోసివేయుచుండుట చాలా విచారకరమైన విషయము.

ఈ వలలో బంధింపబడిన కోటానుకోట్ల మత్స్యములను పెద్దవాటిని, చిన్నవాటిని మెరయుచున్న వాటిని, రంగు రంగులలో వున్నవాటిని గాంచుడు. గానీ, ఇప్పుడు మనము ముఖ్యముగా గ్రహించవలసినది యెద్ది

అనగా ఈ కోటాను కోట్ల మత్స్యములలో మనము జూచుచుండగనే, మన కండ్లముందే, అదృష్టము చేసికొనియున్న ఏ ఒక్క మత్స్యమో మాయవల నుండి బయటపడి ఆనంద సముద్రమును చేరుచున్నది. ప్రియమైన పాఠకా! నీవు మాయ నుండి విముక్తిపొందిన ఆ మత్స్యమువలె వుండగోరెదవా లేక కోటాను కోట్ల బంధింపబడిన మత్స్యములవలె, మాయవలలో చిక్కంబడియే జీవించుచూ ప్రాణములను వదలెదవా? లెమ్ము! మేల్కొనుము, మాయనతిక్రమించుము. ఏలనన నీవు మాయాతీతమైన కోటిసూర్య ప్రకాశ మానమైన దివ్యతేజస్సే నీ జన్మహక్కు. నీ నేత్రములను తెరచుటకిదియే సమయము. ఏలనన ఈ క్షణమే మనది.

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

కైలాసము

8–8–1952

# 36. చిర జీవితము

ప్రతీ మనుజునకు చాలకాలము జీవించవలెననియే వుండును. ఎవ్వరికిని త్వరగా చనిపోవవలెనని యుండదు. ఎంత అవస్థలలో యున్న వానికైనను, వెంటనే చనిపోవవలెనని యుండదు. గాని అవస్థలచే బాధలు పడజాలక “ఓ దైవమా చావు ఎప్పుడు వచ్చును, ఎంతలో తీసుకొని పోయెదవు” అని పెదవులతో మాత్రము వుచ్చరించుచుండును. ఎన్ని అవస్థలు, బాధలు వున్నవాడైనను, అవస్థలు, బాధలు పోవుటకు కోరునుగాని, చావును కోరడు. తెలియక కోరినను, చావుకు మాత్రము తాను సిద్ధముగా వుండడు.

దీనికి వుదాహరణగా ఒక ముసలి మనుజుడు బరువైన పుల్లల మోపును మోయుచు ఎండలోచాల డస్సియుండి, ఒక్కచోటను కూర్చుని, ఓ యముడా, నన్నెప్పుడు తీసుకొనిపోయెదవురా అని విరక్తిచే అనెను. వెంటనే యమధర్మ రాజు ప్రత్యక్షమయ్యేనట. మన ముసలివాడు గజగజవణకుచు నీవెవ్వడవు బాబూ ఎందుకు వచ్చితివని అడిగెను. అప్పుడా యముడు యిప్పుడేగదా, నీవు నన్ను రమ్మనమని తీసుకొని పొమ్మనమని కోరితివి, అనగా నా తండ్రీ నిన్ను యీ బరువైన పుల్లలమోపును, నా నెత్తిమీద ఎత్తుటకు పిలిచితిని అని చెప్పెనట.

దీనిని బట్టి జీవితము, అందరకును, అంత తీపిగా వుండును. ఎవ్వరును మృత్యువును కోరరని తేలుచున్నది. గాని మనుజుడు, అవివేకియై తెలిసియో తెలియకో చిర జీవితమును పెదవులతో మాత్రము కోరుచు, తన మనస్సుతో త్వరితముగా చనిపోయెడి పనులనే, సదా జేయుచుండుట హాస్యాస్పదము, విచారకరమైన విషయము.

ఉదాహరణగా, ఒక మనుజుడు చెన్నపట్నం వెళ్ళెదనని జెప్పుచు, అచ్చటకు వెళ్ళుటకు ప్రయాణమై చెన్నపట్నమునకు టిక్కెట్టు గూడ తీసి కలకత్తా వెళ్ళెడి రైలులో కూర్చుని ప్రయాణము జేయుచున్న అట్టివాని, బుద్ధికుశలతను ఏమని అనవచ్చును.

అటులనే పామరత్వముతో నిండియున్న మనుజుడేగాక చదువరియైన అన్నియు తెలిసియున్న మనుజుడు గూడ చిరజీవితమును, బాహ్యమునకు కోరుచు తాను చేసెడి పనులు, ఆలోచనలన్నియు త్వరలో మృత్యువాతను బడుటకే జేయుచుండెను.

మనము కొన్ని ఉదాహరణలను, మన నిత్యజీవితము నుండియే దినచర్య నుండియే తీసుకొని పరిశీలించిన యీ సమస్య యింకను, బాగుగా బోధపడగలదు.

ప్రతీ మనుజునకు ఆహారము తిండి ముఖ్యావసరముగాన, దానిని ముందు తీసుకుందాము.

**ఆహారము:** సాత్వికమైన ఆహారము, ఆరోగ్యమును చిరజీవితము నిచ్చునని తెలుసును. తెలిసియుండియు, మనుజుడు తాను తినెడి కృత్రిమమైన, తామస, రాజస ఆహారములను పరీక్షించుడు.

ఆహారము నియమముగా, తినవలెనని, ఆకలిలేనప్పుడు, అవేల తినగూడదని గూడ తెలుసును. అయినను, ఆకలివున్నను, లేకున్నను మూడు వేళలయందు నియమముగా కడుపునిండేవరకు, జిహ్వాచాపల్యము చేతనైన నేమి, యితరుల నిర్బంధనచేతనైన నేమి రోజూ అనవసరమైనను తినుట మాత్రము మానడు. తన్నుప్రేమించువారి వెర్రి ప్రేమ యెట్టిదోగాని, అతి తిండివల్ల అనారోగ్యత, త్వరితముగా మృత్యువాతపడుట తప్పదని యెరింగియు, తిను తిను నాయనా అనుచు తరిమి తరిమి వడ్డించుచుందురు. ఒక్కపూట అజీర్తిచే, కుమారుడు తిండి మానివేసిన, తల్లిగూడ తనయునితో ఉపవాసము జేయును. ఇట్టి అవస్థలలో ఒక్కరు అజీర్తిచే బాధపడుట, మరియొకరు ఆకలిచే కృశించుట జరుగుచున్నది.

జిహ్వను జయించినవాడు లోకమును జయించునట గాన అతి తిండి నిర్బంధముచేతనైనను తినకుండుట, ఆకలివేసే వరకు తినకుండుట, నియమముగా, సాత్వికమైన ఆహారమును ఏకాదశి, ద్వాదశి రోజులలోనే గాక, ప్రతిరోజును స్వీకరించుట, చిరజీవితమునకు పునాదిగా, ఆధారముగా

యుండును.

**మాటలు :** ఉదయము లేచినది మొదలు పరుండే వరకు సామాన్య మనుజుడు, ప్రసంగించే మాటలు పరీక్షించుడు. ఇందు అవసరమైన మాటలెన్ని అనవసరమైన మాటలు యెన్ని యితరులకు బాధ కల్గించెడివెన్ని? అమాయకులను నిందించుచు, నిందారోపణలు జేసెడి మాటలెన్ని?

మాటలవల్లగూడ, యెంతయోశక్తి పోవుచున్నదని విజ్ఞులు (సైంటిస్టులు) జెప్పుచుండిరి. గాన ప్రతీమాట, మాట్లాడేముందు, యీ మాటవల్ల యితరులకు సహాయంగా వుండునా, అని ఆలోచించుకొని మరీ మాట్లాడిన నూటికి, తొంబది మాటలు పొల్లుమాటలగానే యుండును. దుర్లభమైన మానవ జీవితము ఉదయము నుండి పరుండెడివరకు, పుట్టినప్పటికి నుండి చనిపోయేవరకు డబ్బావలె వాగుటకే యివ్వలేదు. గావున ఓ మనుజుడా మేల్కొనుము. జిహ్వనేగాక నీవాక్కునుగూడ జయించిన నీవు లోకమును జయింగలవు. ఇక ఆలోచనలను విమర్శిద్దాము.

**ఆలోచనలు :** మనుజుడు ఆలోచనల సముదాయము. ఆలోచనల ముద్దయే. ఏ ఆలోచనలు లేని మనుజుడు, సంకల్పరాహిత్యుడు జీవన్ముక్తుడే. ఇంక విశ్రాంతిలేని ఆలోచనలలో నిండియున్నవాడో అతడు జీవన్మృతుడని చెప్పవలసియున్నది. స్వార్థపు ఆలోచనలతో నిండియున్నవాడు, యితరులకు హాని కల్గించెడి ఆలోచనలతో యున్నవాడు, బ్రతికియుండియు చనిపోయిన వానితో సమానమే!

(సైంటిస్టు) విజ్ఞులే, అనేకమైన పరీక్షలు జేసి, ఆలోచనల నన్నింటిని స్వానుభవముచే పరిశీలించి, వ్యర్థమైన ఆలోచనల వల్లగూడ, కొంతశక్తిపోవు చున్నదని, స్వార్థపు ఆలోచనలచే, మనుజుడు తన ఆయుష్షును తగ్గించుకొను చుండెనని నిశ్చయించిచెప్పిరి.

తన ఆలోచనలెవ్వరును, చూడజాలరుగదా అని వెర్రి మనుజుడు ఉష్ణపక్షి తన తలను యిసుకలోవుంచి, తన్ను ఎవరూ జూచుటలేదని భ్రమించినట్లు, అజ్ఞానమైన మనుజుడు గూడ పామరత్వమునకులోనై, విషపూరితమైన విషయాలోచనలకు బానిసయై నిర్జీవిగా యుండుట చాలా

విచారకరమైన విషయము.

మానవుడు తెలిసియో, తెలియకో, జేసెడి ప్రతి ఆలోచన గూడను స్వర్గమును తెలియబడుచుండునట, ఇదియే కాబోలు చిత్రగుప్తుడు, స్వర్గములో ప్రతీమానవుని, పనులు, మాటలు, ఆలోచనలు చిట్టాబుక్కులో వ్రాయుచుండునని మనము పురాణములలో చదివియుంటిమి.

చిత్రగుప్తుడు వ్రాయుట మాట అటువుంచి, ప్రతి ఆలోచనలో కొంత శక్తివున్నదనియు, ఆ శక్తిని, స్వార్థపు ఆలోచనలచే దుర్వినియోగముచేయుట, స్వార్థరహితమైన ఆలోచనలచే సద్వినియోగముజేయుట జరుగుచున్నదని, మానవుడు ఎంత త్వరలో గ్రహించిన అంత మంచిది.

ఇక యే ఆలోచనయు లేకుండెడి స్థితియో! అది ముక్తిని మోక్షమునే గల్గించును. అదియే, చిట్టచివరకు మానవుని పరమావధియై యున్నది. గాని, అట్టి మహనీయులు ఎచ్చటనో కోటికొక్కరుందురు. అట్టివారి జీవిత ములు ధన్యవంతమైనవి. అట్టి పరిపూర్ణమైన, సంకల్ప రాహిత్యమైన జీవితములే మానవకోటికి ఆదర్శప్రాయములు.

ప్రియమైన శాంతిపాఠకా! వెయ్యిమాటలేల? చిరజీవితమును, త్వరిత ముగా నశించెడి మార్గమును, నీ హస్తములలోనే యున్నవి. త్వరితముగా మృత్యువాతను బడవలెనన్న అతితిండి, అతివాగుడు, స్వార్థపు ఆలోచనలే దగ్గరబాట. నరకము జేర్చెడి బాట చాలా విశాలముగా జనముచే క్రిక్కిరిసి యుండునట.

ఇక చిరజీవితమును నీవు వాంఛించితివా! నిన్ను వెంబడించెడివారెచ్చ టనోగాని వుండరు. స్వర్గమార్గము రాళ్ళు రప్పలు, ముళ్ళతోనిండి, చాల యిరుకుగా నిర్జనముగా యుండును. గాని నీ గమ్యస్థానము పరమపావన మైన శాంతియుతమైన, శబ్దరాహిత్యమైన, పరిపూర్ణమైన కైలాసమే! అటులైన నీవు నీ ఆహారములో చాలా నియమముగా వుండి, సాత్వికాహారమునే మితముగా భుజించవలెను. విజ్ఞుడైన మానవుడు, తన జీవితమును, కేవలము తిండి కొరకే గడపక, జీవించుటకు మాత్రము, మనస్సును దైవములో లీనము చేయుటకును, మానవసేవయే దైవసేవగాన తన యిరుగు

పొరుగువారిని, తనవలె ప్రేమించుచు సేవచేయుటకు, తనకు పడిన ఆహారమును మాత్రమును మితముగా భుజించుచు, దినదినాభివృద్ధి నవ్వవలెను. అటులనే తన మాటలతోను, ఆలోచనలతోను గూడ వివేకవంతుడై మెలగుచు, చాలా జాగురూకతతో విలువైన తన కాలమును సద్వినియోగము చేయవలెను.

ఏలనన, **క్షణములను వ్యర్థము చేయువారు జీవితమునంతను వ్యర్థము చేయును.**

కాలమే ధనము

తరించుటకిదియే సమయము

కైలాసము మీకు స్వాగతమొసంగుచున్నది.

ప్రియమైన పాఠకా! లెమ్ము మేల్కొనుము. నీజన్మహక్కు చిరజీవితమే. మృత్యువు శరీరమునకే. నీవు మృత్యురహితుడవు. ఆత్మ స్వరూపుడవు. ఆ సభావనతో జయించజాలనిదెద్దియు లేదు. దైవ భావనలో అతి తిండిగాని, అతివాడుగుగాని, స్వార్థపు ఆలోచనలుగాని వుండజాలవు. అగ్నికి యీగలు ముసురునా!

ఒక్కతరి, యిప్పుడు, నిమీలితనేత్రులమై మన జన్మహక్కుయైన కోటిసూర్య ప్రకాశమైన దివ్యతేజస్సును ధ్యానించుచు, తరించెదముగాక!

లోకస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

శ్రీకైలాసము

9–3–1951

5.00 ఎ.ఎమ్

# 37. బావిలో కప్ప

ఆశ్రమం చెంతనే ఒక దిగుడుబావి కలదు. అందు చాల కప్పలు బెక బెకలాడుచుండును. ముఖ్యముగా వర్షాకాలములో ఆ బావి నీరుతో నిండి యున్నప్పుడు కప్పలమయమై యుండును. కప్పల బెక బెకలధ్వని గూడ అలవాటు జేసుకున్నవారికి ప్రణవధ్వనివలె యుండునుగదా.

ఈ బావిలో యున్న కప్పలలో ఒక పెద్దకప్ప,బలిష్ఠమైన కప్ప పెద్దనోరు కలిగిన కప్ప, గాంభీర్యమైన ఉపన్యాసములు తరచు యిచ్చుచుండును. బావిలోవున్న కొదువ చిన్న కప్పలన్నియు, కొవ్విన పెద్దకప్ప జెప్పెడి మాట లన్నియు, వేదవాక్యములుగా పరిగణించి మిగుల శ్రద్ధతో వినుచుండెను.

కాలమిటుల జరుగుచుండ, ఒకానొక సమయమున తుఫాను వచ్చెను. అప్పుడు గాలి,వర్షము మిక్కుటముగా కురిసెను. జలము ప్రవాహములుగా ప్రవహింప మొదలిడెను. ఆ తుఫానులో ఒక సముద్రపు కప్ప అనగా సముద్ర తీరమున జీవించెడి, మండూకము తుఫానుచే యీ పై బావిలోపడుట సంభవించెను.

అప్పుడు-దిగుడు బావిలో వుపన్యాసము జరుగుచుండెను. బలిష్టమైన మన మండూకము,తానే అగ్రాసనాధిపత్యమును వహించి, గాంభీర్యమైన వుపన్యాసము నిచ్చుచుండెను. మాటల చమత్కారము చేతనైననేమి, వాగ్ధాటి చేతనైననేమి సభికులను సంభీభూతులను చేయుచు, వారి మెప్పును, ఆశ్చర్య మును బడయుచుండెను. సముద్రము నుండి వెళ్ళిన మండూకము ఆ గాంభీర్యమైన వుపన్యాసముయొక్క సారాంశమేమని గ్రహించగా, అది అంతయు ఆత్మస్తుతిలోనే నిండియుండెను.

తనకన్న తెలిసియున్నవారు యీ లోకములో మరొక్కరులేరని, మొదటి బోధ. తన బావియే లోకములో అన్నిబావుల కంటె, పెద్దదనియు, లోతైనదని రెండవబోధ. చీకటి, అజ్ఞానముతోనిండి, లోతై అగాధముగా యుండవచ్చును గాని, ఆ బావి తదితరమైన బావులన్నింటికంటెను పెద్దదెటులైయుండును.

ఆత్మ స్తుతితో, తృప్తిపడక వుపన్యాసము పరనిందవైపుగూడ పరుగెత్తు

చుండెను. ఎచ్చటనైతే ఆత్మస్తుతినున్నదో అచ్చట పరనిందగూడ వుండి తీరును.

కించజ్ఞత్వము గల్గిన కొన్ని మండూకములకు యితరులను నిందించుటే ఆనందముగా యుండును. ఏ పనియూలేని సోమరులు మాటలతో విలువైన కాలమును వ్యర్థము జేయు మూఢులు–సదా యితరుల జీవితములోనకు రంధ్రములు పొడుచుచునే యుండును.

ఇంకను ఈపై బోధలో ముఖ్యముగా తెలియునది తానే సర్వజ్ఞుండు అన్నియు తెలిసియున్నవాడు, యితరులందరు అల్పజ్ఞులు తెలివితక్కువవారు జ్ఞానశూన్యులు.

మన ఉపన్యాసకుడు–బావిలోని మండూకము, తానెప్పుడును తన బావి బయటకు వెళ్ళకున్నను తనకుమించిన జగతులను తాను యెరుగని విషయములను తన కించజ్ఞత్వమునకు అవాంగ్ మానసగోచరమైన పెద్దపెద్ద సమస్యలన్నింటిని, అనేకమైన వుదాహరణలతో, గాంభీర్యముగా వుపన్య సించుచు తన సభ్యులను ముగ్ధులుగా జేయుచుండెను.

అప్పుడు సముద్రమునుండి, దురదృష్టవశమున, బావిలోపడిన మండూకము తలాతోకలేని, అవకతవకయైన యీ అసందర్భపు వుపన్యాసము నంతయూ విని ఆ వాగ్ధాటి గల్గిన వుపన్యాసకునితో యిటుల అనెను.

వారిద్దరకు యీ క్రింది రీతిన సంభాషణ జరిగెను.

**సముద్రపుకప్ప :** అయ్యా! తాము అమెరికా దేశము తీరమునకు, జపాను దేశముతీరమునకున్న అట్లాంటిక్ మహాసముద్రము గురించి, పసిఫిక్ సముద్రము గురించి వుపన్యసించుచున్నారు. ఆ సముద్రములకంటే మీ బావియేగొప్పదని వుపన్యసించుచుండిరి. మీరెప్పుడైనను వాటిని జూచితిరా? ఈ బావినుండి తమరు ఎన్నడైనను, తమ జీవితములో బయటకు వెళ్ళితిరా?

**బావిలో కప్ప :** నీవెవ్వరవు! నీవెచ్చటనుండి వచ్చితివి? యిచ్చట వున్న వేలకొలది సభికులకంటే మహాతెలిసియున్నదానివలె తెలివితక్కువ ప్రశ్నలు

వేయుచుంటివి. ప్రధానముగా నీకు ప్రశ్నవేయుటకు అధికార మెక్కడున్నది. నీవు మాట్లాడుటకు అధికారమెవ్వరిచ్చిరి. ఈ గాంభీర్యమైన మాటలు వినుచున్న సభికులందరు తమ గురువు యొక్క వాగ్ధాటికి ఎంతయో ఆనందము పొంది, హలహలానము అని సిగ్గు సిగ్గు అని అరచుచు, తప్పట్లు కొట్టి, సముద్రపు కప్పను హేళనజేసి, నోరుమూసుకొని, మౌనంగా కూర్చుని ఆ మహోపన్యాసమునకు అడ్డురాకుండా వినమని వేయినోళ్ళతో చెప్పసాగిరి.

అప్పుడు, మన సముద్రపు కప్ప చాలా నిరుత్సాహము అధైర్యమును పొంది చింతించుచు మరియొక మారు ధైర్యము తెచ్చుకొని అయ్యా! సముద్రము కంటె మీ బావియే గొప్పదనే నీ దృఢమైన నమ్మకమా  అని ప్రశ్నించెను.

**నూతిలోకప్ప :** నిస్సందేహముగా, ముమ్మాటికిని నీకు అనుమానమున్న మా శిష్యులను, సభ్యులను అడిగి తెలుసుకొనుటకు నీకు అనుమతినిచ్చెదను అని జెప్పెను.

గురుమూర్తికి తమయందు వున్న నమ్మకమునకు శిష్యులందరు, ఆనందముతో తప్పట్టులు గొట్టుచు సముద్రపు కప్పకు అవమానము కలిగెడి లాగున హేళన జేయ ప్రారంభించిరి.

మన సముద్రపు కప్ప వేలకొలది కప్పలలో యేకాకియై నిస్సహాయతచే మరి చేయునది యేమియు లేక అయినను సత్యమును భూమిలోనికి తొక్క బడుట, అబద్ధముగా జేయబడుట భరించజాలక మరొక్కసారి తన కంఠము నెత్తి అయ్యా! అఖండమైన అంతు ఆదిలేని సముద్రమును తాము చిన్న ఖండమైన నూతితోపోల్చుట, నూతికంటే చిన్నదనుట చాలా మహాపరాధము ఘోరమైన తప్పిదమని ధైర్యము తెచ్చుకొని మరల చెప్పెను.

అప్పుడు బావిలోని కప్పకు వుపన్యాసకునికి ఆయన శిష్యులందరకు చాలా కోపము వచ్చెను. సభ అంతయు అల్లకల్లోలమయ్యెను. దీనికంతకు కారణము సముద్ర నుండి వచ్చిన మండూకమేగదా అని, కొదువ సభ్యు లందరు, తీక్ష్ణమైన చూపులతో క్రోధముగా జూడసాగిరి. ఆ సముద్ర

మండూకమును పొడిచి, చంపివేయుటకు పరాభవించుటకు, తమ గురు మూర్తి ఆజ్ఞకై యెదురుజూచుచుండిరి. అప్పుడు వారి గురువు– యీ క్రింది రీతిగా, జెప్పదొడగెను.

**బావిలోకప్ప :** వీడు కేవలము మూఢుడు, మూర్ఖుడు, మనోవికాసం లేని అల్పజ్ఞుడు. తానుపట్టిన కుందేటికి మూడేకాళ్ళు అని వాదించెడి మూర్ఖ శిఖామణి. మన ఆశయములను లేశమైన గ్రహించజాలడు. మన బోధనెంత నూరిపోసినను అపరిపక్వమైన మెదడులోనకు వెళ్ళదు. యిట్టి అల్పుడు మూడుడు, మనలోవున్న మన సంస్థకే హాని కల్గునుగాన వీనిని తన్ని తరిమి వేయుడు అని ఆజ్ఞాపించెను.

గురువుగారి వాక్యములు, వారి నోటినుండి వచ్చీ రావడంతోనే సభికులందరు తలకొక చెయ్యను, పాపము ఆ సముద్రము మండూకము వేసి వచించరాని, దుర్భాషలన్ని ఉపయోగించి, ఆ కప్పను నూతినుండి నిర్దాక్షిణ్యముగా తన్ని తరిమివేసిరి. బ్రతుకు జీవుడా అని గాయములతో కొనవూపిరితో పాపమా మండూకము నరకరూపమైన ఆ లోతుబావి నుండి బయటపడినందుకు ఆనందించుచు ఆ దైవలలాయమునకు కృతజ్ఞతావందన ముల నర్పింపసాగెను.

ఇచ్చట మనము రెండు విషయములు నేర్చుకొనవలసియున్నది.

1. నూతిలో కప్ప ఏమియు తెలియక సర్వమూ తెలిసినట్లు నటించుచూ, తాను అధోగతి పాలవ్వుచూ తన శిష్యులందరకు నరకకూపము నకు దారిజూపుచుండెను. సముద్రపు కప్పయేకాక, మీరు నేను చివరకు అవతారమూర్తులు గూడ యిట్టి బావిలో మండూకములను మార్చజాలవు. నూతిలో కప్ప తానచ్చటనే జన్మించి అచ్చటనే జీవించును. అచ్చటనే చనిపోవును. గాని దానికి, నూతికంటే యితరమైనదెద్దియు లేదు. తన అల్ప జీవితమును బట్టియే దాని ఆశయము, అభిప్రాయము గల్గియున్నది. దానికి మించిన భావనలు ఎచ్చటనుండి రాగలవు?

2. అల్పునకు అతీతముగా వున్న దానిని మనము కోరుటగూడ పొరపాటుగదా. సముద్రపు కప్పకు అనుభవనీయునకు ప్రత్యక్షముగా

లోకమంతయూ తిరిగి అన్ని సముద్రములను జూచిన దానికి, ఈ చిన్ని చిన్ని కూపములే కనిపించవు. అయినను తాను, ఏకాకియై యుండుటచే మూఢులు లెక్కకుమీరి యుండుటచే తన నిస్సహాయ స్థితికి విచారించు చుండెను. అయినను ఆ తన అవస్థలో, తనకు సహాయము జేయునది సూర్యుడు ఒక్కడే యైనను మేఘములు కోట్ల కొలదియున్నను ఒక్క సూర్యుడే మేఘము లన్నింటిని పటాపంచలుగా జేయుననెడిదే. అతని నిస్సహాయమైన అవస్థలో అతనికి ఆధారమై బలముగా వుంటున్నది. అన్నిటికంటెను ముఖ్యముగా మనము గ్రహించవలసిన ప్రధానాంశమెద్దియనగా వేలానువేలు జనులు, వుపన్యాసకులు లోకమును తరింపజేయ కంకణముకట్టుకొని అహోరాత్రులు డబ్బుకొరకై లోభులైన శిష్యులను పీడించుచు, సేవచేయుచున్న సంస్కర్తలలో ఎక్కడనోగాని ఒకరు నేత్రములు తెరిచినవారు, బావి నుండి బయటకు వచ్చిన వారు లేకుండుట చాల విచారమైన అంశము.

మనుజుడు సంస్కర్త లోకసంగ్రహమునకై జ్వరతీవ్రములో పాటుపడు చున్నవాడు శరీరమనే బావినుండి బయటకెన్నడును రాకుండగనే తాను కనీవినని ఎన్నడును అనుభవించని సిద్ధాంతములను, యోగరహస్యములను అమాయకులైన గొర్రెల మందలవంటి తన శిష్యులకు ఉపదేశించుచు అంధుడు–అంధులకు దారిచూపునట్లు అందరను కలసి అగాధమైన అంధ కారములోపడుచుండిరి.

నూతిలో వున్న కప్పకు సముద్రముల గురించి వుపన్యసించుటకెటుల అధికారములేదో అటులనే శరీర జ్ఞప్తికలిగిన శరీరం నుండి ఎన్నడును, బయటకు వెళ్ళని మనుజునకు గూడ, దైవము గురించి మాట్లాడుటకు ఉపన్యసించుటకు లేశమైనను హక్కులేదు.

బావిలో వున్న ఓ మండూకములారా! మీరు మరి ఒక్కమారు, బెకబెక మనే ముందు మొదట మీ బావులనుండి బయటకువచ్చి చూడవలసిన సముద్రములన్నింటిని జూచి అనుభవించవలసిన జ్ఞానమునంతయును అపరోక్షముగా, అనుభవించి అటు తరువాత మీ పెదవులను విప్పుడు.

మీరు, మీ శిష్యులను, మిమ్ము నమ్మువారిని మోసపుచ్చ గలరుగాని, మీ హృదయమునకు హృదయముగా నున్న దైవమును, మీరు ఆవలించకుండగనే మీ పేగులన్నింటిని గూడ లెక్కపెట్టియున్న మీ ఆంతర్య దైవమును యెన్నటికి మోసబుచ్చజాలరు. మీరు, అజ్ఞానమనే, మీరు తవ్వు గోతులలో అగాధములో మీరే పడవలసియుండును. యెవ్వరు జల్లిన విత్తనములను వారే అనుభవించవలసియున్నదన్న సత్యముకైన ధర్మ చట్టమునైన గ్రహించి మీకు తెలియని, అనుభవములేని బోధలు చేయవలదు.

ఆత్మస్తుతి పరనింద అనెడి, ఘోరమైన మహా జాడ్యములకు బానిసలుగా వుండవలదు. అనుభవించవలసిన దానిని మనము అనుభవించిన తర్వాతనే మనకు నోరు విప్పుటకు హక్కుగలదు.

బావిలో కప్పలన్నియు సముద్రము వైపునకు దారితీయునుగాక! సముద్రతీరపు మండూకములన్నింటికి ధన్యవాదములు.

సర్వేజనా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

25-4-48

8-00 ఎ.ఎమ్.

# 38. ఈశ్వర సంకల్పము

(కదలదు నీ సంకల్పము లేక గడ్డిపోచయైన)

నిన్నటి దినమున ఒక మంగలి క్షౌరము చేయుటకు వచ్చెను. ఇతడు మాటలయందు చాలా నేర్పరి. ఇలా క్షౌరము చేయుటపూర్తి అయ్యేసరికి, అతని సంసార తాపత్రయములు, ఊళ్ళోగొడవలు, చుట్టుపట్ల సమాచారములు, దేశములో అవస్థలు అన్నియు క్షౌరముతో పాటు పూర్తిచేయును. ఈ క్షౌరము జేయు సమయమందే తన నిమ్మపండ్లు, చొక్కాలు, దుప్పట్లు, బరకములు యింకను ఏమేమి కావలెనో అన్నియు కత్తి మెడమీద పడగానే కోరుచుండును.

క్షౌరము చేయుటలోగాని, అధిక ప్రసంగములలోగాని యితనిని మీరిన వారెవ్వరును వుండరని ప్రజలు చెప్పుకొనెదరు. సహజముగా యితడు తెలివితేటలు గల్గినవాడు. క్షౌరము పూర్తి అయ్యెను. గోళ్ళు తీయుచుండెను. కాలిగోరు తీయుచుండ మాటల సందర్భమున గోరుగల్లు మాంసములోనికి వెళ్ళెను. బాధగల్గుసాగెను. ఏమిటి సంగతి యని అడుగగా "బాబూ రక్తము వచ్చుచున్నది–మందుయేమైన వున్నదా" అని అడిగెను. మాంసము మెత్తగా తెగిపోవుటచే, గోరుగల్లు లోపలికి వెళ్ళెనని చెప్పెను. అచ్చుటనే నీళ్ళువుండగా నీళ్ళుపొయ్యమని మరేమియు లేదని చెప్పితిని. నాకు బాధ గలుగగానే, మంగలి, తెగుటచే రక్తము కారుచున్నదని చెప్పగానే, తలవని తలంపుగా **"కదలదు నీ సంకల్పము లేక గడ్డిపోచయైన"** అని మనస్సులో స్ఫురించినది. గోరుతీయుటలో లోతుగా తెగుట, రక్తమువచ్చుట ఈశ్వర సంకల్పమేనా? దైవ సంకల్పమైయున్నప్పుడు, మంగలితో దెబ్బలాడనేల? మంగలి నిమిత్త మాత్రుడు గదా! మంగలిని కోపపడనవసరం లేదుగదా! అతని గురించి ఆలోచించనవసరమైనలేదు. ఆహా! దైవసంకల్పమెంతటి విచిత్రముగా వుండుననే, ఆలోచించవలసియున్నది.

గడ్డిపోచయైనను దైవ సంకల్పము లేక కదలనప్పుడు, మంగలిచేతిలో, గోరుగల్లు మాత్రము ఈశ్వర సంకల్పము లేక మాంసములోనకు ఎటుల

దిగగలదు ఈ మనసప్పుడు బాధను, రక్తమును జూచుటకు బదులు, యీశ్వర సంకల్పము గురించియే ఆలోచించదొడగెను.

"ఈశ్వర సంకల్పమేరీతి, నెటులుండునో" అనెడి మరియొక కృతిగూడ మన ప్రస్తుతపు సమస్యకు, సహాయముగా వుండును. యేక్షణమునకు ఏది ఎటుల జరుగునో తెలియదుగదా. పూర్తిగా దైవమును నమ్మినప్పుడు ఏది ఎటుల జరిగిననేమి? ఎటల జరిగినను యీశ్వర సంకల్పమే! సర్వములో యీశ్వర సంల్పము గాంచెడి వారి జీవితములు అదృష్టవంతములు. గాని అటుల గాంచుట, సులభముగాదు, చాలకష్టము. గాఢమైన వైరాగ్యముగల్గిన త్యాగశీలులు, నిత్యానిత్యవివేకము గలిగి, సదా దైవత్వములో లీనమై వున్నవారు మాత్రమే, సర్వములో యీశ్వర సంకల్పమును చూడగలరు.

సామాన్య ప్రజలు, ముఖ్యముగా, బాహ్యారక్తులు అవసరమైన లాభమైన పనులలో తమ సంకల్పమును తదితర పనులలో తమకు నష్టము, నింద రానున్నప్పుడు దైవ సంకల్పమును గాంచెదరు.

ఈ సందర్భములోనే, ఆవును చంపిన, బ్రాహ్మణుని సంకల్పస్థితి జ్ఞప్తికి తెచ్చుకొనుట సహకారిగా వుండును. ఒక బ్రాహ్మణోత్తముడు, చక్కనైన తోటను వేసుకొని ఆ తోటలో ముఖ్యముగా విలువైన ఒకానొక చెట్టును, ప్రాణతుల్యముగా పెంచుచుండెను. ఆ చెట్టునే, ఒక ఆవువచ్చి, తినివేయు చుండ ఆ బ్రాహ్మణుడు, కోపం పట్టజాలక, దానిని చావమోదెను. ఆ దెబ్బలతో అదిరి పడిపోయి, ప్రాణము విడచెను.

అప్పుడు మన బ్రాహ్మణుడు, సర్వమును యీశ్వర సంకల్పమనెను. దైవము గూడ, యీనిందను భరించలేక మనుష్యరూపము ధరించి వచ్చి,యీ తోట చాల చక్కగా వున్నది. ఎవ్వరు వేసిరి అని ప్రశ్నించగా, నేనే వేస్తిననియు చాల శ్రమపడి వ్యయప్రయాసలతో తోటపెంచితినని సమాధానము జెప్పెనట. నీ శక్తిచే యీతోట మొదలైనవన్నియు, నీవే వేయగా ఒక్క ఆవును చంపిన పాపము మాత్రము, ఒక్క యీశ్వరునిదా అని మందలించెనట.

దుర్జనులు, చెడుపనులను జేయుచు అంతయు, యీశ్వర సంకల్ప మనెడి వారు లేకపోలేదు. యీశ్వరుని మరచినవారికి, యీశ్వర సంకల్పం

మరుగైయుండును. ఈశ్వరుని, సంకల్పమును రెండు జేయుటకు వీలులేదు. ప్రకృతి, పురుషుడు, రెండును ఆదిలో ఒక్కటే. ప్రకృతి, పురుషుని నుండియే వచ్చును. పురుషుడులేని ప్రకృతియేది స్వార్థముతో నిండి, ప్రజలను పీడించుచు, అమాయకులను హింసించుచు అంతయు యీశ్వర సంకల్పమనెడి వారిని జూచుచుంటిమి గదా.

గాని సత్యమేమనగా, సర్వమును దైవముగా భావించుచు, సర్వములో గడ్డిపోచ కదలుట మొదలు, బ్రహ్మాండములు తిరుగుటవరకు, సర్వములో దైవసంకల్పమును గాంచెడి వారెన్నడును, తప్పుపనులను జేయజాలరు. మాటలునేర్చిన, వ్యవహారిక వేదాంతులు అటుల జేయగలరు. గాని యెంత తెలివితేటలున్నను, దైవము నెటుల మోసబుచ్చగలరు? గాని తాము తవ్వు కున్న గోతులలో, తామే పడెదరు. దైవము కండ్లలో నిసుక జల్లప్రయత్నించెడి వారు, తమ కండ్లలో తామే యిసుక జల్లుకొందురు.

ఈ వ్రాయబడెడి వ్యాసము యీశ్వర సంకల్పమేనా? యిప్పుడీ కలముతో వ్రాయుచుండుట యీశ్వర సంకల్పమేనా? చూచుట, వినుట, కదలుట, ఆలోచించుట యీశ్వర సంకల్పమేనా? యీ వ్యాసము యొక్క ముఖ్యమైన సారాంశమేమన, సర్వకాల సర్వావస్థలయందును యీశ్వరుని, అపరోక్షముగా అనుభవించెడువారు మాత్రమే, యీశ్వరుని సృష్టిలో సర్వ మును యీశ్వర సంకల్పముగా జూడగలరు.

సంకల్పము, యీశ్వరుని నుండియే వచ్చెను. యీశ్వరుడు లేని సంకల్ప మేది? సర్వమును దైవముగా జూచుచు సర్వములో దైవ సంకల్పమును గాంచినవారి జీవితములే అదృష్టవంతమైనవి.

అంతర్యమున బాహ్యమున, నిండియున్న ఓ సచ్చిదానంద స్వరూపా! సర్వములో నీ స్వస్వరూపమును గాంచుచు గడ్డిపూవు కదులుట మొదలు, బ్రహ్మాండములు సృష్టివరకు నీ సంకల్పమునే వీక్షించెడు లాగున కరుణించుము. కదలదు గడ్డిపోచయైన.....

# 39. జగత్తే స్వప్నము

ప్రకృతి శోభాయమానమైన యీ పర్వతశ్రేణులు, యీ పర్వతముల నుండి నిరంతరము ప్రవహించెడి యీ నదులు, ధారలు వృక్షరాజులు, జంతు జాలములు, పృథ్వి, వాయువు, అగ్ని,జలము, ఆకాశము యీ పంచ భూతములు. ఈ స్థూలమైన నామరూపములన్నియు ప్రత్యక్షముగా రెండు కళ్ళతో చూచుచు, యీ జగత్తును స్వప్నమెటుల చెప్పగలము? సూర్యచంద్రాదులు, నక్షత్రమండలము, యీ నామ రూపములన్నియు స్వప్న తుల్యము లేనా? ఈ స్థూల ప్రపంచమంతయు స్వప్నమేయైన, యిక స్వప్నముగానిదెద్ది గలదు? స్వప్నము గానిది, స్వప్నాతీతమైనది, మహత్తరమైన సద్వస్తువు ఒక్కటేకలదు. అది పరమాత్మ స్వరూపమే! అద్దానిని గుర్తించి, దానిలో ఐక్యమై అనిత్య, సత్య సంపూర్ణ స్వరూపమును అనుభవించెడివారి జీవితములు ధన్యవంతములు.

ప్రతీమానవుని జీవితములో ఆనందముగా యుండెడి, పరవశత్వమును గల్గించెడి పరమపావనమైన క్షణములు వుండి వుండును. అట్టి పవిత్రమైన క్షణములు, ప్రకృతి సౌందర్యములను వీక్షించుటచేతను రావచ్చును. సూర్యోదయము, సూర్యాస్తమయ సమయములు గూడ హృదయమునకు ఆనందము నిచ్చును. కొందరకు ప్రార్థనలు, భజనలు గూడ పరవశత్వమును గలిగించును.

నిరంతర దైవనామస్మరణ ఆధ్యాత్మికోన్నతికి ఎంతయో సహాయముగా యుండును. గీతలు, ఉపనిషత్తులు నిత్యపారాయణ జేయుటకూడ దైవము ననుభవించుటకు తోడ్పడుచుండును. ఒక్కొక్క వ్యక్తికి, తన మనోప్రపంచ మునుబట్టి ఒక్కొక్క మహావాక్యము గూడ గొప్ప బ్రహ్మానందమును గల్గించు చుండును.

తలవని తలంపుగా, నా జీవితములో యీ క్రింది మూడు మహావాక్య ములును అశరీరిగా జేయుచుండును. పదే పదే, మన ఆధ్యాత్మిక వృద్ధికి, మానవజన్మ యొక్క గమ్యస్థానమును చేరుటకు తోడ్పడు వాటిని అనుస

రించవలసినదే. నాకు సహకారిగా యున్న యీ చిన్న మూడు మహావాక్య ములు మీతో పంచుకొననీయుడు.

**1. నేను తేజస్సులో యుంటిని.**

తేజస్సు అన్నను, దైవమన్నను, శాంతి అన్నను, విశ్వప్రేమ అన్నను ఒక్కటే.

నేనే గాక మీరుగూడ ఆ దివ్యతేజస్సులోనే అప్పుడప్పుడనక నిరంతరము వుండి యుండిరి. భూత, భవిష్యత్,వర్తమాన కాలములలో మనమందరము ఆ తేజస్సులోనే పొదుకొని యుంటిమి. మన మెచ్చటయున్నను, ఏ ఏ పరిస్థితులలో యున్నను, ఆ దివ్యతేజస్సులోనే యుంటిమని ఆనందించుట యెంత, ఉత్సాహమును, బలమును గల్గించుచున్నది.

2. ఇక రెండవ వాక్యము

**ఆ దివ్యతేజస్సు నాలోనే యున్నది.**

అనాదినుండి అంత్యము వరకు, ఆ దివ్యమైన తేజస్సు మనలోనే యున్నది. ఆ తేజస్సు మనలో లేనిక్షణము ఒక్కటియైనను యెప్పుడును లేదు. ముఖ్యముగా ప్రార్థన ధ్యానాదులు చేయునప్పుడు, ఆ దివ్యతేజస్సుతో నింప బడియుండుటేగాక, అద్దానిని, కాలిగోరునుండి, శిరస్సువరకు గుర్తించి అనుభవించుట అదృష్టనీయము.

ఇక మూడవ వాక్యము

**3. ఆ తేజస్సే నేను**

ఉన్నది ఒక్కటే, అద్వితీయమైనది. రెండు గానిది గాన, ఆ దివ్య తేజస్సే మనము.

ఈ మహావాక్యమును నోటితోను, పెదవులతోను స్మరించి తృప్తిపడ రాదు. దీనిని, జీవితములో శరీర ప్రపంచములను మరచి అనుభవించ వలెను. మరియొక్క భావన నాకెంతయో ఉత్తేజమును పరిపూర్ణమును కల్గించు చుండును. యీ యన్ని మాటలను గూడ మీతో అనుభవించుటను కోరు చుంటిని.

I have done nothing before, I am doing nothing now and I have nothing to do even in future

నేనెప్పుడును యేపనియు చేయలేదు. నేనిప్పుడేమియు చేయుటలేదు. యికముందు గూడ జేయుటకు నాకు యేపనియులేదు. యీ మూడు చిన్న వాక్యములను స్మరించునంత మాత్రముననే అన్ని మాటలకు, పనులకు, ఆలోచనలకు, అతీతుడనై పరవశత్వమును గల్పించుచుండును. నేను ఆశ్రమ ములు స్థాపించుట, భూప్రదక్షిణ చేయుచు పెక్కుమార్లు అమెరికా మొదలైన దేశములలో ప్రచారము చేయుట ఒక చిన్న బాలికకు నా శల్యమును దానము జేయుట, యీ జన్మదినోత్సవములు, లక్షపత్రి, కోటిపత్రి పూజలు అన్నియు స్వప్నతుల్యములేనా? ఆత్మభావనలో యివన్నియు స్వప్నతుల్యములే. నేను శరీరమును అనుకొన్నా, చేసిన పనులు, చేయుచున్న పనులు చేయవలసిన పనులు పరిమితిలేకుండగా ఎన్నియో వుండును. తాను పరిపూర్ణుండను, దివ్య సత్య, నిత్య పరమాత్మ స్వరూపుడను అనెడి అద్వైత భావనలో, యేపనియుండదు. అచ్చట మాటలు రావు. ఆలోచనలు గూడ యుండవు. అది అంతా పరిపూర్ణమే. బ్రహ్మమే, పండిన పండు, తనంతట అదియే రాలినట్లు పరిపక్వమైన, స్థితిగా యుండును. కురిడీ కట్టిన కొబ్బరికాయ పై పెచ్చునుండి వేరుగాయున్నట్లు, యీ మహావాక్యములను స్మరించినంత మాత్రమున తనకు దేహముతో, ప్రపంచముతో యే సంబంధములేని, దేహిగా పరమాత్మగా ప్రకాశించుచుండును. యీ పరిపూర్ణమైన బ్రహ్మస్థితిలో ప్రపంచం యెచ్చటవున్నది. అదివున్నను, స్వప్నతుల్యమేగదా!

**జగత్తే స్వప్నము**

స్వప్నములో యుండగా, స్వప్నముగూడ శాశ్వతమని, సత్యమని మనము నమ్ముచుందుము. అటులనే ప్రపంచములో యుండగా యీ నామ రూపములన్నియు, భార్యాబిడ్డలు, ధనధాన్యములు, ఇండ్లుతోటలు అన్నియు శాశ్వతములే అని మానవులు భావించుచు నిత్యమును మరచి అశాశ్వత మును పూజించుచు అధోగతి పాలగుచుండిరి. నిన్నను అర్ధరాత్రిలోలేచి,

ఉదయము వరకు యేదో వ్యాసములు వ్రాయుచుంటిని. ఉదయమే ధ్యానము చేయుదమని శవాసనములో పరుండగా నిద్రవచ్చెను. నిద్రలో స్వప్నము వచ్చెను. ఆ స్వప్నములో, యెచ్చటనో పాశ్చాత్య దేశములలో, ప్రచారము చేయుచున్నట్లు, పెద్ద బస్సుమీద ప్రయాణముచేయుచున్నట్లు చూచుట జరిగినది. అచ్చట గూడ నిద్రయే. దిగవలసిన స్థానములో దిగక, బస్సు తీసుకొనువెళ్ళుచున్న గమ్యస్థానమునకు పోవుచుంటిని. ఆ బస్సు నడిపెడి కండక్టరున్ను నేనున్ను మిగిలియుంటిమి. అది రాత్రి సమయము, అంతయు అంధకారముగా గూడ యున్నది. ఆ బస్సునడిపే మనిషి నావద్దకు వచ్చి మీ టిక్కెట్టు యేది అని అడుగుచుండెను. నేను సిగ్గుపడుచు యేమియు చెప్పజాలక అవస్థపడుచుంటిని. అదియుగాక యేమి చెప్పుటకును, మౌనముచే మాట్లాడుటకు వీలుకానందున, నేను జవాబు చెప్పకుండుట చూచి, ఆ బస్సు నడిపే ఆయన కూడ ఆశ్చర్యపడుచుండెను. అంతలో కాగితము, కలము తీసి ఆ కాగితములో నేను మౌనముగా యుంటినని, నిద్రలో తెలియక, దిగవలసిన తావులో దిగలేకపోతినని వ్రాసి, చూపించ దలచుచుండ ఆ బస్సు హఠాత్తుగా ఆగిపోవుటచే, చాలా శబ్దము జర్క్ కదలుట జరిగెను. ఆ శబ్దముచే నా స్వప్నము నుండి మేల్కొని కండ్లు తెరవగా అమెరికాలోను, చీకటిలో బస్సుమీద టిక్కెట్టు లేకుండగా అవస్థపడుచుండ– శాంతి ఆశ్రమములో మందిరములో, దూలములు వేలికొక్కలు పైన కనిపించగానే నా అవస్థలన్నియుపోయి ఆనందము కలిగెను.

లిప్త కాలములో మనస్సు అమెరికా మొదలైన దేశాలు తిరిగి రాగలదు గదా! మరలకండ్లు మూయగనే విమానము మీద ప్రయాణము జేయుచున్నట్లు శరీరమంతయు దూదివలె తేలికయ్యెను. గాలిలో యెగురుచున్నట్లు పరవశత్వముతో ఆనందించుచుంటిని. ఆ స్థితిలో నా ప్యాకెట్లు, కలములు, ఒక్కటి తరువాత మరొక్కటి రెండు విమానమునుండి పడిపోవుచుండ, నేను విచారించసాగితిని. విమానమును ఆపుటకు వీలులేదు. ఆ కలములకై క్రిందకు దిగుటకు వీలులేదు. యిట్టి సందిగ్ధావస్థలో యుండ విమానములో యేదో గొప్ప చప్పుడవ్వుటచే నేను మేల్కొని, నా

కలములు పోలేదని ఆనందించ సాగితిని. యిది కేవలము స్వప్నమైయున్నను, నాకింకను ఆ బస్సు, అందులో కండక్టరు, నన్ను టిక్కెట్టు అడుగుచుండుట, ఆ బస్సు హఠాత్తుగా ఆగిపోవుట ఆ శబ్దము, అన్నియు యింకను కనిపించుచు వినిపించుచునే యున్నవి. నా కలములు క్రింద జారిపోవుచుండుట గూడ యింకను నేను చూడగలను.

అంత ప్రత్యక్షముగా కనిపించినవి, వినిపించినవి, అనుభవములు యెటుల అసత్యములో, మనోభావనలో అటులనే యీ స్థూల ప్రపంచ మంతయు నామరూపములతో గూడియున్న యీ పెద్దవస్తువులన్నియు స్వప్నతుల్యములే. నిద్రలో స్వప్నము తాత్కాలికముగా యుండును. జాగ్రత్‌లో స్వప్నము మనం చూచు కాలము హెచ్చుగా యుండవచ్చును. స్వప్నావస్థకు జాగ్రదావస్థకు కాలనిర్ణయములో భేదము గలదు గాని, వాటి ఉత్పత్తి ఆది – స్థిరత్వములో ఒక్కటియే కాన, వివేకవంతులైన వారు స్వప్నమువంటి యీ స్థూల ప్రపంచమే సత్యముగా భావించి సచ్చిదానంద స్వరూపమును మరచి కీనీడల వెంట పరుగెత్తరాదు. స్వప్నాతీతమైన, ప్రపంచరహితమైన అమృతత్వముగనే, బ్రహ్మాసాక్షాత్కరమునే నిరంతరము గ్రోలుచు జీవన్ముక్తులుగా బరగుచున్న బ్రహ్మావాదు జీవితములు ధన్యవంతములు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

13–10–53

3.00 ఎ.ఎమ్.

# 40. నీ విరోధులను ప్రేమించుము

శ్రీ కైలాస ఆశ్రమములో క్రైస్తు జెప్పిన మహావాక్యము నొక్కదానిని వ్రాయవలెనని, బైబిలు పుస్తకము మొన్నటి దినమున తిరగవేయుచుంటిని. కైలాసమునకు వచ్చెడి దారి, చాల ఇరుకుగా, రాళ్ళు, రప్పలు ముళ్ళతోనిండి యుండునుగాన ఆ మహావాక్యమును, క్రైస్తుగూడ, స్వర్గదారి యిటులనే కఠినముగా వుండునని జెప్పియుండెనుగాన, ఆయన వచించిన మాటల కొరకు, బైబిలును వెతుకుచుండగా నేను వెతకబోయెడి మాటలు గానవచ్చుటకు బదులు, యీ క్రింది మహావాక్యములను చదువుచుండగా, అదొక విధమైన ఆవేశము, పరమసత్యము, ఆనందము నా హృదయములో గలుగ సాగెను. అనుభవనీయమైన క్రీస్తు వాక్యములను, పాఠకులారా మీతో పంచుకొననిండు.

మీ విరోధులను ప్రేమించుడు, మిమ్ము హింసించుచుండెడి వారికి వుపకారము జేయుడు. మిమ్ము ప్రేమించెడివారిని, మీరు ప్రేమించినా, దానివల్ల యేమిలాభము? పాపాత్ములుగూడ, తమ్ము ప్రేమించెడి వారిని ప్రేమించెదరు. మీకు వుపకారము జేసినవారికి, మీరు వుపకారము జేసినా యేమి పుణ్యము మీకు గల్గును. పాపాత్ములు గూడ వుపకారమునకు ఉపకారము జేయుదురు.

మీరు ఫలితము కోరుచు, మరల లాభము గల్గునని, బదులిచ్చిన మీకు యేమి పుణ్యము, ప్రవృత్తి పరులుగూడ యిటులనే జేయుదురు. గాన మీరు, మీ విరోధులను, హృదయపూర్వకముగా ప్రేమించుడు. వారికి వుపకారముజేయుడు. ఫలితముకోరకుండా, వారికి కావలసినవి అర్పించుడు. అప్పుడు మీకు ఫలితము గొప్పదిగా దొరకును. అప్పుడు మాత్రమే మీరు పరమ పావనమైన, మహత్తరమైన దైవసంతతిగా వెలుంగుదురు.

ఏలనన, ఆ ప్రభువు, దైవము అకృతజ్ఞులను, పాపాత్ములను గూడ కాపాడి యుండెను. పాపులను దుర్మార్గులను మీ తండ్రి మన్నించి క్షమించి బ్రోచినట్లు, మీరుగూడ, ప్రేమతో మన్నించి మీకు హాని కలిగించెడివారిని

బ్రోచుడు.

అనుభవపూరితమైన యీ ప్రేమ వాక్యములు ప్రస్తుతపు ఆశ్రమ విషయావస్థలలో నా హృదయమునకు యెంత ఆనందమును, శాంతిని, నూతనమైన శక్తినొసంగెనో యీ చిన్నిమాటలలో వ్రాయజాలను. ఈ నా మనోభావనలను యీ వ్యాసములో వ్రాయుచుండ, నాబల్లమీదనే తలవని తలవంపుగా "ఏనిబిసెంటు" జనని, జెప్పిన చక్కని అనుభవనీయమైన పద్యమును, క్రీస్తు భావనలనే బలపర్చుచు, నా వైపు జూచుచున్నది. ఏనిబిసెంటు బొమ్మగూడ ఆ పద్యము ముందుగనే వున్నదిగాన, ఆమె గూడ "నాయనా ధైర్యముగా, ఆనందముగా వుండుమని చెప్పుచు" నావైపు జూచుచున్నట్లు వున్నది. ఆ పద్యములు గూడ మీతో పంచుకొననిండు.

మన స్నేహితుడు, అవిశ్వాస పాత్రుడు యున్న మనము విశ్వాసముగా యుందము.

విరోధి, మనకు హాని గల్గించినా, మనము వానిని క్షమించుదము

మన స్నేహితుడు మనలను మోసపుచ్చినా, అతని చెంతనే నిలువబడుదము. అప్పుడే మనలో, మరుగుపడియున్న దైవము ప్రకాశించుటకు ప్రారంభించును.

ఒకభక్తురాలు, దైవము నీ క్రింది విధముగా ప్రార్థించెనట.

ఓ ప్రభువా, నీ సేవజేయుటకు, నాకు కొంత పనినిమ్ము. నిన్ను మరువకుండా వుండుటకు నాకు కొంత బాధ నిమ్ము. నిన్ను ప్రేమించుటకు నాకు ఒకరిద్దరు విరోధులనిమ్ము.

మన జీవితములో, ఆధ్యాత్మికముగా, జూచిన యెడల విరోధులేని యెడల జీవితము, ఉప్పులేని కూరవలె చాల చప్పగావుండును. ఆహారము నంతయు తీపితోనే యున్న యెడల మొఖము మొత్తునందురు. గాన ఆధ్యాత్మిక వృత్తికి విరోధులు గూడ చాలా ముఖ్యవసరము. అందరు గౌరవించి, పూజించుచుండ ఆనందముగా యుండుట సులభము. మనము నమ్మి ప్రేమించినవారే, మన గొంతుకలు, కోయుచున్నప్పుడు మనము జూపెడి సహనమే నిజమైన సహనము. అప్పుడు వ్యక్తపరచెడి ప్రేమయే

ప్రేమ.

ఈ విరోధులే లేనియెడల మనకు విశ్వప్రేమ, సహనము, ఓర్పువున్నదో లేదో యెటుల తెలిసికొనగలము? పూర్వము సిపాయిల పితూరిలో, ఒక సాధుపుంగవుని, ఒక మూర్ఖుడు, హింసించెనట అప్పుడాయన శిష్యులు ఆ హింసించినవారిని బంధించి తీసికొనివచ్చి యేమి శిక్షజేయుమనెదరని అడగగా ఆయన యిటుల చెప్పెనట.

వాడేవీడు. యితడే దైవము, యితనికి నమస్కరించి వదలివేయుడు. మహాభక్తుడైన జయదేవుని, హస్తములు, కాళ్ళు, క్రూరులైన పరిచారికలు ఖండించినను జయదేవులను జూచినప్పుడు ఆ దుర్మార్గులు భయపడుచు వణకుచున్నను వారు మహాభక్తులని జెప్పి హెచ్చుగా పారితోషికములనిచ్చి సాగనంపెనని మనము వినియుంటిమి.

క్రీస్తు ప్రభువు జీవితములో, ఆయన శరీరములోనికి క్రూరమైన మేకులను దిగగొట్టుచున్నవారి క్షేమమునకై;

ఓ తండ్రీ వీరేమి చేయుచున్నది వీరికి తెలియదు, వీరిని రక్షించి, బ్రోచుము అని ప్రార్థించెను.

ఆ క్రీస్తు ప్రభువే, నుడివిన మరికొన్ని అనుభవమైన వాక్యములను స్మరించుచు ప్రయత్నించెదముగాక. వినుడు. మనుజులు నిన్ను హింసించు నప్పుడు నీ జీవితము అదృష్టమైనది. నీ నామమునకు కళంకముతెచ్చుచు, నీ మీద నిందలు వేయుచు, లేనిపోని కల్లలన్నియు ఆరోపణజేయుచున్నప్పుడు ఆనందముతో, సంతోషముతో గెంతులు వేయుము. స్వర్గములో నీకు ఫలితము (రివార్డు) హెచ్చుగావేచియుండును.

ఒక తత్వవేత్త "నిత్యశాంతి, పూర్ణశాంతి నీ గమ్యస్థానమైన శాంతికొరకే నీవు పరితపించుచు జీవించుచున్న చివరివరకు, నీ జీవితాంత్యము వరకు నీవే బాధపడుము. గాని నీ హస్తముల నుండి మాత్రము, నీవల్ల ఒక్క జీవి నైనను బాధపడనీయకుము" అని నుడివి యుండెను.

గాన మన విరోధులకు గూడ మననుండి ఏవిధమైన శ్రమయు,

బాధయు యెంత మాత్రము గలుగజేయరాదు. ఒరుల శిరస్సులను ఖండించి, వారు ప్రస్తుతము పొడవుగా యుండుటకు ప్రయత్నించుచున్నను వారినే సౌఖ్యముగా యుండనిమ్ము. వారి జోలికి పోవలదు. మన క్షేమముకైనను వారి పతనముకోరవలదు. యిదియే స్వర్గరాజ్యమను శాంతి ధామమును చేరుటకు ప్రత్యక్షమైన, సులభమైన దగ్గర మార్గము.

ఎంతమంది బోధించిన మహావాక్యములు విన్నను, చదివినను కథలా వర్ణించినను, ఆత్మానుభవము లేకుండా, విరోధులను ప్రేమించుట దుర్లభము. అపరోక్షమైన అనుభవమునందే, సృష్టి అంతయు దైవముగా, తన స్వస్వరూపముగా, ఆత్మగాగోచరించును. అట్టి పరిపూర్ణమైన స్థితియందే హృదయము నుండి ప్రేమ పొర్లిపారుచుండును. అచ్చట విరోధులని గాని స్నేహితులనిగాని విభజనలేదు. అందరు దైవస్వరూపములే.

ఎంత పండితులైనను, యోగులైనను, సన్యాసులైనను శరీరజ్ఞప్తి గలిగిన అహంకారమునకు బానిసలై, పేరు ప్రతిష్ఠలకై ప్రాకులాడెడివారు, విరోధులను ప్రేమించుచుంటిమనిన హ్యాస్యాస్పదముగా యుండును. ఒక్క బ్రహ్మజ్ఞానియే విరోధులను ప్రేమించును, బ్రహ్మజ్ఞానమే మానవజన్మకు గమ్యస్థానము. అట్టి బ్రహ్మజ్ఞానమును పొందుటకు మనకు, సావకాశమిచ్చుచున్న శాశ్వత మైన, సత్యమార్గమునకు, దారిజూపుచున్న మన విరోధులకు కృతజ్ఞతా వందనములు.

ఓ విరోధి రూపముగా, ప్రత్యక్షమై మమ్ము పరీక్షించుచున్న ఓ ప్రత్యక్ష దైవమా, నీకు పునః పునః వందనములు.

నీకు ఆంతర్యమున, బాహ్యమున, మీదను, క్రిందను అన్నివైపుల వందనములు. యిప్పుడు అప్పుడుగాక, నిరంతరము శాశ్వతముగా వందనములు

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

12-1-51

2.00 ఎ.ఎమ్

# 41. మా చిన్న నెహ్రూ

ఈ కలియుగములో పొట్టపోషించుకొనుటకు, అనేకమంది అనేకమైన వేషములు వేయుచుందురు. బహుకృతవేషం...అని పెద్దలచే, నుడువబడి యుండెను. ఈ వ్యాసమునకు సూత్రధారియైన వ్యక్తి, నెహ్రూపండితునివలె, పొడవైన, కాళ్ళకు అంటిపెట్టుకొనెడి షరాయి, పొడవైన చొక్కా దానిమీద చిన్న నెహ్రూ వెస్టుకోటు, అన్నిటికంటెను ముఖ్యమైన గాంధీటోపి ధరించు చుండును. నెహ్రూవలె దుస్తులను ధరించినంత మాత్రమున నెహ్రూలయ్యేదరా. నక్క ఎక్కడ దైవలోకమెక్కడ? కాకి నెమలి వెంట్రుకలను సంపాదించుకొని వాటిని తన తోకలో పెట్టుకొనిన మాత్రము నెమలి అవ్వునా?

ఈ వ్యక్తి వాల్తేరు ఆశ్రమం స్థాపించిన రోజులలో, మహాభక్తునివలె నటించుచు, నెహ్రూ బట్టలతో ఆశ్రమసేవచేయుచు తాను తరించవలెనని కోరుచుంటినని వచ్చెను. ఇతడు సిమ్మెంటు పనులు జేయుచుండెను. అతని వద్ద కొన్ని బెంచీలు, బల్లలు, నీళ్ళ కుండీలు వగైరాలు కొంటిమి. వాటితో ఆశ్రమ చిహ్నమును ఒకటిజేసి ఆశ్రమంకు బహుమతిగా యిచ్చుచుంటినని తమ వుదారత్వమును జూపెను.

కొంతకాలమైన తర్వాత,తనకు డబ్బు చాల అవస్థగా వున్నదని మీకొక విలువైన రైటింగ్ డస్కు సిమెంటురాయి శ్లాబు కలిగినది ఆశ్రమంకు అమ్మెను. తరచు వచ్చుచు అనేకమంది ధనికులను ఆశ్రమం తీసుకునివచ్చి వేలకొలది చందాలనిప్పించి బిల్డింగులు కట్టించెదనని జెప్పుచుండెడివాడు. మరొక మారు తాను చాలా అవస్థలో వుంటిననియు రూ. 250, రెండువందల యాభై రూపాయలు వెంటనే కావలయునని ఎటులనైన యీ అవస్థనుండి తన్ను కాపాడవలెనని, బదులు యివ్వమని, కాళ్ళమీదపడి ప్రాధేయపడ సాగెను. ఆ శ్రమమునకు ప్రణవ చిహ్నమును సిమెంటుతో జేసియిచ్చి సహాయము చేసిన వానికి ఆశ్రమభక్తునికి ఎటులనైన సహాయము చేయవలెననే కోరితినిగాని, ఆశ్రమంలో అంత డబ్బులేకపోయెను. అప్పుడు యెవ్వరిచేతనైన ఏదైన వస్తువు యిచ్చిన దానిని తాకట్టుబెట్టుగొని తన

అవసరము గడవగనే, మరల విడిపించి, ఆ డబ్బులు యిచ్చివేసెదనని జెప్పెను. అతని మాటలను నమ్మి, మహాభక్తుడైన నారయ్యాదాసు అనే జాలరినితో చెప్పగా తన యింట్లో స్త్రీల మెడలనున్న వస్తువులను తీసుకొనివచ్చి, బాబూ, మీ యిష్టము వచ్చినట్లు జేసుకుని, మీ అవసరము తీరగనే మరల తిరిగి యిచ్చివేయుడు అని జెప్పుచు అర్పించెను. వాటిని యీ సిమ్మోంటు భక్తునకు యిచ్చితిని. నెలరోజులు దాటకుండగనే యిచ్చెదనన్న వస్తువులు ఆరునెలలు, సంవత్సరము దాటినను యివ్వలేదు. అప్పుడు నేను జాలరి భక్తుడు కంగారుపడ సాగితిమి. చివరకు ఆ వస్తువులను తన డ్రైవరు అమ్మివేసి యెచ్చటకో పారిపోయెనని జెప్పెను. ఎంత దారుణము? వుపకారమునకిటులనే, అపకారము జేయుటయా? యిట్టి హాని, మాయ నెన్నడైనను కనివిని యుంటిరా? జాలరి భక్తుడు చాలామంచివాడు అవుటచే వస్తువుల ఖరీదుయైన యిప్పించమని కోరెను. అప్పుడు చాలా వత్తిడిజేయగా కొంత డబ్బులు ఆ జాలరునకు యిచ్చెను. నిరుపేదయైన అమాయకుడైన జాలరి భక్తుని భక్తియు, నేర్పరియైన సిమ్మోంటు వ్యక్తియొక్క నేర్పరితనము, మాయయు మనస్సునకు చింతను కల్గించెను. అటులనే కొంతకాలము జరిగిపోయెను. తరువాత మన సిమ్మోంటు మనిషి గొప్ప గొప్ప ధనికులతోను, వుద్యోగస్తులతోను మరల ఆశ్రమంకు వచ్చి అనేకమైన వాగ్దానములు చేయదొడగెను. తాను ఆశ్రమంకు జేయనున్న సహాయ మంతయు, ముందు ముందు జూపెదనని జెప్పుచుండెడివాడు.

ఒక్కరోజున అయిదు నెలల క్రింద ఆశ్రమమునకు ఒక కారు, చాల చవక ధరలో కొనిపెట్టెదనని కారుమీద కారు యజమానిని తీసుకొనివచ్చి ఆశ్రమస్తులను, నన్ను, కైలాస ఆశ్రమము త్రయలుగా తీసుకొని వెళ్ళెను. ఆ సందర్భములో నూరు రూపాయలు మాత్రము చాలా అవసరమని మరల మూడురోజులు దాటకుండా, యిచ్చివేసెదనని మరల మరల ప్రార్థించ సాగెను. అప్పుడు డబ్బుయిచ్చుట నాతో లేదని యిదివరలో అనేకమంది, మోసపుచ్చుటచే ఆశ్రమ కమిటీవారు, అందరు కలసి, ఏ పనియైన జేయవలెనని జెప్పగా వారితో జెప్పియే యీ సహాయం జేయించమని కాళ్ళ వ్రేళ్ళపడి బ్రతిమాల సాగెను.

తనతో, ఒక లక్షాధికారియైన ధనవంతుని తీసుకొనివచ్చి, అతడే తనకు మూడురోజులలో యిచ్చునని ఆ డబ్బు అందగనే మరల ఫిరాయించెద నని, లేకున్న తనకు అనేక చెక్కులు, బిల్లులు రానున్నవనియు జెప్పెను. పైగా, ఆ ధనవంతుని, ముందుగనే అతనిచే నాలుగువేల రూపాయలు విలువైన ఒక భవనము కట్టించుటకు ఏర్పాట్లు చేయుచుంటినని చెప్పెను.

ఒక్కమాటు తప్పుచేసినవాడు ఎప్పటికిని తప్పుజేయునా అనియు, 'పరోప కారార్థ మిదం శరీరం' గాన ఏడు రోజులలో మరల యిచ్చివేసెడి డబ్బుకు ఒక వ్యక్తి చాల అవస్థలో వుండ చేయూత నిచ్చుట మంచిదని ఆశ్రమ సభ్యులకు జెప్పితిని. గాని వారికి ఎంతమాత్రము నేను జెప్పిన, యిచ్చుట యిష్టములేదు. మరల మరల, సిమ్మెంటు మనిషి తనలాంటి నిజాయితీ యైన మాటనిలకడ గల్గిన మనిషి విశాఖపట్నం అంతలో లేడనియు తనమాట ప్రకారము డబ్బు తిరిగి వెంటనే యిచ్చివేసెదనని, ఆశ్రమస్థుల నందరిని ప్రార్థించసాగెను. అందరము కొంచెం మెత్తబడితిమి. అప్పుడు ఆశ్రమ సభ్యులకిష్టములేకున్నను నూరురూపాయలు, వారి చేతనే రైసు డిపోలో డబ్బు, మరల కోటా తీసుకొనుటకు కావలెననియు యెన్నోరీతులుగా జెప్పి యిప్పించుటకు కోటా రోజు రాకుండగనే, మరల యిచ్చివేసెదనని ధర్మరాజు, సత్యహరిశ్చంద్రుడు వలె మాట్లాడుచు ఆ డబ్బుతో కారుమీద వెళ్ళెను.

సిమ్మెంటు వర్కు యొక్క ప్రొప్రయిటరు అధిపతి పెట్టిన మూడురోజుల గడువు దాటిపోయెను. తనకు రావలసిన బిల్లులు రాలేదని, పదిరోజులలో యిచ్చి వేసెదనని, ఆలస్యమునకు మన్నించమని ఉత్తరము రాసెను. పదిరోజులలో యిచ్చివేసెదనని, ఆలస్యమునకు మన్నించమని ఉత్తరము రాసెను. మరల ఆ గడువు గూడ దాటి 30 రోజులయ్యెను. ఎన్నోవుత్తరాలు వ్రాస్తిని. ఆశ్రమస్తులు డబ్బు స్వయంగా యిచ్చినవారు యెన్నోమారులు అతని షాపుకు వెళ్ళసాగిరి. వెళ్ళినప్పుడెల్ల ఏదో తన కష్టకాలము గురించి జెప్పుచు మరికొన్ని రోజులు గడువు ప్రార్ధనపూర్వకముగా కోరుచుండెను.

చివరకు 20 తారీఖున తాను డబ్బు యివ్వకున్న ప్రాణహానియైన చేసుకొందునన్నంత వాగ్దానము జేసెను. మరల, ప్రార్థనపూర్వకముగా 10వ

తారీకున ఎన్ని అవస్థలనైనపడి, యిచ్చివేసెదనని నమ్మించెను. ఒకరోజు ముందుగానే వెళ్ళి మందలించి కఠినముగా అడుగగా తాను ఆశ్రమం స్థాపించి నప్పుడిచ్చిన సిమ్మెంటు చిహ్నాము, యైదు వందల రూపాయల ఖరీదు అనియు, ఆశ్రమంకు గాన మూడువందలు తీసుకొందుననియు గాన తనకే యింకా 200 రూపాయలు వచ్చునని, వెంటనే పంపమని, ఆ తుచ్ఛమైన నోటితో తుచ్ఛమైన మాటలాడసాగెను.

నేనీ విచారకరమైన ఘోరమైన వార్తను వినగానే నా హృదయము చింతచే జలదరించసాగెను. యింకను యీ మాటలు నిజమని నమ్మజాలను లోకములో యిట్టి మాయ,మోసము, క్రూరమైన హృదయము గల్గిన అబద్ధీకులు యుంటిరా? ఆశ్రమ అవస్థలలో 100 రూపాయల నష్టము గురించి అంత చింత గలుగుటలేదుగాని, మనిషి యొక్క క్రూరత్వము, మోసము అసత్యము తలచిన, హృదయమేగాక, ఆత్మగూడ జల్లుమనుచు చింతను గల్గించుచుండెను.

అయినను అఖండమైన స్థిరమైన పరిపూర్ణమైన ఆత్మను, అల్పమైన, అస్థిరమైన, తుచ్ఛమైన 100 రూపాయలకు అమ్ముకొనెదనా? గాని ఇప్పుడు నేను హెచ్చుగా విచారించుచున్నది, నా మూఢ నమ్మకమునకు అమాయకత్వ మునకే–

సిమ్మెంటు కృష్ణుని క్షమించనుంటిని గాని, నన్ను నేను క్షమించ జాలకుంటుని. ఒక్కసారి మోసం చేసిన వ్యక్తిని, బదులుగా తీసుకొనివెళ్ళి, తాకట్టు పెట్టిన వస్తువులనే అమ్మివేసిన వ్యక్తిని మరల యెంత తియ్యని మాటలు జెప్పినను, ఆశ్రమములో యెన్ని భవనములు, తన స్నేహితులచే కట్టించెదని వాగ్దానములు జేసినను మరల అతనినే నమ్మి, క్రూరమైన, వ్యాఘ్రము యొక్క నోటిలో దూరుట క్షమించరాని గొప్పతప్పు.

ఇప్పుడీ సంఘటన వల్ల నేను నేర్చుకున్న పాఠమేమన, బదులిచ్చిన 100 రూపాయలకు దణ్ణము. సిమ్మెంటు కృష్ణునికి మరొక వందనము, గాని, ఉపకారము జేయుటకు వెళ్ళి అపకారము బొందుట, విలువైనకాల మును నెలలకొలది ఆతురతతోను, తాపత్రయములతోను వ్యర్థపుచ్చుట

చాల విచారమైన అంశము. అన్నింటికంటెను ముఖ్యమైనది, మాబోటి మెత్తనైన హృదయములు గలిగిన సాధువులు ఆశ్రమ సంబంధమైన ముఖ్యముగా ధనముతోగూడియున్న పనులలో, యెంతమాత్రము జోక్య ముంచు కొనరాదు. ఒక్కమారు మోసపడియు, మరల, మోసగానికే సహాయము జేసెడి వెర్రివాండ్రు, యీలోకములోనే యుండుటకు అనర్హులు. మాయ మోసము, అధర్మము, అసత్యము లేని మరొకలోకమునకు ఎంత త్వరలో వెళ్ళినా అంతమంచిది.

ప్రియమైన పాఠకా, నీకిటువంటి పరీక్షనెన్నడైనా గలిగెనా? యీ వ్యాసము 100 రూపాయల విలువజేయునా? నా మనస్సు చింతగా యున్నను, నావల్ల నా తెలివి తక్కువచేతను, బుద్ధిహీనతచేతను, మెత్తని మనస్సువల్లను, అపకారికి గూడ, అవస్థలో వున్నప్పుడు వుపకారము జేయుట మంచిదనెడి భావముచేతను, నేను కొంతబాధ పడినను యీ వ్యాసమువల్లయే ఒక్క వ్యక్తియైనను కొంతలాభమును పొందగలిగిన రూ 100 రూపాయలు వ్యర్థమవ్వలేదని, కొంత సంతోషించెదను.

అస్థిరమైన, చపలచిత్తమైన ధనమును దైవమే యిచ్చెను. దైవమే తీసికొనెను. దానిని మన వెంట తీసుకొని వచ్చితిమా? మరల, వెంట తీసుకొని వెళ్ళగలమా! అపకారికైనను వుపకారము జేసిన వారెన్నడును పశ్చాత్తాపము జెందనవసరముండదని మహనీయులు నుడివియుండిరి. నిన్ను నిందించుచు, హింసించెడివారిని దీవించుమని మరొక మహనీయుడు జెప్పియుండెను. యింతకూ స్వభావము నెవ్వరు మార్చగలరు? నా స్వభావమును బట్టి నేను జేయబడితిని. సిమ్మెంటు వ్యక్తి స్వభావమును బట్టి అతడు జేయుచుండెను. యేడుమార్లు తేలుకుట్టినను యింకను, తేలును, వరదలనుండి రక్షించుటకే ప్రయత్నించిన సాధువుని, వుదాహరణను మీరు వినియేయుందురు. "నిన్ను కుట్టుచున్న తేలును మరల పట్టుకొని రక్షించ ప్రయత్నించదవేల; ఓ బుద్ధిహీనుడా" అని లోకజ్ఞానము గల్గినవారు మందలించినను "దాని స్వభావము కుట్టుట నా స్వభావము కాపాడుట" అని మాత్రము సమాధానము జెప్పెనట! ఎవ్వరి స్వభావముననుసరించి, వారు వారు జేయుచుండ, యిక చింతలేల, తాపత్రయములేల?

ఓ దైవమా! నూరు రూపాయలు కాదు గదా లక్ష రూపాయలు పోయినా, ప్రపంచములోవున్న రూపాయలు అన్నియు పోయినా, సచ్చిదానంద స్వరూపడవైన, నిన్ను మాత్రము మరువ నీయకుము. సర్వ ములో నిన్నే దర్శించుచు, నీలో, నీ దివ్య తేజస్సులో నీపూర్ణప్రేమలో నీ అఖండమైన శాంతిలో విలీనమయ్యేడిలాగున కరుణించుము.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం ఓం ఓం

8-12-49

4.00 ఎ.ఎమ్.

# 42. సర్పము

సర్పము అన్నను పాము అన్నను ఒక్కటేగదా! సర్పము అనెడి మాట సంస్కృతపదమై యుండవచ్చును. పాము అన్న అందరకును తెలియును.

పాము అన్న అందరకును భయమేగదా! కైలాసములో, చిన్నపాములు, పెద్ద పాములు గూడ గలవు. గాని అవి దైవకృపచే తమ దైవప్రేమచేతను ఎవ్వరికిని, ఎప్పుడును హాని జేయవు.

అల్పమైన, బాహ్యమున యున్న చిన్న చిన్న పాములకు మానవుడు భయపడుచుండెను గాని తనలో పెద్ద పామును జూచి భయపడకుండుట ఆశ్చర్యము. అది మహాపకారమైన పాము.

ప్రశ్న: ఆ పాము యెద్ది?

జవాబు: అదియే అహంకార మనెడి సర్పము.

ఈ అహంకారమును, మనుజుడు మాయలోబడి, విషమునే అమృతముగా భావించుచు దానికి దూరముగా యుండుటకు బదులు యీ అహంకారమునే, ఆలింగనము జేసుకొని రాత్రింబగళ్ళు అద్దానిని పూజించుచుండెను.

ఏమి ఆశ్చర్యము!

అందుచేతనే, చిన్న చిన్నవైన పాములకు, విషపురుగులకు, మనుజుడు, భయపడుట జరుగుచున్నది. దేనిని జూచినా భయపడును, తాటియాకు చప్పుడైనను మనుజుడు అదురుచుండును.

నా చిన్నతనములో ఒక తోటమాలీ మనిషి, భక్తుడు, ఒక చిన్న పాటను పాడెడివాడు. దాని మొదటిపంక్తి నాకేలనో, యిప్పుడు జ్ఞప్తికి వచ్చుచున్నది.

**చావదురా, యీ పాము చప్పిడిదెబ్బలకు**

ప్రశ్న: చిన్నచిన్న చప్పిడిదెబ్బలకు చావనిపాము యెద్ది?

జవాబు: అదియే అహంకారమనెడి కాలసర్పము, విషపూరితమైన సర్పము.

ఈ అహంకారమే, మనుజుని జీవితములో, బాధలకు, అవస్థలకు, సృష్టిలో పెద్దపెద్ద కరవులు మహాయుద్ధములకు, లోకబాధలన్నిటికి మూల

కారణమైయున్నది. సృష్టి అంతయు అహంకారముతో ప్రారంభింపబడి, దానిచేతనే వర్థిల్లును. అహంకారం నశించినప్పుడే, సృష్టికూడ నశించు చున్నది. అనగా మాయమగు చున్నది.

ఇప్పుడు మనకు కావలసినది :

ప్రశ్న: ఈ అహంకారమును, నామరూపములు లేకుండ రూపుమాపుట యెటులను? ఇది చిన్న చిన్న ప్రయత్నములకు, చప్పిడి దెబ్బలకు, చావని యెడల దీనిని దేనితో కొట్టవలయును?

జవాబు: బ్రహ్మాస్త్రము ఒక్కటే మిగిలియున్నది. బ్రహ్మ జ్ఞానమనే ఖడ్గముచే అహంకారమనెడి విషసర్పమును ఖండించవలెను. బ్రహ్మసాక్షాత్కారమే దీనికి తిరుగులేని మందు.

చావదురా యీ పాము చప్పిడి దెబ్బలకు

గాన, మోక్షాపేక్ష గల్గిన మోక్షప్రియులందరును, యీ హానికరమైన, శరీరములోను, గృహములోను, సంఘములోను జాతులలోను, దేశముల లోను, ప్రపంచమంతను అనేక భేదభావనలు, కలహములు, దెబ్బలాటలు, పోరాటములు, వర్ణనాతీతమైన బాధలకు చివరకు మృత్యువునకు గూడ, మూలకారణమైన, యీ అహంకార సర్పమును, యికనుండియైన, సర్పముగా భావించి పూజించక దానిని బ్రహ్మాస్త్రముచే ఖండించి, కోటిసూర్య ప్రకాశమానమైన, దివ్యతేజస్సులో నామరూపములు లేకుండ వుండెడిలాగున భస్మీభూతము చెయ్యవలెను.

అప్పుడు మాత్రమే పాముల భయము లోపలను, బాహ్యమున పూర్తిగా పోవును. ఆంతర్య సర్పమును జయించిన వారికి కోటి బాహ్య సర్పములైనను లేశమైన హానిని గల్గించజాలవు. అన్నింటికంటెను భీతి పెనుబాము. అదియే అజ్ఞానము, అహంకారము. అహంకారమును జయించుటేముక్తి. అదియే మోక్షము. అహంకార రహితులకు ధన్యవాదములు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు, ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

శ్రీకైలాసము

1-2-52, 5-00 ఎ.ఎమ్.

# 43. కుళ్ళిన పండ్లు

కుళ్ళినపండ్లు అనగా చెడిపోయినవి. వాసనకొట్టెడి పండ్లేకాదు. ప్రేమ శూన్యముగా, అహంకారముతో డంభము కొరకై అర్పించుచుండిన పండ్ల న్నియు, ఎంత మిలమిలలాడుతూ, తాజాగా రసముతో నిండియున్నవైనను, కుళ్ళినపండ్లతో సమానమే. తామస వృత్తితో జేయు దానములన్నియు, కుళ్ళినపండ్ల వంటివే. మనుజుడెట్టి అవస్థలోయున్నను, ఆకలిబాధచే మలమల మాడుచున్నను, అట్టి దానములను, నిరాకరించవలసినదే.

నీకెవ్వరైన, కుళ్ళినపండ్లను, ధర్మము చేసిన వాటిని నీవు తీసుకొనకుండ గనే, తిరిగి వారికే యిచ్చివేసిన, ఆ కుళ్ళినపండ్లను, వారే ఆరగించి వాటి ఫలితమును, వారే అనుభవించవలయును. కుళ్ళిన పండ్లు అనగా పండ్లేగాదు. మిఠాయిలు, పకోడీలు మొదలైన తినుబండారములై యుండ వచ్చును. లడ్డు, బర్ఫీలేకాక, చివరకు, విలువైన నోట్లు, ధనమునైనను భక్తి హీనముగా, ప్రేమ రహితముగా, తామసగుణముతో అర్పింపబడినవి, కుళ్ళిన పండ్లతోనే సమానము. వాటిని ఆత్మవాదులు ముమ్మాటికిని నూరుపాళ్లు నిరాకరించవలసినదే. కనికరముచేతను, వివేకము లేక యితరుల పట్టుదలచే, నీవాపండ్లను అంగీకరించి, వాటిని భుజించిన యెడల, దాని ఫలము కుళ్ళి కుళ్ళి మానసముగాను, స్థూలరీతిగాను, ఖర్మననుసరించవలసినదే.

నిత్యానిత్య వివేకము గలిగి, విజ్ఞానముతో ధర్మ, సత్యమునే ఆదర్శముగా గల్గి జీవించుచు, కుళ్ళిన పండ్లను నిర్మోహమాటముగా నిరాకరించినప్పుడే నీకు శాంతి, మోక్షము, కరతలామలకముగా యుండును. కుళ్ళినపండ్లను నిరాకరించుట సులభమే. గాని, పండ్లు రసవంతమై, ఆకర్షణీయముగా యున్నప్పుడు, నీవు ఆకలిచే వాటి, అవసరములో యున్నప్పుడు, అర్పించబడి నప్పుడు, నిరాకరించుటే నిజమైన గొప్పస్థితి. ఆకలిచే ప్రాణము పోయెడి అవసానకాలమునందు గూడ, నీవు ప్రాపంచ ఫలములను కోరకుండా, ఆత్మఫలమునే నీ మనస్సు కోరుచున్న,నీ ఆత్మానుభవమును వెయ్యినోళ్ళ కీర్తించవచ్చును.

శ్రీ కైలాస ఆశ్రమంలో, సింహద్వారము, గేటు చాల దూరములో యున్నది. పగటివేళయందు దాని తలుపులు తెరచియే వుండును. గాని, రాత్రి సమయమున కొండగౌడులు ఎవ్వరైన త్రాగివచ్చి విలువైన కాలమును, వ్యర్థపరచెదరని సాయంకాలం పడెడి సమయమందు, గేటుకు తాళంవేసి మరల సూర్యోదయము సమయమందు, తాళము తెరవబడుచుండును. గడచిన రాత్రి మామూలుగనే, నేను నా నిర్వాణమందిరమున పనియందు మగ్నుడనై యుంటిని. అప్పుడేదో ఆర్తనాదమువలె, అవస్థలో వున్నవారు, అరచుచున్నట్లు వినిపించగా బయటకు వెళ్ళి జూచితిని. కొంతసేపటికి, ఒక మనిషి బ్యాటరీలైటుతో వచ్చుచుండెను. అప్పుడాతడు నన్ను పిలుచుచు, అరగంట నుండి గేటువద్ద నిలువబడి, తినుబండారములను మోయుచు, పిలుచుచుంటి మనియు, గేటు అవతల మనుష్యులుండిరనియు, తాను గేటు ఎక్కివచ్చితినని చెప్పగా. అప్పుడు నిర్మల కుటీరములో నిద్రించుచున్న సాయుధ సూర్యనారాయణను మేల్కొలిపి తాళములిచ్చి గేటు తెరువడ మాయెను.

తరువాత, యిద్దరు భక్తులు పెద్ద బుట్టతో హల్వా, బర్ఫీ, లడ్డు యింకను యేమేమో పకోడీ, కారాపూస వగైరా తినుబండారాములన్నింటిని తీసుకుని వచ్చి నిర్వాణమందిరములో ప్రవేశించి, ఆ బుట్టను నాకు అర్పించిరి, తర్వాత ఒక నూరురూపాయలనోటును గూడ స్వీకరించమని అర్పించిరి.

గాని, ఆ అర్పణ, ఆ ధనము ప్రేమ శూన్యమైనదని గ్రహించి, అచ్చటనే వుండమని జెప్పుచు ఈలోపుగా వ్రాసిన వుపన్యాసమును చదివి వినిపించి, వారు శ్రమదీసుకుని రాత్రిలోవచ్చి నందుకు నూతనమైన శక్తిని, శాంతిని వృద్ధిజేసుకొని వెళ్ళమని కోరితిని. తరువాత కొంతతడవు ధ్యానము, ప్రణవ గానము చేయబడెను. వారెన్నో రీతులుగా, వారు తెచ్చిన ఫలములను అంగీకరించమని కోరిరి. గాని – ఆ తినుబండారముల నుండియు ఆ డబ్బునుండియు, తామసమైన చెడ్డవాసనే, వచ్చుచుండుటచే, నా మెత్తని మనస్సును, కఠినంగా రాయివలె జేసుకొని నిరాకరించవలసి వచ్చినందుకు నేను గూడ విచారించితిని.

మరల ఆ అర్ధరాత్రిలో, ఆ తినుబండారముల బుట్టను నెత్తినబెట్టుకొని నూరు రూపాయల నోటును తీసుకొని వారు, అలోనారాయణ అనుచు, చలిలో, చీకటిలో వెళ్ళుట చూచిన, యెట్టివారికైనను చింతయే గలుగును.

గాని ప్రేమ శూన్యముగా, లాంఛనమునకు తామస వృత్తితో అర్పించ బడిన కానుకలు ఎంతో విలువైనవైనను వాటిని నిరాకరించుట తృణీకరించుటే మన ధర్మముగా వుండవలెను. లోకము ప్రేమతో శాంతితో సాత్విక గుణములతో నిండి వర్ధిల్లుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

శ్రీ కైలాసము

27-12-50

6.00 ఎ.ఎమ్.

# 44. వృక్షముల కృతజ్ఞత

వృక్షములెంత కృతజ్ఞత గల్గినవో, మానవుడెన్నడైనను ఆలోచించుచున్నాడా? సామాన్య మానవునకు, తన కుటుంబమును పోషించుకొనుటకు, పొట్టనింపెడి ఆలోచనతోనే జీవితమంతయు వెళు ళ్ళచుండెను. యిక వృక్ష ములు, జంతువుల గురించి ఆలోచించుట కెచ్చట తీరిక వుండును. గాని, వృక్షముల యొక్క కృతజ్ఞతయేగాక వాటి కష్టసుఖములు గూడ, వృక్ష శాస్త్రజ్ఞు లకు (బొటానిస్ట్) అనుభవమే.

మనమొక చెట్టును వేయుచు అది మొలకెత్తే వరకు నీరును పోయ వలెను. నారు నాటిన తరువాత నీరుపోయకున్నను అనేకజాతుల వృక్షములు వాటంతట అవియే బ్రతుకుచుండును. సుశీలామందిరము వద్ద స్నానముల గది ప్రక్కనే ఒక నిమ్మాచెట్టు గలదు. ప్రతీ సంవత్సరము ఎన్నియో పచ్చని కాయలతో నిండియుండును. తరచు యీ చెట్టుకాయలు క్రిందపడేవరకు కోయకుండా అటులనే వాడుచుందుము.

శ్రీ సుశీలాదేవి గారిచ్చటి నుండి వెళ్లినప్పటి నుండియు, దానికి నీళ్ళు కరువాయెను. నేను జూచేసరికి కొంచెము వాడుచున్నట్లు వున్నది. నేనిచ్చట స్నానముజేయ ప్రారంభించిన తరువాతను దాని ఆకులన్నియు నవనవలాడుచున్నవి. త్వరలో పువ్వు, పిందెవేసి కాయలుగూడ యిచ్చును. యివి నిమ్మకాయలు దొరకని రోజులయినను, యీ నిమ్మ చెట్టు, మీ వుపవాసమునకు పది నిమ్మపండ్లు నేను యివ్వదలంచితిని, అన్నట్లు పది కాయలవరకు, చిన్న చిన్నవి అచ్చటచ్చట వున్నవి.

మరొక చిన్న పుష్పము, చిన్నదుంపలో నుండివచ్చును. వీటిని గ్రామ ఫోను పువ్వులందరు. కాడలు అందముగా యుండును. వాటిని తోటపల్లి ఆశ్రమంలో చెట్ల మొదటను, చుట్టును పాతితిమి. ఎండాకాలములో అవి మాయమైపోయినట్లు, కనిపించకుండా యుండును గాని, యీరాత్రి మీరు చెంబుడు నీళ్ళుపోసిన రేపు ఉదయమునకే మొలకెత్తును. "మూడు రోజు లోనే మోక్షము" అన్నట్లు మూడు రోజులు నీళ్ళుపోసిన వాటి పుష్పములను జూడగలము. వృక్షముల యొక్క తీగలయొక్క దుంపలయొక్క విత్తనములు,

యెంత కృతజ్ఞత జూపుచున్నవో పై అంశములనుబట్టి మీరే ఆలోచించుడు.

ఇక మనుజుడో! ఏలనో, మనుజుడు కఠిన హృదయుడై, ఎంత పెట్టినను, ఎంత ఆదరించినను, అకృతజ్ఞునిలా యుండుట చాల విచారకరమైన విషయము. ఒక్క మనుజుని, సంవత్సరముల కొలది, వెన్నమీగడలతో మేపినను, ఒక్కరోజు మజ్జిగ పలచగావున్నను, పాలుతక్కువయైనను, కళ్ళు యెఱ్ఱ జేయును. కళ్ళు యఱ్ఱజేయుటయే గాక, మనమీద, తన దగ్గర వున్నవారితోను, చుట్టువున్నవారితోను, యిరుగు పొరుగు వారితోను, వచ్చే పోయే వారితోను, అనేకమైన కొండెములు జెప్పుచు, తన అకృతజ్ఞతను వేయినోళ్ళ వెల్లడి చేయును.

కృతజ్ఞులైన మనుజులు, సజ్జనులు లేకపోలేదు. గాని అట్టివారు అరుదు. సామాన్య మానవుడు, ముఖ్యముగా దైవవాసన లేనివాడు, యేవో యొగ్గులను పట్టుటకే ఖండించుటకే ప్రయత్నించుచుండును.

చెట్టుయొక్క సహనమును, ఓర్పును, కృతజ్ఞతను జూడుడు. ఎంతకాలము నీరుపోయకున్నను, అటులనే జీవించుచు, మన ప్రేమ పానీయంబులకై వేచియుండును. మనుజుడు ప్రవృత్తి పరుడు చెట్టువద్ద గూడ నేర్చుకొనవలసిన మంచి గుణములెన్నియో గలవు. ఒకచెట్టు వద్ద అననేల ప్రతీ జీవినుండియు, జంతువు నుండియు ప్రతీ వస్తువు నుండియు, నేర్చొకొనెడివానికి, నేర్చుకొనుట కెన్నియో గలవు. కుక్కను జూడుడు. అది ఎంత విశ్వాసమైనది. తన యజమానికి, కృతజ్ఞతను జూపుటేగాక, చివరకు ప్రాణదానమును గూడ జేసిన, విశ్వాసపాత్రమైన శునకముల యొక్క జీవ చరిత్రలను వినియుంటిమి.

ఎన్నటికైనను, కృతజ్ఞత వృక్షములలోనైనను, జంతువులలోనైనను, మనుజునిలోనైనను, బంగారమునకు వన్నెతెచ్చినట్లు ప్రకాశమునే గల్గించి తోడ్పడును. కృతజ్ఞత లేని జీవితములు, ముండ్లపొదలు, బ్రహ్మ చెముడు కాయలవంటివి. వాటిని సమీపించుటే మానవునకు హానికరము.

సహనము, కృతజ్ఞత గలిగిన మనిషి చిన్న చిన్న మేఘములు వచ్చినను, తాత్కాలికమైన మేఘములను లెక్కించక, నిత్యమైన, శాశ్వతమైన సూర్యునే

దివ్యతేజస్సునే స్థిరము జేయును. ఎప్పటికైనను, ఆనందము శాంతి అట్టి స్వార్థరహితులదే!

ఇంతయేల స్వార్థుడెప్పుడును, పురుషుడైనను, స్త్రీ యైనను అకృతజ్ఞత తోనే జీవించును. స్వార్థుడు, అంతయు తాను తినవలెనని, తాను పడవేసు కొనవలెననే జూచుచుండును. యిక స్వార్థరహితుడో, యితరుల మేలు, యితరుల వృద్ధి, యితరుల శాంతి, యితరుల ఆరోగ్యము కోరుచు పరోపకారార్థం మిదం శరీరమనెడి ధర్మసూత్రమును సదా ఆచరించుచుండును. అట్టి వారి జీవితములు ధన్యవంతములు.

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

7-3-50

10.30 పి.ఎమ్.

# 45. శ్రీ రామదాసుజీ

**రామదాసుగారు రశీదు అందుకోండీ.** అనెడి పాట తలవని తలంపుగా నా నోటినుండి వచ్చుచుండుటచే, యీ వ్యాసము వ్రాయుట ప్రారంభించు చుంటిని. యీ పాట నానుండి వచ్చుటకు కారణము, శ్రీరామదాసుగారు అనెడి భక్తుడు, ఒక ధ్యానమునుండియే నిన్నవచ్చెను.

ఆయన ముప్పది సంవత్సరముల క్రింద తోటపల్లి ఆశ్రమంకువచ్చి యుండెను. అప్పటినుండి మరల ఆయనను జూచుటకిదియే మొదటిసారి. అప్పుడు అనగా ముప్పది సంవత్సరముల క్రితమున పాఠశాలలో చదువు కొనెడి విద్యార్థిగా యుండివచ్చెను. ఇప్పుడు భార్యా పిల్లలతో వచ్చెను. చాల సంవత్సరముల నుండి శ్రీ హరినాధ బాబాగారికి ముఖ్య శిష్యుడుగా యుండి ఆంధ్రదేశములో హరినాధ సేవ ప్రచారము భజనలు జేయుచుండెను. ఈయనపేరునకు సరిపోయెడిలాగున, యీ పన్నెండు సంవత్సరముల నుండియు, శ్రీరామదాసుగారు భద్రాచలరాముని సాన్నిధ్యమునందే గవర్న మెంటులో ఏదో పనిజేయుచు, తీరికగా వున్న సమయములయందు శ్రీహరి నాధ ప్రచారము జేయుచుండిరి.

పూర్వజన్మ సుకృతముచే భద్రాచలరాముని చరణముల దరిని జీవిత మును, గడుపుచుండుటేగాక తనకు తగిన, తన ఆదర్శములను గ్రహించి సహధర్మచారిణిగా యుండుటకు తగిన నారీ రత్నమును గూడ బడయ గలిగెను. రాముని సేవ జేయుచున్న వారింకేమి కావలెను. **తక్కువేమి మనకు రాముండొక్కడుండు వరకు.**

ముప్పది సంవత్సరములు గతించిన తర్వాత మరల శ్రీరామదాసుజీ కుటుంబముతో నన్ను జూచుటకు వచ్చినందుకు చాల ఆనందించి రామదాసు గారు వచ్చినారా రశీదందుకోండీ –అనగా శాంతి సందేశమును గ్రోలండీ అని నేను ఆనందముగా పలుకరించగా ఆయన తీక్షణముగా నన్ను రామదాసు అనవలదు, కామదాసు అనమని సమాధానము జెప్పెను. నిజమైన భక్తులు అతివిధేయతగా, అహంకార శూన్యులుగా వుందురని, ఆనందించుచు, ఆయనజేయుచున్న హరినాధసేవను, భద్రాచలములో

గడుపుచున్న శాంతి జీవితమును కొనియాడితిని.

గాని, రామదాసుజీ, చాలాకఠినముగా తనలో శాంతిలేదనియు, ఎవ్వరిలోను శాంతి లేదనియు, లోకమలో శాంతిలేదనియు, మనుజుడు, డంభము, దర్పము, కామము, క్రోధము, అహంకారముతో జీవించుచుండె ననియు అందుకు ప్రత్యక్షప్రమాణము తన భక్తిహీనమైన ప్రవృత్తి జీవితమే ఉదాహరణ అని వుపన్యసించసాగెను. ఎన్నిరీతులుగా, ఎంత ధైర్యమిచ్చుటకు ప్రయత్నించిన ఆయన తనలో అంధకారమును గాంచుచు అందరిలో ఆ చీకటినే గాంచుచు విరక్తిగా, విపరీతముగా మాట్లాడసాగెను.

రామదాసును కామదాసు అనెను. రామనామములో యే మర్మము లేదనియు, దుమ్ములు నమిలినట్లు వున్నదనెను. తన భజనలు వ్యర్థమనెను. శాంతి శూన్యమనెను, భక్తిగాని, ప్రేమగాని, శాంతిగాని లోకములో ఎచ్చటను లేనే లేదని ఘంటాపదముగా జెప్పగలనని వాదించుచుండెను. శ్రీరామదాసు గారు, అధైర్యము, చింత, నిరుత్సాహములకు బానిసలై అటుల వాదించు చుండుటచే తనచుట్టునూ వున్న వారి కందరికి నిరుత్సాహము గలుగసాగెను.

రామదాసుగారూ, దైవము జీవించియే యుండెను. యింకను చనిపో లేదు. అతడు మన శరీరమంతయు నిండి, హృదయమునకు హృదయముగా కోటిసూర్య ప్రకాశమానముతో, మనము మరచియున్నను సదా వెలుంగు చుండెననియు ఆ దివ్య స్వరూపమును సదా గుర్తించుటే మానవ జన్మవిధి యని జెప్పగా, ఇవన్నియు మాటలు, వట్టి మాటలు, వ్యర్థమైన మాటలే అని, గాంభీర్యముగా జెప్పసాగెను.

శ్రీరామదాసుగారి శరీరంతో అందరి శరీరములు చల్లబడసాగెను. ఏమి మాట్లాడుటకు, ఎవ్వరికీ, ఏమీ తోచుటలేదు. ఏమి జెప్పినను అంతయు మాటలుగానే యుండెను. చింత, నిరుత్సాహము అనెడి అంటువ్యాధి, అందరకు తగలనారంభించెను. మరొక్కసారి నేను రామదాసుగారు మనము వెలుతురుచే నింపబడియుండి, వెలుతురును జన్మహక్కుగా గల్గి, మన కండ్లు మూసుకుని నాలోపల చీకటి, మీలో చీకటి, అందరిలో చీకటి అని అనరాదని జెప్పితిని. అప్పుడుగూడ, ఆయన నాకు చీకటియే లోపల బయట గానవచ్చు చున్నది. గాన నేను యెటుల అబద్ధమాడగలనని కఠినముగా వాదించ

సాగిరి. ఇంక వాదించినా లాభములేదని, శాంతి కరపత్రములనిచ్చి, రామదాసు గారిచే చదివించితిని. అచ్చుటచ్చుట చదువుచు ఆగి అధైర్యముగా వ్యాఖ్యానము చేయతొడగెను. కాని చివరకు ఆ శాంతి కరపత్రము పూర్తి అయ్యెడి సరికి, కొంతమార్పు గలిగెను.

శ్రీరామదాసు గారు చెప్పెడి మాటలలో సత్యము లేకపోలేదు. కొంత యధార్థము గలదు. మనుజుడు, దుమ్ములనే సదా నములుచు దానితో తృప్తి పొందుటకు ప్రయత్నించు చుండెను. దుమ్ములనుండి సారము వచ్చునా? మనోనాశనము కలుగకుండ శాంతి గలుగునా? విషయ వాసనలను విడువకుండ ముక్తిగలుగునా? అహంకారమును చంపకుండా మనుజునకు మోక్షము సిద్ధించునా? మాటలకు, బోధలకు అతీతమైనదే శాంతిగదా!

అప్పుడు శ్రీరామదాసు గారిని, ఆశ్రమంలో యున్న అనుభవనీయులైన శ్రీయోగిగారిని దర్శించి, శాంతిని బడయుమని కోరితిని. ఎవ్వరిని దర్శించినను, ఏమియు లాభములేదని, నిర్మోహమాటంగా జెప్పెను. ప్రార్థన వలన లాభము కనిపించుటలేదు, ధ్యానము వల్ల అసలే ఫలితములేదు. నామ సంకీర్తనముతో, దుమ్ములు నమిలినట్లే. అరుచిగా వున్నదని జెప్ప సాగెను.

ఇంకేమి చేయుట? ఏది చెప్పుచున్నను ఏదో ఒక జవాబు, నిరుత్సాహ ముగానే జెప్పుచుండెను. ఆనందమైన మాటలను, ధైర్యమైన వచనములను, సత్యవాక్కులను, రామదాసు గారు మాట్లాడరు, యితరులను జెప్పనీయరు. ఏమి జేయుటకు తోచక, రామదాసు గారు ఒక కీర్తన పాడమంటిని, ఆయన చాల కీర్తనలను గూడ, స్వయముగా జేసి యుండిరని వింటిని. కాని, ఆయన పాట పాడెడి స్థితిలో లేడు. దానికేమో సమాధానము అధైర్యము జెప్పుచు పాడుటకు నిరాకరించెను.

అప్పుడు యిక ఏమి మిగిలియున్నది, నిశ్శబ్దముగా ధ్యానము జేయు టొక్కటేగాన రామదాసుగారూ, సర్వమును మరచి, మనమిప్పుడు ధ్యానము చేయుదమంటిని. నన్ను రామదాసు అని పిలువవలదు – కామదాసు అని

పిలువుడు అని గర్జించెను. ఏమిరాదైవమా యేవైపు జూచినా, యే దిక్కును ధైర్యమును గానవచ్చుటలేదని, అందరమునూ కండ్లను మూసి ధ్యానము చేయసాగితిమి. అటులనే కొంతతడవు నిశ్శబ్దములో అందరము గడిపితిమి. చివరకు ప్రణవగానము చేసితిమి.

అప్పుడు రామదాసుగారు నేత్రములను తెరచి యిటువంటి పవిత్రమైన ఆశయములతో నిండియున్న ఆశ్రమములను దర్శించగా దర్శించగా మహనీయుల స్పర్శచే ఎన్నటికైన కొంత తృప్తిని, శాంతిని బడయవచ్చునని జెప్పుచు నమస్కరించసాగిరి. ఆశ్రమ సేవలో వినియోగించుడని, యైదు రూప్యములుగూడ బహుమతిగా అర్పించి, శ్రీరామదాసు గారు శాంతి కరపత్ర ములు, శాంతి పుస్తకములను తీసుకొని రశీదు అందుకొని, శాంతిగా వెళ్ళిరని వ్రాయుటకు ఆనందించుచుంటిని.

శ్రీరామదాసు గారి నుండి, మనము నేర్చుకొనవలసినవి :

1. రామ నామమును, స్మరించి నంతనే భక్తుడు పులకాంకితుడై ఆనంద బాష్పములను రాల్చవలెను.

2. శాంతి అనగా,శాంతి అనెడి రెండు అక్షరముల మాటగాదు. అనిర్వచనీయమైన శాంతి అమృతమే! అట్టిశాంతి గురించి, వినుచు, ప్రసంగించుచు తృప్తిపడక ఆ శాంతి అమృతమును సదా పానము జేయుచు, దైవ సంభూతులైన మానవులు తరించుటకు ప్రయత్నించవలెను.

3. అధైర్యము నుండియే ధైర్యమును, చింతనుండియే వుత్సాహమును, దుర్బలత్వము నుండియే బలమును, అంధకారము నుండియే వెలుతురును, అశాంతి నుండియే శాంతిని, విషయలోలత్వము నుండియే పవిత్రజీవన మును, అగాధము నుండియే నూతనశక్తిని, మృత్యువు నుండియే అమృత పదవిని అనుభవించుటకు దైవ పిపాసకులు ప్రయత్నించుచు తరించెదరు గాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

నిర్వాణ కుటీరము
12-1-50

# 46. పాపులదే స్వర్గము

HEAVEN IS FOR THE SINNERS

పాపులదే స్వర్గమనెడి వార్త పాపులందరకును, యే దుర్బలత్వము గలిగినవారికైనను, ఎంత ఆనందము నిచ్చెడి సందేశముగా నున్నది! హెవెన్ ఫర్ ద సిన్నర్స్ నేను పాపాత్ముల కొరకే వచ్చితినని క్రీస్తు ప్రభువు నుడివి యుండెను. Repent. Ye the Kingdom of heaven is near at hand. పశ్చాత్తాపపడుడు. స్వర్గరాజ్యము మీచేతి దగ్గరనే యున్నదని క్రీస్తు ప్రభువు ప్రియశిష్యుడైన జాను నుడివియుండెను. యెంతో మంది పుణ్యాత్ములు స్వర్గమును చేరినప్పటి కంటె ఒక్క పాపాత్ముడు స్వర్గమును చేరిన, అచ్చటచాల సంతోషము అందరను పొందెదరని చెప్పబడెను. యెంత పాపాత్ముండైన నన్ను భక్తి శ్రద్ధలతో యేమాత్రముయైన మనస్సులో గొల్చిన, నన్నే చేరుచుండెనని శ్రీకృష్ణభగవానుడు గీతలో నుడివి యుండిరి. Forgetfulness of God is Sin. పాపమనగా దైవమును మరచుటయే యని శ్రీరామతీర్థులు జెప్పిరి.

Where is there as wretch

So wicked and loathesome as I have forsaken my makes.......so faithless has I been....

అధధాముండనైన నాలాంటి పాపి, నా సృష్టికర్తనే మరచిన అవిశ్వాస కుడైనవాడు, మరొక్కడు యీ సృష్టి అంతలో యెచ్చటవుండెను అని మహా భక్తాగ్రేసరుడైన సూరదాసు నుడివియుండెను. క్రీస్తు ప్రభువు జీవితములో మేరి మాగ్దదీన్ అను నామె పాపపు పనినిజేయుచుండ పట్టుకుంటు మనియు ఆమెను రాళ్ళతో కొట్టిచంపివేయుదమనియు, యూదులు, పారశీను రాళు ్ళ తీసుకుని, ఆ స్త్రీని క్రీస్తు ప్రభువు చెంతకు తీసుకుని వచ్చి, మీరేమి చెప్పనుంటిరో చెప్పమని ప్రశ్నించిరి.

అప్పుడా మహనీయుడు కొంతతడవు నివృతుడై యీ క్రింది రీతిగా నేలమీదను వ్రాసెను. మీలోఎన్నడునూ, ఏ తప్పును, ఏ పాపమును చేయని వారు మొదటిరాయిని ఆమె మీద వేయుడు.

క్రీస్తు ప్రభువు రాసినది చదివి, ఒక్కొక్కరును వారు వారు జేసిన పాపములకు సిగ్గుపడి రాళ్ళనచ్చటనే జారవిడిచి నెమ్మదిగా జారిపోయిరి. అప్పుడు క్రీస్తు ప్రభువును మేరి మాగ్దలీన్ మాత్రమే మిగిలియుండిరి. అప్పుడు ప్రభువు నిన్ను హింసించి చంపమన్న వారందరు వెడలిపోయిరి. నీవుగూడ వెళ్ళుము. యింకెన్నడును పాపమును చేయకుమని వుపదేశించెను.

అప్పటినుండియు ఆ స్త్రీయొక్క జీవితమంతయు పూర్తిగామారి, క్రీస్తు ప్రభువునకు చాలా సన్నిహితురాలైన భక్తురాలుగా, తన జీవితమంతయు, ప్రార్థన ధ్యానాదులతో గడిపెనని జెప్పబడెను.

పాపులదే స్వర్గమనెడి వార్త యెంత ఆనందకరమైనది, ఈ లోకములో జన్మించుటయే పాపము జేయుటకు, క్రిందపడి లేచుటకు. పసిబిడ్డను జూడుడు! అతడు పడకుండగా నడచుట నేర్చుకొనగలడా! పడగా పడగా పడినప్పుడెల్లను, లేచుటకు ప్రయత్నించుచు తన నడకను నేర్చుకొను చుండెను. అటులనే మానవుడు ఎప్పుడో ఒకప్పుడు తెలిసియో తెలియకయో ఏదో చిన్న తప్పో గొప్ప తప్పో జేసియుండకపోరు. పొరబడుటే మనుష్య స్వభావమని జెప్పబడి యుండెను. తన పొరపాటును తెలిసికొనుట దేవతా స్వభావము. యింకెన్నడును పొరబడకుండుట దైవ స్వభావము.

మరియొక్క భక్తవరేణ్యుడు "నేను పడినప్పుడెల్లను, దైవము వడిలోనే పడు చుంటినననినుడివి యుండెను. దైవములేని తావెచ్చటనూ లేదుగదా! గాన యీ ప్రపంచమంతయు దైవము యొక్క వడియే! యీ విశ్వమునంతను దైవము యొక్క వడిగా జూచెడివారి జీవితములు ధన్యవంతములు. నూరు మంది పుణ్యాత్ములు స్వర్గమును చేరుటకంటె, ఒక్క పాపాత్ముడు స్వర్గమును చేరినప్పుడు హెచ్చు ఆనందమచ్చటయుండునని మహనీయులు చెప్పియుండిరి. పాపులదే స్వర్గమని జెప్పినప్పుడు యిక పుణ్యాత్ముల గురించి జెప్పనేల? పుణ్యాత్ములెప్పుడును స్వర్గములోనే దైవసన్నిధినే జేరియుంటిరి. వారు నిరంతరమును దైవమునకు సన్నిహితులుగానేయుండిరి.

ఈ భావననే శ్రీకృష్ణ పరమాత్ముడు గీతలో యీ క్రింది శ్లోకములో నుడివి యుండిరి.

అపిచేత్ దురాచారో – భజతే మామనన్యభాక్

సాధురేవ స మంతవ్యః సమ్యగ్వ్యవసితో హిసః

తా. ఎంతో దుర్మార్గుడైనప్పటికి నన్ను అనన్య భావంతో సేవిస్తే అతడు సరైన నిర్ణయం తీసుకొన్నవాడే, కాబట్టి సత్పురుషుడుగానే ఎంచదగినవాడు.

There is hope for all !

అందరకును మోక్షము గలదు. అందరును ముక్తిని బడసెదరు. దైవమును చేరెదరని కొందరు బ్రహ్మవేత్తలు జెప్పియుండిరి. యేలనన అందరును దైవబిడ్డలే! మన మందరము దైవము నుండియే వచ్చి, దైవము లోనే జీవించుచు చివరకు దైవములోనే విలీనమయ్యెదము.

ఒకటి రెండుసార్లు అంధకారములో దారి తప్పిన మాత్రమేమి? ప్రయత్నించిన దారి దొరకకుండునా? జ్ఞానమనే దీపమే అంధకారము నంతను పారదోలి సరియైన మార్గమును జూపును. అగాధములోయున్నను, నూతనమైన శక్తినిపొందుచుంటి ననియు, చీకటిలో గూడ వెలుగునే జూచు చుంటిననియు, అంధకారములోగూడ నేను సత్యమార్గమునే అనుసరించి యుంటినని, లింకను మహాశయుడు జెప్పియుండెను.

ప్రియమైన శాంతిపాఠకులారా! రండు! రండు! స్వర్గద్వారములు మన కొరకై తెరచి యున్నవి. యిక తడవేల? వెనుక చూపుయేల? గతించిన దానిని పూడ్చివేయుడు. ఈక్షణమే మనది, యీ క్షణము నందే ఆంతర్య హృదయనివాసియైన, జ్యోతిస్వరూపుని గుర్తించి, ఆ దివ్యతేజస్వరూపునిలో లీనమయ్యెదముగాక! పాపులకు, పుణ్యాత్ములకు, పేదలకు, ధనికులకు, చిన్నలకు, పెద్దలకు, అజ్ఞానులకు, జ్ఞానులకు, పామరులకు, పండితులకు, స్వర్గమునకు యిదియే సుస్వాగతము.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

28–4–55

5.00 పి.ఎమ్

# 47. బ్రహ్మ సాక్షాత్కారము

పాడిపంటలు, అనెడి చక్కని చిత్రములతోను, రైతులకు వ్యవసాయ దారులకు వృద్ధియవ్వవలెననియున్న మానవులందరకును, వుపయోగించెడి వ్యాసములు,చక్కని బోధలు గల్గిన, మాసపత్రిక యొకటి, వ్యవసాయాధి కారులచే ఆశ్రమంకు పంపబడెను.

మొదటి పేజీ చిత్తరువులో ఒక భక్తుడు జపము చేయుచుండ దైవము ప్రత్యక్షమై, మరియొక మూలను ఆనందముతో పొలము దున్నుకొనుచున్న వ్యవసాయదారుని, జూపించుచు "ఈ చీకటిలో, తలుపులన్నియు మూసి, ఎవ్వరును పూజించుచుంటివి. కష్టపడి భూమిని దున్నెడి కాపువానిలో దైవమును చూడుము" అని చెప్పును. కవిసార్వభౌముడైన శ్రీ రవీంద్రుని యీ క్రింద గీతము గూడ పై భావనను తెలుపుచున్నది.

"జపతపంబులు గానముల్ చాలుచాలు

అన్ని తలుపులు మూసి యీయాలయమున

జిమ్మ జీకటి గొందిలో జేరి యిట్టు

లొంటి నెవ్వరిని పూజించుచుంటి విచట....

తెరచి కన్నుల జూడుము దేవుడెదుట

గానవచ్చునో లేదో నీకన్నులకును

గట్టియే భూమి దున్నెడి కాపువాడు

కష్టపడుచోట నాతడు గలడుచూడు!"

మరల చివర పేజీలో మరియొక్క చక్కని చిత్తరువు గలదు? ఒక మూలను సాధుఒకడు తపస్సులో నిమగ్నమైయుండెను. **జపతో నాస్తి పాతకం** అని అతని ప్రక్కనే వ్రాయబడియుండెను. ఇంక అతని చుట్టును, పెద్ద చిత్తరువులో **కృషితో నాస్తి దుర్భిక్షం** అనెడి హెడ్డింగులో అరటిచెట్లు, కొబ్బరి చెట్లు, తేనెపెట్టెలు, కూరగాయలు, ఫలములు, సౌకర్యముల నన్నింటితో

తులతూగుచుండ పిల్లలు ఆడుకొనుచున్నట్లు చిత్రింపబడియున్నది. రైతులు తృప్తితో వారి సిరిసంపదలను కూడబెట్టుకుండుచున్నట్లు చిత్రింపబడి యున్నది.

మనస్సు ఆకర్షించెడి యీ చిత్తరువును చూచిన తర్వాతను, పై పద్య మును చదివిన తర్వాతను ఆనందముతో, పని పాటలు జేసుకొనెడి యీ వ్యవసాయదారులను జూచిన ఆ పొడవు ముఖముతో శరీరమును, ప్రాణ మును వుగ్గబెట్టుచు, పాపముతో, హెూరా హెూరీగా పోట్లాడుచుండెనా? అన్నట్లు జపము జేయుచున్న ఆ సాధువు స్థితిని జూచిన యెవ్వరికైనను విచారము గల్గును. జపతో నాస్తి పాతకమ్ అనెడి, ఆశయముతో సాధువు జపము చేయుచుండెను. మొదట, యీ పాతకము యెచ్చటనుండి యెటుల నుండి వచ్చెను. ఒక్క మాటలో పాతకము సోమరితనము నుండియే వచ్చు చున్నది. పాతకముజేయనేల, దానిని పోగొట్టుగొనుటకు, జపము జేయనేల? సోమరి తనమునకు సావకాశము నివ్వకుండా, విలువైన కాలమును, తనకు నిరుపేదలకు, వుపయోగించెడి పాడిపంటలు వృద్ధిచేయుటలో వినియోగించిన, పాతకము తన దగ్గరకు వచ్చుటకే భయపడును గదా! యేపనియు లేని, సోమరిమెదడులోనే, సైతాను నాట్యమాడుచుండెనని మహనీయులు జెప్పియుండిరి.

జపము జేయుట సులభమా లేక పాడిపంటలు వృద్ధిజేయుట సుల భమా? జపము వల్ల దేశములో కరువు, క్షుద్బాధ నివారణ తగ్గునా లేక పాడిపంటలను వృద్ధిజేయుటవల్ల దేశక్షామము పేదరికము నివారణ యవ్వునా? తినతిండి, కట్టగుడ్డ లేక పడరాని అవస్థలు పడుటేగాక మృత్యువు వాత పడుచున్న వేలానువేల దిక్కులేని ప్రజలకు తోడ్పడెడిది తపస్సా లేక పాడిపంటలా?

తపస్సంపన్నులైన మహనీయులందరకూ ధన్యవాదములు, నిజమైన తపస్సుకు వ్యతిరిక్తముగా వ్రాయునంతటి వాడనుగాను. కొంగ జపము జేయుచు, బక ధ్యానములతో విలువైన కాలమును సోమరితనముతో వ్యర్థము జేయుట కంటే పాడిపంటలు వృద్ధి జేయుటలో వినియోగించిన దేశక్షామమును బాపి, ఆకలి బాధచే మలమలమాడుచు పెక్కు యిక్కట్లు పడుచున్న దిక్కులేని మానవులను బ్రోచుట గొప్పనేతయై దేశవృద్ధికి తోడ్ప

డును. యిదియే నిజమైన మానవ విధియైయున్నది.

జపమును, కృషిని వేరు జేయుటకు వీలులేదు. కులమును, జీవిత మును వేరుజేయగలమా? అవిరెండును ఒక్కటే. అటులనే నిజమైన జపము వల్ల తన కృషిని తెలుసుకుని దేశవృద్ధికి తోడ్పడవలెను. సరియైన కృషివల్ల, మనశ్శాంతి పొంది, జపము జేయుచు లోకశాంతికి తోడ్పడవలెను.

నాగలి తాకినంత మాత్రమున శూద్రత్వము గల్గునన్నవారు మనలో పెక్కుమంది గలరు. వ్యవసాయపు పనిముట్లను త్రాకుటకే భయపడుచుందురు. భూమిని దున్నిన శూద్రులమగుదమా బొరిగెతో మొక్కలు బాగుజేసిన బానిసల మగుదమా? పాడిపంటలు వృద్ధిచేసిన మనజాతులు పోవునా? శూద్రత్వమెచ్చట గలదు. అది సోమరితనమందే గలదు. అది అహంకార మందే గలదు.

రవీంద్రుని గీతమే నా చెవులలో మ్రోగుచున్నది. దేశమంతయు కరువుచే పీడింపబడుచుండ కరువు చాలదాఅన్నట్లు, మన మునసబులు, కరణములు పై అధికారుల అనుజ్ఞ ప్రకారము తిండిలేక చనిపోవనున్న బీద రహితులను పీడించుచు యెచ్చట నున్నవారిని అచ్చటనే నిలువబెట్టి అదనపు పన్నులు కొత్తపన్నులు వసూలు జేయుచుండుట చాల బాధాకరమైనది. ఇట్టి అవస్థలో జపములను, తపస్సులను కొంచెము తగ్గించి, పాడిపంటలు వృద్ధిజేయుచు నిరుపేదలకు తోడ్పడుటలో కొంతకాలమైన వినియోగించుట సమంజసమని తట్టుచున్నది. జపతపంబులు, గానములు, భజనలు, ఏకాహ ములు, సప్తాహములు చాలు చాలు యివన్నియు చాలకాలము నుండి,దేశ మంతయు జేయుచుంటిమి. చీకటిలో, తలుపులు మూసి, ఆలయములలో మందిరములలో యెంతకాలము తపస్సులు యాగములు ఆచరించుదము? కన్నులు తెరచి జూచిన, లోపలయున్న దైవము బయట లేడా?బయటనున్న దైవమునే గాంచుదము. రాత్రింబగళ్ళు, మనకంటిముందు, కష్టపడుచున్న అమాయకుడైన, రైతులో, పొలమును దున్నుకొనువానిలో, దారిప్రక్కన రాళ్ళబ్రద్దలు కొట్టుచున్న కూలివానిలో, దైవములేడా? వీరిలో దైవమును గాంచవలదా!

తులసి,రుద్రాక్షమాలలను ఒకదరినుంచి, తవ్వుగోలను తీసుకొని,

మొక్కల మొదలునున్న ఒక్కొక్క కలుపు మొక్కను దైవ నామమును ఉచ్చరించుచు తీసిన రెండు విధముల ఫలితమును, ఆదిగా కలుపు తీయుటచే చెట్లు వృద్ధి అవ్వుట, దైవ నామమును ఉచ్చరించుటచే, మనోశాంతిని బొందుట గూడ, బడయగలము. నోరులేని జంతువుల సేవయే నిజమైన సేవ మనకు, ఫలములను, ఆహారముగా నొసంగెడి చక్కని వృక్షముల సేవయే చక్కని ఫలితము నిచ్చెడి సేవ. పాడిపంటల వృద్ధియే దేశవృద్ధి దేశవృద్ధియే లోకశాంతి, లోకశాంతియే మానవాభ్యుదయము.

రవీంద్రుని పై గీతమును చదివిన కొలది,యీ కలమును కాగితములను పారవేసి, కాపువానివలె భూమిని దున్నుచు మొక్కలు బాగుజేయుట, చెట్లకు నీళ్ళుపోయుచు పాడిపంటలు వృద్ధిచేయవలెనని, పురిగొల్పుచున్నది. శ్రీశాంతి ఆశ్రమం తపోవనముగా, శాంతికి నిలయముగా వుండుటకై స్థాపితమైనను జపమును కృషిని ఎప్పుడును వేరుగా జేయలేదు. ఆశ్రమంను దర్శించి, అనేక రకముల ఫలవృక్షములు, పుష్పజాతులను,తేనె పెట్టెలను ప్రణవగానము జేయుచు, మధువును పోగుజేయుచు, తేనెటీగలను, ఆనందముతో పాడు పక్షులను జూచి, ఆనందించుడు. మీరుగూడ పాడిపంటల వృద్ధికై మీదొడ్లలో మీ యిండ్లలో నారులుపోసి మీశక్తి కొలది పెంచుడు. దేశములో కరువును పారద్రోలి, దాని పురోభివృద్ధికై తోడ్పడుట మీ బాధ్యతయై యున్నది.

విలువైన కాలమును, పగటిపూట స్వప్నమును గాంచుచునో లేక మాటలతోనో వృథాబుచ్చుట కంటెను ఆ వేళలలో, ఆ సమయంలో యే కాయగూర విత్తనములతో, చిన్న చిన్న మడులుగా జేసి,జల్లి నీళ్ళుబోయుచున్న, వెనువెంటనే, వాటి ఫలితమును మనము అనుభవించుటయే గాక, యితరులతోగూడ పంచుకొనవచ్చును. పనిజేయని సోమరికి తినుటకు హక్కులేదు అనెడి మహావాక్యమును మరువకుడు. మీరెంత ధనవంతులైనను రాజాధిరాజులైనను, పనిజేయకుండా విందులారగించిన అజీర్ణ రోగము గలుగును. దేశములో రోగములన్నింటికి ఈ సోమరితనము అర్హతలేకుండ అతితిండి తినుటయే కారణము, దేశవృద్ధిని, లోకశాంతిని కోరెడి ప్రతీ మానవుడు తాను ప్రతిదినము భుజించక ముందు తాను ఆ రోజున తన

తిండిని తినుటకు, ఏపనిచేసెనో తనకు అర్హత కలదో లేదో అని, తన జీవితమును పరీక్షించుకొనవలెను. కష్టపడి జేసి అర్హత గల్గినపుడు తినిన తిండియే తన శరీరారోగ్యమునకు, ఆత్మశాంతికి ఆత్మవృద్ధికి తోడ్పడును. బ్రహ్మ సాక్షాత్కారమునకు, అనేకమైన మార్గములు గలవు. జపము ఒక్కటే మార్గమనెడి దురభిప్రాయమును విడువవలెను. పాడిపంటలను వృద్ధి జేయుచు మానవ సేవకు తోడ్పడుట గూడ బ్రహ్మసాక్షాత్కారమునకు మార్గమే!

వినుడు మరల రవీంద్రుని భావగీతమును, గట్టియైన భూమిని, దున్ను చున్న కాపువాని చెంతను, దైవముండెనని జెప్పెనుగదా! మనమాతని చెంతకు వెళ్ళి దైవమును గాంచుదామా? మనము గూడ అతనివలె, పృధివి సేవజేయుచు, దైవము ననుభవించుదామా? బ్రహ్మ అద్వితీయుడు. అణువు మొదలు బ్రహ్మాండమువరకు,నిండియున్నవాడు గాన, ఆయనను సర్వత్రా గాననగును. ఆ పరమాత్మ స్వరూపమును అందరిలో గాంచవలెను. పిపీలికాది బ్రహ్మ పర్యంతము వ్యాపించియున్న వానిని నేత్రముల ముందు ప్రత్యక్షముగా వ్యక్తమైయున్న దైవమును మరచి, కండ్లుమూసి, మనస్సులోనే గాంచెదమనుట వెర్రితనము. ప్రేమయే దైవము. ఎచ్చుట ప్రేమయుండెనో అచ్చుటనే దైవముండెను. రైతు తన భూమిని ప్రేమించుచు,తన పాడిపంట లను వృద్ధిచేయుచు దైవమును వ్యక్తపరచుచుండెను. వ్యవసాయదారుడు తన పాలేరులను, తన పశుసంతతిని ప్రేమించుటలో దైవమును వ్యక్తపరచు చుండెను.

క్రిందటి నెలలో, బెంగుళూరు నుండి ఒక స్నేహితుడు, 20 ప్యాకెట్లు కూరగాయల, పుష్పముల విత్తనములు పంపెను. చిన్న చిన్న మడులుగా జేసి విత్తనములనుజల్లగా, వారం రోజులలోనే అన్నియు మొలకెత్తెను. ఆ చక్కని, పుష్పములను,జూచిన దైవమును జూచిన ఆనందమే గల్గును. ఆ చక్కని పుష్పములు మొలకెత్తకముందు అవి ఎచ్చుట వున్నవి. మొదటలో బెంగుళూరులో విత్తనముల రూపముగా వున్నవి. వాల్తేరులో బీరువాలో ప్యాకెట్టులలో కట్టబడి కొన్నాళ్ళు వున్నవి. ఇప్పుడో చూడుడు. కృషిచే ఎంత మార్పును పొందినవో దర్శించుడు.

అటులనే, ఆత్మ సోదరులారా, సోదరీ స్వరూపములారా, మీలో విత్తు

రూపముగా వున్న శాంతిపుష్పములను, ప్రేమ పుష్పములను, సేవ పుష్పములను బయటకు తీయుడు. భూమిలో నాటుడు. వాటి ఫలితమును మీరనుభవించి యితరులతో పంచుకొనుడు. దైవము మీకిచ్చిన విత్తులను మీరు వాడని యెడల అవి పురుగులుబట్టి చదలుబట్టి పాడవ్వును. విత్తనము చెడకుండగనే నేడే మీలో వున్నవాటిని తీసి సారవంతమైన,శక్తి, బలము, మంచి యెరువుగల్గిన, మడులలో జల్లి, వాటి ఫలితమును అనుభవించి తరించుడు. బ్రహ్మసాక్షాత్కారమును అంతర్యమునే గాక బాహ్యమున గూడ జేయుడు. యేలనన సర్వము బ్రహ్మమయమే గదా! దైవము అంతర్యమున, బాహ్యమున నిండి, మీకొరకై వేచియుండెను.

చూడుడు బ్రహ్మను, ఆ వికసించెడి పుష్పములలో, ఆ గానము జేసెడి పక్షులలో, సాధుత్వముతో నిండియున్న ఆ పశువులలో గాంచుడు బ్రహ్మను– పవిత్రతతో నిండి ఆడుచున్న ఆ పిల్లలలో బ్రహ్మసాక్షాత్కారమును బడయుడు. అమాయకత్వముతో నిండి స్వార్ధరహితుడై పాటుబడుచున్న ఆ కాపువానిలో అంతర్యమున, బాహ్యమున నిండియున్న ఓ దివ్యస్వరూపా! నీకు ధన్యవాదములు. వివిధ నామరూపములతో విలసిల్లుచున్న ఓ బ్రహ్మ స్వరూపా నీకు ధన్యవాదములు.

విత్తులో వృక్షముగా మనుజునిలో దైవత్వముగా, ఖండములో అఖండముగా విరాజిల్లుచున్న ఓ అఖండదివ్యకోటిసూర్యతేజస్వరూపా నీకు అనంతకోటి ధన్యవాదములు.

పాడిపంటలు వృద్ధియగుగాక!

దేశములో క్షామము గతించుగాక!

లోకమంతయు శాంతితో నిండియుండుగాక!

సర్వేజనా స్సుఖినోభవంతు, ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

బి.డి 21–1–48

10.00 పి.ఎమ్.

# 48. గ్రామ మునసబు

పార్శీజాతివారు, చనిపోయినప్పుడు, వారి శరీరములను, మామూలు పద్ధతి ప్రకారము సమాధిజేయుటగాని దహనము జేయుటగాని జేయరు. వారి మతాచారము రీతిగా, శరీరమును పార్శీ వారికై ప్రత్యేకముగా నిర్మింపబడిన తావునకు తీసుకొనివెళ్లి, అందులో ఎత్తుగా కట్టబడిన శిఖరముపై అనగా డాబా మీద వుంచెదరు. అప్పుడు, క్రూరమైన రాబందులు, వాటి భీకరమైన ముక్కులతో యీ శరీరము పొడిచి ఆ చర్మమునంతయును తిని వేయును. అదివారి ఆచారము, ప్రతీపారశీయుడు తప్పనిసరిగా ఆచరించుచుండును. ప్రార్థన ధ్యానాదులను,పార్శీ గ్రంథములలో వ్రాయబడిన మత విధులను ఆచరణలో పెట్టకపోయినను ప్రాణముపోగానే శరీరమును మాత్రము రాబందులకు అర్పించుట తప్పదు. ఒక్కొక్క మతమునకు ఒక్కొక్క ఆచారముండునుగదా! అదియెట్టి క్రూరమైనది, విపరీతమైనది, హాస్యాస్పదమైనది యైనను వారి సంతతివారు అటుల జేయుచునే యుందురు.

ఇప్పుడు మన గ్రామ మునసబుల దగ్గరకు వచ్చి వారిని విమర్శింతము. పార్శీమతస్థుల శరీరములను తిని తిని, చివరకు ఆ రామబందులు ముసలితనముచే చనిపోయినప్పుడు దైవము యీ రాబందులకు మనుష్యులతో సంబంధముండి యుండుటచే దుర్లభమైన మనిషి జన్మనిచ్చి గ్రామమునసబ్యులుగా జేయుచుండును. పాపము యీ మునసబులు వారి పూర్వ జన్మలో వుండి యున్న సంస్కారబలముచే మరల మానవుల ధనమును రక్తమును నిర్దాక్షిణ్యముగా పీల్చును. నిరుపేదలైన మానవుల మాంసమునే తినుచు జీవించుచుండిరా అన్నట్లు లేశమైన జాలిలేకుండ దిక్కుమాలిన వారిని పీడించుచుందురు.

ప్రియమైన పాఠకా, నేను వ్రాయునది,నీకు విపరీతముగా తోచవచ్చును. గాని, యీ మధ్య మా ఆశ్రమం చెంతనే జరిగిన, ఒక సంఘటనను నీవు వినిన,నాతోనీవు గూడ ఏకీభవించి, గ్రామ మునసబులు కొందరైనను, రాబందుల సంతతిలోన నుండి వచ్చిన వారే అని నిశ్చయముగా జెప్పెదవు.

అది హరిజనులపేట! సరియైన నీటిని త్రాగుటకు లేదు. తిండి లేకున్న జీవించవచ్చును. నీరులేకుండ ఎటుల మానవులు జీవించ గలరు. ఒక ధర్మబుద్ధిగల హరిజనుడు నేలనూతిని, అతికష్టము మీద, తనకు తనచుట్టునున్న వారికి వుపయోగించుననెడి ఉపకారబుద్ధితో త్రవ్వించెను. అటులనే చాలసంవత్సరములు ఆ బావి హరిజనులకు చాల వుపయోగముగా యుండెను. దురదృష్టవశాత్తు ఒక్కరోజున రాత్రియందు హరిజనస్త్రీ నీళ్ళుతోడుటకు వచ్చి, తనకుండనచ్చుట వుంచి, నూతిమీద వున్న దూలముపై కాలుపెట్టి నీళ్ళుతోడబోవుచుండ, దూలము కదలియో, కాలుజారియో నూతిలో పడిపోయెను.

మరునాటి ఉదయము శవము ఆ నేల బావిలో తేలుచుండెను. ఆ చనిపోయిన దురదృష్టవంతురాలి కుటుంబము గూడ ఏ పూటకు ఆ పూటకు రెక్కల కష్టముతో ఏ గంటెలో, చోళ్ళో సంపాదించుకొని దినములు గడుపు చున్నవారే! మానవసేవయే దైవసేవగా భావించి ఇట్టి నిరుపేద కుటుంబము లకు ముఖ్యముగా దుఃఖములోను, అవస్థలలో వున్నప్పుడు సహాయముజేసి, వారిని గట్టెక్కించి దరిజేర్చుటకు బదులు మనగ్రామ మునసబుల మొదటి ఆలోచన **యీ విపత్తు నుండి మనమెంత డబ్బును లాగగలము.** త్రాగుటకు నీరైన లేక అవస్థపడుచున్న తనతోటి జనులకు పనికివచ్చునని అష్టకష్టములుపడి బావి తవ్వించిన కుటుంబము, కర్మచేతను, రోజుల నుండియో, నూతిలో పడిపోయిన ఆ మనిషి యొక్క కుటుంబము గూడ చాల నిరుపేదలైయుండిరి. వారికి మాంసముగాని రక్తముగాని లేకుండ శల్యములవలె జీవించుచుండిరి.

ప్రియమైన పాఠకా! యీ దుమ్ములనుండియే, యిద్దరు మునసబులు కలిసి 40రూపాయలు యిద్దరి కుటుంబముల నుండి తీస్తిరని వ్రాసిన నీవు నమ్మజాలవేమో! యిది రక్తములేకుండ, ఆరిపోయిన దుమ్ముల నుండి తీసిన డబ్బుగాన, దుమ్ములపన్ను అని చెప్పవలెను. యీ 40 రూపాయలను మన మునసబులిద్దరును ఆనందముతోపంచుకొనిరి. ఆహా! దైవమా నీవెచ్చట నుంటివి. యిట్టి క్రూరమైన దురన్యాయములు జరుగుచుండ, నీవు చూచుచు, ఉపేక్షగా వూరుకుందువా? అందరు మునసబులు,

యిటువంటి క్రూరహృదయులే అని వ్రాయుటలేదు. ధర్మరాజువంటి దయార్ద్ర హృదయులై తమ గ్రామస్తులను, తమ బిడ్డలుగా ప్రేమించుచు, వారి కష్ట సౌఖ్యములను తమవిగా భావించుచు తమకున్న దానినంతను నిరుపేదలతో పంచుకొనెడి మునసబులు గూడ గలరు. గాని, అట్టి ధర్మమూర్తులు చాల అరుదుగదా.

మన ధర్మబుద్ధి గల్గిన హరిజనుడు తాను ఉపకారముచేయబోయిన అపకారము ఎదురయ్యేనని పశ్చాత్తాపము జెంది ఆలస్యముజేసిన, మరెవ్వరైన నూతిలో పడిన మరల 20 రూపాయలు మునసబుగారికి చెల్లించవలసియుండినని, కొంతడబ్బును యిరుగు పొరుగువారి వద్ద అప్పు జేసి తన నూతిని వెంటనే పూడ్చివేసెను. మునసబుగారికి కోపము వచ్చిన ఒక్క మనిషిని నూతిలో త్రోయించియైన, కొంతడబ్బు లాగుటకు ప్రయత్నించెదరు. ప్రవృత్తిపరులకు డబ్బే ప్రధానముగదా, ధనమే దైవము.

ఓ మునసబులారా! నేను మిమ్ము ఖండించుచుంటినని, నిందించు చుంటినని తప్పు అభిప్రాయము వలదు. మీ మేలును, శ్రేయస్సును కోరియే యీ వ్యాసమును, నా మనోభావములను వ్రాయుచుంటిని. ధన పిశాచా రాధనకు ఒక దణ్ణముపెట్టి,మానవరూపముగా యున్న దైవమును ఆరాధిం చుటకు ప్రయత్నించుడు. దైవము సర్వాంతర్యామిగాన,యెవ్వరి రక్తము పిండినను దైవ రక్తమే! మాయ మోసములతో, మీ అబద్ధములతో మీరెంత చాకచక్యములు గల్గియున్నను దైవమును మోసపుచ్చజాలరు. కొందరిని, ఎప్పటికి మోసబుచ్చ వచ్చునట. అందిరిని కొంతకాలము మోసబుచ్చగల రట. కాని అందరిని కాలమంతా, ఎప్పటికిని మోసబుచ్చ జాలరు. ప్రజల కొరకై జీవించి ప్రజలకు తన ప్రాణమును సహితమర్పించిన లింకన్ మహాశయుడు నుడివియుండెను. గాన మీనిద్రలనుండి, గాఢమైన అంధకారము నుండి దీపము ఆరిపోవకముందే మేల్కొని, పాపములచే క్రుంగుచున్న మాతృదేవి యొక్క భారమును తగ్గించుడు, దైవము మిమ్ము బ్రోచుగాక.

లోకాస్సమస్తా సుఖినోభవంతు, ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

తోటపల్లి, 2-3-50; 8-00 ఎ.ఎమ్.

## 49. మా చిన్న దూడలు

ఇది శీతాకాలము. చలి చాల హెచ్చుగా యున్నది. మనుజులు రాత్రుల యందు యిండ్లలోనుండి బయటకు వచ్చుటకు భయపడుచున్నారు. నేనొక నాడు, రాత్రి తలుపు తెరచి బయటకురాగా, అచ్చట రెండు చిన్నదూడలు కట్టివేయబడియుండెను. నన్నుజూచి, అవిలేచి నాతో యీ రీతిగా ప్రసంగించి నట్లు అయ్యెను.

మమ్ము మా తల్లుల నుండి వేరు జేయుటేగాక, సముద్రపు గాలిలో, చలిలో వదలివేసి మీరు దుప్పట్లు కప్పుకొని, కిటికీలు గూడ మూసి నిద్రించుట ధర్మమా!

వాటివద్ద నీళ్ళుగాని, గడ్డిపరకలుయైనను లేవు. ఆశ్రమస్థుల తోట మాలీలయొక్క అశ్రద్ధకు చింతించి తెల్లవారగనే, తోటమాలీలను మందలించి ఇంకెన్నడును అటులచేయకుండుటకు తగిన ఏర్పాట్లు జేయనిశ్చయించితిని.

ఇంక త్వరలో తెల్లవారుపోవును గదాయని నేను ధ్యానము జేయ నారంభించితిని. గాని నా ధ్యానములో ఆ కోడెదూడలే అమాయకమైన, నోరులేని, మొఖములతో ప్రత్యక్షమయ్యెను. యింకను, మమ్ము, చలిలో విడచి నీవెటుల ధ్యానము జేయగలవు అని ప్రశ్నించసాగెను. నా మనస్సు బాధించ మొదలిడెను. ధ్యానము కుదురుటలేదు. అప్పుడు, లేచి తోటమాలీలున్న చోటకు వెళ్ళి పనివానినొక్కని లేపి దూడలను పాకలో కట్టివేయించి, గడ్డివేయించితిని. తర్వాత వచ్చి ధ్యానము జేయ ప్రారంభించితిని.

అప్పుడు గూడ మరల ప్రత్యక్షమయ్యెను. గాని,యీ మారు నన్ను నిందించుచు నావైపు చూచుటలేదు. "నోరెరంగని నిస్సహాయులమై చలిలో, వంటరిగా, బాధపడుచున్న మాకు,మీరు సహాయము జేసినందుకు కృతజ్ఞతాభివందనములు" అని జెప్పుచున్నట్లు గానవచ్చెను. అటు తరువాత నా ధ్యానమెంతయో, తృప్తిగా ఆనందముగా, శాంతితో నిండియుండెను.

ఆహా మనుజుడెంత కఠినహృదయుడయ్యెను. కేవలము స్వార్థముతో తనతోడి మానవుల జీవకోటుల శ్రేయస్సుకోరకుండా శాంతిగా, ఆనంద ముగా జీవించజాలడు. యేలనన తన అశ్రద్ధ తన నిస్పృహ, తనస్వార్థమే తన హృదయమును చెదపురుగులు దొలచినట్లు తినివేయును. అహర్నిశ ములు బాధించుచుండును.

అటులనే మనుజుడు తానుజేసిన మంచి వుపకారము, స్వార్ధరాహిత్య మైన సేవ, సూర్యుని తేజస్సువలె, వెంబడించుచు తన జీవితమును ఆనందముగా జేయును. మానవుడెంత చదువరి, బలవంతుడు, ధనవంతుడు, స్వార్థుడైనను, మానవకోటి నుండి వేరుగా వుండి "ఇతరుల అవస్థలు బాధలతో నాకు నిమిత్తములేదని" జెప్పజాలడు. యితరుల బాధలే తన బాధలు, యితరుల ఆనందమే తన ఆనందము, యితరుల అశాంతియే తన అశాంతి, యితరుల శాంతియే తన శాంతి అని తత్వవేత్తలు జెప్పు చుండిరి. యేలనన యీజగమంతా రామమయమే. యీ విశ్వమంతయు విష్ణుని చేతనే నింపబడియున్నదట. ప్రతీజీవిలో దైవమే! మనుజులలో అననేల, కోడెదూడలలో గూడ దైవమే! మనుజుని ప్రేమించనివాడు, దైవము నెటుల ప్రేమించగలడు. తనతోడి మానవునే ప్రేమించనివాడు, నోరులేని మూగ జంతువుల నెటుల ప్రేమించగలడు.

ప్రేమలేని జీవితము ఘాతకమైనది. శ్మశానము వంటిది. దైవము ప్రేమ స్వరూపుడుగదా! ప్రేమయే దైవము గదా! దైవసంభూతుడైన మానవుడు, తన హృదయమును విశ్వప్రేమతోనింపి, మానవసేవ జేయుటకు బదులు, సదా తన తిండి, తన దుస్తులు, తన సౌఖ్యములు, తన ఆరోగ్యము, తన ముక్తికొరకే, అహర్నిశలు ఆలోచించుచు విలువైన కాలమును స్వార్థ ముతో గడుపుచుండుట చాలా విచారకరమైన అంశము. గాని ఎన్నటికైనను స్వార్థుడు ప్రేమశూన్యుడు తన స్వార్థపు విత్తుల ఫలితమునే, అనుభవించ వలసియుండును. స్వార్థరహితుడు, ప్రేమపూర్ణుడు తన ప్రేమ సేవ విత్తుల పంటనే విరివిగా అనుభవించుచు ఆనందించును.

దూడగా, రోగిగా, నిరుపేదగా మేము నీ సేవజేసి తరించుటకై మాకు ప్రత్యక్షమవుచున్న ఓ దైవ స్వరూపా నీకు ధన్యవాదములు.

మా వివిధమైన పరీక్షలలో మా జీవితమంతయు నిన్నే, నీ వివిధ నామ రూపమలలో దర్శించుచు, నీ సేవ జేయుచు, నిన్ను ప్రేమించుచు తరించెదము గాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః ఓం

నిర్వాణకుటీరము

16-1-50

4.00 ఎ.ఎమ్.

## 50. దొంగ వచ్చెను

సుబ్బారావుగారూ, దొంగవచ్చెను లేవండి అని జయదేవులు, అర్ధరాత్రిలో పిలుచుచుండెను. సుబ్బారావు గాఢనిద్రలో వుండుటచే చాలసార్లు పిలవవలసి వచ్చెను. చివరకు, సుబ్బారావు వులిక్కిపడి లేచి, దొంగ ఎచ్చటనని అడిగెను. అప్పుడు జయదేవు, దొంగ మహాలక్ష్మిగారింటిలో పడెననియు, అందరూ మేల్కొని దొంగ దొంగ అని కేకలేయుటచే, అరటితోటలో నుండి,పారిపోయెనని చెప్పెను. కండ్లు నులుపు కొనుచు, నిద్రమొగముతో సుబ్బారావుగూడ ఎందుకైనా మంచిదని బ్యాటరీ లైటు తీసుకుని పరుగెత్తసాగెను. అందరూ, దొంగను వెంబడించసాగిరి. గాని ఆ దొంగ దొరుకునా?

ఇదివరకే, మహాలక్ష్మమ్మగారి వస్తువులు,చాల భాగము దొంగలింపబడి యుండుటచేతనో, మరేలనో యీ మారు, అదృష్టవశాత్తు దొంగ వట్టి చేతుల తోనే పోయెనట. దొంగ పారిపోయే అపుడు, మహాలక్ష్మిగారి శిరస్సుమీద చెయ్యివేసి, దైవము మేల్కొని యుండ నీవేల నిద్రపోయెదవు? అని జెప్పుటకో మరేలనో ఆమెను లేపి వెళ్ళెను. దొంగ వచ్చుటచే ఆశ్రమం అంతయు తెల్లవారే వరకు, అల్లకల్లోలముగా యుండెను. యీ దొంగల నుండి రక్షింప బడుటకై ప్రత్యేకముగ రాత్రి కాపలాకు నియమింపబడిన, గూర్ఖా సిపాయి గూడ తన మొలను కత్తినుంచుకొని, ఆశ్రమం అంతా గస్తీతిరుగుచున్నను, దొంగవచ్చుట ఆశ్చర్యము.

దొంగవచ్చినా ఆశ్రమం అంతా యింత అల్లోకల్లోలముగా భయభ్రాంతు లతోనిండి యుండెను. ఇకదైవము వచ్చిన ఎటులవుండునో పరిశీలింతము. అర్ధరాత్రిలో, గాఢనిద్రలోవున్నవారి వద్దకు ఎవ్వరైన వచ్చి సుబ్బారావుగారు దైవమొచ్చెను,లేవండి! అని లేపిన, సుబ్బారావు భక్తుడుగాన, నిద్రపాడుచేసి నందుకు, అంత సణగకుండ లేవవచ్చును. గాని మరొక సామాన్య మనుజుండైన, ముఖ్యముగా ప్రవృత్తి పరుడైన, దేవుడులేదు, దయ్యములేదని కర్రతీసి కొట్టవచ్చును.

ఇప్పుడు మనము పరిశీలించవలసిన విషయము దొంగవచ్చెను. అనెడి భావనకు బదులు దైవమొచ్చెను, అనెడి భావన, నమ్మకము, ఎంత ఆనంద

మును,శక్తిని,శాంతిని కలిగించును. దొంగవచ్చెనన్న భావన, భయము, భ్రాంతిని,చింతను, అశాంతి గల్గించుచున్నది. మనమిప్పుడు, దొంగ ఎవరు, దొర ఎవ్వరు అని తెలుసుకొనవలెను. దొంగలోను, దొరలోను, అనగా దుర్మార్గునిలోను, సన్మార్గునిలోను పాపిలోను, పుణ్యాత్మునిలోను అజ్ఞానిలోను జ్ఞానిలోను ఒకే దైవము ప్రకాశించుచుండెనుగదా! దొంగలో, దైవము మరుగై యుండెను. జ్ఞానిలో దైవము ప్రకాశించుచుండెను.

అదియుగాక, నిన్నటి వరకు దొంగగా యున్నవాడు, రేపు దొరగా సన్మార్గునిగా మారవచ్చును. నేటివరకు దొరగాయున్నవాడు దుష్టసహ వాసముచేతను, గ్రహపాటుచేతనో, రేపటి నుండి దొంగగా మారవచ్చును. గాన, దొంగలోను దొరలోను అజ్ఞానిలోను జ్ఞానిలోను, సర్వములోను వున్న నామరూపములలోను, దైవమును గాంచెడివారి జీవితములే అదృష్టవంత ములు.

దొంగవచ్చి వెళ్ళిన, సాయంత్రమే సముద్రపువడ్డుననే, కొండవైపునకు షికారు వెళ్ళి మరల వచ్చుచుండ, శ్రీమతి మహాలక్ష్మిగారు, ఆమెభర్త శ్రీ రాఘవరావుగారు, తదితర ఆశ్రమస్తులతో,యిసుకలో కూర్చుని యిష్టాగోష్ఠిగా యేమేమి మాట్లాడుకొనిచుండిరో నాకు అంతగా తెలియదు. నేను మాత్రము వారి దగ్గరకు వెళ్లి, జాలరిపేటలో సముద్రతీరముననే, కట్టబడుచున్న దేవా లయము దగ్గరకు, ఆశ్రమస్తులందరిని తీసుకొని వెళ్లితిని. అచ్చట, దేవాలయ ములో మేము వెళ్లగనే స్త్రీలు, పురుషులు, పిల్లలు ఒక వందమంది వరకు పోగయి మాచుట్టును చేరిరి. దేవాలయమును జూచిన తర్వాత వీరందరిని అచ్చటనే జేర్చి జీవితములో యెవ్వరికైన, దైవస్మరణలో గడిపిన క్షణములు, అదృష్టమైనవి, తోడ్పడెడివి గాన వారందరి చేతను-

బ్రహ్మానందం పరమ సుఖదం అనెడి మంత్రమును పాడించి, తర్వాత హరే రామ హరేరామ, రామరామ హరే హరే - హరేకృష్ణ హరేకృష్ణ కృష్ణకృష్ణ హరేహరే అనే మంత్రమును పాడించి ప్రణవ ధ్యానముతో తలవని తలంపుగా కూడిన సమావేశమును విరమింపజేస్తిమి.

మరల ఆశ్రమంకు వచ్చేఅప్పుడు, అలసియుండుటచే, ఇసుకలో కూర్చుని శ్రీరాఘవ రావుగారిని పాడమనగా ఆయన అంతా రామమయం,

బీజగమంతా రామమయం, అండపిండ బ్రహ్మాండం అంతా రామమయం. అని పాడసాగిరి. విశ్వమంతా రామమయం, యైయుండ, యీ సృష్టిలో దొంగలెచ్చటనుండి వచ్చిరని తర్కింపబోవుచుండ వస్తువులు పోగొట్టుకున్న దైవము మేల్కొని యుండ, నీవేల నిద్రపోయెదవని, లేపబడిన మహాలక్ష్మి గారు, యీ జగమంతా దొంగలమయము. రామమయముగాదు అనెను.

అప్పుడే, కొత్తచంద్రుడు గానవచ్చు చుండెను. అందరును, ఆ చంద్రునికి నమస్కరించి వారి వారి మనోభావములను మనస్సులలోనే సంకల్పించ సాగిరి. నేను అప్పుడు చంద్రునిలో దైవమును దర్శించి, ఆ దైవమునే, అందరిలో దర్శించుటకు నిశ్చయించుకొని, మన జీవితములను శాంతితో, ప్రేమతో నింపుకొందుము గాక యని హెచ్చరించితిని. అటు తర్వాత, శ్రీమతి విజయలక్ష్మి గారు, చి॥అమ్మాజి సర్వమంగళనామ, సీతారామ అనెడి, కృతిని చాల చక్కగా అంతారామమయం యనెడి భావనను, స్థిరమయ్యేలాగున పాడిరి.

అంతలో సుబ్బారావుగారు మాకు, దొంగనో, దైవమునో, వెదుకు కొనుచు, వచ్చుచుండిరా అన్నట్లు ప్రత్యక్షమైరి అందరును కలసి, మూడుసార్లు ప్రణవగానము చేయుచు కొంత తడవు నిశ్శబ్దముగా ధ్యానించి, హృదయము లను మనస్సులను శాంతితోను, ప్రేమతోను నింపుకొని ఆశ్రమం చేరితిమి.

దొంగగా దొరగా వివిధనామరూపములలో విలసిల్లుచున్న, ఓ సర్వ మంగళనామా, విశ్వపితా మా నేత్రములు నిన్ను తప్ప అన్యమును ఎచ్చటను ఎన్నడును, ఎవ్వరిలోను దర్శించకుండా వుండెడిలాగున నీవే సర్వాంత ర్యామివిగాన, సర్వంలో నిన్నే దర్శించెడి శక్తిని, మా అందరకు గల్గించి, మమ్ము నీలో విలీనము జేసుకొనెదవుగాక!

సర్వేజనా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

20-5-50, 11.00 ఏ.ఎమ్.

# 51. దైవము మాట్లాడునా?

మీవలె, నావలె, దైవముగూడ మాట్లాడుచున్న దైవమునకు మీకును నాకును భేదమేమి యుండును? యింతయేల? దైవము మాట్లాడునో, మాట్లాడడో, ప్రత్యక్షముగా దగ్గరలోయున్న మల్లిఖార్జునివద్దకు వెళ్ళి జూడ వచ్చును లేక అన్నవరం శ్రీ సత్యనారాయణస్వామి వద్దకు వెళ్లవచ్చును. సింహాద్రి అప్పన్నవద్దకు సింహాచలము, వెంకటేశ్వర్ల వద్దకు తిరుపతి వెళ్ళినా వెళ్ళ వచ్చును.

ఎచ్చుటకు వెళ్ళినా, ఏ గుడిలోనికి వెళ్ళినా, ఎన్ని పుణ్యతీర్థములు తిరిగినా ఎందరు దేవతలను, దైవములను సేవించినా, ఏ గుడిలోపలను, ఏ దైవము మాట్లాడుచున్నట్లు యింతవరకు నేను వినియుండలేదు. మీరు వినియుం డిరా? మీరుగూడ వినియుండలేదు. మరెవ్వరును వినియుండరని తలచెదను. ఏ పుణ్యక్షేత్రమునకు, ఏ గుడిలోనకు వెళ్ళినను, అచ్చటి పూజారి మాట్లాడవచ్చును. అచ్చటకు వెళ్లిన భక్తుల మాటలు ప్రార్థనలు వినవచ్చును. గుళ్ళు, గోపురాలలో యున్న దైవమును సేవించుచున్న భక్తుల ప్రార్థనలు, వారి వారి మనోపరిపక్వము ననుసరించి అనేకరీతులుగా యుండును. ఇప్పుడు ఇచ్చట మనకు కావలసినది వివిధమైన, స్వాభావికమైన, విపరీతమైన మానవుల కోర్కెలను, విమర్శించుటగాదు.

దైవము మాట్లాడునా, మాట్లాడడా, అనెడి సమస్యను విపులముగా విమర్శించి, అనుభవముగా తెలుసుగొన్న, మన భావివృద్ధికి, ఆధ్యాత్మిక జీవితమునకు సహకారిగా యుండును. నేను అప్పుడప్పుడు ఆశ్రమం చెంతనే యున్న తోటపల్లి ధారవద్దకు వెళ్ళుచుందును. అచ్చట ప్రకృతి సౌందర్యము ననుభవించుచు, నిరంతరము, రాత్రింబగళ్ళు ప్రవహించుచున్న ఆధార శబ్దమును వినుచు శివలింగమువైపున అనగా శ్రీమల్లిఖార్జునునివైపు ఏకాగ్రతగా జూచుచుందును. ఎంత జూచిన, శివుడు మాట్లాడడే! శివుడు మాట్లాడడేల? అతనికి నోరులేదా? దైవమునకు నోరులేదా? దైవమునకు వాక్కురాదా?

దైవమునకు, ఒక్కనోరే గాక లోకములోయున్న నోరులన్నియు దైవము నవే అని గ్రంథములు మహనీయులు గూడ చెప్పియుండిరి. దైవము,

మానవుల ద్వారానేగాక, పశుపక్ష్యాది జంతువుల ద్వారా మాట్లాడుచుండును. పశుపక్ష్యాది జంతువులలోనే గాక, చీమలో, దోమలో, క్రిమికీటకాదులలో గూడ దైవమే నిండి నిబిడీకృతమైయుండెనట. కండ్లువున్న వారు జూడ వచ్చును. చెవులు వున్నవారు దైవశబ్దమును, అన్ని నోరులనుండియు అన్ని శబ్దముల నుండియు వినవచ్చును.యింతియేగాదు! మీ నేత్రములను తెరచి చూడుడు. మీ కర్ణములను వికసింపజేయుడు. దైవము చీమ,దోమ, క్రిమి కీటకాదులలోనేగాక, చెట్లు చేమలు లతపుష్పాదులలోనే గాక అనంతమైన సముద్రములు, నదులు, ధారలలో గూడ ప్రత్యక్షముగా మాట్లాడుచుండెను.

ఆయన సముద్రములో, ప్రణవగానము జేయుచుండెను. నదులలో శాంతిగా పారుచుండెను. ధారలలో, ఏకాగ్రతగా, తెంపులేకుండగా, తైల ధారవలె ప్రవహించుచుండెను. దైవము కోటి కంఠములతో పాడుచుండ దైవము జడుడు, మాట్లాడుటలేదని మనమెటుల జెప్పగలము. ఏ నాలుకతో ఆడుచు, పాడుచు, అరచుచున్నను అదియు దైవమే! పక్షులలో ఆనందముగా ఆకాశమున ఎగురుచు పాడుచున్నది దైవమే! ఏ ఏ శబ్దములు ఏ ఏ నామ రూపములనుండి వచ్చుచున్నను ఆ శబ్దమంతయు దైవమే! దైవ శబ్దమే! ఏలనన శబ్దమంతయు, నిశ్శబ్ద స్వరూపుడైన దైవమునుండియే, కెరటము సముద్రము నుండి వచ్చుచున్నట్లు, కిరణము సూర్యుని నుండి వచ్చుచున్నట్లు వచ్చును. మరల కెరటము సముద్రమునందు కిరణము సూర్యునియందు, విలీనమవుచున్నవి.

లోకమునకు, ప్రత్యక్ష దైవముగా పూజింపబడుచున్న సూర్యభగవానుని వీక్షించుడు. ఆయన మాట్లాడుటలేదా? సూర్యుడు నిశ్శబ్దముగా యుండెనా? సూర్యుడే నిశ్శబ్దముగా యున్న మాట్లాడుటలేని యెడల యీప్రపంచమంతయు అంధకారములో మునింగియుండి వినాశమయ్యెడిది. సూర్య భగవానుడు, కోటాను కోట్ల కిరణముల ద్వారా మాట్లాడుచు, ప్రపంచమంతను, వుదయమే, ప్రాతఃకాలమునందే మేల్కొలుపుచున్నాడు.తెల్లవారినను నిద్రపోయెడివారు నిద్రపోవచ్చును, మేల్కొనెడి వారు మేల్కొని, దివ్యమైన సూర్యుని తేజస్సును, అనుభవించుచు ఆ దివ్యతేజస్సును ధ్యానించుచు దిన దినాభివృద్ధిని గాంచవచ్చును.

సూర్యభగవానునివలె కోటి కంఠములతో వీరవేంకట సత్యన్నారాయణ, సింహాద్రి అప్పన్న, తిరుపతి వేంకటేశ్వర్లు గూడ మాట్లాడజాలరు.

వారి దివ్య వాక్కులను వినుటకు యీ ఖండమైన కర్ణములు జాలవు. అఖండకోటి దివ్య తేజస్వరూపుడైన ఆ పరంధాముని దివ్యతేజస్సును యీచిన్న నేత్రములు జూడజాలవు. ఆ దివ్యతేజస్సును, గాంచుటకు, జ్ఞాననేత్రము తెరువవలెను. జ్ఞానమును మించినది మరొక్కటి ఎచ్చటను, ఏ లోకమునను లేదు. జ్ఞానములేనివాడు, పశువుతో సమానమని పెద్దలు నుడివియుండిరి. జ్ఞానమనగా వున్నది ఒక్కటియే అని, అదియే వివిధ నామరూపములలో వ్యక్తమవుచున్నదని, వున్నది ఒక్కటేగాన, రెండు అసత్యముగాన, ఎన్నడును లేదుగాన, ఆ వున్నదే తానని, అపరోక్షముగా గుర్తించుటయే జ్ఞానము.

తత్వమసి! అదియే నీవు!

ఈ సత్యము తప్ప అన్యమైనదంతయు మిథ్యయే, ఎండమావులలో నీరువంటిదే .

ఏకమేవా ద్వితీయంబ్రహ్మ!

బ్రహ్మస్వరూపము రెండుగాక, ఒక్కటిగా వెలుంగుచున్నది. వున్నది ఒక్కటియేగాన, అది అద్వితీయము, అఖండము, పరిపూర్ణముగాన, నేనిప్పుడు యీవాక్యము వ్రాయుచుండ యీ కలముతో గీకుతూ వ్రాయు చున్నది, నా బల్లమీద గడియారములో టిక్కు టిక్కు అని కొట్టుకొనుచున్నది. నాచెంత నున్న పిల్లిపిల్లలో, సోహం అనుచున్నట్లు గుర్రుపెట్టుచున్నది, కీటకములలో శబ్దము జేయుచున్నది, పక్షులలో పాడుచున్నది,బాలురలో ఆడుచున్నది, మానవులలో పనిపాట్లు చేయుచున్నది. మాట్లాడుచున్నది,అంతయు దైవ శక్తియే. దైవశబ్దమే. దైవాజ్ఞ లేనిదే చీమ చిటుక్కుమనదనియు,యీశ్వర సంకల్పములేనిదే, గడ్డిపరకయైనను కదలజాలదనియు విజ్ఞులు, బ్రహ్మవేత్తలు నుడివి యుండిరిగదా.

ప్రశ్న: దైవము మాట్లాడుచుండెనా?

జవాబు: ఒక్క కంఠము నుండియేగాక కోటికంఠముల నుండి మాట్లాడు చుండెను. అన్ని వైపుల మాట్లాడుచుండెను. అందరిలోను మాట్లాడు

చుండెను. బాహ్యాముననే గాక ఆంతర్యమునగూడ, మన హృదయములలో ప్రతీ స్తంభనములో, దైవము మాట్లాడుచుండెను.

మీరు నిద్రపోవుచున్నను, దైవ సన్నిధిని, దైవ వాక్కును, గుర్తించినను, గుర్తింపజాలకున్నను నీలో అహర్నిశములు సోహంసోహం అనుచున్న దెవరు? అది దైవముగాదా! అది దైవవాక్కు గాదా! అది దైవోపదేశముగాదా! యిప్పుడైనను కండ్లను తెరచి, మీలో నిరంతరము ప్రత్యక్షముగా వినపడు చున్న దైవ శబ్దములోని, శాంతి వాక్కును సోహం భావనలో గుర్తించుడు. దైవము మాట్లాడుచుండెను. మీరేల వినరు అని ఒక్కమహనీయుడు నుడివి యుండెను.

మన అస్వాభావికమైన జీవితములు,పరిమితిలేని మన కోర్కెలు, వాంఛలే దైవము ప్రత్యక్షముగా యున్నను మనలను జడులుగా,అంధులుగా జేయుచున్నవి. చెవులుండియు, దైవవాక్కులు వినజాలకుంటిమి. కండ్లు ఉండియు, దైవతేజస్సును చూడజాలకుంటివి. మరియొక మహనీయుడు నిశ్శబ్దముగా యుండి, నిశ్శబ్దములో నీవే దైవమని తెలిసికొనుడు అని గాంభీర్యముగా నుడివియుండెను. మనము ఒక్క క్షణమైనను నిశ్శబ్దముగా యుండజాలము. చివరకు స్థిరముగాఁయైనను ఒక్క నిమిషము ఆసనములో కూర్చొనుట ప్రవృత్తి మానవులకు ప్రత్యక్ష నరకముగా యుండెను. వారి మెదడులు సదా పనిజేయుచు పరిమితిలేని ఆలోచనలతో వేడియెక్కియే యుండును.

ఏ పనియు లేనివారి మెదడులో దెయ్యములు నాట్యమాడుచుండెనని గూడ జెప్పబడియుండెను. మెదడులలో దెయ్యములు నాట్యమాడుచుండ, యిక దైవశబ్దమెటుల వినగలరు? దెయ్యమును, దైవమును ఒకేసారి,ఎంత చదువరులైనను, ధనవంతులైనను, మేధావంతులైనను, పూజించజాలరు గదా!

దైవముమాట్లాడునా?

ముమ్మాటికి మాట్లాడును. నూరుపాళ్ళు మాట్లాడుచుండును. కోటి కంఠములతో మాట్లాడుచుండెను. మీతోమాట్లాడుచుండెను. నాతో మాట్లాడు చుండెను, అందరితోను మాట్లాడుచుండెను. యిప్పుడప్పుడనక, ఏదో

కంఠము ద్వారా ఏదో రీతిగా సదా దైవము మాట్లాడుచునేయుండెను. మన స్నేహితులలో, విరోధులలో, బంధుమిత్రులలో, సేవకులలో స్త్రీలలో, బాల బాలికలలో వీరు వారు అననేల అందరిలో మాట్లాడుచున్నది దైవమే!

అజ్ఞానులు, దైవమును ఒక్కగుడికి గోపురమునకు, ఒక్క నామరూపమునకు బంధించెదరు. జ్ఞానులు దైవమును, అన్నిగుళ్ళలో అన్ని గోపురములలో దేశములలో, మానవకోటి అంతలో గాంచుచుందురు. ప్రతీ శబ్దములో దైవ వాక్కును వినెడివారి జీవితములు ధన్యవంతములు. తమ ఉచ్ఛ్వాస నిశ్వాసములలో నిరంతరము దైవ శబ్దమును గుర్తించుచు, అమృతతుల్యమైన నిత్యశాంతిని గ్రోలుతున్న వారి జీవితములు పరమపావనమైనవి.

సోహం వాక్కే దైవ వాక్కు

సోహం ధ్యానమే,ఉత్కృష్టమైన గొప్ప ధ్యానము.

ధ్యానము తైలధారవలె, ఏకాగ్రముగా నిర్మలమైన మనస్సుతో ఎడతెరపి లేకుండగా, చేయగా చేయగా కోరికలతో గూడియున్న వ్యక్తమైన సోహము, చాల నీచహితమైన కదలికలేని, పరిపూర్ణమైన అఖండమైన స్వయంప్రకాశమానమైన, అవ్యక్తమైన,సోహంలో నీరు నీరులో పాలు పాలలో, ఘటాకాశము మహాకాశములో ఏకమై అభేదమై కలసి లీనమవుచున్నట్లు శరీరములో ఆడుచున్న యీ సోహము విశ్వశ్వాసలో,అఖండ సోహములో విలీనమై బ్రహ్మ సాక్షాత్కారమును, పూర్ణశాంతిని కల్గించుచున్నది.

ప్రజ్ఞానం బ్రహ్మ

యీ తెలివియే బ్రహ్మ

యీ సోహమే బ్రహ్మస్వరూపము. యిదియే దైవవాక్కు

అదియే నీవు

తత్వమసి

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శాంతిః; హరి ఓం తత్సత్

26–2–58

6–00 ఎ.ఎమ్

# 52. మానవ ధర్మము

ప్రతీ మానవుడును, తన ధర్మమును, విధిని దుర్లభమైన మానవ జన్మ తనకు యివ్వబడినందుకు, తాను నెరవేర్చవలసిన పనిని, జీవితము యొక్క గమ్యస్థానమును గ్రహించిన, తన హృదయములో ఆనందము, గృహములో తృప్తి, దేశములో వృద్ధి, లోకములో శాంతియుండి తీరునుగదా!

మానవుని ధర్మము బ్రహ్మసాక్షాత్కారమే! ప్రత్యక్షముగా దైవము ననుభవించుటయే! అపరోక్షానుభవముగా మోక్షమును చవిజూచుటయే! జన్మ రాహిత్యమును జేసుకొని నిరంతరమును స్వస్వరూపానందమును అనుభవించుటయే!

కాని మాయలో మునిగియున్న సామాన్య మానవుడు ఆత్మవిచార శూన్యుడై తనకీ దుర్లభమైన మానవజన్మ యెందుకు ఇవ్వబడెనో గూడ తెలుసుకొనుటలేదు. తాను సదా, నామరూపములవెంట పరుగెత్తుచు ప్రపంచములో, ఆటవస్తువులకు బానిసయై, నిత్యమైన దైవమును కోరుటకు బదులు, అనిత్యమైన, విషయవాంఛలకు బానిసయై సంసార మహాసాగర సముద్రములో, కొట్టుకొని పోవుచు చివరకు అందే మునిగిపోవుచుండెను.

మానవ ధర్మమోద్దియో, తన విధియెద్దియో ఆలోచించుటకు బదులు నిరంతరము, వుదయము లేచినది మొదలు రాత్రి పరుండెడి వరకు, రెండు డబ్బులు గడించుట యెటులనో, అనియే సామాన్యమానవుడు ఆలోచించుట జరుగుచున్నది.నిన్నగాక మొన్న వచ్చి, రేపో మాపో నశించెడి శరీరమే తాను, అని అనుకొనుటచే, వ్యవసాయదారుడైన భూకామందుగా, లాండ్ లార్డుగా ఉండుటకు కోరును. చిన్నబంట్రోతు యైన పెద్ద బంట్రోతు ధఫేదారుగా అవ్వుటకు కోరును. చిన్నవర్తకుడు, పెద్ద వర్తకునిగా అవ్వుటకు ప్రయత్నించును. అటులనే, చిన్న డాక్టరు పెద్ద డాక్టరుగా, చిన్న లాయరు పెద్దలాయరు వకీలు అవ్వుటకును ఆశించుచుండును. జమీందారు రాజుగాను, రాజుమహారాజుగాను అవ్వుటకుకోరుచుండును. చిన్న గుమాస్తా పెద్ద గుమాస్తాగాను, చిన్నమాస్టరు హెడ్‌మాస్టరుగా యెంతలో అవ్వుదమనే ఆలోచించుచుందురుగాని, కోటానుకోట్ల జీవుల జన్మములో ఉత్తమమైన

యీ మానవజన్మ యెందుకు తనకు యివ్వబడెనని, దీనిని సద్వినియోగము చేయుట ఎటులనని, ఆత్మవిచారణ జేయుచు తరించుటకు ప్రయత్నించెడి వాడెచ్చటనో గాని గానరాకుండుట విషాదకరమైన అంశము.

మానవుడు తన జీవితాశయమును, జీవితము యొక్క ధర్మమును, విధినే మరచి జీవించుట కేవలము పశుప్రాయముగా యుండెను. యీ స్థితినే భక్తచింతామణిలో కవీశ్వరుడు.

మనుజుండె పశువవ్వుట కంటె

పశు జన్మచే హెచ్చు.....అని గీర్తించియుండెను.

శ్రీరామతీర్థులు ప్రస్తుతము మానవుని దుస్థితిని యీ మూడే చిన్నమాటలతో ఇమిడ్చి, క్లుప్తముగా చెప్పియుండిరి.

Marry, Multiply live in ignorance and die in bondage.

పెండ్లిఆడుట, సంతతిని వృద్ధిజేయుచు అజ్ఞానములో జీవించుట, బంధములలో బురదలో నశించుట.

ఎవ్వరి జీవితములను వారు, విమర్శించి కఠినముగా పరీక్షజేసుకొని జూచుకొన్న తామెటుల దినదినాభివృద్ధి గాంచుచు, గమ్యస్తానము జేరుచున్నదీ, లేక జీవితము యొక్క విధినే మరచి, అధోగతి పాలవ్వుచున్నదియు గ్రహించవచ్చును. తమ ప్రస్తుతపు దుస్థితిని గ్రహించినప్పుడే భావిస్థితిని, వృద్ధిజేసుకొని తరించుటకు అవకాశముండును.

జరిగిపోయిన కాలమునుగురించి ఆలోచించుట, గతజలసేతు బంధనము వంటిదని విజ్ఞులు నుడివియుండిరి. అనగా, యిదివరకే ప్రవహించియున్న నదీజలమును, బంధించుటకు కట్టిపెట్టి, అనగా గట్టువేసి వుంచుటకు ప్రయత్నించుట.

కాన కాలము చాల విలువైనది గాన ఒలికిపోయిన పాలుగురించి చింతించుచు జీవితమును వ్యర్థపుచ్చరాదు. యికముందు పాలు ఒలుకకుండగా, ఒక్కక్షణమైనను వ్యర్థమవ్వకుండగ ప్రయత్నించవలయును.

ఇంతవరకు మానవధర్మము బ్రహ్మసాక్షాత్కారము, దైవమును, ప్రత్యక్షముగా అనుభవించుటయే గ్రహించితిమి.

**ఆదైవ మెచ్చుటయుండెను**

భిన్నముగా యుండెనా! ఏ ఆకాశమునందో,స్వర్గములోనో, దూరముగా యుండెనా లేక అభిన్నముగా సన్నిహితుడైయుండెనా?

దైవము, మన నేత్రములకు నేత్రముగా, మనస్సునకు మనస్సుగా హృదయమునకు హృదయముగా శ్వాసకు శ్వాసగా, వెలుంగుచుండ, అతడు దూరముగా,భిన్నముగా యెటుల నుండును? మనలో మనకై వేచియుండెను. గాన ఆయనను ఎప్పుడో, ఎచ్చటనో గాక ఇచ్చటనే, ఇప్పుడే గుర్తించుదము. దైవమును గుర్తించి జీవించు జీవితములే ధన్యవంతములు. దైవానుభవము లేని జీవితములన్నియు భూభారములే!

ప్రేమయున్నచోటనే దైవముండెననియు, ప్రేమయే దైవమనియు బ్రహ్మ విదులు నుడివియుండిరి. ప్రేమతో ఆలోచించెడి ఆలోచనలు, ప్రేమతో మాట్లాడెడి మాటలు, ప్రేమతో జేసెడి స్వార్థరహితమైన పనులే సహకారిగా యుండును.

ఈ వ్యాసము ఏకాహము జరుగుచుండగా వ్రాయబడు చున్నదిగాన, ప్రేమతో చేయు భజనలు పూజలు, ప్రేమతో పాడెడి పాటలు, కీర్తనలు, కృతులు, మానవుని వృద్ధికి తోడ్పడుచున్నవని మీరు ఎరింగియున్నదే. దైవ నామమును విన్నంతమాత్రముననే ఆనంద బాష్పములను కార్చెడి వారి జీవితములు ధన్యవంతములు. దైవ నామమును హృదయపూర్వకముగా స్మరించుచు, దైవమునకు తమ ఆనందబాష్పములనే కానుకగా అర్పించుచున్న వారి జీవితములు అదృష్టనీయములు. అట్టి వారే, భక్తులుగా, మహాభక్తులుగా బరంగుచుండిరి.

దైవ నామమును, యెంత విన్నను, యెంత స్మరించినను ఒక్క ఆనంద బాష్పమైనను, యెన్నడును, దైవమునకు అర్పింపజాలని వారి జీవితములు విచారకరము. దైవమునకు లోకములో యున్న పుష్పములు, మాటలన్నింటి కంటెను, మన ప్రార్థనలు పూజలకంటెను, హృదయపూర్వకముగా తన్మయత్వ ముతో, దైవసన్నిధిననుభవించుచు అర్పించెడి, ఆనందభాష్పములే, అతి ప్రియముగా స్వీకరించబడును.

గార్దభములకు మంచి గంధపు చెక్కలు బరువేగాని, వాటివాసన తెలియ

దని, శాస్త్రములు జెప్పుచున్నవి. గాన, నిజభక్తునికి కావలసినది గంధపు చెక్కల సువాసన, వేదాంత సారము, దైవానుభవము.

పరమాన్నమును కలుపుచున్నగరిటె, క్రింద మీదచుట్టును, ఎంత గట్టిగా కలపినను దానికి పరమాన్నము రుచి తెలియదుగదా! అటులనే, కొన్ని ప్రవృత్తి జీవితములు మానవ ధర్మమును, తమ జీవితము యొక్క విధినే మరచియుండుటచే, దైవ పరితాపనలేనందున, దైవానుభవము శూన్యమై పరమాన్నములో గరిటెవలె జీవించుట జరుగుచున్నది.

మనలను, పాడమనిరి గదా అని గ్రామఫోను ప్లేట్లువలె దైవపరితాపన లేకుండగా పాడరాదు. మనుజునకు ప్రాణము యెంత ముఖ్యావసరమో ప్రతీ పాటకును దైవపరితాపన, తానుపాడెడి పాట యొక్క అర్థము, సారాంశము గ్రహించుట అంత ముఖ్యము. మా శాంతి గురుకులబాలికలు, ఎన్నో శ్లోకములు, పాటలు,పద్యములు,కృతులు నిత్యము పాడుచుందురు. వారు పాడుచుండ ఒక్క ఎన్నో శ్లోకములు, పాటలు, పద్యములు, కృతులు నిత్యము పాడుచుందురు. వారు పాడుచుండ ఒక్క ఆనంద బాష్పమైనను రానందున, వారందరును పిన్నవయస్సులు, చిన్నపాపలుగాన పరమాన్నము లోని గరిటెవలె, పరమాన్నమును కలుపుచున్నారు గదాయని చింతించుచుందును. గాని, చిన్న పిల్లలు, దైవ పరితాపన లేకుండగా, పాడుచున్నను, మనము చింతించుటకు బదులు ఆనందించవలసియున్నది. యేలనన, ఆ వయస్సులో, దైవనామ సంకీర్తన జేయుటచే వారి పూర్వజన్మ సుకృతము.

ఇప్పుడు మనము, విచారించవలసినది, పెద్దవారై అన్నియు తెలిసి, అన్ని కీర్తనలు, కృతులను వల్లించి, చివరగా భగవద్గీతను గూడ, నిత్యము పారాయణజేయుచు, దైవపరితాపన లేనియెడల దైవమునకు ఆనంద బాష్పములను అర్పించజాలని యెడల అట్టివారి జీవితములు భూభారమే, విచారించదగినవే,విషాదకరమైన జీవితములే.

“యథారాజా తథాప్రజా” అని చక్కనైన సామెత గలదు. రాజుయెటుల నున్న ప్రజలందరు అటులనే యుందురట. అటులనే, తల్లితండ్రులెటుల యున్న వారి బిడ్డలు గూడ అటులనే యుందురు. తల్లితండ్రులనే పిల్లలు

సదా అనుసరించెదరు. తల్లితండ్రులు పరమాన్నములో గరిటెవలె జీవించు చున్న తమ పిల్లలు గూడ వారి అడుగుజాడలలోనే నడచుటకు ప్రయత్నించు చుందురు. తల్లితండ్రులకు ఈ జీవితాశయములో ఆధ్యాత్మిక జీవితము మరుగైయున్నందున, తమ బిడ్డల భావిస్థితిని, వృద్ధినైన కోరకుండా నామ రూపములకు, పేరు ప్రతిష్టలకు బానిసలై జీవించుట చాల విషాదకరము. తండ్రి హరిజేరుమనెడి తండ్రి తండ్రీయని భాగవతము చెప్పుచున్నది. తన బిడ్డలనందరను జీవితముక్తముగా,ఒక జనని చేసెనని వినియుంటిమి.

ప్రియమైన ఆత్మసోదరీ సోదర స్వరూపులార,ఆశ్రమ భక్తులార మీకు నిజమైన ప్రేమ మీ బిడ్డలయందు యైనను యున్న, వారిగురించి యైనను మనస్సులను, స్థిరమైన శాశ్వతమైన, పరిపూర్ణమైన, మీ జన్మలకు ఆధారమును గమ్యస్థానమైన దైవమనందు నేడే స్థిరము చేయుటకు ప్రయత్నించుడు. మీరు దైవము ననుసరించుచు, మీపిల్లలను గూడ,దైవ మార్గమున నడిపించుచు వారి ఆధ్యాత్మిక వృద్ధికి, తరింపునకు తోడ్పడుడు. మీ పిల్లలను మీరే వృద్ధిచేయకున్న మరెవ్వరు వృద్ధి చేయుదురు? నిజమైన వృద్ధి ఆధ్యాత్మిక వృద్ధియే దైవము ననుభవించుటయే. కొదువ చదువులు, వృద్ధి అంతయు, కీనీడల వెంట పరుగెత్తుచు, గాజుపెంకు ముక్కలను పోగుజేసుకొనుటయే.

మానవ జీవితము, శ్లేష్మములో పడిన యీగవలె, తాపత్రయములతో నిండి చివరకు, శ్లేష్మములో, అంధకారములో నశించుటకు యివ్వబడలేదు. నిరంతరము, ఆత్మవిచారణ జేయుచు, మనము తరించి, మనమీద అనుకొనియున్న అమాయకమైన మన బిడ్డలను, మన బంధుస్నేహితులను తరింపజేయుటకే, యీ దుర్లభమైన జన్మదొరికెను. యీఏకాహము జ్ఞాపకార్థ ముగా మనమందరమును, దైవమును అపరోక్షముగా అనుభవించుచు మనమీద ఆధారపడినవారందరకును తోడ్పడులాగున, దైవపరితాపనతో నిండి ఆదర్శనీయమైన జీవితములను జీవించెదము గాక. కృపామయుడైన దైవము మీ అందరను ఆయురారోగ్యములతో బ్రోచుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

హరి ఓం తత్సత్

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

# 53. దైవమునకు ప్రీతియైన అర్పణ

ఈ మౌనపు దినములలో, దైవమునకు ఆనందము గలిగించెడిది, ప్రీతియైన అర్పణ యెద్ది అని, నాలో నేను తరచు విమర్శించుకొనుచుందును. ఆశ్రమాభిమానులైన, భక్తులు కొందరు పీసు పత్రికలో, శ్రీ సాయిబాబా గురించి చదివినప్పటినుండియు శ్రీసాయినాధుని పేరున అప్పుడప్పుడు విరాళములను పంపుచు, శ్రీ సాయినాధునికి ప్రీతికరమైన రీతిగా, వారి విరాళములను వాడమని నన్ను కోరుచుందురు.

అప్పుడు శ్రీసాయికి, ప్రీతియైనదెద్దియని, నేను దీర్ఘముగా ఆలోచించు చుందును. దేశములో వున్న పుష్పములన్నింటిని కోసి, శ్రీసాయిపూజ జేయు చున్న సాయినాధుడు ఆనందించునా లోకములో యున్న పుష్పములన్నియు తెప్పించి, సాయికి అర్పించిన తృప్తిపొందునా! నిరుపేదలైన ఏ రక్షణయు లేని రోగులసేవయే నిజమైన తృప్తిని, ఆనందమును శ్రీసాయికి కలిగించును. యింతకు అర్పించవలసిన దానిని అర్పించవలెనన్న అదియేది? మనస్సే! మనస్సునే అర్పించినవారు సర్వమును అర్పించినట్లే! హృదయమనే పుష్పమును అర్పించినవారే నిజమైన భక్తులు. సహస్రారమనెడి వేయి రేకుల పద్మమును దైవార్పణ జేసినవారు మహాజ్ఞానులేగదా! పత్రం పుష్పం ఫలంతో దైవమునకు ప్రేమతో అర్పింపబడినవి, ప్రీతికరములైనను, యే చిన్న వస్తువును దైవార్పణజేసియైనను నీవు నాకు ఏమియిచ్చెదవని కోరికతో అర్పించెడి వస్తువులేమియు, యెంత అమూల్యములైనను దైవమునకు ప్రీతి కరములు కాజాలవు.

కోరికతో ప్రతిఫలమును కోరుచు, వర్తకునివలె దైవముతో బేరమాడుచు ప్రపంచములోయున్న పుష్పములను ఫలములనే గాక ధనరాశులున్నియు అర్పించినను, దైవమునకు ప్రీతిని గల్గించజాలవు. నిష్కామముగా ప్రేమతో, దైవమునకు ఒక్క నీటిబొట్టు నర్పించినను, ఆయన ఆనందముతో స్వీకరించును. బాహ్యపూజావిధానములన్నింటిలో, దైవము ప్రేమకొరకే వెదుకు చుండును.

దైవమునకు ప్రేమ ముఖ్యమా పండ్లు ముఖ్యమా? ప్రేమచేతనే శబరి భక్తితో అర్పించిన, ఎంగిలి పండ్లను ఆనందముతో స్వీకరించెను. సర్వాంత ర్యామియైన దైవము, యీ బాహ్య పుష్పములతోను, మాధుర్యమైన ఫలముల తోనేగాక ఆంతర్య పుష్పముల నర్పించి నప్పుడు ప్రేమతో పరవశత్వమును పొందును. ఆ ఆంతర్యపుష్పాదులేవి.

ప్రేమయనెడి పుష్పమును అర్పించెడివారు ధన్యులుగదా! హృదయ మనెడి ఫలమునే దైవార్పణ జేయువారు, నిజమైన భక్తులుగదా!

అహింస ప్రథమ పుష్పం

సత్యం ద్వితీయ పుష్పం....

అనెడి శ్లోకము దైవమునకు యేయే పుష్పములు ప్రీతికరములో తేలికయైన మాటలలో చక్కగా తెలియజేయుచున్నది.

ఆంతర్యమున, బాహ్యమున యున్న యీ ఫలపుష్పాదులన్నింటికంటె నా అంతటనేను నిశ్శబ్ద ఘడియలలో, మరియొక్క అమూల్యమైనది దైవము నకు అఖండమైన ప్రీతిని గల్గించెడిది యున్నదని నిశ్చయించగల్గితిని.

అది యెద్ది?

మనలో, ప్రతీజీవిలో రాత్రింబగళ్ళు నిరంతరము ఉచ్ఛ్వాస నిశ్వాసము లలో ఆడుచున్న శ్వాసయే! ఒక్కొక్క శ్వాసను ఒక్కొక్క పుష్పముగా జేసుకొని అన్ని శ్వాసలను దైవార్పణ జేసినవారే భక్తవిదులు, జీవన్ముక్తులు,అట్టి మహ నీయులు లోకములోయున్న పూజలన్నియు జేయుచున్నట్లే.

**సోహం భావేన పూజయేత్**

ఆ పరమాత్మను సోహం భావనచేతనే పూజించవలెను. సోహం పూజయే పూజలన్నింటికి గొప్పపూజ. అదియే పూజలకు మహాపూజ అదియునుగాక, నామరూపముల గలిగియున్న ఫలపుష్పాదులన్నియు, వస్తు వాహనము లన్నియు అవి ఉద్భవించినప్పుడే దైవపూజలో అర్పించబడినవి. పుష్పము దైవము కొరకే వికసించుచుండెను. ఫలము చెట్టుననే దైవార్పణజేయబడెను. యిక దీప ధూపనైవేద్యములతో భగవంతుని

పూజించుదమా అవిమాత్రము దైవార్పణ జేయబడలేదా! దైవమునకు చెందని వస్తువేది? దైవముగాని దెద్ది? చివరకు, దైవమును, నక్షత్రములతో పూజింతుమన్నను, నక్షత్రము లన్నియు దైవముకొరకే ప్రకాశించుచున్నవి.

ప్రపంచములో, సృష్టింపబడిన వస్తువులన్నియు దైవపూజలో వాడబడు చున్నవే వాటంతట అవియే దైవమునకు అర్పణజేయబడుచున్నవి. దైవము నకు ఒక్కమారు అర్పణ జేయబడిన వస్తువును మరల మనమేల అర్పించి పూజ చేయవలెను. ఎప్పుడును, ఎన్నడును అర్పించని అమూల్యమైన వస్తువే దైవమునకు ప్రీతికరము.

ఆ వస్తువు మనలో యిక రాబోయెడి శ్వాసయే–సోహం మహాపుష్పమే. ఇంతవరకు గడచిన శ్వాసలు ఎంగిలివే, వాడిపోయినవే, కృశించినవే, మలిన మైనవే! ఇకముందు, విడవబోయెడి శ్వాసయే మలిన రహితమైనది, నూతనమైనది, యిప్పుడే జన్మించుచున్నది గాన అదియే దైవమునకు, సన్నిహితమైనది, నూతనమైనది, యిప్పుడే జన్మించుచున్నది గాన అదియే దైవమునకు, సన్నిహితమైననది.దైవమును శ్వాసలో ప్రతీ శ్వాసలో, ఒక్కొక్క శ్వాసలో అనాదినుండియు అంతిమవరకు పూజించుచున్న బ్రహ్మవిదులకు ధన్యవాదములు. అట్టి మహనీయుల జీవితములే, వారి అజప గాయత్రి పూజలే, ఎన్నటికైనను, లోకశాంతికి మానవాభ్యుదయమునకు ఆధారమై యున్నవి.

లోకాస్సమస్తా సుఖినోభవంతు

హరి ఓం తత్సత్

**సర్వ హృదయ నివాసియు ప్రభువైన శ్రీకృష్ణ భగవానునికి అర్పణ**

5-7-56

4.00 ఎ.ఎమ్.

# 54. మీరా సాహేబు

మీరా సాహేబు ఒక రాతి పనివాడు. రాయి తవ్వుటలో ఆరితేరినవాడు. యీచుట్టుపట్ల పది గ్రామములలో గూడ అతనితో సమముగా యెవ్వరును, రాయితవ్వజాలరని తానే జెప్పెను. అతడు చాల బలాఢ్యుడుగూడను.

ఇప్పుడు తోటపల్లి ఆశ్రమములో ఒక నుయ్యి కొట్టబడవలసి యున్నందున మీరాసాహేబు ఆ నూతి కొరకై రెండు వందల గజములరాయి తీసెద ననియు, యిది దైవపని గాన వందకు పదిగజములు ధర్మముగా యిచ్చెద నని, మొదటరోజు వాగ్దానముజేసి, రెండవ రోజున తాను అటుల యిచ్చెద ననలేదనియు, రెండువందల గజములకు పదిగజములిచ్చెదనని అబద్ధ మాడుటచే, నాకు మొదటిలోనే కొంత చింత కలిగెను.

అప్పుడు మీరాసాహేబుతో, దైవపనికి నీకు ధర్మము చేయవలెనని యిష్టము లేని యెడల ఒక్క గజము రాయనైన యివ్వనవసరములేదు, నీ యిష్టముతోను, నీ భక్తితోను గూడుకున్నది గదా! నిర్బంధన లేదు. గాన, నీ రాతి పనిని ఆనందముగా జేసుకొనమని జెప్పితిని. నా మాటలు విని కొంత సిగ్గుపడుతున్నట్లుగాన వచ్చెను. ఏలనన తాను జేసిన వాగ్దానమును తన హృదయములో ఎటుల మరువగలడు.

మరొక రోజున మీరాసాహేబుతో యిటుల సంభాషించితిని.

నేను: మీరాసాహేబు మీ మతములో రోజుకు 5సార్లు నమాజు (ప్రార్థన) జేయుమని జెప్పబడినది. అటుల జేయుచుంటివా?

మీరాసాహెబు : నేను ఆ సిస్టమ్ పద్ధతి పెట్టుకొనలేదండి.

నేను : దుర్లభమైన మానవజన్మను పొందియు దైవ ప్రార్థనలేని జన్మ భూమికి భారముగదా!

మీరాసాహేబు : అయ్యా దానికి దీనికి కుదరదండి. లంగరు అందదండి. గాన ఆ సిస్టమ్ మానివేసితిని.

నేను: ప్రార్థన, దైవభక్తి లేని జన్మ మానవజన్మ ఎటుల అవ్వును?

మీరా సాహేబు :అయ్యా నేను ఐదుసార్లు, నమాజు జేయుచు దైవ ప్రార్థన జేయుచున్న, కొండదరికి వెళ్ళి రాళ్ళనెవ్వరు తెచ్చెదరు. పొట్ట పోషించుకొనుటయెటుల అందుచే, ఆ సిస్టము నేను పెట్టుకొనలేదు.

నేను: మీరాసాహేబు, నీవు పని జేయుచున్నను దైవమునమభవించ వచ్చును. నీ పనికి దైవము అడ్డురాడు. నీపనినే నీ ప్రార్థనగా, ఆరాధనగా జేసుకొని జీవించవచ్చును.

అప్పటికిని మీరాసాహేబు తాను జేయుచున్న పద్ధతే తనకు మంచిదని జెప్పుచు కొంచెము దీర్ఘముగా, నేను జెప్పిన మాటల గురించి ఆలోచించుచు భక్తితో నమస్కరించి డబ్బు తీసుకొని వెళ్ళెను.

ప్రియమైన పాఠకా! సామాన్య జనుని స్థితి సామాన్యజనుడు అననేల లక్షలకొలది పాటకజనులస్థితి, రోజూ ఏదోపనిజేయుచు పొట్టపోషించుకొనెడి వారి భావన యిటులనే యుండునుగదా!

లక్షలకొలది పనివాండ్రు కూలీలు, పాలేరులు, రైతులు వగైరా పాటకపు జనుల జీవితములకు మీరాసాహేబు ఒక వుదాహరణముగా యుండెను.

దైవమెచ్చటనో,గుడిలోనో,మసీదులోనో, ఆకాశములోనో,స్వర్గములోనో భిన్నముగా దూరముగా లేడనియు తమ హృదయములందే ప్రకాశించు చుండెనని, తమ నేత్రములతో జూచుచుండెననియు తమ శరీరమంతయు నిండియుండెనని, తాము పని జేయుచున్నప్పుడు, కదలుచు మెదలుచు తమలో పనిజేయుచుండెనని అమాయకులైన మూఢత్వముతో నిండియున్న యీ లక్షలకొలది, కోట్లకొలది మీరాసాహేబులకు యీ అద్వితీయమైన, సత్యమైన సువార్తను, బోధించెడి వారేరి?

లోపలవున్న దైవమును మరచి, ఎచ్చట నమాజులోను, మసీదులోను ఉన్నాడనెడి భ్రమయేగదా నిన్నటి వాగ్దానము నేడు తుడుపు పెట్టుచున్నది. దేవుడు పారడైజు–స్వర్గములో, సింహాసనమున కూర్చుని యుండునన్న భ్రాంతియే, మీరా సాహేబుకు కోపమువచ్చిన, తనతోటి సోదరుని కత్తితో సహా హత్య చేయించుచున్నది.

మానవుడే దైవము,మానవుని ప్రేమించుటే దైవమును ప్రేమించుట.

పనియే ఆరాధనయని మనము మనచుట్టును, దేశమంతలో, లోకమంతయు నిండియున్న మన మీరా సాహేబులకు బోధించిన, యీ అబద్ధములు, సంఘ పోరాటములు, కక్షలు హత్యలు వుండవుగదా!

వ్యక్తులలోను, సంఘములలోను, దేశములోను, ప్రపంచములోను శాశ్వత శాంతి కావలసిన మనము మనసేవను మీరాసాహబుతోనే ప్రారంభించవలెను. మరచితిని. మీరాసాహేబు తన రాతి పనిని ప్రారంభించి నప్పుడు, నోరెరుగని కోడినో, మేకనో దానిని చంపి తినుటకు మూడు రూపాయలు మామూలు గూడ వున్నదని జెప్పెను. దైవము తనలోను ప్రతీ జీవిలోను వుండెనన్న సత్యమును మన మీరాసాహేబు గ్రహించి, నోరులేని అమాయకమైన జీవులను హత్యజేయుచు జీవించడు గదా! ఆ సిస్టము అనగా దైవ ప్రార్ధన, నమాజు పెట్టుకొననందుననే, దైవ మును తన పనిలోనకు తీసుకొని ఆయన దివ్యసన్నిధిని నిరంతరము అనుభ వించనందుననే యీ అనర్థములన్నియు, అసత్యములు, కక్షలు, పోరాట ములు, చివరకు హత్యలు గూడ గ్రామములలో పట్టణములలో జరుగు చున్నవి. యిప్పుడు మన మీరాసాహేబు తాను కాంట్రాక్టు వ్రాసి యిచ్చిన 200 గజముల రాయిత్రవ్వుట పూర్తి చేయుటకు ముందే తన సిస్టమును మార్చుకుని ఆశ్రమం నుండి వెళ్ళేముందుగా, కొత్తపద్ధతిలో దైవ సన్నిధిని నిరంతరము ప్రతీ చిన్న పని పెద్దపనిలో గూడ అనుభవించుటకు ప్రయత్నించుటకు...సిస్టమనెడి యింగ్లీషు మాటను మీరా సాహేబు వాడుచున్నదే. ధర్మచట్టములు, దైవ విధులు పనివాండ్రకు, ప్రభువులకు సమమే అని, అందరకు ఒకే సిస్టము అని మన నేతలు, సాహేబులు ఎంత త్వరలో గ్రహించిన అంత దేశవృద్ధికి అంతమంచిది. మన మీరాసాహేబు తమ నమాజు పద్ధతిను త్వరలో తన జీవితములోపలకు, తన పనిలోనకు, తీసుకొనివచ్చి తరించుటకు దైవము ఆశీర్వదించుగాక!

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

తోటపల్లి

27-2-50

## 55.నిమ్మచెక్క

చిన్నతనము నుండియు ఒక నిమ్మపండు నీళ్ళలో పిండి తీసికొనుట, అభ్యాసమైయుండెను. ఇది ఆరోగ్యమునకు, ముఖ్యముగా, కాల విరోచన మవ్వుటకు సహకారిగా వుండునని, ఆంగ్లవైద్యులు, ప్రకృతి వైద్యులు, ఆరోగ్య వేత్తలందరు జెప్పియుండిరి. ఈ నిమ్మ నీటిలో పంచదార వాడరాదు. అవసరమైన తేనెను కొంచెము కలిపిన రుచిగా యుండుటేగాక బలము నిచ్చునని కొందరు జెప్పెదరు.

మనకిప్పుడు కావలసినది నిమ్మకాయ యొక్క గుణములను, మాహాత్మ్య మును గాదు. ఆ రోజున నేను ఒక్కడినే, కైలాసములో యుండుట జరిగెను. నిమ్మపండ్ల నిండుకున్నవి. గాని, ఒక సగము నిమ్మకాయచెక్క మాత్రము వున్నది. చీకటిపడుచున్నందున గ్లాసులో నీళ్ళు ఆ మిగిలివున్న నిమ్మచెక్క తీసుకొనివచ్చి వుదయములేవగనే తీసుకొనుటకు బల్లమీద వుంచితిని. తెల్లవారు జాముననే వెలిగించుటకై దీపము మొదలైవని గూడ బల్లమీద వుంచితిని. యిక ధ్యానము జేయుచు విశ్రమించువచ్చునని తలచుచుండ యిద్దరు అతిధులు, చాల దూరమునుండి వచ్చిరి. అతిధులకు ప్రార్ధన కాగితములిచ్చి కొంత తడవు అయిన తరువాతను ప్రార్ధన జేయించి, ప్రణవ గానము చేయుట జరిగెను. అప్పుడు, వారిని మంచితీర్థము కావలెనా అని కాగితము మీద వ్రాసి అడిగితిని. వారు కావలెను. అనిరి. అంతలో నిమ్మకాయ చెక్క నావైపు చూడసాగెను. దానివైపు నేను జూస్తిని.

ఒక్క నిమిషములోననే నాకును నిమ్మకాయబద్దకు ఈ క్రిందివిధముగా సంభాషణ జరిగెను.

నిమ్మకాయ: నావైపు చూచెదవేల? వారు మంచినీరే అడిగిరి, వెంటనే వారికి మంచినీరు యిమ్ము.

నేను: నిన్నువారికి, మంచినీరులో కలిపి పంచదారవేసి అర్పించిన వారు చాల ఆనందించెదరు అని, నీవైపు చూచుచుంటిని.

నిమ్మకాయ: నన్నువాడిన, రేపు వుదయము నీకు యేమీ వుండదు. వారు అడిగినది మంచి నీరేగదా!

నేను: అయినను వారికి నిన్ను అర్పించి, ఆనందము గల్గించిన, యితరుల ఆనందమునాదే గాన, నేను ఆనందముగా యుందునని తలచు చుంటిని.

నిమ్మకాయ: ఓ వెర్రివాడా! తనకు మాలిన ధర్మమా! నేను నీకు రేపు ఉదయమే అవసరము. వారు నన్ను అడుగలేదు. వెంటనే, మంచినీరు వారు కోరినట్లు వారికి యిచ్చి చాదస్తపు ఆలోచనలు మాని ధ్యానము జేసుకొనుము.

నేను: నీ సలహాకు ఆనందమేగాని, వారికి నిన్ను అర్పించకుండా, నిన్ను నాకై దాచుకొన నాకు యీ రాత్రి అంతయు నిద్రపట్టదు. నా జీవిత మంతా చిన్న నిమ్మకాయబద్దను యితరుల కివ్వజాలనైతినిగదా అని విచారించ వలసియుండును. గాన నా ఆనందము కొరకు, మనోశాంతి కొరకైనను నిన్ను వారికర్పించుటకు నిశ్చయించితిని.

అని జెప్పుచు వెంటనేలేచి ఆ నిమ్మకాయ బద్దను లోపలకు తీసుకొని వెళ్ళి, రెండు గ్లాసులలో పిండి నీళ్ళుపోసి, పంచదారకలిపి, అతిధులకు యిద్దరకు అర్పించితిని. అప్పుడు వారు, అయ్యా కైలాసములో నీళ్ళుయింకను లేవగాన,మేమిద్దరమును ఒక్కగ్లాసు నీళ్ళే పంచుకుని త్రాగెదమని చెప్పిరి. అప్పుడు నేను అది మంచినీరు కాదనియు నిమ్మకాయ సిరప్పు అని చెప్పగా, ఎంతో ఆనందముతో మహాప్రసాదమని కండ్లకు అద్దుకొనుచు స్వీకరించిరి.

గ్లాసులు నేను కడగవలసియుండునని వారే వాటిని కడిగివేసి, మరల ముమ్మారు ప్రణవగానము జేయుచు, కైలాసము నుండి శాంతితో వెడలిరి.

అప్పుడు నేను నిమ్మకాయ ముక్క చిన్నదైనను, యితరుల సేవలో సద్వినియోగ మయ్యెను గదాయని ఎంతయో ఆనందముతో ధ్యానము చేయసాగితిని.

ప్రియమైన పాఠకులారా! యిది సామాన్యమైన చిన్న వుదాహరణ యైనను, దీని నుండి, మనము శాశ్వతముగా నేర్చుకొనవలసిన స్థిరమైన గొప్ప పాఠము గలదు. మనుజుని ఆనందమంతయు, అది చిన్న నిమ్మపండైనను, పెద్దరాజ్యమైనను తాను అనుభవించుటలోనే లేదు. తనకు గలదానిని

యితరులతో పంచుకొనుటయందే వున్నది. ఏలనన యితరుల ఆనందమే తన ఆనందము. స్వార్థమే నరకము, స్వార్థరాహిత్యమే స్వర్గము. యింతకు మానవసేవయే దైవసేవగదా!

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

శ్రీకైలాస్

19–10–51

4.00 ఎ.ఎమ్

## 56. ద్వంద్వము లేక బేధభావన

ద్వైతమన్నను, ద్వంద్వమన్నను భేదమన్నను ఒక్కటే. దైవము సత్యము, అనిత్యము కేవలము భ్రమయని అద్వైత గ్రంథములు. అనుభవనీయులు వెయ్యినోళ్ళ చాటుచుండిరి. అయినను, దైవము, అబద్ధము అసత్యమన్న దైవవాదులకు కష్టముగా యుండునుగాన ద్వంద్వమనే వాడుదము.

లోకమంతా, ద్వయి నామరూపములతోనే నిండియున్నది. అన్ని మత ములలోను ద్వైతమునకే ప్రాముఖ్యత నొసంగబడియున్నది. ఎచ్చటనో గాని, నిత్యమైన,సత్యమైన పరిపూర్ణమైన, అద్వైత భావన గానవచ్చుట లేదు. అన్ని మతములలోను అద్వైతవాసన అచ్చుటచ్చుట వున్నను అది అనుభవములోనికి వచ్చుట చాల దుర్లభముగా యున్నది.

ప్రశ్న : ఎందుచేత?

జవాబు : అజ్ఞానముచేతను, భ్రమచేతను, మాయచేతను మనుజునకు చిన్నతనము నుండియు తల్లి ఉగ్గుపాలతోగూడ, యీద్వంద్వమునే, బేధ భావననే నూరిపోయుట, బలవంతముగా త్రాగించుట జరుగుచున్నది.

పుట్టినది మొదలు మన తల్లితండ్రులు దైవము నెచ్చటనో, భిన్నముగా వేరుగా ఉన్నట్లే మనకు బోధపరచుచుండిరి. వారుగూడ భిన్నముగా అన్యముగా ఉన్న దైవమునే ఆరాధించుచుండ వారిలోలేనిది, వారికి అనుభవ మవ్వజాలనిది అగమ్యగోచరమైన దానిని మనకెటుల బోధపర్చగలరు?

అంధులు అంధులకు దారిజూపుచు, చిట్టచివరకు అందరూ కలసి అగాధములోపడినటులే మానవుని దుస్థితి ప్రస్తుతము యుండియున్నది. పైగా, సత్యనారాయణ కొండకు వెళ్ళి వ్రతములు జేయుట, సింహాచలము వెళ్ళి సింహాద్రి అప్పన్నకు వెంట్రుకలర్పించి, బోడుగుండు జేయించుకొనుట, తిరుపతివెళ్ళి అచ్చట తిరుపతి వెంకటేశ్వరునికి ముడుపులు చెల్లించుట, యీ మూఢాచారములన్నియు దైవము భిన్నముగా, ఎచ్చటనో, పుణ్యతీర్థము లలోను, కాశీరామేశ్వరములలోను, గుళ్ళలోను, గోపురములలోను, భిన్న ముగా యున్నట్లే అపరిపక్వమైన సున్నితమైన, అమాయకమైన, బాలబాలికల

మనస్సులకు తట్టుచున్నది. చిన్నతనములోనే ఉగ్గుపాలతో వేయబడిన యీ ద్వంద్వ బీజములు విషబీజములై పెద్ద వృక్షములై మ్రానులు కట్టి యిప్పుడు వ్యాపించియుండ, వాటినుండి తప్పించుకొని దూరముగా యుండి కోట్లలో ఎవ్వరో ఒక్కడు మహనీయుడు దైవము బాహ్యమున లేడు నాలోయుండెను నేనే దైవమును అని జెప్పిన "వీడు పిచ్చివాడని, పిచ్చి ఆసుపత్రిలో కొంత కాలము వుంచిన గాని మతి స్థిరమవ్వదని" ముఖ్యముగా ద్వైతులు చెప్పు చుంటిరి.

మానవుని దినచర్యలో, అనుష్ఠాన విధానమును పూజాపునస్కారము లను ఏవి పరిశీలించిజూచినను సర్వము దైవములోనే, ద్వంద్వములోనే, బేధ భావములోనే ప్రారంభించి ఆ భేదభావనలోనే దుఃఖములో అంధకారములో మరలబడుచుండెను.

భేదమే నరకమని, అభేదమునే స్వర్గమని బేధమే బంధమని, అభేద భావనయే మోక్షమని అద్వైత గ్రంధములు, బ్రహ్మవిదులు ఘోషించుచుండిరి. చివరకు మనము పాడెడి పాటలు, వినెడి కృతులు అన్నియు భేదభావననే పురికొల్పుచున్నవి. ఉదాహరణగా కొన్ని కృతులపేర్లను తీసుకొందాము.

1. నను పాలింపగ నడచి వచ్చితివా? ఎచ్చట నుండి నడచివచ్చెను.

2. ఇంకా దయరాదా! ఎప్పుడు దయవచ్చును?

3. ఎప్పుడు కృపగల్గునో? కృప ఎప్పుడు వచ్చును?

ఎచ్చటనో, అద్వైత భావనలో వుండియున్న కృతులు, కొలది తప్ప విడిచి, మరల దిగి, ద్వైతభావన, ద్వంద్వభావన, భేద భావనలోనే మన పాటలు, కృతులు, కథలు, ప్రార్ధనలు అన్నియు నిండియున్నవి. చివరకు యీ ద్వంద్వ భావనచే మనుజుని జీవితము నిస్సారముగా ప్రాణము లేని శరీరముగా, శక్తిలేని వ్యక్తిగా మారియున్నది. భేదభావన, ద్వంద్వము మనుజునికి జన్మహక్కైన స్వశక్తిని, ఆధారమును మంటలో గాల్చి, బూడిద పాలుజేసి జీవన్మృతినగా జేసినది. తాను సింహమై యుండియు గొర్రెపిల్లగా తయారయ్యెను. గొర్రెవలె భయముతో నిండి అరచుటే నేర్చుకొనక, యిప్పుడు సింహమువలె గర్జించుట అన్న, తనకే భయము వేయుచున్నది.

నిశ్శబ్దముగా యుండి, నీ హృదయములో నీ కొరకైవేచియున్న దైవమును అనుభవించమని అద్వైతము బోధించుచున్నది. డప్పులు, బాజాలు, మద్దెల, తాళములతో బాహ్యపూజా విధానములతో, వస్త్రవాహనములతో దైవమును అలంకరించి, పల్లకీలో కూర్చునబెట్టి ఊరేగించి, అటులు ఆరాధించగా ఆరాధించగా దైవమునకు నీ మీద కృపగలిగి, వైకుంఠమునకు, చనిపోయిన తరువాత తీసుకొని వెళ్ళునని ద్వైతము బోధించుచున్నది.

దైవము సత్యమైనను దానిని గూడ, మనుజుని ఆధ్యాత్మిక జీవితములో పాషాణముగా జేసుకొనక ఒక మెట్టుగా, సోపానముగా జేసుకొని అద్వైతమును సత్యమును బేధమని అనుచు ద్వైత భావన గల్గిన పాఠకులు నేను ద్వైతమును, ద్వైతులను ఖండించుచుంటినని తప్పు అభిప్రాయము పడవలదు. ద్వైతములో మన జీవితము ప్రారంభించినను చిట్టచివరకు అద్వైతములో పరిపూర్ణములో, దైవములో విలీనమవుట ముఖ్యావసరము. అదియే గమ్యస్థానము గాని లోకాచారములు పరిశీలించి జూచిన అటుల గానవచ్చుట లేదు. అక్షరములు ప్రారంభమున నేలమీద వ్రాసి నేర్చుకొనుటలో తప్పులేదుగాని, చనిపోయిన వరకు నేలమీదనే తన వ్రాతను తాను వ్రాయుచుండుట హాస్యాస్పదము. 70,80 సంవత్సరముల వయస్సు వచ్చినను తమలో జ్యోతిస్వరూపముగా, హృదయమునకు హృదయముగా యున్న దైవమును మరచి, దైవమెచ్చటి నుండియో, ఏ స్వర్గము నుండియో ఎప్పుడు వచ్చునురా దైవమా, అని కండ్లు కాయలు గాచెడిలాగున జూచుచు, నోరునొప్పి పెట్టెడి లాగున ప్రార్థించుచున్న వారి అవస్థలు విచారకరము.

దైవ భక్తియే లేక, దైవమునే స్మరించక, కేవలము ప్రవృత్తిపరులై, నర పశువులుగా జీవించెడి వారి స్థితికంటె భేదభావనలో నిండియున్నను దైవ పరితాపనలో నిండియున్నవారి జీవితములు కొనియాడవలసినదే. గాన సాధకుని మతము ద్వైతములో ప్రారంభించినను చివరకు సత్యములో, అద్వైతములో, అభేదములో విలీనమవ్వుట ముఖ్యావసరము. యిదియే మానవ జన్మకు గమ్యస్థానము.

ఓ దైవమా! ఎచ్చటవుంటివిరా! నన్ను కాపాడుమురా! అని ప్రార్థించుట చాల సులభము. ఏదైవము కొరకై వెదకి, వేసారి పడుచుంటినో ఆ దైవము

నాలోనే యుండెను. ఆయనను, నా మనోవాక్కాయములలో, యిప్పుడే యిచ్చటనే వ్యక్తపరచెదనుట చాలకష్టము. గాన, మనుజుడు సులభమైన ద్వైతమార్గమునే నడచుటకు కోరుచుండెను. అవ్యక్తమును పూజించుట, ధ్యానించుట చాలాకష్టమని గీతలు మొదలైన, మహాగ్రంధములు గూడ జెప్పుచున్నవి. గాన యిప్పుడు మనము గమ్యస్థానము చేరుటకు, శాంతిని పొందుటకు దగ్గర మార్గమేది? వ్యక్తము నుండి అవ్యక్తములో పడవలెను. బేధభావన నుండి అభేద భావనను పొందవలెను. ద్వైతము నుండి అద్వైతమునకు తీసుకొనివెళ్ళవలెను. నరుడే నారాయండని గ్రహించుటయే. జీవుడే దైవమని స్థిరము చేయవలెను. సత్యమును సత్యముగా గ్రహించి, అసత్యమును విడువ వలెను.

పడవ యేరు దాటువరకే గదా! నేను పడవలోనే కూర్చొనెదను, అవతల వడ్డుకు రానని జెప్పినఎటుల యుండును. చీడీలు (మెట్లు) మేడ ఎక్కుటకే కదా గాని నేను చీడీల మీదనే చచ్చెడివరకు ద్వంద్వములో, భేదములో కూర్చొనదనిని యెడల, మేడ ఎక్కను అన్న మనమేమి చేయగలము, గాని ఉగ్గుపాలతో నూరిపోసిన అలవాటులను ఒక్కరోజున పారదోలుట దుర్లభము. నలుబది సంవత్సరములు చీకటి గదిలో బంధింపబడిన, చైనా దేశస్థుడు వెలుగులోనకు తీసుకొనిరాగానే, “చోచో చచ్చిపోయెదను యీ వెలుగు నాకండ్లను పొడిచివేయుచున్నది. మరల నన్ను చీకటిగదిలోనకే తీసుకొని పోయిరక్షించుడని” ప్రార్థించెను.

అటులనే అద్వైత భావన భీకరముగా యుండును. మనుజుడు స్వశక్తిని మరచి పోయెను. తన జీవితావస్థలలో ప్రతీచిన్న పరీక్షకు, జబ్బులకు, బాహ్య దైవములకు మొక్కుట ముడుపులు కట్టుట నేర్చుకొనెను. ఆహా! మానవుని స్థితి, కస్తూరి మృగము యొక్క దుస్థితివలె వచ్చినదని విచారించ వలసియున్నది. కస్తూరి మృగము కస్తూరివాసనను కనిపెట్టుటకై, కొండలు అడవుల వెంట తిరిగి తిరిగి, వేసారి ఒక కొమ్మ తన హృదయములో గ్రుచ్చుకొనగా రక్తము కారుచుండ సొమ్మసిల్లి పడిపోయెను. ప్రాణము పోయెడి అవసాన కాలమునందు తన నుండి కారుచున్న రక్తమునే ఆఘ్రా ణించగా, అప్పుడు ఏ కస్తూరికై, కొండలన్నియు, అడవులన్నియు తిరిగి,

చివరకు ప్రాణము పోగొట్టుకొంటినో ఆ కస్తూరి నాలోనే, నా హృదయములో నుండెనని ప్రాణము పోయే సమయమందు గ్రహించెను. విచారకరమైన కస్తూరి మృగము జీవితములో, ప్రాణము విడువక ముందే, అమృతతుల్యమైన కస్తూరి తనయందు ఉన్నదని, గ్రహించిన తరువాతనే ప్రాణములు విడచెను. కొంతవరకు మనము సంతసించవలసినదే.

ఇకమానవుని స్థితియో?

బ్రతికియుండగా, తనలోవున్న దైవమును, గ్రహించి అనుభవించునా, లేక బాహ్యదైవములనే కొలుచుచు ప్రాణములను విడుచునా?

ప్రియమైన శాంతిపాఠకులారా, ప్రాణము పోకుండగనే, యముని దర్శించకుండగనే నిత్యమైన సత్యమైన, పరిపూర్ణమైన ఆ చిత్ పదార్థమును అఖండకోటి సూర్యతేజస్సును మన జీవితములలో నేడే యిచ్చుటనే యీ క్షణమునందే, వ్యక్తపరచుటకు, అనుభవించుటకు ప్రయత్నించెదముగాక! భయ భ్రాంతులను, రోగములను, చింతలను పారద్రోలి, ద్వైతసారమైన బ్రహ్మ సాక్షాత్కారమనెడి దివ్యతేజస్సే ద్వంద్వమైన మేఘములన్నింటిని పారద్రోలి బ్రహ్మానందమును పూర్ణశాంతిని అనుభవించెదముగాక!

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

కైలాసము

20–6–50

3–00 ఎ.ఎమ్.

# 57. బ్రహ్మము నెరింగిన బ్రాహ్మణోత్తముడు

ఈవారములోనే, ఒకరోజున నేను స్నానముజేసి, శరీరము తుడుచుకొని బట్టలు ఆరవేసుకొనుచుండ, ఒక వ్యక్తి దొర టోపి, జోళు వేసుకొని ఆశ్రమం వ్రాయబడిన మహావాక్యములను చదువుచు నెమ్మదిగా వచ్చుచుండెను. ఆయన తలవెంట్రుకలు పూర్తిగా తెల్లబడి నెరసియున్నందునను, కర్ర సహాయముతో నెమ్మదిగా నడచుచున్నందునను, చాల పెద్ద వయస్సు అనియు జబ్బు మనిషి అని తలచితిని. దొర టోపి పెట్టుకొనుటచే, నేను ఆయనను ఒక క్రిస్టియన్ మతస్థునిగా తలచితిని.

హస్తముతో స్వాగతము నిచ్చుచు, నా గదిలోనికి తీసుకొనివెళ్ళి, కుర్చీ మీద కూర్చొనమనగా, అటుల చేయక, సాష్టాంగ నమస్కారము జేసి పసి బాలుని వలె విలపించసాగెను. నాకేమి జేయుటకు తోచక, వెన్నుమీద తట్టుచు ఓదార్చుచు ఎట్టకేలకు కుర్చీమీద కూర్చొనబెట్టితిని. ఇంకను నేత్రముల నుండి బిందువులు పడుచునే యున్నవి. మీకేమి కావలెను. చాలా శ్రమపడి కైలాసము కేలనడచి వచ్చితిరి? మీకు ఏమి సహాయము కావలెను అని కాగితము మీద వ్రాసి యిచ్చితిని. దానిని చదివి యింకను హెచ్చుగా రోదన జేయనారంభించెను.

నేను వ్రాసిన మాటలకు సమాధానముగా యీ క్రింది మాటలను నాకు ఆయన తిరిగి వ్రాసి యివ్వగా, వాటిని చదివి, ఆశ్చర్యము, ఆనంద ముతో స్తబ్దుడనైతిని. ప్రభువా నాకేమి కావలెనో నీకు తెలుసును. నాకు కోరిక లేకుండా వుండుటే కావలెను.

I WANT TO BE DESIRELESS

తమ జబ్బులు బాగుజేయమని మందులకొరకు వచ్చెడి వారిని జూచెదము. అనేక ప్రాపంచకపు తాపత్రయములచే అవస్థలలోవుండి, వారి అవస్థలు,ఏ ప్రార్థన చేతనో, మంత్రము చేతనో పోగొట్టుకొనుటకై వచ్చెడి వారిని జూచెదము. ఇంక భక్తి, ప్రేమలతో వుపదేశము కొరకు, దైవమును తెలుసుకొనుటకై వచ్చెడి వారు గూడ వుందురు. గాని నాకు ఏమియు

వలదు, నాకే కోరికయు లేకుండుటే నాకు కావలెను, అనెడివారు యీ లోకములో చాల అరుదుగదా!

బ్రహ్మవిదుడైన ఆ భక్తుని మనోపరిపక్వమును జూచినప్పటి నుండియు నా మనస్సునకు గల్గిన ఆనందమునకు మేరలేదు. అటులనే, నావద్దకు కైలాసములో రెండు గంటలపైగా కూర్చుని, పైగా శాంతిని అనుభవించుచు నాకు గూడ ఎంతో నూతనమైన శక్తిని కలిగించెను. తర్వాత ఆయన ఆశ్రమంకు, నాకు కొత్త గాదనియు, పీసు, శాంతి పత్రికలు చదువుచుంటి ననియు నన్ను పన్నెండు సంవత్సరముల క్రింద దర్శించినంటినని జెప్పగా విని ఆశ్చర్యమందితిని.

ఎండ హెచ్చుగా అవుచున్నను, మధ్యాహ్నామైనను, ఇంకను వెళ్ళుటకు ఇష్టములేక ఇచ్చుటనే చాలసేపు వుండెను. ఆయన వెళ్ళు సమయమున ఆతిథ్యము యిచ్చి సత్కరించి, నాకేమి అవసరములేదు, ఏ కోరిక లేకుండుటే నాకు కావలెను అనెడి వారిని కలసిన, జూచిన రోజు నా జీవితములో,అదృష్ట వంతమైనదనియు అట్టి నిష్కాములే,ఆశ్రమవృద్ధికి,శాంతి స్థాపనకు ముఖ్యవసరమని జెప్పగా, చిట్టచివరకు వెళ్ళబోవుచు, మరల సాష్టాంగ నమస్కారము వలదు వలదు అన్నను జేయుచు, మరల ఆనంద బాష్పములచే నా పాదము లను తడిపివేసెను. ఆయన గవర్నమెంటు వుద్యోగము నుండి రిటైరు అయిన పెద్ద వుద్యోగి దొర టోపి ధరించినను, బ్రాహ్మణోత్తముండు. బ్రహ్మవిదులు, గనుకనే ఏ కోరికయు లేక ఆదర్శమైన జీవితమును జీవించుచుండెను. కోరికయే నరకము. కోరిక లేకుండుటే మోక్షము. స్వర్గ రాజ్యము, ఆత్మాను భవము, నిర్వాణము, బ్రహ్మ సాక్షాత్కారము కోరికలేని వారిదే. అట్టి మహ నీయులకు నా శిరస్సును వంచుచుంటిని.

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

శ్రీ కైలాసము

18-7-51

7-00 ఎ.ఎమ్.

# 58. బావిలో సర్పము

మొన్నటి గాలివాన తుఫాను రోజులలో వరదలవల్ల ఒక పెద్ద సర్పము కొత్తనూతిలో పడెను. ఆ బావి యింకను కట్టలేదు. వానజల్లు పడి నుయ్యి మట్టిచే కప్పబడుచుండెను.

వాల్తేరు ఆశ్రమం నుండి నేను తోటపల్లి రాగానే, నూతిలో నల్లని పెద్ద పాము పడియున్నదనియు, దానిని చూచిన వారందరూ, తల ఒక్కరాయితో ఆ పామును కొట్టుచున్నారని జెప్పిరి. నేను వెళ్ళి చూడగా, ఆ సర్పము నూతిలో పడ్డను, చుట్ట చుట్టుకొని పండుకొనియున్నది. దాని పొడవును నాకు చూపించుటకు, ఒక మనిషి మట్టిబెడ్డను పామువైపు విసిరెను. దానిని కొట్టవద్దని చెప్పుచుండగా, పాము కొట్టిన పుణ్యమని సమాధానము చెప్పెను.

ఆ సర్పము చప్పుడవ్వగనే నీళ్ళలోనకు తన ప్రాణమును కాపాడుకొనుటకు మునిగిపోయెను. పామును కొట్టిన పుణ్యమని చెప్పిన మూర్ఖుడెవ్వడు? అందు, నిస్సహాయముగా ఏ దిక్కులేని అవస్థలోయున్న పాముపై రాళ్ళు రువ్వి దాని దేహమును గాయపరచి హింసించుటవల్ల పుణ్యము గల్గునని జెప్పెడి, హృదయములేని అథముడెవ్వడు?

సర్పమువైపున రాయి రువ్విన మనుజునితో నేనిట్లు అంటిని. "నీవే ఆ నూతిలో నిస్సహాయమైన స్థితిలో, తిండిలేక బయటకు రాజాలక అవస్థపడుచుండ నీమీద రాళ్ళు రువ్వి నీ కన్నో, తలయో కన్నముపెట్టి హింసించిన నీకు ఎటులవుండును" అని అడిగితిని. అప్పుడు అతడు నిజమే చాల తప్పు అని పామును కొట్టిన పుణ్యమనెడిమాట నమ్మకము, అజ్ఞానమని ఒప్పుకొనెను. అప్పటినుండియు ఎవ్వరును, పాముపై పుణ్యము సంపాదించుకొనుటకు రాళ్ళు రువ్వుటలేదు.

ఇప్పుడు బావిలో పడియున్న, సర్పమును రక్షించుట ఎటులనని ఆలోచించుచుంటిని. తాము చేసిన కర్మ ఫలితముగా నిస్సహాయ స్థితిలో పడియున్న వారందరినీ, యిటులనే మూఢులైన లోకులు రాళ్ళతో బాధించుచుందురుగదా! నిస్సహాయ స్థితిలో ఏ గతీలేకుండా వున్నదని మనము

చెయ్యి జూచిన ఆ పామును తీయుటకు ప్రయత్నించిన అది తన భయముచే మనలను కరవవచ్చును. వుపేక్షగా వూరుకొనిన చనిపోవును. చెయ్యిజూచిన కరచును. గాన ఏమి చేయుట?

ఇటులనే మనుజులలో గూడ అనేకమైన పాపపు పనులు చేసి, నిరుపేదలను హింసించి, వారి రక్తమును పీడించి, వారి వద్ద పన్నులు తీయుచు, లంచములు పుచ్చుకొనుచు, చివరకు వారి కర్మ పరిపక్వమైనప్పుడు, మన దిక్కులేని పామువలె వారు తవ్వుకొనిన గోతులలో వారేపడి, దిక్కులేని స్థితిలో నిస్సహాయ స్థితిలో వుందురు. అప్పుడు అందరు తలవక రాయి వారిమీద పడవేసెడివారే! ఎవ్వరికి తోచిన మాటలు వారు అనుచుందురు కాని తాము జేసిన కర్మఫలితము అనుభవించుచు బాధపడుచుండిరి గదా అని జాలి దలచి దిక్కులేని స్థితిలో వున్నవారికి సానుభూతిగా నిచ్చుచు చేయూత నిచ్చెడివారు చాలఅరుదు.

పాము కరచెడిదైనను, అది దిక్కులేని నిస్సహాయ స్థితిలో వున్నప్పుడు దాని మీద రాళ్ళురువ్వుట ఎంత పాపము! అటులనే బీదలను పీడించిన మనుజునియైనను, మనలను నిందించి, అపకారముజేసిన వానినైనను, నిస్సహాయ స్థితిలో వున్నప్పుడు, చేయిజాచి తోడ్పడవలెను గాని రాళ్ళు రువ్వ రాదు. చెయ్యిజాచి సానుభూతితో ఓదార్చిన మనలను కరచునేమో అని మనము భయపడవచ్చును. నిజమే! అందు రాళ్ళచే కొట్టబడి, గాయములు తగిలి వుండుటచే హెచ్చుకోపములో బుస్సుమనును.

గాన ఏమి జేయుట? నిస్సహాయస్థితిలోనున్న పామును నెటుల కాపాడుట అటులనే విడిచిన మలమలమాడి నెమ్మదిగా మనకండ్లముందు చనిపోవునేమో! అప్పుడే రెండు నెలల నుండి బావిలోపడియున్నది. పాములను పట్టెడి వాండ్రను తెప్పించి ఆ సర్పమును తీయించుదమా అని ఆలోచించుచుంటిని. బావిలో త్రాడువేసి వుంచిన ఆ త్రాడును బట్టి పైకి వచ్చునని కొందరు జెప్పుచుంటిరి. తీసి దానినేమిజేయుట? దైవవిధి నెవ్వరు వర్ణించగలరు. ఖర్మను ఎవ్వరుల్లంఘించగలరు. విషపు పురుగునకైనను, దుష్టజంతువునకైనను, తానుజేసిన ఖర్మ అనుభవించక తప్పదు గదా! యీ

పాము ఎన్ని జీవులను కరచి, చివరకు యీ బావిలో పడెనోగదా! మనుజున కైనను సర్పమునకైనను, ఖర్మ ననుభవించుట తప్పదు.

కొందరు మనుజులు బావిలోపడిన పామువలె రాళ్ళతో కొట్టబడు చున్నను, తాను చేసిన కర్మకై పశ్చాత్తాపబడుటకు బదులు, రాయి తగలి నప్పుడెల్లను, కండ్లు ఎఱ్ఱగా జేయుచు, తాము ఎప్పటికైనా బయటపడ కుందుమా? ప్రతీ దెబ్బకు ఒక్కొక్క కాటు మరల వేయకుందుమా అని అనునట్లు కక్షలు పెంచుకుంటూ కొత్త కర్మను పోగుచేసుకొనుచునే యుందురు.

ఓ మనుజుడా! నీవు బావిలో పడకముందే మేల్కొనుము. ప్రజలను మోసబుచ్చవలదు. నిరుపేదలను హింసించుచు అబద్ధములతో నీ జీవితమును గడపవలదు. నిస్సహాయ స్థితిలో తాముచేసిన కర్మను నరకకూపములలోపడి, బాధపడుచున్న వారిమీదరాళ్ళను రువ్వకుము. చేతనైన తోడ్పడుము, లేకున్న దూరముగా వుండుము. నీకు గూడ అట్టిగతియే రావచ్చును. దిక్కులేని అమాయకులైన బీదప్రజలను మోసబుచ్చగలవు గాని, వారిలోనున్న దైవమును మోసబుచ్చగలవా? వారిలో జ్యోతిస్వరూపముగా వెలుంగుచున్న దైవమునకు, నీ కుతంత్రములన్నియు, నీ మాయ పన్నుగడలన్నియు, నీ కుయుక్తులన్నియు నీవు విప్పకుండగనే తెలియును.

నీవెంత చదువరివైనను, మేధానిధివైనను, దైవచట్టములను దాట జాలవు. దైవ స్వరూపమును మోసగించజాలవు. దైవము కండ్లను గప్పి యిసుక జల్లజాలవు. దైవము కండ్లలో యిసుక జల్లుటకు ప్రయత్నించిన ఫలితమే, నిన్ను నేడో మాపో అంధకారమైన నరకకూపములలో లోతైన బావులలోపడత్రోయును. అప్పుడు దిక్కులేక, దరిగానక, నిస్సహాయస్థితిలో దుఃఖించిన లాభమేమి? వెలుతురుండగనే యిప్పుడే మేల్కాంచుము. దైవము కొండమీద, ఆకాశములోను, స్వర్గములోను, గుడిలోను, గోపురములలోను వుండె నన్న భ్రమను విడచి, సర్వత్ర నిండియున్న, మానవులందరి హృదయ ములలో నిరంతరము ప్రకాశించుచున్న దైవమును ఏకోనారాయణుని

పూజించుచు తరించ ప్రయత్నించుము.

**మానవ సేవయే దైవ సేవయనెడి** సత్యమును – మహావాక్యమును నీ రక్తముతో నీ హృదయమునందు రాసుకొని సేవ జేయుచు తరించుము. నీనుండి ఎవ్వరికిని, ఏ జీవినికి బాధ కలగకుండుగాక! లోకమంతయు శాంతితో నిండియుండుగాక!

సర్వేజనా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

14–1–46

5–00 ఎ.ఎమ్.

# 59. దైవమును ప్రార్థించుట అవసరమా?

ఈ మధ్యను నేను వ్రాయుచున్న వ్యాసముల యొక్క శీర్షికలు అనగా వ్యాసముల పేర్లు చాల విపరీతముగా, సామాన్య మానవునకు తోచవచ్చును. అయినను అందు బ్రహ్మాండమైన గాంభీర్యమైన భావనలు గలవు.

ఉదాహరణగా, దైవమునకసాధ్యము అనెడి శీర్షికలో వ్రాసిన వ్యాసము, దాని ఆంతర్యభావన, సారాంశము, నాకెన్నడును, యే వ్యాసమును యివ్వ జాలని,నూతనమైన, అఖండమైన శక్తి నొసంగెను.

నన్ను మరచుట, నా నుండి వేరుగా నుండుట, దైవమునకు సాధ్యమా? తలచినంత మాత్రముననే, నా శరీరము, మనస్సు, హృదయము, బుద్ధి, సర్వమును దైవత్వముచే నిబిడీకృతమై అఖండమైన అపారమైన, వర్ణనాతీత మైన ఆయన దివ్యశక్తిలో తేలుచుందును.

అటులనే, **దైవమునకై ప్రార్థించుట నవసరమా?** అనెడి యీ వ్యాసము గూడ నాకెంతయో తృప్తిని, ఆనందమును, శాంతిని కల్గించుచున్నవి. ఇప్పుడీ వ్యాసమును, సామాన్య మానవులుగూడ అవగాహన జేసుకొనుటకై విమర్శింతము.

చాలమంది భక్తులు జేయు ప్రార్థనలు ఓ దైవమా నీకృప ఎప్పుడు గల్గును. నీవు ఎప్పుడు వచ్చెదవు, నీ దర్శనము ఎంతలో లభ్యమవ్వును అనియే ప్రార్థింపబడుట మనము ఎరింగియున్నదే!

తీవ్రమైన భక్తి కలిగిన, మరికొందరు దైవాన్వేషకులు, ఓ దైవమా నీవు లేకుండ, ఒక్కక్షణమైనను జీవించజాలము. ఓ ఆపద్బాంధవా, యిప్పుడే, యిచ్చటనే, నీ దర్శనమునిచ్చి మమ్ము బ్రోవుము అని, అనేకరీతులుగా దైవ దర్శనముకై పరితపించుచుండిరి.

ఈ ప్రార్థనలు, పరితాపనలన్నియు ఒక్కొక్క స్థితియందు సహకారిగా యున్నను, భక్తుడు, తనకును, దైవమునకును, వుండియున్న అవినాభావ సంబంధమును గ్రహించిన,తాను, నోటితో ప్రార్థింపజేయలేడు. చిన్న వుదాహరణగా, సముద్ర గర్భమునయున్న నీటిబుడగ, సముద్రమునకై నీ

కృప ఎప్పుడు గల్గును, ఓ సముద్రమా, నీవెంతలో వచ్చెదవు నీవులేకుండ నేను జీవించజాలనని, ప్రార్థించుట ఎటులవుండునో మీరే గ్రహించుడు.

అటులనే, కించజ్ఞుడైన మానవుని ప్రార్థనలు గూడ వుండి యున్నట్లు, ఎంత త్వరలో గ్రహించిన అంతమేలు కలుగును.

ఆంతర్యమున, బాహ్యమున చుట్టును అనాదినుండియు, సముద్రముచే నింపబడి ఆవరింపబడి, సముద్రమెచ్చటనో యున్నదని, నీటిబుడగ తాను ప్రార్థించగా, ప్రార్థించగా ఎచ్చటినుండియో, తన ప్రార్థనలచే, వూడిపడునని, ప్రార్థించుట తెలివితక్కువయు, కాలయాపనయేగదా!

అటులనే మానవుడు, బుద్ధి కుశలత గల్గియున్న ప్రతీ మానవుడును, తన లోపలను బాహ్యమును, చుట్టును తన్ను ఆవరించి తన జీవితమునకు ఆధారముగా యున్న దైవమును మరచి, ఆ ప్రభువు ఎచ్చటనో, స్వర్గములో యున్నట్లు–

ఓ దైవమా నీకృప ఎప్పుడు గల్గునురా, ఎప్పుడు వచ్చెదవురా ఎంతలో వచ్చెదువురా, అని మొరలిడుట కండ్లు వుండియు గ్రుడ్డిగా వుండుట, విచార కరమైన విషయమేకదా!

ఏ దైవమునకై ప్రార్థించు చుంటిమో, ఆ దైవము సర్వవ్యాపకుండైన ఆ దైవము వచ్చియే యుండెను. అతడు నీ హృదయాంతర్యామిగానే, అనాది నుండియు వెలుగుచుండెను. నీకొరకై వేచియుండెను. నీవెంతలో ఆయనను గుర్తించగలవని ఆతురతతో చూచుచుండెను.

దైవము, మీ నేత్రములకు నేత్రముగా, కర్ణమునకు కర్ణముగా, వాక్కునకు వాక్కుగా,మనస్సునకు మనస్సుగా, హృదయమునకు హృదయముగా, శ్వాసకు శ్వాసగా, జీవితమునకు జీవితముగా,ఆత్మకు ఆత్మగా కోటిసూర్య ప్రకాశవంతమైన దివ్యతేజస్సుతో, నిరంతరము నీలో ప్రకాశించుచుండ యింకను, అంధుడవై,జడుడవై, మూగవై, మూఢత్వములో, యెన్నాళ్ళు ఓ దైవమా ఎప్పుడొచ్చెదవుగా అని ప్రార్థించుచు విలువైన కాలమును వ్యర్థ బుచ్చెదవు.

దైవము దూరముగా యున్న రాగలడు. నీ దగ్గరలోనే, నీ లోపలనే, నీ హృదయములోనే, నీ స్వరూపముగానేయుండియుండ ఎచ్చటెనుండి రాగలడు.

నీటి బుడగ సముద్రమునకై ప్రార్థించుట అనవసరముగదా! కిరణము సూర్యునికై వెదకుట అసందర్భముగదా! కస్తూరి మృగము తనలోయున్న కస్తూరిని మరచి,గుర్తించక, బాహ్యమున లోయలలో కొండలలో వెదకుచు, డస్సివేసారి చివరకు ప్రాణమును విడచుట విషాదకరమైన వార్తయేగదా!

ప్రియమైనపాఠకా! నేను వ్రాయు విషయములు, విపరీతముగా కొత్తగా అగ్రాహ్యముగా యున్నను అధైర్యపడకుము. అంతర్ముఖుడువై దీర్ఘముగా ఆలోచించుము. అమెరికాలోనో, జర్మనీలోనో చెన్నపట్నములోనో,చివరకు విశాఖపట్నములోననో యున్నవారికి, ఉత్తరములు వ్రాయుదము. మన చెంతనే ఎదురుగుండగనే యున్నవారికి వుత్తరములు అనవసరముగదా! దైవము, చెంతనే ఎదురుగుండగనే గాక ప్రత్యక్షముగా, ఆంతర్యమున బాహ్యమున ప్రకాశించుచుండెను.

ఇంకను, ఆనందకరమైన,శక్తినొసంగే సత్యమైన వార్త యెద్ది అనగా నీవు ప్రార్థించినను, ప్రార్థించకున్నను దైవము కాలిగోరు మొదలు శిరస్సు వరకు, ఆపాదమస్తకము నిబిడీకృతమై, నీవు మరచినను, నిన్ను మరవకుండ, నీవు విడచినను నిన్ను విడవకుండ, నీవు ప్రార్థించకున్నను నీ శరీరమంతయు పరిపూర్ణముగా నిండి నీ కొరకే వేచియుండెను.

గాన, ఆ కరుణాసముద్రుని గుర్తించుటకు యింకను ఆలస్యమేల? తడవేల? ఆయనను గుర్తించి,ఆనందము ననుభవించుటకు బదులు, అంధుడవై, మాయచే కప్పబడి అహంకారమునకు బానిసవై, యింక ఎంత కాలము ప్రార్ధనలతో, నీ విలువైన జీవితమును వ్యర్థబుచ్చెదవు?

మేల్కొనుము! లెమ్ము! యే దైవమునకై ప్రార్థించుచుంటివో, ఆ దైవము నీలోపలనే, నీ స్వస్వరూపముగానే విలసిల్లి యుండెను. గాన దైవమును రమ్మనిమని నీవు ప్రార్థించనవసరములేదు. దైవకృపకై గూడ ప్రార్థించుట అనవసరము.యేలనన, బుద్బుదము సముద్రముచే ఆవరింపబడి జల

మయమై సదా ఉండియున్నట్లు మానవుడు గూడ సర్వకాల సర్వావస్థల యందును, జాగ్రత స్వప్న సుషుప్తి అవస్థల యందును గూడ దైవకృపచే దైవతేజస్సుచే, దైవత్వముచేతనే నింపబడి యుండెను.

లేనిదానికై ప్రార్థింపవచ్చును. దూరముగా యున్నదానికై ప్రార్థించుట సమంజసనీయము, గాని లోపలను, బయటను దగ్గరను, దూరమునను అన్ని దిశలను నిండియున్న సత్య పదార్థమును, దివ్యతేజస్సును గుర్తించుటకు బదులు, యింకను యెన్నాళ్ళు అజ్ఞానముతో కండ్లు వుండియు అంధునిగా జ్ఞానముండియు అజ్ఞానిగా, అంధకారములో జీవించుట?

దైవమును గుర్తించజాలని జీవితము అంధకారబంధురమైనదే కదా! అటులైన ప్రార్థన అనవసరమేనా అని చాలమంది భారమైన హృదయము లతో దుఃఖించెదరు.

పసిబిడ్డలకు ప్రార్థన అవసరమే. దైవతేజస్సును ఆంతర్యమున, బాహ్య మున గుర్తించజాలనివారికి ప్రార్థన అవసరమే. దైవము భిన్నముగా యుండె నన్నవారికి ప్రార్థన ముమ్మాటికి అవసరమే.

ఇక ప్రార్థన ఎవ్వరికి అవసరములేదు? దైవముతో అవినాభావమైన సంబంధము గల్గిన వారికి, దైవమును ఆంతర్యమున బాహ్యమున ప్రతీచిన్న పనిలోను పెద్దపనిలోను, తన మనోవాక్కాయములలో దైవశక్తినే గుర్తించు చున్న అనుభవనీయులకు ప్రార్థన అనవసరము.

పడవను అనవసరమని చెప్పజాలము, నదిని దాటనివారికి అవసరమే. నదినిదాటిన వారికి అనవసరమే. ప్రార్థన సహాయముచే సంసార సముద్రము దాటుట ముఖ్యావసరమే! గాని నీవెవ్వరికొరకై అహర్నిశములు, ప్రార్థించు చుంటివో ఆ దైవము ఎచ్చటవుండెనో ఆయనకును నీకును వుండియున్న అవినాభావ సంబంధమును గుర్తించి ప్రార్థించుట ముఖ్య అవసరము.

దైవమునుండి వేరవ్వుటకు, వీలులేని అద్వితీయమైన, నీ ఏకత్వమును గుర్తించిన అప్పుడు నీపెదవులే కదలజాలవు. నీ జీవితమే ఒక తెంపులేని ప్రార్థనగా యుండును.

కొందరు భక్తవరేణ్యులు, మేము పుట్టినది మొదలు ప్రార్థనలలో పెరిగితిమి. ప్రార్థనలేకుండ జీవించజాలము. అని జెప్పిన, ఓ ప్రియమైన సోదరీ సోదర స్వరూపములార మీరు ప్రార్థన మానజాలక్కు మీ ప్రార్థనలను విడువకుడు. ముమ్మాటికి ప్రార్ధన చేయుచుండుడు. దైవము మీ చెంతనే మీలోనే మీ స్వరూపముగానే ప్రకాశించుచుండెను. మీరాయనకై ఆయనను రమ్మనమని, ప్రత్యక్షమవ్వమని ప్రార్థించనవరసములేదు. ఆయన, నిరంతరము అందరిలోను ప్రత్యక్షముగానే, పరిపూర్ణముగానే వెలుంగుచుండెను.

ఇక, ప్రార్ధన జేయకుండ ఉండజాలని యెడల, దైవము వచ్చియుండెను. ప్రత్యక్షముగా మీలో వెలసియుండెనుగాన, ఆయనకై ప్రార్థించుటకు బదులు, మీలోవున్న అహంకారమును అజ్ఞానమును పారద్రోలుటకై, లేకుండా జేసుకొనుటకై ప్రార్థించుడు. యేలనన, ప్రత్యక్షముగా, పరిపూర్ణముగా యున్న దైవమును, యీ అహంకారమే, ప్రకాశవంతమైన సూర్యుని చిన్న మేఘము గప్పివుచ్చుచున్నట్లు, దైవ తేజస్సును మరుగుజేయుచున్నది. గాన అహంకార మును నశింపజేయుటకు, రూపుమాపుటకు ప్రార్థించుడు.

ప్రియమైన పాఠకులారా! యీ వ్యాసము యొక్క ముఖ్యమైన సారాంశ మును మరల క్లుప్తముగా మీతో పంచుకొనుచు దీనిని సమాప్తి జేయుటకు కోరుచుంటిని.

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుండైన దైవము, కోటిసూర్య ప్రకాశ వంతుడై, సూర్యుడు తేజస్సుతో నింపబడియున్నట్లు, బుద్బుదము జలమయమై యున్నట్లు, మీ శరీరములు, మనస్సులు, హృదయములు, జీవితములు పూర్తిగా, మీరు ప్రార్థించక ముందే, ఆ కృపామయుని, దివ్యతేజస్సుతో నిరంతరము నింపబడియున్నది. గాన, ఆ దివ్యతేజస్సును ఎప్పుడోగాక యిప్పుడే గుర్తించుచు, ప్రార్థనలకు అతీతులై, అమృతతుల్యమైన దైవప్రేమను, దివ్యతేజస్సును, పూర్ణశాంతిని ఎప్పుడోగాక, యిప్పుడే, యిచ్చటనే అనుభవించెదరుగాక.

దైవమెచ్చియుండ ప్రత్యక్షముగా ఆంతర్యమున, బాహ్యమున ప్రకాశించుచుండ యింకను ప్రార్థనలతో కాలయాపన జేయనేల? మీ కండ్లను తెరువుడు. మనస్సులను, హృదయములను వికసింపజేయుడు గుర్తించుడు, అనుభవించుడు, ఇప్పుడే యిచ్చటనే!

పూర్ణమిదః పూర్ణమిదం అంతయు పరిపూర్ణమే గాన మీరు సదా పరిపూర్ణముతో ప్రకాశించుతు దేశవృద్ధిని లోక కల్యాణమును జేకూర్చుదరు గాక!

లోకాస్సమస్తా సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

18-6-52

4-00 ఎ.ఎమ్.

ఎడతెరపిలేని దైవ ప్రార్థనలను, సదా జేయుచు, అహంకార మమకారములతో, నిండియుండుటకంటె, దైవమును ప్రత్యక్ష క్షణములో గుర్తించి, శాంతి, ప్రేమలతో, అభేదజ్ఞానముతో విలసిల్లుటే యీ వ్యాసము యొక్క ముఖ్యమైన సారాంశము.

# ౬౦. మూడు రోజుల పని వ్యర్థము

ఒక భక్తుడు తోటపల్లి ఆశ్రమంకు, చిరకాలము నుండి రాగోరుచుంటి నని, నేను వాల్తేరు ఆశ్రమమంనుండి యిచ్చటకు రాగానే వ్రాయమని వ్రాయు చుండెను. ఇచ్చటకు వచ్చిన తరువాత,ఆయన కోరినట్లు, తెలియబర్చుచు, ఆశ్రమం వచ్చి,కొంత కాలము శాంతి ననుభవించుచు, వృద్ధిచెందవలసినదిని వ్రాస్తిని.

దానికి జవాబుగా,ఆశ్రమంకు వచ్చిన మూడు రోజులు వ్యర్థముగా పని పాడవ్వునని వ్రాసిన ఉత్తరము మరల మరల చదివి, చాల ఆశ్చర్యముతో నవ్వుచుంటిని. ఆశ్రమమును దర్శించి, శాంతిగా ఆత్మానుభవముతో గడిపిన రోజులే వ్యర్థమైన దినములా?

రేపు అకస్మాత్తుగా వైకుంఠము నుండి వెంటనే బయలుదేరి రమ్మనమని వార్త వచ్చిన ఎన్నిరోజులపని దండగవ్వునో గదాయని, ఆలోచించరేల? ఆశ్రమంకు వచ్చుటకై,తీరికలేక పోవచ్చును, జరూరు పనులు చక్కబరచు కొనవలసినవి, మన పిల్లలకు ఒప్పజెప్పవలసినవి వడ్డీలు, బాకీలు మొదలై నవి రాబట్టుకొనవలసినవి చాలాగ వుండవచ్చును. ఆశ్రమంకు యీ నెలలో గాకున్న వచ్చే నెలలో తీరికవ్వగనే వచ్చెదనని వ్రాయవచ్చును.

గాని వైకుంఠమునకు వెంటనే వెళ్ళుటకు నిశ్చయమైన అప్పుడు ఒక్క, క్షణమైనను, ఒప్పగింతలకుగాని, కష్టపడి ఆర్జించిన ధనమును కూడబెట్టి లెక్కవేసుకొనుటకు గాని సావకాశము యివ్వబడదుగదా! ఒకటి రెండు రోజుల మాట అటువుండ ఒక్క గంటలో వచ్చెదనన్నను, ఒక్క నిమిషము వ్యవధి యివ్వమన్నను–యివ్వబడదుగదా!

గాన వెలుతురుండగనే,మనయింటిని, చక్కపరుచుకొనవలెను. దీపం ఆరిపోయిన తరువాత చీకటిలో ఏమియూ చేయజాలము. యేరోజున, యే గంటకు, యే క్షణమునందు వైకుంఠయాత్రకు వేంచేయమని జాబు వచ్చునో యెవ్వరును జెప్పజాలరుగదా! నేడు ఉన్నవారు రేపుండక పోవచ్చును. రేపున్నవారు ఆ మరునాడు వైకుంఠయాత్ర కట్టవచ్చును. గాన యీ క్షణమే మనది, మరుక్షణము మనదికాదు.

బుద్ధిమంతులైనవారు, భక్తవరేణ్యులు, జన్మతరించెడి, శాంతినిచ్చెడి పని యెద్దియో కాలయాపనజేసెడి వ్యర్థమైన పనియెద్దియో, తెలుసుకొని అనిత్యమైన పనులకై, నిత్యమైన పనిని, త్యాగము చేయరాదు.

ఆత్మసోదరులారా, మీ పనులను మానుకొని సన్యసించమనుచుంటినని తప్పు అభిప్రాయము పడవలదు. నేను జెప్పెడిదేమన యెన్ని పనులలో వున్నను అసలు పనిని దైవపనిని, ఆత్మవృద్ధిని మరువరాదు. ఆత్మవృద్ధికి తోడ్పడని పనులన్నియు వ్యర్థమే. ఆత్మను అనుభవించుచు, శాంతితో గడిపెడి పనిమాత్రమే నిజమైనపని అదియే యెప్పటికైనా శాశ్వతమైన శాంతిని జేగూర్చును.

ఏదిపనియో, ఏదిపనిగాదో,ఏ పని ముక్తినిచ్చునో, ఏ పని బంధములను గల్గించునో సాధకులైన వారు పరిశీలించి తెలుసుకొని, దుర్లభమైన మానవ జన్మ పొందగలిగినందుకు నరజన్మ యొక్క గమ్యస్థానమును, శాంతిని బొంద ప్రయత్నించవలెను.

మనభక్తుడు యిప్పట్లో ఆశ్రమంకు వచ్చిన మూడు రోజులపని వ్యర్థమవు నని వ్రాసెను. ఇక శ్రీరామకృష్ణులు, యీ కలియుగములో మూడు రోజులు మాత్రమే, ఏకాగ్రతగా ఏకాంతమైన నిర్జనమైన ప్రదేశములలో భగవధ్యానము జేసిన తరించెదరని నుడివియుండిరి.

ప్రియమైన ఆత్మ సోదరులారా, సోదరీమణులారా, సంవత్సరమంతయు మీరెటుల గడిపినను మూడు అరవై రెండు రోజులు, ధన పిశాచారాధనకు మీ కుటుంబ సంరక్షణకు, పెండ్లిండ్లు ఊరేగింపులు వగైరాలకు గడిపినను సంవత్సరములో 3 రోజులైనను, భక్తులు ఏకాంతములో శాంతిననుభ వించుచు,తరించుటకై స్థాపించబడిన శాంతి నిలయములలో గడపుటకు యికముందైనను ప్రయత్నించుడు. దుర్లభమైన మానవజన్మ పొందగలిగి, ఏకాంత వాసములో దైవము ననుభవించుటకు, తరించుటకు మీకు తీరిక లేకుండుట చాలవిచారమైన విషయము.

ఏదైతే నిత్యము, శాశ్వతము మీ జన్మహక్కుయై యున్నదో, దేనిని పొందుటకై యీ మానవజన్మ యివ్వబడినదో, ఆ దైవ స్వరూపమును

అనుభవించుటకు మీకు జీవితములో కొంతభాగమైనను నూరవ వంతు యైనను గడిపి తరించప్రార్థించెదను.

అశాశ్వతము, అనిత్యము, క్షణభంగురము, వట్టి మాయ అగు, సంవత్సరమంతయు, యిరువది నాలుగు గంటలు బయటపడుటకు వీలులేని దట్టమైన మాయ వలలో చిక్కుకుని, గేలుపు ముల్లును మ్రింగిన మత్స్యమువలె గిలగిల కొట్టుకొనుచు, జీవించుచుండుట చాల హాస్యాస్ప దము, విచారకరము, గేలమునున్న ఎరను మింగుచున్న చేప, దానిని ఆహారమనే భ్రమించుచున్నది గాని, అది తనను చంపనున్న గేలపు ముల్లు అని, దానిని ఆ ఎరను మ్రింగుటే తన మృత్యువునకు హేతువని భావించుట లేదు.

జన్మించినప్పుడేమియు మన వెంటను తీసుకొనిరాలేదు. వైకుంఠము నకు వెళ్లేటప్పుడు మొలకున్నత్రాడు యైనను తీసుకుని వెళ్ళజాలము. మన వెంటను తీసుకొని వెళ్ళగల్గినది, శాంతి నిలయములలో, శాంతిగా ఆత్మను, స్వస్వరూపమును అనుభవించుచు గడిపెడి క్షణములే. స్వార్థరహితముగా మానవసేవలో గడిపెడి క్షణములే ఎన్నటికైనను మన ఆత్మవృద్ధికి తోడ్పడును.

గాన నిత్యానిత్య వివేకము కలిగి, దీపము ఆరిపోకముందే ఎన్ని పనులలో వున్నను, అసలుపనిని, ముఖ్యమైన పనిని, దైవ పనిని, అన్నింటి కంటెను జీవితములో గొప్పపనిగా, ముఖ్యమైనదానిగా జేసుకొని, నేడే తరించ ప్రయత్నించెదముగాక.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

21-4-46

8-00 పి.ఎమ్

# 61. వాసనలు

మూలము: స్వామి ఓంకార్ అనువాదము: గరిగిపాటి కృష్ణ

మనిషి జీవితము వాసనామయము. ఈ వాసనలనేవి ఈ జన్మలోని కోరికలు, ఆలోచనల నుండైనా పుట్టి వుండవచ్చు లేదా అవి అనేకములైన గత జన్మల నుండైనా సంక్రమించి వుండవచ్చు. ఈనాటి మన జీవన విధానము గత అనేక జన్మల ఆలోచనలు, కోరికలు మరియు మనము చేసిన కర్మల యొక్క ఫలితము మాత్రమే. మన ప్రస్తుత ఆలోచనలు, కోరికలు, కర్మలే మన భవిష్యత్తును నిర్దేశిస్తాయి. గతములోని వాసనలు మనకు ప్రస్తుత స్థితిని కలిగిస్తే, మనము జనన, మరణ చక్రములో బంధింపబడు తామా లేక బంధవిముక్తి కలిగి కైవల్యము నందుతామో ఈజన్మలో కూడబెట్టిన వాసనల నాణ్యతే నిర్ణయిస్తుంది.

వాసనలను రెండు విధములుగా చెప్పవచ్చును. ఒకటి శుద్ధమైనవి, రెండవది అశుద్ధమైనవి. శుద్ధవాసనలు (సంస్కారములు) మనలను స్వేచ్ఛ, అమృతత్వము వైపునకు తీసికెడితే, అశుద్ధవాసనలు బంధము, మరణము మరియు అజ్ఞానము వైపుకు గొనిపోవడమేగాక అవి అనేకములైన జన్మలకు కారణభూతమవుతున్నాయి. భగవదనుగ్రహము నొందినవారే సూక్ష్మబుద్ధిచేత మరియు దృఢమైన సంకల్పము చేత వాసనలయొక్క ఫలితమును గ్రహించ గలరు. మనము కనులతో దర్శించలేము గనుక ఈ వాసనలను అర్థము చేసికొనుట కష్టతరమై యున్నది.

నేను వాల్తేరు నందు స్నానమునకై సముద్రపు ఒడ్డుకు వెళ్ళినపుడు అక్కడ నేను సముద్రములో ఎగసిపడే లెక్కలేనన్ని అలలను గమనిస్తూ ఈ వాసనల గురించి ధ్యానము చేస్తూండేవాడిని. మీరు ఎప్పుడైనా సముద్రము లోనికి కొంతదూరము వెళ్లి ఆ సముద్రము యొక్క ఉగ్రతను, అల్లకల్లోల ముగా ఉండడాన్ని గమనించారా? మీరు ఎప్పుడైనా చుట్టుచుట్టుకొని దుమికే కెరటాలను, సముద్రపు నీరు కొండంత ఎత్తుకు ఎగిసిపడుతూ, నిరంతరమూ పోటీపడుతూ తెల్లని నురగలాంటిది మీ ముందుకు రావడము గమనించారా? మీరు కన్నులు మూసుకొని మీ అంతరంగములోనికి

తొంగిచూసినట్లయితే, మీరు కూడా అల్లకల్లోలముగా ఏర్పడిన మోహములను గమనిస్తారు. ముఖ్యముగా భయము, అజ్ఞానము ఒకదానితో ఒకటి కలియబడుచున్నట్లు గమనిస్తారు. ఒకదాని వెంబడి మరియొక వాసన మీ మెదడు యొక్క ముఖ్య భాగములో అంతర్విితమవుతుంది. సుషుప్త్యావస్థలో తప్ప ప్రాపంచిక విషయములలో చిక్కుకున్న విశ్రాంతి లేని మనసుకు ఒక క్షణముకూడా ప్రశాంతత గాని, స్వేచ్ఛగాని చిక్కదు. ఎవరి ఆత్మ వాసనారహితమైనదో, వారే మహాత్ములు, నిజమైన యజమాని; తతిమా వాళ్లందరూ ఎడతెగని వాసనలనే మహా ప్రవాహములో సేవకులవలె చిక్కుకొని యుందురు.

మనము ఒక పాత్రలో మరిగించిన నీటితో ఈ లెక్కలేనన్ని వాసనల వేగాన్ని, వాటి తీక్షణతను అర్థము చేసుకొనవచ్చును. మనము నీటిని మండుతున్న అగ్నిపై మరిగించిన కొలదీ వాటిలో వేలాను వేలుగా బుడగలు ఏర్పడుతాయి. ప్రాపంచిక సుఖములతో ఆ బుడగలను పోల్చుకొని మీ మనసులో బుడగలవలె వాసనల పరంపర కొనసాగుతూండడము గమనించండి.

ఇదివరలో చెప్పినట్లు, నేటి మన స్థితిని వాసనల పర్యవసానముగా గుర్తించండి! మనిషి వాసనలయొక్క జీవకణజాల వల్ల మాత్రమే. మీరు సంపూర్ణ స్వేచ్ఛను ఆశించినట్లయితే మీలో మంచి, చెడు, శుద్ధమైన, అశుద్ధమైన వాసనల క్షయము కావాలి. మనకు ఎదురయ్యే ముఖ్యమైన ప్రశ్న, ఎలా మనము ఈ బలముగా నాటుకొనియున్న వాసనల నుండి తప్పించుకోవాలి? అనేది. ముందుగా చెడు వాసనలను మంచి వాసనలతో అంతము చెయ్యాలి. చివరిగా, మంచి లేక శుద్ధవాసనలు కూడా మనలో నుండి నిష్క్రమించి దైవిక శక్తియందు లీనమవుతాయి.

దీనికి, శ్రీరామకృష్ణులవారు, ఒక చక్కటి ఉదాహరణను ఇస్తూ, మనము కాలిలో గ్రుచ్చుకున్న ఒక ముల్లును తీయడానికి, వేరే మరియొక పదునైన ముల్లును ఉపయోగిస్తాము. గ్రుచుకున్న ముల్లు బయటకు రాగానే రెండు ముళ్ళనూ తీసి పారవేస్తాము కానీ రెండవ ముల్లు మొదటి ముల్లును తీసి

వెయ్యడానికి సహాయపడిందని దానిని దగ్గర ఉంచుకోము. అది మన పాదములో గ్రుచ్చుకున్నా లేక మరొక ముల్లును తీసివెయ్యడానిని ఉపయోగ పడినా, ముల్లు ముల్లే కదా!

అలాగే 'వాసన' అనేది శుద్ధమైనది అయినా అశుద్ధమైనది అయినా అది వాసనే అవుతుంది. అవి మనలో తమ ప్రభావమును వదలిపెడతాయి. నీటి మీది వ్రాతలు చెరిగిపోతాయి. కాని మట్టి మీద వ్రాసిన వ్రాతలు వెంటనే పోవు. ఈ బలముగా నాటుకుపోయిన వాసనలు నిర్మూలనము లేదా అదృశ్యము అవడానికి మనకి కాలమే సహాయపడుతుంది.

నీలో కోరికలనే నిప్పు మండుతున్న కొద్దీ, నీవు వాసనలను తగ్గించు కోవడము గానీ వాటిని పూర్తిగా నిర్మూలించడము గాని జరుగదు. నీటిని మంటపై పెట్టి మరిగించినంత కాలమూ, బుడగలు రావడము జరుగుతూనే వుంటుంది. నీవు బుడగలను ఆపివేయాలనుకొంటే మంటను ఆపివెయ్యి; అప్పుడు, క్రమేణా బుడగలు ఒకటొకటిగా తగ్గుతూ చివరిగా ఆగిపోతాయి. బుడగలు సముద్రములో కలసి చివరకు సముద్రముతో ఒకటిగా లయ మౌతాయి.

బాహ్యముగా చూస్తే మనిషి నిశ్చలముగా ఉన్నట్లు అనిపించవచ్చు. అప్పుడాతనికి వాసనల నుండి విముక్తుడైనట్లు తోచిననూ, మనసుకు ఎప్పుడైతే ఇంద్రియ విషయములతో సంపర్కము కలుగుతుందో లేక విశ్వ మును నామ, రూపాత్మకమైన దానిగా భావిస్తాడో అప్పుడే నీరు మరగడము, దానిలోంచి బుడగలువచ్చి పేలడము గమనిస్తాడు. అందుచేత ఈ జబ్బునకు మూలకారణమును గుర్తించి జబ్బును సమూలముగా పెరికి వెయ్యడము జరగాలి.

ఈ వాసనలకు ముఖ్యకారణము, భగవంతుని ఉనికిని విస్మరించడమే. ఇంకోలా చెప్పాలంటే అఖండమైన సత్యమును లేక దైవత్వమును గుర్తించ లేకపోవడము. సూర్యుడు లేనప్పుడే అంధకారము ఉంటుంది. సూర్యుడనే సత్యము ప్రకాశించునంతవరకూ అంధకారము గాని అస్థిరతకు గురిచేయు వాసనలు గాని దరిదాపులకు చేరలేవు. మనిషి తన జన్మహక్కైన స్వయం

ప్రకాశమును గుర్తించక అంధకారములోనే సంతోషము కొరకై వెదకి తాను ఒక నీచ సేవకునివలె అనేకములైన కల్లోలపరచే వాసనలయందు తగుల్కొనును. దీని పరిణామముగా అనేక నీచ జన్మలెత్తుచూ అజ్ఞానమనే అంధకారములోనికి నెట్టి వేయబడును.

మనిషి అశుద్ధమైన వాసనలు మరియు సంస్కారముల ఉచ్చులో పడకుండా ఉండాలంటే శుద్ధమైన వాసనలు మరియు నిష్కామముతో కూడిన ఆలోచనలు పెంపొందించుకొనడమే దీనికి సులభమైన పరిష్కారము. మంచి ఆలోచనలచే ఏర్పడిన అనుకూలమైన వాసనలు చెడు వాసనలను ధ్వంసము చేయుటకు లేదా వాటిమీద విజయము సాధించుటకు తోడ్పడుతాయి. శుద్ధమైన వాసనలు ఎన్నడూ మనిషిని కర్మ చక్రములో బంధింపజాలవు. అవి వేయించిన గింజలవలె జీవిత గమ్యమును చేర్చుటకు తోడ్పడునే గాని, వాటికి మరల మొలకెత్తి పెరిగే అవకాశము ఉండదు. ఎవరైనా పంటను ఆశించకుండా శుద్ధవాసనలనే విత్తనములు నాటవచ్చును. ఎవరి మనసులైతే వేయించిన గింజలవలె, జ్ఞానమనే అగ్నిచేత దహించబడతాయో వారే నిజముగా ధన్యాత్ములు.

మంచివైనా లేక చెడువైనా ఆలోచనల ప్రభావము నాగేటి చాలు వలె దీర్ఘమైన ముద్రను మన మెదడులోనికి పంపుతాయో తలచుకుంటే ఎంతో ఆశ్చర్యము కలుగుతుంది. ప్రతి ఆలోచన తనదైన ప్రత్యేకమైన కలుగును ఏర్పాటు చేసుకొని, పైకి ఉబకడానికి లేదా మొలకెత్తడానికి తనవంటి వైన సంక్రమించే ఆలోచనల స్పర్శకోశము ఎదురు చూస్తూంటుంది. ఉదాహరణకు, నీవు ఇరవై సంవత్సరాల క్రితము ఒక అరుదైన ఫలమును తిన్నావనుకుంటే, ఇప్పటికీ ఆ విషయము నీ మెదడులో బలముగా నాటుకొనియుంటుంది. బాహ్యములో నీవు ఆ పండును తిన్న విషయముగాని, అలాంటి పండు ఒకటి వున్న విషయము గాని తెలిసినట్లు అనిపించకపోవచ్చు. కానీ నీవు మరల అదే పండును తినినప్పుడు, ఏనాడోగతములో అంతర్లీ నంగా ఉన్న అదే పండు తిన్న అనుభవము బయటికివచ్చి నీ ఇప్పటి అనుభవమును స్వాగతిస్తుంది. అలాగే నీవు ఏబది సంవత్సరాలకు పూర్వము, అంతులేని శాంతిని, సమాధిని గాని,

నిర్వాణమును గాని అనుభవించి వుండి, మళ్లీఇప్పుడు అదే విధమైన అనుభవము కలిగితే అది నీకు క్షణమాత్రములో ఆ అనుభవమును గుర్తు చేస్తుంది. ఎవరు పవిత్రులో, నిస్వార్థపరులో వారి జీవితము కూడా, ఒక వేగముగా ప్రవహించే నదీ ప్రవాహము ఏ విధముగా తరతమ భేదము లేకుండా మొత్తముగా పరీవాహక ప్రదేశాలకు తన స్వచ్ఛ మైన నీటిని అందించి వాటిని సస్యశ్యామలం గావిస్తాయో, అదేవిధముగా తమ స్వచ్ఛమైన నడవడికచే తమ చుట్టూయున్న వ్యక్తులను ప్రభావితము చేస్తారు. అటువంటి వారు ఎంత ధన్యులో కదా!

ప్రియమైన శాంతి పత్రిక చదువరులారా! ఆలోచనలు ప్రమాదకర మైనవే గాక ఒక్కొక్కప్పుడు అవి కూడా జీవితానికి ఉపయోగపడేవే గనుక మీరు జాగ్రదవస్థలోనూ, స్వప్నావస్థలోనూ చేసే ఆలోచనలను జాగ్రత్తగా గమనించి వాటిని ఆధ్యాత్మికతవైపు మళ్లించండి. బలహీనమైన మరియు వ్యతిరేకమైన భావనలను సానుకూలమైన ఆలోచనలతో ఎదుర్కొనండి. ఎప్పుడెప్పుడు మీ మనసు గమ్యము లేని బాటసారి వలె అటు,ఇటు పరుగెడు తుందో, దానిని భగవంతుని ధ్యానించడానికైనా లేదా ఆత్మ విచారణయందు నిమగ్నము కావించండి. అప్పుడు మీ జీవితము దైవీలక్షణములతో ప్రకాశించ డమేగాక,అంతులేని శోభాయమానమైన పరమశాంతిని పొందగలుగుతారు. ఆ స్థితిలో మనసు తనయొక్క ఉనికిని కోల్పోతుంది గనుక మీరు ఆలోచనా రహితులుగాను మరియు మీలో గుప్తమైన సంస్కారముల నుండి విముక్తులు గాను కాగలుగుతారు.

నిశ్శబ్దములో మనము ఎవరి కోరికలైతే నశించాయో, ఎవరు గుప్త సంస్కారముల నుండి విముక్తులైనారో అటువంటి కొద్దిమంది ధన్యాత్ములకు ప్రణామముల నర్పిద్దాము.

ఈ విశ్వములోని జనులందరూ శాంతిని బడయుదురుగాక!

ఓమ్ తత్సత్!

(శాంతి, జూన్ 2021)

# 62. బ్రహ్మ కపాళము

ప్రియమైన శాంతిపాఠకులారా! బ్రహ్మ కపాళము నెప్పుడైనను దర్శించితిరా, అది హిమాలయ పర్వతములలో బద్రీనారాయణకు మీదుగా యున్నది. చిన్నతనములోనే నేను బద్రీయాత్రనుజేసి బ్రహ్మ కపాళదర్శనము జేస్తితిని. అంతదూర ప్రదేశమునకు వ్యయప్రయాసలతో మేము వెళ్ళ జాలము అన్నవారికి బ్రహ్మకపాళము మనలోనే నున్నదనెడి ఆనంద వార్తను జెప్పుటకు నాకు, యెంతయో సంతోషముగా యున్నది. గాని ఆంతర్యము, సహస్రారము మీదుగా మన శిరస్సులోనే యున్న బ్రహ్మకపాళము జేరుట అంత సులభముగాదు.

వందసార్లు బాహ్యమున హిమాలయ పర్వతములలో యున్న బ్రహ్మ కపాళమునైనను దర్శించవచ్చునుగాని తీర్థయాత్రలు ఎన్నియైన చేయ వచ్చును గాని, అమనస్క స్థితినిపొంది మనోనాశనము గల్గి, వాసనక్షయ మునుజేసి, విజ్ఞానముతో నింపి, బ్రహ్మకపాళమును ఛేదించుట చాలా దుర్లభము. బ్రహ్మకపాళమును ఛేదించుటకు, అహంకార మమకారములను పూర్తిగా కాల్చివేయవలెను. అట్టివారికే, బ్రహ్మకపాళ భేద్యము సాధ్యమవ్వను. అట్టివారే జీవన్ముక్తులు.

ఈ మధ్యను నాలోయున్న బ్రహ్మకపాళము తరచు అదురుచుండుటచే, నా ఆలోనలు బ్రహ్మకపాళము గురించి పరుగెత్తుచున్నందున నా భావన లను, యీ వ్యాసము రూపముగా వ్రాసి మీతో పంచుకొనుచుంటిని.

షష్ఠిపూర్తికోటి పత్రి పూజ జ్ఞాపకార్థముగా నిర్వాణమందిరము ముఖ్య ముగా పాశ్చాత్యదేశీయులైన ఆశ్రమ భక్తుల ఉపయోగార్థమునకు చక్కగా కట్టబడెను. పాశ్చాత్య దేశపు భక్తులు లేనప్పుడు అచ్చట ఏకాంతముగా చల్లగా యుండును గాన, నేను నివసించుచుందును. అందు స్నానముల గది చిన్నది అవ్వుటచే గుమ్మములు రెండును చిన్నవిగా, పొడవు తగ్గించి పెట్టితిరి. యీ శరీరము పొడవుగా యున్నందున ఎంత జాగ్రత్తగా యున్నను, తరచు బ్రహ్మకపాళము బ్రద్దలు అయ్యేడిలాగున, శిరస్సు గుమ్మమునకు తగులు చుండును. రాత్రి తగిలిన దెబ్బకు శిరస్సున బొప్పిగట్టి యింకను

బ్రహ్మకపాళములో అదురుచునే యుండెను. ఆశ్రమవాసులొక్కరు నావద్ద వుండి, ఆ దెబ్బలను జూచి కొంచెము చూచుకొని నడవరాదా స్వామీజీ అంత తొందరయేల అని అనిరి. రోజూ చూచుచునే స్నానముల గదిలోనకు వెళ్ళని యెడల, యీ సరికి బుర్రబద్దలై బ్రహ్మకపాళముపైకి వచ్చియే వుండును అని నాలో నేను తలంచితిని.

జాగ్రత్తగా లేని యెడల రోజుకు పదిసార్లు తగిలేది! ఎంత జాగ్రత్తగా యున్నను గుమ్మము చిన్నదిగా యున్నందున యేదో సమయమందు దెబ్బ తగులుచుండును. వంటశాలలో ఎంత జాగ్రత్తగా వుండినను మసి అంటు కొనునని పెద్దలు జెప్పిరి. నిన్న తగిలిన దెబ్బకు శిరస్సుమీద బొప్పియింకను తగ్గలేదు. బ్రహ్మ రంధ్రములో కొంత అదురుచుండగనే నాయీ భావనలు వ్రాయుచుంటిని. ఖండమైన మనస్సు యీదెబ్బలేల తగలవలెను, యీ బొప్పి యేల కట్టవలెనని ప్రశ్నించుచుండును.

బాధలో గూడ దైవము ననుభవించుడని అందరకు జెప్పుచుందును. నా బాధలో దైవ సన్నిధి అనుభవించుచుంటినా లేదా అని విమర్శించి స్వీయ పరీక్షజేసుకొనుటకే, యీ పరీక్ష లివ్వబడుచున్నవని ఆనందించు చుందును. కర్మ పరిహారమవ్వుచున్నదని గూడ తృప్తి చెందుచుందును.

శరీరముపోయే సమయమందు అజ్ఞానులకు ప్రాణము నోటినుండి గాని, ముక్కు రంధ్రముల నుండిగాని, పోవుననియు జ్ఞానులకు సహస్రారము మీదుగా బ్రహ్మరంధ్రము ద్వారా ఆత్మజ్ఞప్తిలో, ప్రాణమును విడిచెదరనియు బ్రహ్మవిదులు జెప్పియుండిరి. అన్ని జన్మములలో దుర్లభమైన, ఉత్తమమైన మానవ జన్మను బయడగలిగినందుకు, దైవపరితాపనతో నిండి విజ్ఞానమును బడసి గ్రహించవలసిన దానిని గ్రహించి, బ్రహ్మకపాళ దర్శనముజేసి, దైవము యొక్క పిలుపు రాగానే బ్రహ్మరంధ్రము ద్వారా, జీవమును విడచి, బ్రహ్మ సాక్షాత్కారమును, పొందగల్గిన మహనీయుల జీవితములు పరమపావన మైనవి. అట్టి బ్రహ్మవిదులకు నమస్కృతులు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు, హరి ఓం తత్సత్

15–4–56

1–00 ఎ.ఎమ్.

## 63. మా టాగూరు మహాశయుడు

ఈ మహనీయుని వయస్సు అరువది సంవత్సరములుండును. ఈయనను జూచిన శ్రీరవీంద్ర నాథ్ టాగూరు మహాశయునిని దర్శించినట్లే యుండును. ఏలనన, యీయనకు గూడ దైవము నెరసిన గడ్డమును, స్వచ్ఛమైన తలను యిచ్చి యుండెను.

మా టాగూరు, చక్కని భజన కీర్తనలను, కృతులను పరవశత్వముతో పాడగలడు. యెట్టి కఠిన హృదయుల మనస్సునైనను మార్చగలడు. అనేక నెలల నుండే గాక, సంవత్సరముల నుండి గూడ, ఆశ్రమం వాగ్దానము చేసినా చందాలను ఎగవేయుచున్న వారిని గూడ, తన మాటల చమత్కార ముచే వారి మనస్సులను, రంజింపజేసి, బాకీపడియున్న చందాలను వసూలు చేయుచుండును.

తలనెరసియున్నది, గెడ్డము ఆకర్షణీయముగా యున్నది. కాని, మా టాగూరులో ఉన్న చిన్న స్వల్పగుణ మెద్దియనగా, హృదయము మాత్రము స్వచ్ఛముగా, తెల్లగాలేదు. కొంచెము నల్లగా యున్నది. పాపము, ఆశచేతనో, పేదరికము చేతనో, జన్మాది నుండియు వుండియున్న అలవాటుచేతనో, చిన్న చిన్న అబద్ధము లాడుచుండును. అతి వాగుడు మరొక దుర్గుణము, ఎంత తప్పుజేసియైనను, తప్పును వప్పుగొనడు. తన మాటల చమత్కార ముచే తన తప్పులనే ఒప్పుగా వాదించి జూపించగల మేధావంతుడు.

తరచు తాను, లక్షాధికారులైన, లక్ష్మీపుత్రులవద్ద పనిజేస్తిననియు, తన చేతులమీద లక్షలకొలది, నోట్లును, ధనమును లెక్కించితినని నిమీలిత నేత్రుండై జెప్పుచుండును. ఆ ధనములో ఎంత డబ్బు, స్వార్థమునకై తన స్వంత ఉపయోగార్థమై, తాను కైంకర్యముజేసినదియు, బ్రహ్మదేవునికి తెలియదు తాను, నిమీలిత నేత్రుడై యున్నప్పుడు, తన కొక్కనికి మాత్రమే తెలియవలయును.

ఆశ్రమంలో యెన్ని జరూరు పనులున్నను, యెన్ని పాడవ్వుచున్నను, రేపు సాయంత్రం,6 గంటల 6 నిమిషముల 6 క్షణములకు తప్పక వచ్చెద నని, మరల మరల వాగ్దానము జేసియు ఆ మరునాడో అవతలనాడో,

నెమ్మదిగా రవీంద్రనాధుని వలె, మా టాగూరు మహాశయుడు దర్శనమిచ్చు చుండెను.

ఆయనజేసిన ఆలస్యమును గురించి, వివిధ కారణములు. తప్పనిసరియైన కారణములను ఉపన్యసించుటకు ప్రారంభించగా, నీవుస్తంభీ భూతుడవయ్యేదవు. నీవింక వాదించ జాలవు. నిన్నునోరు విప్పనీయడు. ఆ మెరసిన వెంట్రుకలను, ఆ తెల్లటి గెడ్డమును జూచి ముగ్ధుడవయ్యేదవు. మా టాగూరుకు కుటుంబము చాల పెద్దదై యుండుటచే తరచు ఊళ్ళో ప్రోగుజేసిన చందాలు అచ్చటనే, కొంతభాగము ఖర్చుపెట్టవలసి వచ్చు చుండును. గాని,ఎక్కౌంట్స్, జమాఖర్చులు జూపించుటలో మా టాగూరును మించినవారు, హిందూ దేశములోనే గాక ప్రపంచములో యెచ్చటను లేరని మీరు నమ్మవలసియున్నది.

ఆయన, అరువది సంవత్సరముల అనుభవమును జూడుడు. లక్షాధి కారులైన వర్తకుల వద్ద లాయరు అయ్యెను. ఆయన చేయజాలని పని యొద్దియును లేదు. చిన్నపనులు, పెద్దపనులు, అన్నియు ఓర్పుతో, ప్రేమతో జేయుచుండును. పనిలో ముఖ్యముగా, తనకు లాభమనెడిది యున్న తిండిని గూడ లెక్కజేయడు.

గొళ్ళెములు వేయుట, తీయుట, గడలు బిగించుట,వదులు చేయుట తాళములు, మార్చుట తీయుట యివన్నియు ఆయనకు జన్మతోనే మంచి నీరువలె, అనుగ్రహముగా అలవాటై యున్నవి.

తలుపువేసియున్నను, తీసియున్నను బియ్యము, పంచదార మొదలైన వస్తువులు అమాంతముగా, మా టాగూరు తలచినంత మాత్రముననే మాయ మగుచుండును. దైవము ఒక్కొక్కరికి ఒక్కొక్క అద్భుతమైన శక్తిని యిచ్చు చుండునుగదా!

మా టాగూరును జూచినను, తలచినను నా మనస్సు చాల చింతగా యుండును. ఈయనను బాహ్యమునే గాక, లోపల గూడ టాగూరుగా, జేయజాలనా అని తలచుచుందును. గాని స్వభావమును మార్చుటెట్లా? అందులో అరువది సంవత్సరముల స్వభావము ఆరితేరినది గట్టి పడినది,

ఒక్క తాడిచెట్టు వలె స్థిరముగా పాదుకొని పాదుకొని యున్న దానిని వంచుట ఎటులను?

ఎన్నిత్రాళ్ళు వేసి, ఎన్ని రోజులుగా, ఎంత ప్రయత్నించినను తాటిమాను లేశమైన వంగునా? దానిని వంగ దీయుటకు, పునాదులతో పెకలించుటో, లేక గొడ్డలితో నరుకుటో వక్కటే మార్గముగా తోచుచున్నది.

ఆ టాగూరు మహాశయుని ఏమిచేయుట అనెడిది, యిప్పుడు మాకు కఠినమైన గొప్ప సమస్యగా వున్నది. శ్రీ డిస్ట్రిక్ట్ కలక్టరుగారు శాంతి ఆశ్రమం వంటి ఆశ్రమంనే సీతమ్మపేటలో స్థాపించమని, అన్ని విధముల దాని వృద్ధికై తోడ్పడెదమనియు, మా టాగూరుచేతనే, వార్తను పంపిరి. మా టాగూరుజీ గూడ చాల ఆతురతలో, అచ్చటకువెళ్ళి బీద ప్రజల సేవ చేసెదనని వువ్విళ్ళూరుచుండెను. సీతమ్మపేట ప్రజల రోజులు మంచివి గాకున్న, వారు దుష్కర్మ జేసియున్న మా టాగూరు మహాశయుడు, అచ్చటకు వెళ్ళవలసి వచ్చును. యింతకు, యీశ్వర సంకల్పము లేనిదే గడ్డిపోచయైనను కదలదు గదా దీన దయాళుడైన ఆ యీశ్వరుడు దిక్కులేని బీదప్రజలను మా టాగూరు మహాశయుని ఆరోగ్యము సిరిసంపదలతోను ధర్మము, న్యాయము, సత్యములతో బ్రోచుచు లోకశాంతికి తోడ్పడుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

నిర్వాణ కుటీరము

17-1-50

4-00 ఎ.ఎమ్